మూగవానికి భోజనం పెడితే అరవై మందికి భోజనాన్ని పెట్టిన పుణ్యం. అనాథపసిపిల్లలకి భోజనం పెడితే కూమరస్వామికి భోజనం పెట్టిన పుణ్యం. అనర్హులకు అనగా రెండో పెళ్ళి చేసుకున్న స్త్రీకీ, పురుషునికీ, పదిమందినీ తిట్టే వానికీ భోజనం పెట్టడం వల్ల, దాత తన పుణ్యాన్ని కోల్పోతాడని మనుధర్మశాస్త్రం శెలవిస్తోంది.

గర్భశోకము కలిగిస్తే ఎంతటి పాపం...

ధర్మం కోసం కూడా తల్లికి పుత్రశోకం తెప్పించకూడదని శాస్త్రం నొక్కి చెబుతోంది. అలాంటి తల్లి కడుపు మంట నుంచి వచ్చిన శాపవాక్యాన్ని దేవాది దేవుడు కూడా మార్చలేడు. గాంధారి శ్రీకృష్ణునికి కడుపుమంటతో శాపం పెడుతుంది.

మహా యుద్ధం చేసి పాండవులకి రాజ్యం కట్టబెట్టావు. ఏం అదే మంత్రాంగముతో నా బిడ్డల్ని మార్చి కురుపాండవులు కలిసుండేలా ఎందుకు చెయ్యలేదు. నాకు గర్భశోకం కలిగించావు. నీవూ, నీ యాదవ వంశమూ ఇలానే గొడవలు పడి

నశించు గాక అని శ్రీ మహావిష్ణువుకే గాంధారి శాపం ఇచ్చింది. అలాగే దశరథ మహారాజు యవ్వనంలో శబ్దవేధి విద్యతో బాణం వేసి పండు ముసలి దంపతుల పుత్రుణ్ని చంపినందుకు జగదభిరాముడైన శ్రీరాముడ్ని ఎడబాయాల్సి వచ్చింది.

గర్భశోకం అంతటి మహా నరకాన్ని తెచ్చిపెడుతుంది. తల్లి కడుపు మండి అంటే బ్రహ్మాస్త్రానికైనా తిరుగుంటుంది గాని తల్లి శాపానికి తిరుగులేదు.

శ్రీనివాసుని దర్శనం ఎన్ని రెట్లు పుణ్యఫలం...

కృతయుగంలో పదిసంవత్సరాలూ, త్రేతాయుగంలో ఓ సంవత్సరము, ద్వాపర యుగంలో అయిదు మాసాలు, కలియుగంలో ఒక్కరోజు సంపాదించే అనంతమైన పుణ్యం కన్నా కోటి రెట్లు పుణ్యం ఒక్క శ్రీనివాసుణ్ని దర్శించినంతనే కలుగుతుందని సూతమహర్షి శౌనకాది మునులకు శ్రీ శ్రీనివాసుని మహత్మ్యం గూర్చి వివరిస్తూ శెలవిచ్చాడు.

భర్తను మోసం చేసి వివాహేతర సంబంధమనే పాపం చేస్తే...

క్షణికావేశంలో గానీ, తీవ్రకోర్కె వల్లగానీ, ధనమాశించి గానీ, అవసరార్థం గానీ పర పురుషునితో కలిసిన స్త్రీ పాపం శాపంగా మారి సమాజానికి ముఖం చూపించలేని స్థితి ఏర్పడుతుంది. అయినవారి నుంచి చులకన మాటల ద్వారా ఆ పాపం ప్రక్షాళనమవుతుంది. అహల్య వంటి మహాస్త్రీ కూడా క్షణకాల చంచలమైన మనస్సుతో దారి తప్పినందుకు అందరికీ దూరమై ధూళిలో ధూళిలా బ్రతికింది. శ్రీరాముని రాకతో ఆ ప్రాంతమంతా పవిత్రమవ్వటంతో తన భర్త గౌతముడిచ్చిన శాపాన్నుంచి ఉపశమనం పొందింది. (వాల్మీకి రామాయణం)

దంపత్ తాంబూలం తీసుకోవటం ఎంతటి పుణ్యం...

శ్రీనివాసుని కళ్యాణోత్సవంలో పార్వతీ పరమేశ్వరులూ, సరస్వతీ బ్రహ్మలు దంపత్ తాంబులాన్ని స్వీకరించారు.

నూతన వధూవరుల చేతుల మీదుగా దంపత్ తాంబూలాన్ని స్వీకరిం చటం ద్వారా ఇచ్చిన వారికీ, తీసుకున్నవారికీ జీవితం నిత్య నూతనమవుతుంది.

ఇరువురికీ పూర్ణ సౌభాగ్యం సిద్ధిస్తుంది. అదే భగవంతుని కళ్యాణంలో దంపత్ తాంబూలం తీసుకునే అవకాశం ఎంతో పుణ్యమైన వారికి తప్ప రాదు. అది మహాపుణ్యం.

మునిమనవళ్ళను చూసే పుణ్యం పొందాలంటే...

దేవుని కళ్యాణం అయ్యాక అంతా ఆ ఆది దంపతుల పాదాల మీద ఎండు కొబ్బరి చిప్పలలో అంతకు ముందు జరిగిన తలంబ్రాల బియ్యాన్ని నింపి పాదాలపై భక్తిగా పోస్తారు.

మీ బంధుమిత్ర హితులైన వారిలో ఎవ్వరైనా పుణ్య దంపతులు ఆ కార్యక్రమానికి వచ్చి ఆది దంపతులను సేవిస్తుంటే, కొత్తగా పెళ్లైనవారు, ఆ పుణ్యదంపతులు రెండు ఎండు కొబ్బరి చిప్పలతో అనగా ఇరువురూ నాలుగు ఎండు కొబ్బరి చిప్పలతో తలంబ్రాల బియ్యం స్వామి పాదాల మీద పోస్తున్నప్పుడు ఆ పాదాల దగ్గర వంగి కొంగు

పట్టి వారు పోసిన తలంబ్రాల బియ్యం కొంగులో పడేలా పట్టుకోవాలి. వాటిని స్వీకరించి కొత్తగా పెళ్లైన ఆ భార్యభర్తలు నెత్తిన చల్లుకుంటే మునిమనవళ్ళని చూసే అదృష్టం ఆ దంపతులకి కలుగుతుంది.

దైవ కార్యాలప్పుడు దైవ దూషణ గలవానితో మాట్లాడితే ఎంత పాపం...

పుణ్య కార్యాలప్పుడూ, దానాది యజ్ఞ వ్రతాలప్పుడూ దైవదూషణ చేసేవానితో మాట్లాడితే మహా పాపం సంక్రమిస్తుంది. అట్టివాడు ఎదుటపడితే మౌనమే శరణ్యం. అటుల కాదని పూర్వము ధర్మాత్ముడూ, దైవ ఆరాధకుడైన శతధన్వుడు ఆయన భార్య శైబ్యతో కార్తీక పున్నమి రోజు గంగానదిలో స్నానం చేసి వస్తూ ఓ నాస్థికుడితో మాట్లాడాడు. శైబ్య మాత్రం మౌనంగా ఉండి రాజ ప్రసాదానికొచ్చి విష్ణు పూజ చేసి ఆపై దినచర్య ప్రారంభించింది. మరుజన్మలో ఆ రాజు కుక్కగా, ఆయన భార్య రాకుమారిగా జన్మించారు. కుక్కగా పుట్టడమేకాక అవసాన దశలో రోగిష్టి

బాధలన్నీ అనుభవించాడు రాజు. కాన దైవ దూషణ చేసేవారితో మాట్లాడటం. మాట్లాడేవాని కన్నా విన్నవానికి ఎక్కువ పాపం.

భోజనానికి ముందు నమస్కరించి తినటం ఎంత పుణ్యం...

సూర్యభగవానుడు ఉత్తర దిక్కుగా ఓసారి పయనించి భూమిలోని సారాన్ని గ్రహిస్తాడు. మళ్ళీ దక్షిణ దిక్కుగా పయనించి మేఘ రూపుడై దివ్యఔషధులను గ్రహించి చంద్రుని ద్వారా అనగా చంద్రకిరణాల ద్వారా ఆ ఔషధులను మరింత వృద్ధి చేసి భూమిపైకి పంపుతుంటాడు. వాటి నుంచి ఆహారాన్ని సృష్టించి మనకి అందిస్తాడు. అందుకే భోజనానికి ముందు నమస్కరించి తింటే ఆ ప్రత్యక్ష నారాయణుడికి నమస్కరించిన పుణ్యం.

నూతన వధువు సౌభాగ్య సిద్ధికి చెయ్యాల్సిన యాత్ర...

మహా సౌభాగ్య సిద్ధి పుణ్యం కొరకు నూతన దంపతులు తొలి సంవత్సరంలో భద్రాద్రి

సీతారాముల కళ్యాణం భక్తిప్రపత్తులతో వీక్షిస్తే వారి దాంపత్యము సుఖంగా సాగుతుంది.

ఆయురారోగ్యాలు వృద్ధి చెందుతాయి. అలాగే తొలి సంవత్సరం సీతారాముల కళ్యాణోత్సవం జరిపే పందిళ్ళలో కళ్యాణం వేడుకల్లో దంపతులు పాల్గొన్నా ఆ సీతారాముల కరుణా కటాక్షాలు నూతన దంపంతులకి రెండు రెట్లు పుణ్య ఫలం ఇస్తాయి.

కుజదోషమున్నవారు చెయ్యాల్సిన వ్రతం...

నారద మహర్షి మహాపతివ్రత సావిత్రికి ఉపదేశించిన వ్రతమే శ్రీమంగళగౌరీదేవి వ్రతము. ఈ వ్రతం చేసిన వారికి భర్త వియోగమన్నది ఉండదు. సకల సౌభాగ్యాలనిచ్చే శ్రీమంగళగౌరీ వ్రతము శ్రావణ మాసములో వచ్చే మంగళ వారమునాడు చెయ్యటము వల్ల సర్వశుభాలూ కలుగుతాయి. ఈ మంగళగౌరీదేవిని పూజించటం వల్లే కుజుడు మంగళవారానికి అధిపతయ్యింది. ఈ తల్లిని పూజించినవారికి కుజదోషాలు తొలగుతాయి. శ్రీకృష్ణుడి ఉపదేశంతో ద్రౌపది ఈ

మంగళగౌరీ వ్రతాన్ని చేసింది. వివాహమయ్యాక అయిదు సంవత్సరాలు వరుసగా చేసి ఉద్యాపన తీర్చుకుంటే సౌభాగ్యసిద్ధి కలుగుతుంది.

ఏ ఆహార పదార్థాన్నైనా సరే రకరకాల కారణాలతో నిందిస్తే, ప్రాణశక్తిని అనగా భోగవంతుణ్ని నిందించిన పాపం సంక్రమిస్తుంది. దానితోపాటు ఓ వ్రతాన్ని నిందించిన పాప ఫలం కలుగుతుంది.

-తైత్తిరీయ ఉపనిషత్తు

స్వర్గ ప్రాప్తి ఎవ్వరి కుండదు...

చంద్ర, సూర్య, అగ్నిలు ప్రసరించకుండానే మహా వెలుగుతో వెలిగిపోయే స్వర్గ ప్రవేశము హోమాలు ఆచరించనివారికీ, అనత్యాలను పలికేవారికీ, మాంసాహారం తినేవారికీ, దేశద్రోహం చేసినవారికీ, సామాజిక ద్రోహం చేసినవారికీ, పుణ్య

తీర్థ ఆలయాలను దర్శించి సేవించని వారికీ లభించదు. వారు స్వర్గ ప్రవేశ ద్వారంలో ఉండి ఆహ్వానించే తెల్ల ఏనుగు ఐరావతాన్నీ చూడలేరు. మాణిక్యరాశులతో మెరిసిపోయే సకల సుఖాలూ, సౌఖ్యాలూ గల స్వర్గపురిలో ప్రవేశించలేరు.

స్త్రీకి కలిగే అయిదు దోషాల పరిహారార్థము...

రజస్వలవ్వకపోవటమూ, సంతానము నిలువకపోవటమూ, ఏక సంతానము కలగటమూ, ఆడ పిల్ల ఒక్కతే జన్మించటమూ, గర్భము నిలవకపోవటం.

ఈ అయిదు స్త్రీకి కలిగే పంచ దోషాలు. ఈ దోషాలు పండ్లూ, పూలునూ చెడగొట్టడము ద్వారా, భార్యా భర్తను విడదీయటం ద్వారా, పిల్లలని హింసించటం ద్వారా, పరాయి మగవాళ్ళని కామంతో కోరుకోవటం ద్వారా కలుగుతాయి. ఆ దోషాలు కనపడినవారు గోవ్రతం చేసి పుణ్య దంపతులకి భోజనం పెడితే దోషాలు పోతాయి. ఇది జనమేజయునకు వైశంపాయనుడు చెప్పిన దోష పరిహార సారాంశము.

పార్వతీదేవి అరుంధతికి చెప్పిన పుణ్యక వ్రతం...

అరుంధతీ! ఈ పుణ్యక వ్రతం చెయ్యాలను కున్న స్త్రీ తొలుత భర్త అనుమతి తీసుకోవాలి. ఆపై అత్తమామలకు నమస్కరించాలి. స్నానం చేసేటప్పుడు చేతితో కాళ్ళు కడుక్కోవాలి. కోపం, అసహనం, ఏడ్పు వంటివి దరిచేరకూడదు. తెల్లని వస్త్రాలను ధరించాలి.

ఆ రోజు నూనె వ్రాసుకోకూడదు. ముఖ్యంగా స్నానమప్పుడు వంటి మీద ఏమీ లేకుండా స్నానవిధి పూర్తి చెయ్యాకూడదు. శిరస్నానం తప్పనిసరి. స్నానమాచరించునపుడు కాటుక, గంధం, పువ్వులని పెట్టుకోకూడదు. పదకొండు మంది పుణ్య స్త్రీలను పిలిచి తాంబూలాదులను భక్తితో సమర్పించాలి. దీన్నే ఉమావ్రతమని కూడా అంటారు. శక్తిని బట్టి దానాలు ఇవ్వాలి.

ఈ వ్రతం సంతానం లేని స్త్రీకి సంతానం కలిగిస్తుంది. సౌభాగ్యాన్నిస్తుంది. కీర్తినీ, ధనాన్నీ భర్తకి లభించేలా చేస్తుంది. ఈ పుణ్యకవ్రతాన్ని అదితి, సావిత్రి, సత్యభామ వంటివారు ఎందరో

చేశారు. చేసే స్త్రీ పతివ్రత అయి ఉండాలి. అలా కాని వాళ్ళు చేస్తే దోషము. పాపం.

మహా విజయం కొరకు అర్జునుడు పరమేశ్వరుని ఎదుట చేసిన దండకము...

'శ్రీకంఠ, లోకేశ, లోకోద్భవస్థాన సంహారకారీ, పురారీ, మురారి ప్రియా, చంద్రధారీ, మహేంద్రాది బృందారకానంద సందోహ నంధాయి, పుణ్యస్వరూపా, విరూపాక్ష, దక్షాధ్వరధ్వంసకా, దేవ, నీదైన తత్త్వంబు భేదించి బుద్ధిం బ్రధానంబు గర్మంబు విజ్ఞాన మధ్యాత్మయోగంబు సర్వక్రియాకారణం బంచు నానాప్రకారంబులన్ బుద్ధిమంతుల్ విచారించుచున్ నిన్ను భావింతు రీశాన, సర్వేశ్వరా, శర్వ, సర్వజ్ఞ, సర్వాత్మకా, నిర్వికల్ప ప్రభావా, భవానీపతీ, నీవు లోకత్రయీవర్తనంబున్ మహీవాయుఖాత్మాగ్ని సోమార్కతోయంబులం జేసి కావించి సంసార చక్రక్రియా యంత్ర వాహుండవై తాదిదేవా, మహాదేవ, నిత్యంబు నత్యంత యోగస్థితిన్ నిర్మలజ్ఞాన దీప ప్రభాజాల విధ్వస్త నిస్సార సంసార

మాయాంధకారుల్ జితక్రోధరాగాదిదోషుల్ యతాత్ముల్ యతీంద్రుల్ భవత్పాద పంకేరుహధ్యాన షీయూష ధారానుభూతిన్ సదా తృప్తులై నిత్యులై రవ్యయా, భవ్య సేవ్యా, భవా, భర్గ, భట్టారకా, భార్గ వాగస్త్య కుత్సాది నానామునిస్తోత్ర దత్తావధానా, లలాటేక్షణోగ్రాగ్ని భస్మీకృతానంగ, భస్మానులిప్తాంగ, గంగాధరా, నీ ప్రసాదంబునన్ సర్వగీర్వాణ గంధర్వులున్ సిద్ధసాధ్యోరగేంద్రా సురేంద్రాదులున్ శాశ్వతైశ్వర్య సంప్రాప్తులై రీశ్వరా, విశ్వకర్తా, సురాభ్యర్చితా, నాకు సభ్యర్థితంబుల్ ప్రసాదింపు కారుణ్యమూర్తీ! త్రిలోకైక నాథా! నమస్తే నమస్తే నమః'.

ఈ దండకాన్ని పఠించినవారికి శత్రుభయం ఉండదు. మహా విజయం ప్రాప్తిస్తుంది. పరమేశ్వరుణ్ని కనులారా చూస్తూ అర్జునుడు స్తుతించిన దండకము.

భార్య చేతిలో తలతెగే పాపమేంటి...

ఓసారి శ్రీమహావిష్ణువు క్షీరసముద్ర రాజతనయ శ్రీమహాలక్ష్మి సుందరసుకుమార

వదనాన్ని చూసి నవ్వాడు. దానితో లక్ష్మీదేవి శ్రీ మహావిష్ణువు అకాల నవ్వుకి అర్థం వెదికింది. ముల్లోకాలను పాలించేవాడు ఊరికే నవ్వుతాడా? భార్యని చూసి నవ్వాడంటే? అదీ కారణం లేకుండా? నాకు సవతిని తెచ్చి ఉంటాడు. అనుకొంది. కోపం తన్నుకు వచ్చింది. శ్రీ మహావిష్ణువు తల తెగి ఉప్పు సముద్రంలో పడేలా శాపం ఇచ్చింది. హయగ్రీవ వృత్తాంతంలో ఉండే ఈ గాథ వల్ల భార్యకి సవతిని తెస్తే ఎంతకైనా తెగిస్తుందని పరమార్థము.

శ్రీశైల క్షేత్ర తీర్థం, కృష్ణా, గోదావరిలని దర్శించి సేవిస్తే కలిగే పుణ్యం...

అన్ని తీర్థాల్లో కెల్లా గొప్ప తీర్థం శ్రీశైలము. అక్కడి దేవహ్రదంలో స్నానం చేస్తే శివుడు మహా అభీష్టాలను నెరవేరుస్తాడు. ఇంద్రుడు నూరు యజ్ఞాలు చేసిన తీర్థం. దాన్నే దేవహ్రదంగా పిలుస్తున్నారు. ఈ తీర్థ స్నాన ఫలం ద్వారా అశ్వమేధ యాగం చేసిన ఫలం కలుగుతుందని పులస్త్య మహర్షి శెలవిచ్చాడు. ఇక కృష్ణా స్నానం

మహోన్నతమైన ఫలం. సకల పాపాలను పొగొట్టేది కృష్ణా స్నానం. దానితోపాటు పూర్వజన్మ స్మృతి కూడా కలుగుతుంది. అలాగే గోదావరిలో స్నానం చేస్తే గోమేధ యజ్ఞము చేసిన ఫలమని నారద మహర్షి నదీ పుణ్య ఫలాలను వివరించాడు.

దుష్టుడి గుమ్మం తొక్కినా పాపమే...

దేవ గురువు బృహస్పతి భార్య తారని ఆమె ఇష్టం మీదే చంద్రుడు అనుభవిస్తాడు. నాలుగు పాతకాలకన్నా, గురు భార్యను దగ్గరికి తీయటం మహా పాతకమని బృహస్పతి చెబుతాడు. అయినా చంద్రుడు బృహస్పతి చెప్పిన మాటలలో ధర్మశాస్త్రం చెబుతాడు. అనగా, వేద పఠనాల ద్వారా పాపాలు పోతాయని అలాగే స్త్రీ చేసిన పర పురుష సంగమం ఋతుస్రావంలో పోతుందని చెబుతాడు. అయినా భార్యకోసం వెళ్ళిన బృహస్పతి చంద్రుడి గుమ్మం ఎక్కకూడదని, గురు భార్యని పొందిన పాపం చేసిన చంద్రుడి గుమ్మం తొక్కకూడదని బైటే ఉంటాడు. తన భార్య తారని బైటినుంచే పిలిచి రమ్మంటాడు. ఆ పాపమేకాదు, ఏ పాపం చేసిన వాని గుమ్మం

తొక్కినా అలా తొక్కిన తనకి ఆ పాపం అంటుతుందని బృహస్పతి అంతటివాడే బైట నిలబడ్డాడు. కాన పాపాత్ముల ఇంట కాలు పెట్టినా వాని పాపాల్లో భాగం ఎంతోకొంత పంచుకోవాల్సిందే.

పితృకార్యాల్లో ఏ భోక్తను పిలిస్తే దోష పాపం...

భోక్తగా పిలిచే బ్రాహ్మణుడు గుణవంతుడై ఉండాలి. శ్రోత్రియుడైన ఆ భోక్తకు సంతానం ఉండాలి.

సంతానం లేనివాడు వేద శాస్త్రాలను చదివితే చదివి ఉండొచ్చు. నిత్యకర్మలను చేసేవాడైనా అయి ఉండొచ్చు. మహాశ్రేష్ఠుడైనా, మహోన్నతమైన వంశంలో పుట్టిన వాడైనా సరే సంతానం లేకపోతే వాణ్ని పితృ, ధర్మ శుభకార్యాల్లో వినియోగిస్తే దోషం. పాపం. పూర్వం పుణ్యశీలుడు అలాంటి భోక్తనే పిలిచి ఆ దోషానికి గాడిద రూపాన్ని పొందాడు. కాన సంతాన రహితుణ్ని ధర్మ, శుభ, పుణ్య, పితృకార్యాలకి పిలవకూడదని శాస్త్రాలు శెలవిస్తున్నాయి.

ధర్మపరులకి సాయం చేస్తే ఎంతటి పుణ్యం...

మంచికోసమూ, మానవత్వముకోసమూ చెయ్యగలిగినంత సహాయం చెయ్యటం మహా పుణ్యాన్ని సంపాదించిపెడుతుంది. ఎంతటి పాపాత్ములకైనా అలాంటి ధర్మపరులకి సాయం చెయ్యటం ద్వారా మహర్జాతకుడయ్యే పుత్రుడు కలుగుతాడు. వాని ద్వారా అపార కీర్తి కలుగుతుంది. పూర్వం కకుతస్థుడను రాక్షసుడు దేవతలకి సహాయం చెయ్యటం వల్లే సాక్షాత్తు శ్రీమహావిష్ణు అంశ అయిన పృథు చక్రవర్తికి జన్మించాడు.

ఎలాంటి పరిస్థితుల్లో చేసినవి పాపాలు కావు...

ఆకలితో అవసరార్థము చేసినవీ, భార్యా పిల్లల సిగ్గును దాచటానికీ, ఆకలి తొలగించుకోవటానికి చేసినవి ఏవీ పాపాలు క్రిందకురావు. స్త్రీ తన మానాన్ని రక్షించుకునే ప్రయత్నంలో అసత్యమాడినా, మరింకేమి చేసినా

ఎట్టి పాపమూ అంటదని ధర్మశాస్త్రాలు శెల విస్తున్నాయి.

ఏ హోమ భస్మం ఎంతపుణ్యం...

ఆవుతోక క్రిందభాగం నుంచి పేడను క్రింద పడకుండా తీసుకుని వేదమంత్రాలతో హోమం చేయగా వచ్చిన భస్మం శాంతికమనీ, అదే షడాక్షరీ మంత్రంతో హోమం చేయగా వచ్చిన విభూదిని పౌష్టికమనీ, అదే బీజాక్షరాలతో హోమం చేస్తే వచ్చే భస్మాన్ని కామదమని అంటారు. అలాగే విభూదిని ధరించినవానికి భోజనం పెట్టడము ఈశ్వరునికి నైవేద్యం పెట్టినంత పుణ్యం.

ఊర్ధ్వపుండ్ర ధారణ చేస్తే...

పర్వతం మీద మట్టిగానీ, శివక్షేత్రం ఉన్న ప్రాంతపు మట్టిగానీ, సముద్ర తీరపు మట్టిగానీ, తులసి కోటలోని మట్టిగానీ ఎంతో ప్రశస్తము. పుణ్యప్రదం. అట్టి చోట మట్టిని నొసట ధరించటం ఊర్ధ్వ పుండ్ర ధారణ అంటారు.

శాంతి కోసము నల్లమట్టినీ, కోరిన కోర్కెలు తీరటం కోసం ఎర్రమట్టినీ, శుభకార్యాలకోసం పసుపు మట్టినీ, ధర్మకార్యాలకి తెల్లమట్టినీ బొటన

వేలుతో పెట్టుకోవాలి. అదే చూపుడు వేలితో పెట్టుకుంటే ముక్తిప్రదం. నడిమి వేలితో పెట్టుకుంటే ఆయుష్షు పెరుగుతుంది. అనామికతో పెట్టుకుంటే సంపద వృద్ధి. శివకేశవుల నామాలను పఠిస్తూ ధరించాలి.

మహాపాపాలను హరించే శక్తి ఈ ఊర్ధ్వపుండ్ర ధారణకుంది.

పొంగలి ఎక్కడ చేస్తే పుణ్యం...

పొంగలిని దేవాలయంలో చేసి నైవేద్యం పెట్టి స్వీకరిస్తే పుణ్యం... ఒకప్పుడు పొంగలంటే దేవాలయంలో మాత్రమే ప్రసాదంగా దొరికేది. దాన్ని గృహాల్లో చేసేవారు కాదు. గృహంలో చేసుకుంటే తగదని ధర్మశాస్త్రము చెబుతోంది.

భర్తకి భార్య ఎంత గొప్ప వరం...

సరస్వతీదేవి లేనిదే బ్రహ్మదేవుడు సృష్టి చెయ్యలేడు. లక్ష్మీదేవి లేనిదే విష్ణుమూర్తి లోకాలని రక్షించలేడు. పార్వతీదేవి లేనిదే మహాశివుడు సంహారము చేయలేడు. భార్య లేనిదే పురుషుడు ఏ కార్యంలోనూ విజయం సాధించలేడు. ఈ సకల భూమండలాన్నీ ఏలిన నలుడు పుష్కరుని చేతిలో

భంగపడి కట్టుగుడ్డలతో అరణ్యం బాట పట్టాడు. మహా దరిద్రంలో హీనంగా గడిపాడు. ఆ సమయంలో ఆకలి కోసం రెండు పక్షులను పట్టుకునే ప్రయత్నంలో తన పంచె తీసి వాటిపై విసిరాడు. పక్షులు చివరకు నలునకు మిగిలిన పంచెను కూడా తీసుకొని పైకెళ్ళిపోయాయి.

దిశమొలతో భార్య ముందు నిల్చున్నాడు. అప్పుడు దమయంతి తన చీర కొంగును చుట్టి దిశమొలతోనున్న భర్త సిగ్గుని కాపాడింది. విదర్భ రాకుమారికి అంత కష్టం వచ్చినా భర్తనే అనుసరించింది.

భార్యకు అర్థం పరమార్థం దమయంతి. భార్యకు భర్తపై అంతటి ప్రేమ. సుఖాల్లో ఎంతమందైనా ఉండొచ్చు. కష్టాల్లో తోడుండేది భార్య.... భార్య ఋణం తీర్చుకోవటానికి పురుషుడికి ఏడు జన్మలు పడుతుంది.

అతిథులను పిలిచేటప్పుడు భోజనము సిద్ధంగా నున్నది అని చెప్పి పిలవాలి

- తైత్తిరీయ ఉపనిషత్తు

ఎన్ని సంబంధాలు చూసినా వివాహం కుదరకపోతుంటే...

తల్లీ, తండ్రిలో గానీ, సంతానంలో గానీ వివాహ సంబంధిత దోషాలుండి ఉండచ్చు. సకల దోషాలు పోవటానికి సీతారాముల వారి కళ్యాణం గానీ, శివపార్వతుల కళ్యాణం గానీ, తిరుమలలో కళ్యాణము గానీ చేయిస్తే అనేక గృహస్థ దోషాలు పోతాయి. వివాహ కార్యమనేదే పుణ్యం ద్వారా జరిగే శుభ కార్యము. కళ్యాణం చేయించటం ద్వారా పుణ్యాల్లో కెల్లా గొప్పదైనా కన్యాదాన ఫల పుణ్యం కలుగుతుంది. ఆ పుణ్యం పొందటం ద్వారా ఇంట్లో శుభకార్యం తప్పని సరిగా జరుగుతుంది. ఇలాంటి దోషాలు పోవటానికే దేవాలయాల్లో భక్తుల చేత కళ్యాణాలు చేయించేది. మీరు మీ పిల్లలతో కలిసి కళ్యాణాన్ని చూస్తూ మీ అభీష్టాన్ని కోరుకోండి. అంతా శుభం జరుగుతుంది.

పూజాదికాల సమయాల్లో చెయ్యాకూడని దోషాలు...

నిద్ర, కునికిపాట్లు, భయం, కోపము, మోహము, మదం, ఉన్మాదము, ప్రమాదము,

విస్మయం, సందేహం, లోభం, అసూయ, మాత్సర్యము, కపటము, అనాసక్తి, ఆగమశాస్త్రాలపై నిర్లక్ష్యము, పక్కలకి చూడటము, దండించటము ఈ దోషాలను యజ్ఞ యాగాదుల సమయంలో చేయరాదు. ఈ దోషాలను యాగశాస్త్రములో వివరించారు. ఆ సమయాల్లో అలా చెయ్యటం ద్వారా వ్రత పూజ, యజ్ఞ ఫలం సంపూర్ణంగా అందదు. పుణ్యాన్ని హరిస్తాయి ఆ చర్యలు. జనమేజయుడు సర్పయాగం చేస్తుండగా ఓ శునకం వస్తుంది. దాన్ని ఆ కారణంగా కొట్టినందుకే ఆ యాగం పూర్తవ్వదు. దీక్షా యాగ పూజా సమయాల్లో చేసిన దోషం అంతటి పాప ఫలాన్నిస్తుంది.

ఏ దానాలు వృద్ధాప్యంలో రక్షిస్తాయి...

జలదానమూ, అన్నదానములూ చేసినవారికి వృద్ధాప్యమున, మరణ సమయాన ఎట్టి బాధలూ కలగవని అష్టాదశ పురాణాల్లోని శ్రీ మార్కండేయ పురాణం చెబుతోంది. అట్లే చలికాలంలో శీతల బాధలూ పోవటానికి కట్టెలు, దుస్తులు ఇచ్చినవారికి

వృద్ధాప్యమున చలి బాధించదు. చందనము దానము చేసినవారికి ఎండకాలం తాపము దరి చేరదు.

కుటుంబ యజమాని చేసిన పుణ్యం ఎంత మందికి అందుతుంది...

సకల ధర్మకార్యాలనూ, దానాలనూ, పూజలనూ, యజ్ఞయాగాదులనూ చేసిన యజమాని పుణ్యం ఓ దశలో అనగా మహాతి మహోన్నతమైన పుణ్యంగా మారి ఆయనకే గాక ఆయన కుటుంబానికీ, సన్నిహితులకీ అందుతుంది. ఇంకా ఎన్నో ధర్మకార్యాలను చేసి మహాపుణ్యాన్ని పొందితే ఆ ఫలం సకల ప్రజలకీ అందుతుంది. అందుకే అంటారు. ఇన్ని పాపాలు జరుగుతున్నా ప్రళయం రావటం లేదంటే ఏ పుణ్యాత్ముడి పుణ్యమో కాపాడుతుందని.

ఆడి మాట తప్పని సత్యహరిశ్చంద్రుడి పుణ్యరాశి వల్ల అయోధ్యా పురవాసులందరికీ స్వర్గలోక ప్రవేశం సాధ్యమైంది. కోట్ల కొలది విమానాలు అయోధ్య పురవాసులకై స్వర్గలోకం

నుంచి వచ్చాయి. అపూర్వమైన ఆ హరిశ్చంద్ర ఘట్టాన్ని చదివినవారికీ, విన్నవారికీ పుష్కర, ప్రయాగ, సింధు తీర్థాల్లో స్నానం చేసిన పుణ్య ఫలమూ, సంతానం లేనివారికి సంతానాన్ని కలిగిస్తుందని సత్యహరిశ్చంద్ర గాథ తెలియ చెబుతోంది.

మహా విజయాన్ని సాధించాలంటే ఉండకూడని దోషాలు...

కామాదరిషడ్వర్గములు విడనాడినప్పుడే ఏ వృత్తిలోనైనా విజయం వరిస్తుంది. మొదట జయించాల్సింది కామాదరిషడ్వర్గములనే. ఆ తర్వాతనే మీ చుట్టూ ప్రపంచము చేత గొప్పవాడిగా కీర్తించబడతారు. పాండురాజంతటివాడు కామా వేశుడై జీవితాన్నే కోల్పోయాడు.

అనుహ్లాదుడు తన అపార కోపాగ్నిలో తానే భస్మమయ్యాడు. చివరకు కొడుకుని పోగొట్టు కున్నాడు. ఇక దేనుడు ద్విజులచే సంహరించ బడ్డాడు. మహా గర్వముతో అనాయుషుని పుత్రుడు సర్వమూ కోల్పోయ్యాడు.

సూర్య భగవానుని ఎలా పూజిస్తే ఎలాంటి ఫలం కలుగుతుంది...

- పత్ర, పుష్ప, ఫలతోయములతో పూజించి భక్తితో ప్రదక్షిణం చేస్తే భూప్రదక్షిణ చేసిన ఫలం కలుగుతుంది.
- షష్ఠి తిథినాడు వంటి పూట భోజనము చేసి అలాగే సప్తమినాడు కూడా ఏక భుక్తము చేసి సూర్యదేవుణ్ని ఆరాధిస్తే అశ్వమేధ యాగ ఫలం కలుగుతుంది.
- కృష్ణ పక్ష సప్తమి తిథినాడు సకల ప్రాణికోటికి ప్రత్యక్షదైవమైన సూర్యభగవానుణ్ని పూజిస్తే మహా పుణ్యం ప్రాప్తిస్తుంది.
- తెల్ల జిల్లేడితో సూర్యహోమము చేసిన కోరిన కోర్కె సిద్ధిస్తుంది.
- విజయ సప్తమి నాటి స్నానదానములు మహా ఫల ప్రదములు.
- ఆవు నెయ్యితో లేదా నువ్వుల నూనెతో దీపాన్ని పెట్టి సూర్యభగవానుణ్ని పూజించిన కంటి వ్యాధులు నయమవుతాయి.
- సూర్యదేవునికి అర్ఘ్యం అభిముఖముగా ఇవ్వాలి. భిన్నంగా ఇచ్చిన దోషము.

- అగరు చందనములతో, ఎర్రని పుష్పములతో ఆదిత్యుణ్ని సేవించినవారికి మనోభిష్ట మహా కార్య సిద్ధి కలుగుతుంది.
- ఆదిత్యవ్రతము అనగా సూర్యుడు ఉదయించి నప్పటి నుంచి అస్తమించే వరకూ సూర్యస్తోత్ర పఠనంలో నున్నవానికి సకల వైభోగములు సిద్ధిస్తాయి.
- సర్వసంపదలకీ, కోరిన కోర్కెలకీ, కార్య సిద్ధులకీ ఆవు నెయ్యితో తర్పణం చేసిన ఫలించును.
- రాత్రీ, పగలూ సరిసమానంగా నున్నప్పుడు భాస్కర దేవుణ్ని సేవిస్తే సకల దోషాలు తొలిగి ప్రశాంతత లభిస్తుంది. శుభకార్యాలు జరుగుతాయి. ఈ మహత్తర పుణ్యాలను బ్రహ్మదేవుడు స్వయంగా మునులకి చెప్పాడని శ్రీ బ్రహ్మ పురాణము వివరిస్తోంది.

భూలోక కల్ప వృక్షమును ఎలా పూజిస్తే ఫలం...

శ్రీహరికి నివాసమైన మర్రిచెట్టుకు భక్తితో మూడుసార్లు ప్రదక్షిణం చేస్తే, నీటితో కడిగితే

మురికి పోయినట్టు పాపాలూ, దోషాలూ పోతాయి. ఓ మహా యాగం చేసిన పుణ్య ఫలం అందుతుంది. మర్రిచెట్టుకు పూజాదికాలు చేసి ఇలా స్తుతించాలని ఇతిహాసం శెలవిస్తోంది.

ఓం నమోవ్యక్త రూపాయ మహాప్రళయ కారిణే
మహద్రసోపవిష్టాయ న్యగ్రోధాయ నమోస్తుతే
అమరస్త్వం సదాకల్పే హరేశ్చాయతనంవట
న్యగ్రోధహరమే పాపం కల్పవృక్ష నమోస్తుతే

తెలియక చేసిన పాపాలు నార వస్త్రాలు వంటివి. జింక చర్మంలా దులిపితే పోతాయి. అదే తెలిసి చేసిన పాపాలు మన వస్త్రాలు వంటివి. ఎంత పుణ్యంతో ఉతికినా ఇంకా పాపం అంటి ఉంటుంది.

అందమైన భర్త కావాలంటే...

ఆశ్వీయుజ బహుళ తదియనాడు వచ్చే అట్లతద్దినాడు కన్యలు ఉమాశంకరుణ్ని పూజించాలి.

చంద్రోదయం వరకూ ఉపవాసం ఉండి ఆపై అట్లను నివేదించాలి. ఊయల పండగని కూడా పిలిచే ఈ రోజు అట్లతద్ది వ్రత కథ విని, ఆ అక్షింతలను తలపై చల్లుకోవాలి. పెద్ద వాళ్ళతో కలిసి భోజనం పూర్తి చెయ్యటం ద్వారా అందమైన భర్త లభిస్తాడు. పెళ్లైనవారికి ఆ భర్త అనురాగం మరింత పెరిగి సుఖంగా ఉంటారు.

వ్రత, పూజ, దానాలప్పుడు శునకాన్ని తాకితే ఎంత దోషం...

సకల పుణ్యకార్యాల ద్వారా వచ్చే పుణ్య ఫలం శునక స్పర్శ ద్వారా తొలిగిపోతుంది. ఇంట్లో కుక్కని పెంచుకునే వారు వ్రత, పూజాదికాలు జరిగేటప్పుడు శునకాన్ని తాకటం ద్వారా చేసిన వ్రత, పూజలు వృధా అవుతాయి.

కాన వ్రతపూజానంతరము, భోజనం పూర్తి అయ్యాకే శునకాన్ని తాకాలి. రత్నమయ విమానంలోకి శునకాన్ని రానివ్వననీ, శునక స్పర్శ యజ్ఞ యాగాదుల ఫలం కూడా లాగేసుకుంటుందని దేవేంద్రుడు యముడి సమక్షంలో ధర్మపుత్రుడైన

ధర్మరాజుకి చెబుతాడు. కాన పూజాదికాలప్పుడు శునకాన్ని తాకకండి.

నైవేద్యం పెట్టకముందే రుచి చూస్తే కలిగే పాపం...

పాప ధనం ద్వారా వచ్చిన అన్నాన్నీ, శ్రాద్ధాన్నమునూ, సూతక అన్నాన్నీ, మామగారింట పని చేయకుండా తినగా మిగిలిన అన్నాన్నీ, భృతుల భోజనాన్నీ తిన్న దోషము కలుగుతుంది. అట్లే పొంగలిని భగవంతునికి అర్పించనిదే తినరాదు. అటుల చేసినచో పాలలో మజ్జిగ కలిపి తాగిన దోషం కలుగుతుంది.

నర్మదా మహాత్మ్యమెంత గొప్పది...

రుద్రుని దేహము నుంచి జన్మించినది నర్మదానది. సరస్వతీ నదిని మూడు రోజులు, యమునా నదిని ఏడురోజులు, గంగానదిని తాకినంతనే ఎంతటి పాపులైన పవిత్రులవుతారు. అదే నర్మదానది దర్శన మాత్రమే సకల పాపాలూ హరించుకుపోతాయి. ఈ నదిలో స్నానము చేసి ఆ రాత్రి ఉపవాసమున్న అతని వంశాన్ని వంద తరాల వరకూ ఆ తల్లి రక్షిస్తుంది. ఇక్కడ పితురులకు

కార్యాలు చేస్తే పది సంవత్సరాలు వరకూ ఏ కారణంగా చేయలేకపోయినా పితురులు నొచ్చుకోరు. అట్లే ఎన్నో సంవత్సరాల నుంచి పితురుల కార్యాలు చేయనివారు ఇక్కడ చేస్తే చేయని అన్ని సంవత్సరాలు చేసినట్టే.

'ఓంకార' ధ్యానమెంత పుణ్యం...

'ఓం' అక్షరం బ్రహ్మ. 'ఓం' అనగా భూమీ, ఆకాశ, పాతాళములు. 'ఓం' కారమును పలికితే ఎంత పుణ్యమో, విన్నా అంతే పుణ్యం. నిత్యం నెలపాటు 'ఓం'కార ధ్యానం చేస్తే అశ్వమేధయాగం చేసిన ఫలం.

సత్యవాక్కుతో, మద్య మాంసాలను వదలి జీవిస్తుండడం ద్వారా వచ్చే పుణ్యం 'ఓం' కార జపము ద్వారా కలుగుతుంది. మహా తపస్సుల ద్వారా వచ్చే పుణ్యం, దానాలలో కెల్లా అత్యుత్తమ దానమైన విమల దానం ద్వారా వచ్చే పుణ్యం ఈ 'ఓం' కార ధ్యానము ద్వారానే కలుగుతుంది. వాయువూ, అగ్నీ, జలములూ అక్షరమైన ఓంకారం నుంచే జన్మించాయి. ఇంతటి పుణ్య రహస్య విషయాన్ని సూతుడు శౌనకాదిమునులకు చెప్పాడు.

ఏ సమయంలో ప్రథమ రజస్వలయితే ఏ ఫలం...

- చిరుగులు లేనివీ, శుభ్రమైనవీ, రంగు గలవి అయిన దుస్తుల్లో ప్రథమ రజస్వల అయితే శుభప్రదములు.
- రజస్వల సమయం మంచిది కాకపోతే నవగ్రహశాంతితోపాటు గౌరీదేవి కుంకుమార్చన చేయించుట మంచిది.
- ప్రాతఃకాలము అయినచో నిత్య సుమంగళిగానూ, మధ్యాహ్నము పూట అయినచో గొప్ప ధనవంతురాలవుతుంది.
- అర్ధరాత్రి అయితే గ్రహ తిథిలను బట్టి శాంతులు చేయించాలి.
- రజస్వల సరిసంఖ్య తేది కన్నా బేసి సంఖ్యా తేది మంచిది.

ఉపవాసంలో చేయకూడని దోషాలు...

వ్రతమంటే తపస్సు. తపస్సు ఎప్పుడు ఉపవాసంతోనే చేయాలి. అప్పుడే అది సార్థకమవుతుంది.

పూజాదికాలప్పుడు ఉపవాసముండి భగవంతుని సేవిస్తారు. ఆ సమయంలో ఉపవాసంలో దోషాలు చేస్తే పుణ్యం కాస్త పాపంగా మారుతుంది.

- కంచుపాత్రలలో భోజనం చేయకూడదు.
- ఉపవాస సమయంలో పుష్పాలతో అలంకరణ చేసుకొనరాదు. సౌందర్య సాధనాలను వాడరాదు.
- ఉపవాస కాలమందు నీరు ఒకటికి పదిసార్లు త్రాగితే దోషము.
- ఉపవాసం తర్వాత తాంబూలమూ, ఆపై సంభోగములు దోషములు.
- గుమ్మడి, వంకాయ, అనపకాయ కూరలూ, వులునులూ ఉపవాసమైన తర్వాత భోజనంలోకి వలదు.
- పగలు ఉపవాసముండి రాత్రి భోజనం చేయు ఉపవాసం శ్రేష్టాతి శ్రేష్టం.
- ఏ కారణం చేతనైన ఉపవాసం భంగపడితే ఆ దోషం పోవటానికి మూడు రోజులు వంటిపూట భోజనంతో దోషానికి పరిహారం చేసుకోవాలి.

- ఉపవాస సమయాన నీరు, ఫలము, నెయ్యి, పాలు, ఔషధములు శరీర అవసరార్థం సేవించినా దోషం కాదు.
- ఉపవాస సమయాల్లో నేలపై నిద్రించుటతో పాటు ఆ సమయంలో దానం మహా పుణ్యం కలిగిస్తుంది. ఆయుర్దాయమునూ, కీర్తినీ, ధనాన్నీ పెంపొందిస్తుంది.

ఏ వత్రాలు ఏ ఫలాన్నిస్తాయి...

- పాడ్యమి వ్రతాలు చెయ్యటం వల్ల బ్రహ్మ దేవుడు ప్రీతిచెంది కోరిన కోర్కెలు నెర వేరుస్తాడు.
- విదియ వ్రతాలు భుక్తితోపాటు ముక్తినీ, కుటుంబంలో ప్రశాంతతనూ ఇస్తాయి.
- తదియ వ్రతములు సౌభాగ్య, ఆరోగ్య, దీర్ఘాయువులను అందిస్తాయి.
- చవితి వ్రతములు చేసిన ఈ భూమిపై తాను కోరుకున్న సుఖాలను పొందుతాడు. తన వాళ్ళకి తన వ్రత పుణ్యం ద్వారా సుఖాలను అందిస్తాడు.
- పంచమి వ్రతములు మహాకీర్తిని తెచ్చి పెడతాయి.

- షష్ఠీ వ్రతాలు చెయ్యటం వల్ల మహా గౌరవము లతోపాటు ముక్తి కలుగుతుంది.
- సప్తమీ వ్రతాల కారణంగా తెలిసి చేసిన పాపాలు, తెలియక చేసిన పాపాలు సమసి పోతాయి.
- అష్టమి వ్రతాల వలన ఈ జన్మలో చేసిన సమస్త పాపాలూ తొలగిపోతాయి. అష్టమి వ్రతాల ద్వారా కలిగే పుణ్యం వల్ల సుఖాలు కూడా అందుతాయి.
- నవమి వ్రతముల ద్వారా వ్రతం చేసిన వారి కోర్కెలే కాదు, కుటుంబ యజమాని కోర్కెలు కూడా తీరుతాయి.
- దశమి వ్రతములు చేసిన వారికి మహాధికారం వస్తుంది.
- ఏకాదశి వ్రతముల ద్వారా తానూ, తన సంతానమూ అపార సంపదలను పొందుతారు.
- ద్వాదశి వ్రతము చేసినవారు తన కుటుంబ మంతటికి ఆరోగాన్నీ, పుణ్యాన్నీ ఇచ్చిన వారవుతారు.
- శ్రావణము నాటి వ్రతము మహా తీర్థాలలో స్నానం చేసిన ఫలం.

H త్రయోదశి తిథి వ్రతము మహా పుణ్యలోక ప్రాప్తి.

H చతుర్ధశి తిథి వ్రతము మహా సుఖవైభోగ సంతోషాలను కలిగిస్తుంది.

'హరి ఓం' అని ఒక్కసారి పైకి అనినంతనే మనలోని భయాన్నీ, దుష్టగుణాన్నీ, అసమర్థతలనూ పోగొడతాడు ఆ దేవదేవుడు.

భర్త దగ్గర స్త్రీ ఎలా ఉండకూడదు...

H ఆహారమూ, నిద్రా, సంభోగమూ అతిగా పురుషునికి పనికిరాదు. ఇక స్త్రీకి కూడా ఆహారమూ, నిద్రా రెండూ అతిగా పనికిరావు.

H భర్త శత్రువులను కీర్తించుట, పక్కింటి మొగుడి గొప్పతనము చెప్పుట, మహా గర్వంతో మాట్లాడుట ఇటువంటివి ఉండకూడదు.

H భర్త ప్రేమగా దగ్గరకు తీసుకున్నప్పుడు, ముద్దు పెట్టుకుంటున్నప్పుడు ముఖం వక్కకి

తిప్పుకొనుట, తుడుచుకొనుట, కడుగుగొనుట వంటివి చేసిన ఆ భార్యకి భర్తపై ప్రేమ లేదన్నది సత్యం.

H భర్త దగ్గర ఆవేశపడే స్త్రీ జీవితాంతము దుఃఖాన్ని భరించే పరిస్థితి తెచ్చుకుంటుంది.

H భర్త చెప్పేది వినకపోవటమూ, భర్త తెచ్చిన వస్తువును చూసి చూడనట్టు ఉండటమూ, పక్కన పడుకున్నప్పుడు పూర్తిగా దుప్పటి కప్పుకొని వుండటమూ వంటివాటితోపాటు ఇంకా కోరిక కలిగినప్పుడూ దగ్గరికి వచ్చినప్పుడూ అయిష్టతనూ, నిర్లక్ష్యాన్ని తెలియపరచటమూ తగదు. అట్టి స్త్రీ సంభోగానికి పనికిరాదు. సుఖమివ్వదు.

H శృంగార సమయాన శింగారించుకోకుండా పిచ్చి పిచ్చిగా ఉంటే అట్టి స్త్రీని తాకుట వృధా.

H భర్తపై ప్రేమున్న స్త్రీకి భర్తను చూడగానే ముఖం వికసిస్తుంది. భర్త చూస్తుంటే కొద్దిగా తల పక్కకి తిప్పుకొని తన ఎదవంక చూసుకొనే స్త్రీ ప్రేమాభిమానురాలు గల భార్య అగును.

H భర్త స్పర్శచే కనులు మూసుకున్న స్త్రీ పద్మిని జాతి లక్షణము కలది. భర్త ఇచ్చిన చిన్న

వస్తువును కూడా అతి భద్రంగా దాచుకునే భార్యతో సంభోగము మహా సుఖాన్నిస్తుంది. భర్త నిద్రించిన తర్వాత నిద్రించునదీ, భర్త లేవకముందే తాను నిద్ర లేచినదీ, భర్త కనుల ముందు మలమూత్రాదులకు వెళ్ళనిదీ సాధ్వీమణి, పతివ్రత, సకల సంసార సుఖములను ఇచ్చు కల్ప వృక్షమంతటిది ఆ భార్యామణి.

పూజా, పారాయణ వ్రత సమయాల్లో అక్షర దోషాలతో చదివితే ఎంతటి పాపం...

శ్రీ లలితా సహస్రనామం, శ్రీ విష్ణు సహస్ర నామం, శ్రీ హనుమాన్ చాలీసా, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం. ఇలా సకల పూజా వ్రత, పారాయణాలప్పుడు స్తోత్రాలూ, అష్టోత్తరాలూ, వ్రతపూజా విధానాలను చదువుతూ దేవుణ్ని సేవించేటప్పుడు అక్షర దోషం లేకుండా చదవాలి.

అలా చదివి, ఆ పుస్తకంలో అలా ఉంది కదా అంటే కుదరదు. అక్షర దోషాలతో, భావ దోషాలతో చదివిన ఆ పాపం అవహించక మానదు.

కాన అలాంటి గ్రంథాలను వ్యాపారాత్మకంగా చేసే వారి నుంచి కాక దేవాలయాల ప్రచురణలూ, ఆశ్రమాల ప్రచురణలనుంచి గ్రహించి పుజాదికాలు చేసుకోవాలి. ఇంటి కొచ్చిన అతిథిని అమర్యాదగా మాట్లాడితే ఆ అతిథి వక్క క్షణమైనా ఉంటాడా! దేవుడూ అంతే. పూజ అంటే స్తుతించటం... అక్షర శబ్దం మారితే అమర్యాద. కాన సకల స్తోత్ర పూజలన్నీ అష్టాదశ పురాణాల్లో ఉన్నాయి. వాటినాధారంగా తీసుకొని పూజాదికాలు నిర్వహించు కోవాలి.

కోటి గోవులను దానమిచ్చిన ఫలం పొందాలంటే...

శ్రీ మహావిష్ణువుకి ప్రీతికరమైన మాలతి, మల్లి, గులాబి, అశోకము, తగరము వంటి పూలతో సకల పూజ చేసి నాలుగుసేర్ల నెయ్యితో శ్రీమహావిష్ణువుకి అభిషేకం చేస్తే కోటి ఆవుల దానమిచ్చిన ఫలం కలిగి, కుటుంబంలోకి వరద నీరు వచ్చినట్టుగా సంపదలూ, సుఖాలూ తరలి వస్తాయి.

అనారోగ్యాలూ, దోషాలూ తొలగిపోతాయి. ఇంతటి పుణ్య పూజను చెప్పింది అగ్నిదేవుడు.

మన ఇంట్లోని ఎలుకలనూ, బొద్దింకలనూ, దోమలనూ ఇత్యాదివన్నింటినీ చంపటం ద్వారా పాపము ఎందుకు సంక్రమించదు...

భగవంతుని సృష్టి ధర్మమే అలా ఉంది. మనకి తెలియకుండా చేసే హింస వలనా, మానవ జీవన సరళికి ఇబ్బంది, అవరోధాలనూ కలిగించే జీవులను చంపటం ద్వారా ఎలాంటి పాపమూ రాదని ధర్మశాస్త్రాలు ఖచ్చితంగా శెలవిస్తున్నాయి.

వివాహం కాకపోతే స్వర్గలోక ప్రవేశం ఎందుకు నిషిద్ధము...

సకల పుణ్య కార్యాల ద్వారా వచ్చే ఫలంతో స్వర్గలోక నివాసప్రాప్తి కలుగుతుంది. వివాహం కుటుంబ వ్యవస్థను పెంచేది మాత్రమే కాదు పుణ్యకార్యం కూడా. పెళ్లి ద్వారా కూడా పుణ్యం వస్తుంది. అయితే ఎన్ని పుణ్యాలూ, ధర్మాలూ, యాగాలూ చేసినా వివాహం చేసుకోకపోతే,

ధర్మార్థకామమోక్షాలతో జీవనం సాగించకపోతే స్వర్గలోక ప్రాప్తి ఉండదు. స్త్రీ అయినా పురుషుడైనా పెళ్ళితోనే సకల కార్యాల వల్ల వచ్చే పుణ్యఫలాన్ని పరిపూర్ణంగా పొందుతారు. అయితే వైకుంఠ ప్రవేశానికీ, వివాహానికీ సంబంధము లేదు. భక్తి ద్వారా ఎవరైనా వైకుంఠ ప్రాప్తిని పొందవచ్చు.

శ్రీ మహావిష్ణువుకు ఒక్కసారి నమస్కరించినంతనే పద్దెనిమిది పురాణాలకు మొక్కిన ఫలితం...

శ్రీ మహావిష్ణువు పురాణపురుషుడు. అనంత కోటి బ్రహ్మాండనాయకుడైన ఆ నారాయణమూర్తి హృదయములో పద్మపురాణమూ, శిరస్సు నందు బ్రహ్మపురాణమూ, బొజ్జ నందు గరుడ పురాణమూ, చర్మము నందు వామన పురాణమూ, తొడల యందు భాగవతమూ, ఎముకల నందు బ్రహ్మాండ పురాణమూ, మెదడు నందు మత్స్యపురాణమూ, వెన్నుపూస నందు కూర్మపురాణమూ, కుడి చీలమండ నందు లింగపురాణమూ, ఎడమ చీలమండనందు వరాహ పురాణమూ, బొడ్డు నందు నారద పురాణమూ, వెంట్రుకల నందు స్కాందమూ,

ఎడమ భుజము నందు శివ పురాణమూ, కుడి భుజము నందు విష్ణుపురాణమూ, ఎడమ పాదము నందు అగ్ని పురాణమూ, కుడి పాదము నందు మార్కండేయ పురాణమూ, ఎడమ కాలు మోకాలినందు బ్రహ్మవైవర్త పురాణమూ, కుడి కాలు మోకాలి నందు భవిష్యపురాణమూ నిక్షిప్తం అయి ఉన్నాయి. అట్టి పురాణ పురుషుడైన శ్రీ మహావిష్ణువుకు నమస్కరించడమంటే పద్దెనిమిది పురాణాలకి నమస్కరించినట్లే. సకల పుణ్యప్రాప్తికై పద్దెనిమిది పురాణాలను తలచుకొని నమస్కరించండి. అలా తలుచుకొని పూజిస్తే పద్దెనిమిది పురాణాలు చదివిన పుణ్యం కూడా వస్తుంది.

యజ్ఞ యాగాదులు చెయ్యటం వల్ల వచ్చే ఫలం...

యజ్ఞాలు చెయ్యటం ద్వారా వరుణుడు శాంతిస్తాడు. లోకానికి మేలు కలుగుతుంది. దానితోపాటు యజ్ఞకర్త పితృదేవతలు సంతృప్తి చెంది ఆ లోకాల నుంచి అనేక దీవెనలు ఇస్తారు. ఇహలోకంలోనూ యజ్ఞకర్త సమస్త సుఖాలను కుటుంబంతో సహా పొందుతాడు. అనంతమైన

పుణ్యరాశిని పొంది, అనేక జన్మల వరకూ ఉత్తమమైన జన్మ పొందుతాడు. యాగాలూ, పూజలూ, వ్రతాలూ ఇవన్నీ ఇహలోకంలో సుఖాన్నిచ్చేవి కూడా.

స్కాందపురాణము చదవటం వల్ల ఎంత పుణ్యప్రాప్తి...

భక్తిగా, నిష్ఠగా ఓ నెల రోజులపాటు స్కాంద పురాణాన్ని చదివిన వారికి అనేక దీర్ఘరోగాల నుంచీ, మహా దారిద్ర్యాల నుంచీ విముక్తి. వివాహాదులప్పుడూ, శుభకార్యాలప్పుడూ ఓ అధ్యాయంగానీ, స్కాందము మొత్తంగాని చదివితే సకలం శుభమవుతుంది. తీర్థయాత్రలప్పుడు స్కాంద పురాణాన్ని దగ్గర పెట్టుకుని చదువుతూ ఉంటే తీర్థయాత్ర ఫలం రెట్టింపు అందుతుంది.

'శివా' అని పిలిచినంతనే కలిగే పుణ్యం...

భక్తి నిష్ఠలతో ఎవరైతే మహాశివుణ్ని 'శివా' అని ప్రార్థించి పిలుస్తారో, పిలిచినంతనే మోక్షమునకు అర్హులవుతారు. మహేశ్వరుడు

ఉదారుడు. అడిగినంతనే వరాలని ఇచ్చే వరమశివుణ్ని వేడుకోవటం ద్వారా మహా సముద్రమనే సంసార సాగరాన్ని అవలీలగా దాటగలరు.

సాటి వారికి హాని చేయటం ద్వారా ఎంతటి పాపాన్ని మూటగట్టుకోవాల్సివస్తుంది...

కోపంతోనూ, ద్వేషంతోనూ, అకారణవైరం తోనూ, పుత్రప్రేమతోనూ పక్కవారికి హాని చేస్తే, దాన్ని అనుభవించిన వాని సమస్త వ్యధ ఓ శక్తిలా మారి ఏదో ఒక సమయాన అతణ్ని ఆవహించి, ఏ చెడు అయితే చేశారో, ఆ చెడే రెట్టింపుగా హాని చేసినవాడు అనుభవించవల్సివస్తుంది. కాన ఆవేశంలో కూడా సాటివారికీ, అయినవారికీ కీడుచేయద్దు. చెడు చేసినా ఆ వ్యక్తులను ద్వేషించకుండా దూరంగా ఉండటం వల్ల ఆ పాపాన్ని మీకు తెలిసేలా, మీ కళ్ళ ముందే మీకు కీడు చేసినవాడు అనుభవిస్తాడు. తండ్రి స్థానంలో ఉండి కూడా పాండవులకు అన్యాయం జరుగుతుంటే మౌనంగా ఉన్నందుకే... అరణ్య

వాసాలకి వెళుతున్నా కలగచేసుకోనందుకు శిక్షగా ధృతరాష్ట్రుడు అదే ధర్మరాజు ఎదురుగా సమస్తమూ, సకల పుత్రబంధువులూ పోయి, వేదనతో అరణ్యవాసానికి వెళ్ళాడు. ఏ బాధలైతే పాండవులు పడ్డారో అదే బాధలు అనుభవిస్తూ ధృతరాష్ట్రుడు బ్రతికున్నంతవరకూ అరణ్యాల్లోనే గడిపాడు. చివరకు కార్చిచ్చులో బూడిదయ్యాడు గాంధారీ, కుంతిలతో సహా. అలా కాకుండా అదే కత్తికి కత్తిలా సమాధానం చెబితే ఇరువురూ మరొక రకంగా బాధపడాల్సివస్తుంది.

ఈ జన్మలో చేసిన పాపాలని ఈ జన్మలోనే అనుభవించాలి. ఆ పాపాలకి సమయం లేనప్పుడూ, ఎక్కువగా అనుభవించాల్సినప్పుడూ ఆ పాప ఫలం మలి జన్మకి వాయిదా వేయబడుతుంది. అయితే దాని తాలూకూ వడ్డీ ఈ జన్మలోనే అనుభవించాలి.

శివాలయానికి మూడుసార్లు వెళ్ళటం ద్వారా ఎంతటి పుణ్యం...

ఉదయాన్నే దర్శించినంతనే రాత్రి చేసిన పాపము సమసిపోతుంది. అట్లే మధ్యాహ్నము ఆలయానికి వెళ్ళి స్వామిని దర్శించి ధ్యానిస్తే అనేక జన్మల పాపము కరగటం ప్రారంభమవుతుంది. రాత్రిపూట చేసే దర్శనము అనంతమైన పుణ్య ఫలం ఇస్తుంది. మనసునీ, శరీరాన్నీ తేలిక చేస్తుంది. కర్మ పుణ్య దిశగా నడిపిస్తుంది.

శివాలయంలో భేరిధ్వని వినటం కూడా మహాపుణ్యమే...

మహాశివుని సన్నిధిలో నున్న భేరినాదమును దూరం నుంచి విన్నవారు కూడా శివానుగ్రహానికి పాత్రులు.

దైవమంటే నమ్మకం లేనివారూ, విమర్శించే వారు సహితం ఆ నాదం వినటం వలన వారి తప్పులను మహాశివుడు క్షమిస్తాడు. ఏ పశు చర్మంతో భేరి నిర్మించారో ఆ పశువు కైలాసాన మహాశివుని సన్నిధిలో నివాసముంటుంది.

మహాశివున్ని ఏ విధంగా సేవిస్తే ఏ ఫలం...

- శివదేవుని ఎదుట దానాలు చేసే భక్తులు మహాశివుని ప్రేమకు పాత్రులవుతారు.
- పరమేశ్వరునికి చామరములు ఇచ్చువారు ఇహలోకంలో అనేక సుఖాలను పొందుతారు.
- శివునికి దీప దానము చేసినవారు తేజోవంతులూ, వీర్యవంతులూ అవుతారు.
- అర్ధనారీశ్వరుడైన సదాశివునికి ధూపమును సమర్పించిన వారికి అఖండమైన కీర్తి కలుగుతుంది.
- పరమేశ్వరునికి నిత్య నైవేద్యము పెట్టడం ద్వారా తమ వారికి ఆకలి అన్న బాధ అనేక తరాల వరకూ కలగదు.
- శివాలయాన్ని బాగుచేసిన వారూ, నిర్మించిన వారూ ఇహలోకములోనూ, పరలోకములోనూ అనంతమైన సంతృప్తిని పొందుతారు.
- రోజూ మూడుసార్లు శివున్ని దర్శించుకున్న వారికి సమస్త దుఃఖముల నుంచి విముక్తి కలుగుతుంది. (స్కాందపురాణము నుంచి)

ఏ శివలింగాన్ని పూజిస్తే ఎంత పుణ్యం...

H సృష్టికర్త బ్రహ్మదేవుడు నిత్యమూ పూజించే మణిమయ శివలింగం వలె మణులతో అలంకరించిన శివలింగాన్ని పూజించిన వారికి అనంతమైన సంపదలు కలుగుతాయి. కలిగిన సంపదలు తనకీ, తనవారికీ పరిపూర్ణంగా అందుబాటులో ఉంటాయి.

H శచీపతి ఇంద్రుడు వలె నిత్యమూ రత్నాభరణాలను ధరింపచేసి పూజిస్తే అఖండమైన అధికారాన్ని పొందగలరు. దీర్ఘ ఆయువు కలుగుతుంది.

H సకల లోకాలకి వెలుగును నింపే చంద్రుని వలె మహా శివలింగాన్ని ముత్యాలతో అలంకరింపచేసి పూజిస్తే మీ కుటుంబము నకు అనంతమైన సుఖసౌఖ్యాలు, భోగ భాగ్యాలకీ కొదవ ఉండదు.

H సూర్యభగవానుని వలె రాగి శివలింగమును పూజిస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. అనేక వ్యాధులు మీ నుంచి దూరమవుతాయి.

నూతన శక్తితో ఎంతటి కార్యాన్నైనా సునాయాసంగా చేయగలుగుతారు.

H కుబేరుని వలె బంగారు శివలింగాన్ని పూజిస్తే మీ సంపదలు దుష్టుల పాలు కాక మీకూ, మీ తరతరాలకూ అందుతాయి. ఎలాంటి దుర్భర పరిస్థితుల్లో కూడా మీ కుటుంబానికి రాచమర్యాదలే జరుగుతాయి.

వినాయకునికి ఎలా నమస్కరిస్తే ఇష్టం...

సకల గణములకు అధిపతి అయిన పార్వతీ పుత్రా, అనేక పాపముల నుంచి రక్షించే ఈశ్వర పుత్రా, సకల సౌభాగ్యాలూ, సిద్ధులూ ఇచ్చే ఏకదంతము కలవాడా, ఏనుగు ముఖాన్ని కలిగి, మూషిక వాహనుడైన వినాయకా నీవు కుమారస్వామికి గురువువి. అట్టి నీకు నమస్కరిస్తున్నాను. అని ఎవరైతే అలా ధ్యానించి పూజ ప్రారంభిస్తారో వారికి వినాయకుడు ఎల్లవేళలా తోడై ఉంటాడని మహాశివుడు మహా శివపురాణంలో శెలవిచ్చాడు. అలా ప్రార్థించిన వారికి వినాయకుడు ఎట్టి విఘ్నాలూ కలగకుండా సకల కార్యాలనూ విజయవంతము చేస్తాడు.

కార్తీక మాసంలో శివపూజ ఎంతటి పుణ్యం...

శివ ప్రీతికరమైన కార్తీక మాసంలో దీపమాలలను శివునికి అర్పిస్తే ఆ దీప మాలలు శివలింగము ఎదుట ఎంత సేపు వెలుగుతాయో అన్ని యుగ సహస్రములవరకూ మహా సుఖాలు పొందుతారు. ఈ కార్తీక మాసంలోనే కుసుమ నూనెతో దీపాలను వెలిగిస్తే శివ అనుగ్రహానికి పాత్రులవుతారు. అలాగే నువ్వుల నూనెతో దీపాలన్నీ వెలిగించినవారు సకల కుటుంబ సౌఖ్యాలనూ పొందుతారు. నెయ్యితో దీపాలను వెలిగించినవారికి వృద్ధాప్యంలో అయినవారు ప్రీతితో సకల సేవలూ చేస్తారు. వృద్ధాప్యాన్ని అనుభవించి ముని మనవళ్ళను చూసి ఆ తర్వాత శివసాయుజ్యమును పొందుతారు.

విభూదిని ధరించిన వానిని చూసినా పాపము పోతుందా...

కపిల వర్ణము గల గోవు పేడను క్రిందపడక ముందే గ్రహించి, దాన్ని ఎండ పెట్టి, దహించగా

వచ్చినదే విభూది. దాన్ని ధరించినంత మాత్రానే శివప్రీతి కలుగుతుంది. అట్టి విభూదిని ధరించిన వానిని చూసినంతనే మనము తెలియక చేసిన పాపాలు నశిస్తాయి.

శ్రీవిష్ణుసహస్రనామమూ, లలితానామమూ వంటివి ఏకాగ్రతతో ధ్యానిస్తూ పఠించాలి. వేరే ఆలోచనలతో చేస్తే రావాల్సిన పుణ్యం రాదు.

ఏ రుద్రాక్ష ధరించి పూజిస్తే అనంతమైన ఫలం కలుగుతుంది...

ఏకముఖి నుంచి పదహారు ముఖాలు కలిగిన రుద్రాక్షల్లో సర్వశ్రేష్ఠమైనవి రెండే. ఒకటి ఏకముఖి, రెండో రుద్రాక్ష పంచముఖి రుద్రాక్ష. వాటిని ధరించి పూజించిన జప, తప, క్రియ, యోగ, స్నాన, దాన, అర్చనము వంటి పుణ్య ఫలం రెట్టింపు అవుతుంది. (స్కాందపురాణము)

వీరిని హింసిస్తే ఎంతటి మహా పాపము...

గాయాలతోనున్న వారినీ, అన్యధాశరణమన్న వారినీ, భయపడుతున్న వారినీ, ఆర్ధికంగా చితికిపోయినవారినీ, స్త్రీలనూ, పిల్లలనూ హింసించినా, అలా బాధించినా మహాపాతకాన్ని అనుభవించాల్సి ఉంటుంది. బ్రహ్మ హత్య చేసిన వారితో సమానంగా కర్మను అనుభవించక తప్పదు. వారిని పెట్టిన బాధకు రెట్టింపు వ్యాధులు ఆవహించి తద్వారా ప్రత్యక్ష నరకాన్ని చవిచూడాల్సి వస్తుంది.

సకల శాస్త్రాలు తెలిసిన వారినీ, చదివిన వారినీ కించపరిస్తే...

మరో జన్మలో కొండచిలువగా పుట్టాల్సి వస్తుంది. అలా తిట్టిన ఇహ లోకంలో వారికి విద్య రాదు. మూఢులవుతారు. ధర్మమే జీవనముగా గడుపుతున్న ధర్మశాస్త్ర పురాణాల్లో పుణ్య కోవిదులను మహా అధికార మదంతో అవమానించిన కారణంగా నహుషుడు వంటివాడు సర్ప జన్మ ఎత్తి చేసిన తప్పుకి శిక్ష అనుభవించాడు.

మహాశివున్ని ఏ సమయంలో పూజిస్తే అనంతమైన కార్యసిద్ధి...

కార్తీక, శుక్ల పక్షమున శనివారము సంపూర్ణ త్రయోదశినాడు పూజించిన ఎంతటి కార్యమైన సిద్ధింపక తప్పదు. అనాడు ప్రదోష సమయంలో పరమేశ్వరుణ్ని లింగరూపంలోనున్న ఆ స్వామిని పూజించి కోరిన కోర్కె ఖచ్చితంగా తీరగలదు.

మధ్యాహ్న సమయాన శుచిగా ఉండి నువ్వులతోనూ, ఉసిరికాయలతోనూ, గంధ పుష్పాలతోనూ, ఫలములతోనూ పూజించాలి. తిరిగి సాయంత్ర సమయాన విశేష పూజలు చేయాలి.

ఈ పవిత్రమైన రోజు అనగా ప్రదోష వేళ నిద్రిస్తే అంతవరకూ సంపాదించిన పుణ్యమంతా తరిగిపోతుంది.

శివాలయంలో ఎన్ని ప్రదక్షిణలు చేయాలి...

ప్రదోష సమయంలో లింగరూపంలోనున్న శివున్ని దీపధూపనైవేద్యములతో పూజించి నూట

ఎనిమిది సార్లు శివ నామాలని ధ్యానిస్తూ ప్రదక్షిణం చేస్తే కోరిన కోర్కె తీరుతుంది. (స్కాందపురాణం)

మహా విజయం కొరకు శివ పూజ ఎలా చేయలి...

కార్తీక మాస శనివారము పూర్తి త్రయోదశి నాడు వెండి ఎద్దు విగ్రహం చేయించి, పీఠము చేయించి అర్ధనారీశ్వరుని ప్రతిమని ఉంచి, అనగా అయిదు తలలతో, పది భుజములతో సగ భాగమున పార్వతి ఉండేలా కనకపు విగ్రహాన్ని చేయించి సకల పూజలు చేసి పంచామృతములతో స్నానం చేయించి, ఆ రాత్రి జాగరణ చేసిన వారు ఎంతటి మహా కార్యములోనైనా అఖండ విజయం పొందుతారు. వృత్రాసురునితో మహేంద్రుడు యుద్ధం చేయటానికి ముందు ఈ పూజ చేసే యుద్ధానికి ఉపక్రమించి అఖండ విజయలక్ష్మిని పరమేశ్వరుడు పొందాడు.

ఎక్కడ శివ లింగాన్ని పూజిస్తే ఎంత పుణ్యము...

పట్టణమూ లేదా గ్రామమూ వీటి మధ్యనున్న శివలింగాన్ని పూజించిన దాని కన్నా నూరురెట్లు

అధిక పుణ్యఫలం పట్టణ గ్రామాలకి చివరనున్న శివాలయాల్లోని శివుణ్ని పూజిస్తే పొందవచ్చు.

గ్రామ పట్టణ వెలుపల ఉన్న శివలింగాన్ని పూజించిన దాని కన్నా వెయ్యి రెట్ల పుణ్యఫలం అరణ్యమునున్న శివలింగాన్ని పూజిస్తే కలుగుతుంది.

అరణ్యమునున్న శివలింగాన్ని పూజించిన ఫలం కన్నా వందరెట్లు పర్వతం పైనున్న శివలింగాన్ని సేవించి పూజించుట వల్ల పుణ్యం కలుగుతుంది.

పర్వతం పైనున్న లింగమును పూజించిన ఫలం కన్నా పదివేల రెట్లు పుణ్య ఫలం తపోవనంలోనున్న శివలింగాన్ని పూజించుట ద్వారా సిద్ధిస్తుంది.

మహా శివుని ప్రీతికై ఎన్ని దీపాలు వెలిగించాలి...

స్తోమత, శక్తి ఉన్నవారు వెయ్యి దీపాలు వెలిగించాలి. అలాగే వంద దీపాలు గానీ, ముప్పై రెండు గానీ వెలిగించి శివప్రీతిని పొందవచ్చు. నేతితో వెలిగించిన దీపాలు పరమేశ్వరునికి

అనంతమైన తృప్తి కలిగిస్తాయి. వరుణ, దేవేంద్రులూ సంతసిస్తారు.

గృహంలో అగ్నిహోత్రం చేయటం వల్ల కలిగే ఫలం...

ఈ అగ్నిహోత్రము సూర్యోదయ సమయాన లేదా సూర్యాస్తమయ సమయాన చేయాలి. ఎండిన ఆవు పేడా, ఎండిన అరటి మొక్కలు, వేప, పనస వంటి కొమ్మలని వేదమంత్రోచ్ఛాటనలతో కర్పూరహారతితో వెలిగించాలి.

అందులో నెయ్యిలో నానిన బియ్యాన్ని వేస్తూ చేసేది అగ్నిహోత్రము. ఇలా గృహస్థు చేయించుకోవటం వల్ల కుటుంబసభ్యులందరికీ ఆయురారోగ్య ఐశ్వర్య ప్రాప్తి. అగ్నిహోత్రం జరిగినంత సేపు అగ్నిహోత్రము వద్ద నిష్ఠగా మంత్రోచ్ఛాటన వింటూ కుటుంబ సభ్యులంతా విధిగా ఉండాలి.

అగ్నిహోత్రం పూర్తవ్వగానే వచ్చిన భస్మాన్ని పూజకి ముందు నిత్యం ధరించాలి. ఏ కార్యములోనైన విజయం అట్టి అగ్నిహోత్ర భస్మాన్ని ధరించిన వారికి కలుగుతుంది. (యజ్ఞవిధి నుంచి)

అనేక దోషాలు నశించేందుకూ, దోష పరిహారమైన పాపాల్ని పొందకుండా ఉండేందుకు...

శ్రావణ నక్షత్రములో ద్వాదశి తిథినాడు తెలిసీ, తెలియక చేసిన సమస్త పాపములు హరించుటకై ఉపవాసం ఉండి శ్రీమహావిష్ణువుని పూజిస్తే సకల దోషాలు తొలగిపోతాయి.

పూర్వం మహామునీంద్రులైన కశ్యపుడు అదితి చేసిన దోష పరిహారార్థములకై ఈ ఉపవాసాన్ని భార్యకి ఉపదేశించి చేయించాడు. (మహాభారతము)

బ్రహ్మప్రాప్తి ఎట్టి వారికి లభించదు...

ఎంత పండితుడైనా, ఎన్ని భక్తి, మోక్షా మార్గాలను చెప్పినా, మహా విద్వాంసుడూ, ధర్మసూక్ష్మాలు తెలిసినవాడికైనా మోక్షం లభించదు. పదిమందికీ చెప్పినవి తను చేసినప్పుడే, స్వయంగా అనుభవించి అనుభవాన్ని పదిమందికి చెప్పిననాడే బ్రహ్మ ప్రాప్తి. ఆసనంపై కూర్చొని అన్ని ధర్మాలూ, పుణ్యాలూ చెప్పినా, మహా గ్రంథాలూ రాసినా

సముద్రంలోని ఇసుకలో ఓ ఇసుక రేణువంత పుణ్యం కూడా రాదు. చెప్పిన ధర్మం, న్యాయం, యజ్ఞం, యాగం చేసినప్పుడే అఖండమైన మోక్షం...

శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ ఫలం...

శ్రీ మహావిష్ణువు యొక్క ఈ సహస్రనామ పారాయణ వల్ల ధర్మార్థ, కామ మోక్షాలు నెరవేరుతాయి. చక్కటి సంతానమూ, ఐశ్వర్యమూ, సుఖశాంతి పొందుతారు. దుర్గుణాలన్నీ వాటికై అవే సమసిపోతాయి. అకారణాలతో పోగొట్టుకున్న ఆత్మీయుల్ని తిరిగి మీ వద్దకు రప్పిస్తుంది. అంతటి మహా అపూర్వ మంత్రశక్తి గలది విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణము.

మహాదేవుణ్ణి లింగ రూపంలో కొలిస్తే కలిగే పుణ్యం...

శివస్మరణ లేని క్షణమైన అమంగళ మవుతుంది. రజోగుణము కలవాడు సృష్టికర్త బ్రహ్మదేవుడు. సత్త్వ గుణములు కలవాడు వైకుంఠ

వాసుడు శ్రీమన్నారాయణుడు. సకల గుణాలకి అతీతుడు కైలాసవాసుడు మహాదేవుడు. అట్టి శివుణ్ని లింగరూపంలో పూజిస్తే భక్తితోపాటు ముక్తినీ అనుగ్రహిస్తాడు. బాధలూ, వ్యధలూ, రోగాలనూ దూరం చేస్తాడు. సుఖములను ఇచ్చువాడు శంకరుడని అంటారిందుకే.

చేసిన పాపాలకి పైలోకాల్లో శిక్షించేది ధర్మపరుడు యముడు. కానీ సకల పాపాలకి ఈ జన్మలోనే బ్రతికుండగానే శిక్ష విధించేది కాకివాహనుడు శనీశ్వరుడు.

ఓ మహా కార్యాన్ని సాధించటానికి చేయవల్సిన పుణ్య కార్యము...

భాద్రపద మాసంలో దశమి తిథినాడు పరిశుభ్రతగా స్నానమాచరించి శ్రీమహావిష్ణువును

పూజించి ఒంటిపూట భోజనము చేయాలి. అలా శుచిగా ప్రార్థించి, విష్ణునామ స్మరణతో ఆ రోజంతా ఉండిననాడు అన్ని కామములు తీర్చే పుణ్య ఫలం వారికి చేరుతుంది. ఒంటి పూట భోజనము, ఉప్పులేని వంటకములను అరటి ఆకుపై భుజించాలి. విష్ణు భక్తి సదా మిమ్ములనూ, మీ కుటుంబాన్ని రక్షణ కవచమై కాపాడుతుంది.

స్త్రీల పుణ్యం ఎలా కరిగిపోతుంది...

వ్రతాల ద్వారా, పుణ్యాల ద్వారా, పతి సేవల ద్వారా, దానాల ద్వారా, ధర్మకార్యాల ద్వారా, ఇంకా భర్త చేసిన పుణ్యాల వల్లా స్త్రీలకు పుణ్యం కలుగుతుంది. ఆ పుణ్యం వల్లా, భర్తవల్లా, బిడ్డల వల్లా సుఖాలు కలుగుతాయి. ఎన్ని సత్కార్యాలు చేసినా సుఖము లేదంటే పుణ్యం ఎప్పటికప్పుడు కరిగిపోతుందని అర్థం. దానికి కారణము రజోగుణము అనగా ఆగ్రహం. కోపము వల్ల ఎంత పుణ్యము ఆర్జించినా పుణ్యఫలమంతా తరిగిపోతుంది. దుఃఖాలకూ, బాధలకూ కారణమవుతుంది. ఆ కోపం వల్లే విశ్వామిత్రుడు

తన పుణ్యాన్ని మొత్తం అనేక వృధా కార్యాలకి వశిష్ఠుడు వంటి ఎందరో శాంతమూర్తులపై వినియోగించాల్సి వచ్చింది. ఆవేశం అన్ని వేళలా తగదు.

ఆవేశంతో పాటు అబద్ధం... అసత్యవాక్కు ఎంతో పుణ్యాన్ని హరించి వేస్తుంది. అసత్యవాక్కు కంటే అబద్ధాన్ని చెప్పించటం ద్వారా మొత్తం పుణ్యమే కరిగిపోతుంది. భర్తకు చెప్పే అబద్ధం ద్వారా చెయ్యబోయే పుణ్య కార్యాల పుణ్యం కూడా హరించుకుపోతుంది.

అతిథికి పెట్టే భోజనము వల్ల కలిగే పుణ్యం...

సమయానికి, లేదా, అతిథిగా వచ్చిన వారికి, ధర్మమార్గంలోనున్నవారికి, ఎలాంటి భోజనము పెడతామో, అలాగే భవిష్యత్తులో వారికి వారి కుటుంబ సభ్యులకి అన్నపానాదులు సంపూర్ణగా అందుతాయి. భక్తితోనూ, అభిమాన శ్రద్ధలతోనూ పెడితే భవిష్యత్తులో కుటుంబమంతటికీ సంతృప్తిగా భోజ్యాదులు లభిస్తాయి. ధర్మరాజు ఇంద్రప్రస్థ పురాన్నేలేటప్పుడు పదివేల మంది అతిథులకి

భోజనాన్ని పెట్టి గాని భుజించేవాడు కాదు. సమస్త రాజ్యం పోయినా అడవులపాలైనా, ధర్మరాజు అతిథులకీ, ధర్మస్వరూపులకీ భోజనాన్ని పెట్టలేక పోతున్నానే అని ఎంతో వ్యధ చెందాడు. అప్పుడే ధౌమ్యుడి ఉపదేశంతో సూర్యుణ్ని ఆరాధించి అక్షయపాత్రను అనగా సకల పదార్థాలను ఇచ్చే రాగి పాత్రను సూర్యుణ్ని అష్టోత్తర శతనామాలతో పూజించి ధర్మరాజు అందుకున్నాడు. విసుగుతోనూ, చికాకుతోనూ అయిష్టంగా పెడితే, మీకూ, మీ వారికీ అలాంటి భోజన సుఖమే అందుతుంది.

పాపాలకి ఎంత శక్తి వుంది...

బ్రహ్మ జాతకాన్ని తారుమారు చేసి సకల దరిద్రాల్లో మునిగి తేలేలా చేసేది శనీశ్వరుడు మాత్రమే. ఆ శనీశ్వరునికి ఆ శక్తి వచ్చేది కేవలం ఆ మనిషి చేసిన పాపాల వల్లే. పాపాల వల్ల తొలుత చక్కని సుఖమొస్తుంది. ఆ తర్వాత అసలు నరకమంటే తెలుస్తుంది. అలాంటి వాడిని శనీశ్వరుడు బ్రహ్మ జాతకాన్ని కూడా తారుమారు చేసి అష్టకష్టాలు పెడతాడు. అందుకే తెలియక చేసిన పాపాలను కూడా గుర్తించి వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి. పాపం చెయ్యగానే ఎందుకు

పండదంటే పుణ్యం కాపాడుతుంటుంది. ఎప్పుడైతే పుణ్యం కరిగిపోతుందో. పాపం విజృంభిస్తుంది. ధర్మకార్యాల ద్వారా, దానాల ద్వారా నష్టం జరిగిన వారికి తిరిగి లాభం చేకూర్చటం ద్వారా వచ్చిన పుణ్యంతో పాపాలను పోగొట్టుకోవాలి.

అందుకే పాపం చాలా కాలం తర్వాత పండుతుంది. పెద్దవాళ్ళు కూడా 'ఇప్పటికి వాడి పాపం పండింది' అంటారు.

ఉగాది రోజున నూనెలో శ్రీలక్ష్మీదేవి, జలంలో గంగాదేవి ఉంటారు. కాన నూనెని శరీరానికి రానుకొని, తలంటుస్నానం చెయ్యమని పెద్దలు చెబుతారు.

ఓ వ్యక్తి పరువుప్రతిష్టలని ఉద్దేశ్య పూర్వకంగా పాడుచేస్తే వచ్చే పాపం...

తాత్కాలికంగా బ్రహ్మాండమైన ఆనందాన్ని అలా చేసినవాడు పొందితే పొంది ఉండచ్చు.

బాధితుడు ఆ బాధతో, వ్యధతో కొంత కాలం తర్వాత కోలుకోవచ్చు. కొంత కాలం తర్వాత జరిగింది మర్చిపోయి హాయిగా చిరకాలం ఎలాంటి వ్యాధులూ లేకుండా గడపొచ్చు. లేదా పతనమవ్వచ్చు. అయితే చేసినవాడు మాత్రం దీర్ఘాయుష్కుడిగా బ్రతుకుతాడు. తినలేక, త్రాగలేక, తింటే ఒక బాధ, తినకపోతే ఒక బాధ, వాటితో పాటు ఆ వ్యక్తి అత్యంత ఎక్కువగా ప్రేమించే వారికి అనేక కష్టాలు వచ్చి తాను చేసిన పాపం పదేపదే గుర్తుకు వచ్చి క్షీణించి, క్షోభించి మరణిస్తాడు.

దంపతులకి సంతానమే కలగకపోతే ఆ పాపం ఎప్పటిది...

ఈ జన్మలో చేసిన పాపాల వల్లే భగవంతుడు ఆ శిక్ష విధించాలన్న నియమంలేదు. గత జన్మల్లో దంపతులు ఇరువురూ తల్లీ, తండ్రీ నుంచి పిల్లలని విడగొట్టడమూ, పసి పిల్లలను ధనము కోసమూ, మరొక కారణంగా హింసించటమూ చేసిన వారికి సంతానము కలగకుండా, ఆ బాధతోనే ఈ జన్మ నమసిపోయి ఉండచ్చు. అలాంటి వాళ్ళు అనాధలకూ, స్త్రీలకూ చేయగలిగినంత సహాయం

చెయ్యటం ద్వారా, పుణ్య తీర్థాలను ఎక్కువకాలం సేవించటము ద్వారా వారి పాపం నశించి ఆలస్యంగానైనా చక్కని ఆరోగ్యకరమైన సంతానం కలుగుతుంది.

పుత్రసంతానం కలగకపోతే ఆ పాపం ఎవరిది...

పున్నామనరకాన్ని తప్పించే పుత్రుడు జన్మించకపోతే, ఆడ పిల్లలు మాత్రమే కలిగితే ఆ పాప ఫలం పురుషుడే అనుభవించాల్సింది. స్త్రీది ఎంత మాత్రమూ కాదు. ఆ పాపం పురుషుడిదే అయివుండక పోవచ్చు. వాని వంశంలో వారెవ్వరైనా గతంలో పాపం చేసి ఉంటే ఆ పాపం ఆ వ్యక్తి వద్దకు వచ్చి అంతటితో ఆ వంశానికి వారసుడు లేకుండా చేసి ప్రక్షాళనము అవుతుందని ధర్మశాస్త్రం శెలవిస్తోంది. స్త్రీ కేవలం నిమిత్తమాత్రురాలు.

నమ్మకంగా నమ్మించి ద్రోహం చేస్తే వచ్చే కష్టాలు...

స్నేహం పేరుతోగానీ, వినయవిధేయతలతో గానీ నమ్మించి ధన మానాలకు హాని కలిగిస్తే అలా

చేసిన వ్యక్తి ఈ జన్మలోనే సరిగ్గా అలాంటి నమ్మకద్రోహమే ఎదుర్కొనవల్సి వస్తుంది. అది కూడా వారి వారి కుటుంబసభ్యులతోనే... అయినవారితోనే... బైటివారు చేసే అవకాశం ఎట్టి పరిస్థితుల్లోనూ రాదు. తను ప్రేమించి ఇష్టపడినవారి చేతే తనింతకు ముందు చేసిన నమ్మక ద్రోహానికి రెండింతలుగా ద్రోహం చేయబడతాడు. అప్పుడు గాని వానికి తనెంత మందికి అలా చేసింది గుర్తొచ్చి నరక యాతన పడతాడు.

చుట్టూ జరిగే పాపాలని చూస్తూ ఉండటం వల్ల ఎంతటి పాపాల్ని మూటగట్టుకుంటారు...

మన కళ్ళ ముందే అన్యాయం జరుగుతుంటే దాన్ని చూస్తూ మౌనంగా ఉండటం వల్ల మహాపాపం సంక్రమిస్తుంది. ఆపగలిగే శక్తి లేకపోతే ఏ దోషమూ అంటదు. అలాంటి వాళ్ళు చూసి ఆనందిస్తే మాత్రం రెండింతల పాపఫలాన్ని పొందాల్సి ఉంటుంది. ఆ పాపాలని చేవ ఉండీ, శక్తి ఉండీ, ఆ అధర్మాన్ని ఆపగలిగే అవకాశం ఉన్నా కూడా

ఆపకుండా నాకెందుకులే మనవాళ్ళూ, మన బంధువులూ కాదు గదా అనుకుంటే, ఆ సమస్త పాపాల్లో సగభాగం ఆ వ్యక్తికి చెందుతుంది. అందుకే ఎలాంటి శత్రుత్వమూ లేకున్నా, భీమసేనుణ్ని తీసుకెళ్ళి పై విషయాన్నే చెప్పి జరాసంధుణ్ని చంపిస్తాడు శ్రీకృష్ణుడు. భైరవ పూజకు బలి అవ్వాల్సిన రాజులను రక్షిస్తాడు.

నీకు పనిచ్చి, జీతమిచ్చే యజమానిని మోసం చేస్తే వచ్చే పాపం...

అన్నం పెట్టే సంస్థని, దాని యజమానిని మోసం చేస్తే వచ్చే పాపం వల్ల, తాత్కాలిక ధన ఆనందం కలుగుతుంది. కొత్తకొత్త సుఖాలూ పొందుతాడు. ఆపై అనారోగ్యమూ, అనేక సంఘటనలతో దిగులూ నిరాశలూ కలిగి, జీవితం ఎక్కడ ప్రారంభించాడో అక్కడే ఆ జీవితం ముగిసిపోతుంది. పదికీ, ఇరవైకీ కూడా అప్పు పుట్టని పరిస్థితి వస్తుంది. ఓ సంస్థను మోసం చెయ్యటమంటే అందులో పని చేసే వారినందరినీ (తనతో సహా) మోసం చెయ్యటమే.

ఉగాది పచ్చడిని వసంత నవరాత్రులు అనగా తొమ్మిది రోజులూ ఆరు రుచుల ప్రసాదాన్ని తీసుకుంటే గృహానికే, శరీరానికే మంచిదవ్వటంతోపాటు దేహాన్ని వజ్ర సమానం చేస్తుంది.

ఆడ పిల్లలుంటే భువిపై ఎంత పుణ్యం...

మగసంతానము లేకుండా, కేవలం ఆడపిల్లలే ఉంటే అది గతజన్మలో చేసిన పుణ్య ఫలమే. పుత్రసంతానము లేకపోవటము వల్ల మగ పిల్లవానికి ఆస్తులు కూడబెట్టాలి అనీ, ఎంతో కొంత అప్పచెప్పాలనీ, ఆ ఆశలతో ఎన్నో తప్పులనీ, పాపాలనీ తెలిసి కొన్ని తెలియక కొన్ని చెయ్యాల్సివుంటుంది. అదే ఆడ పిల్లలైతే ఎంతో కొంత ఇచ్చి పంపిస్తే ఆ బాధ్యత తీరుతుందను

కుంటారు. దానితో పాపాల సంఖ్య తగ్గి, పుణ్యాల సంఖ్య పెరుగుతుంది. అందుకే ఆడ పిల్లల తల్లీ, తండ్రికీ, పున్నామ నరకం విషయం వదిలేస్తే చాలా పుణ్యం అనేక జన్మల వరకూ సంపాదించు కుంటారు. బ్రతికినంత కాలం మగ పిల్లల తల్లీ, తండ్రీ కంటే సుఖంగా ప్రశాంతంగా బ్రతుకుతారు.

స్నేహితుణ్ణి, పరిచయస్థులని వ్యసనాల్లోకి దింపితే వచ్చే పాపం...

తన బలహీనతల కోసమూ, తన ఆనందము కోసమూ, ఈర్ష్య అసూయల వల్ల కాని ఏ కారణమునైనా గానీ ఏమీ తెలియని వార్ని, వారి మానాన వారు పని చేసుకుంటున్న వారిని ఏ వ్యసనాల వైపు తీసుకెళ్ళినా, తీసుకెళ్ళిన వారికి మహాపాపం సంక్రమిస్తుంది. అది వార్నీ, వారి కుటుంబాన్ని చెదలా తినేస్తుంది. అలా వ్యసనాల బారిన పడిన వాని తాలూకు భార్యా పిల్లల ఆక్రోశమే పాపంగా మారి, అందులోకి దింపిన వాని భార్యాపిల్లలకు సంక్రమిస్తుంది. తద్వారా రెట్టింపు వ్యధలకు వారు గురికావాల్సి వస్తుంది. ఒక్కోసారి

వ్యసనంలోకి దింపిన వాని భార్య పరాధీన మవుతుంది కూడా.

గుడికి ఏ ఉద్దేశంతో వెళితే పుణ్యం వస్తుంది...

పక్కవారి నాశనము కోసమూ, తన లేదా తన వాళ్ళ ఎదుగుదల కోసమూ వెళ్ళే కన్నా భక్తిగా వెళితేనే పుణ్యం వస్తుంది. లేదా ఏదైనా పాపం చేసినప్పుడూ నిజంగా పశ్చాత్తాపం చెంది, దేవుడికి మొరపెట్టుకుని క్షమించమని అడిగితే ఆ పాపానికి అంతో ఇంతో ప్రాయశ్చిత్తం కలుగుతుంది. తల్లికి బిడ్డ ఆకలి ఎలా తెలుసో, భగవంతుని బిడ్డలమైన మనకి ఏం కావాలో ఆయనకు తెలుసు. కోరికలను ఎదుటుంచి భక్తిని ప్రదర్శిస్తే భగవంతుని దీవెనలు ఆలస్యం అవ్వచ్చు. ప్రతిఫలం ఆశించకుండా చేసే పూజ మంచి ఫలితాన్నిస్తుంది.

ద్రోహినీ, నయవంచకుణ్నీ, వది లేయటం ద్వారా ఎంతటి పుణ్యం...

మనం నమ్మినప్పుడే అవన్నీ ఎవ్వరైనా చెయ్యగలరు. అలా అని మనం ఎవర్నీ నమ్మకుండా

ఎలా ఉండగలము. ఇంటి విషయంలో భార్యని నమ్మాలి. పెంపకం విషయంలో పిల్లల్ని నమ్మాలి. స్నేహంలో మిత్రుణ్ని, వ్యాపారంలో పనివారిని నమ్మాలి. అలా అని వాళ్ళు నీచానికి దిగితే వారిని క్షమించి వదిలేయటమే అసలు సిసలు శిక్ష. దాని తాలూకూ పుణ్యం మీకు ఆయుర్ధాయాన్ని, ఆరోగ్యాన్ని పెంచుతుంది. చిరకాలం పిల్లాపాపలతో సుఖంగా ఉండే పుణ్యం సంపాదిస్తారు.

స్త్రీలనూ, గోబ్రాహ్మణులనూ అవమానించినా, హింసించినా ఎంతటి పాపము...

మహాఘోరమైన పాపాలకి ఆహుతవ్వక తప్పదు. అగ్నిలో వేసిన ఎండు గడ్డిలా బూడిదవ్వటమే. ఆ పాపం వల్ల మహా దరిద్రం ఆవహిస్తుంది. వంశ గౌరవము మంట కలసిపోతుంది. ఆఖరికి స్త్రీలకి బానిసవ్వాల్సి వస్తుంది. ఆకలికీ, గుడ్డకీ ఏడ్వాల్సివస్తుంది. లేదా అవన్నీ ఎదురుగా ఉన్నా తినలేని, అనుభవించలేని స్థితి వస్తుంది. యజ్ఞ యాగాదులూ, పుణ్యాలూ, వ్రతాలూ, నోములూ చేసినా పుణ్యఫలంరాదు,

సుఖాలు దొరకవు. ఆ పాపాలకి శిక్షగా స్త్రీలనూ, గోబ్రాహ్మణులనూ అనేక ధర్మకార్యాల ద్వారా సంతృప్తి పరచాలి. అప్పుడే ఆ పాపాలు కనుమరుగు అవుతాయని శ్రీదేవీ భాగవతంలో వ్యాసులవారు విశదీకరించారు.

పరాయివాడి భార్యను బెదిరించి పొందడం ఎంత పాపం...

ఆయుధాలు చూపించి, ప్రాణభయం పెట్టి పరాయి సొత్తైన స్త్రీని పొందటం ద్వారా మహా పాపం సంక్రమిస్తుంది. పరస్త్రీని ధన, భయ ప్రలోభాలతో లొంగదీసుకుంటే అవేమి లేకుండానే ఇష్ట పూర్తిగా పాపి భార్య మరొకరికి స్వంతమవుతుంది. మనసా వాచా తనని తను అర్పించుకుంటుంది. పక్క వాడి కూడు ఎంగిలి చేస్తే మన సొంత ఇంటి కూడు ఎంగిలవుతుంది. లేదా తన పిల్లల ద్వారా అయినా అలాంటి చర్యే అటూ ఇటూగా ఉదాహరణకి తన కూతురికి కలగటం ద్వారానైనా ఆ పాపాన్ని అనుభవించక తప్పదు. తులసి విత్తనాలు నాటితే తులసి మొక్కలు ఎలా వస్తాయో, గంజాయి విత్తనాలు నాటితే గంజాయి

మొక్కలు ఎలా వస్తాయో, మనుజుడు చేసిన కర్మ వల్లే భవిష్యత్తులో మంచి లేదా చెడు ఫలితాలొస్తాయి.

సంతానము కలగకపోవటానికి చేసిన పాపాలు...

ఈ జన్మలోగానీ, గత జన్మలో గానీ చేసిన పాప ఫలం వెంటాడటమే సంతానము లేకపోవటము. పసిపాపలనూ, సాధు జంతువులనూ హింసించి, చంపిన పాపాల వల్ల మరో జన్మలో సంతానము కలగదు. పాండురాజు ముని దంపతులను విడదీసినందుకు, ఆ పాపంగా అతనికి సంతానం లేకుండా పోయింది. అలాంటి దోషాలున్న వారు వ్రతాలూ, పూజలూ, తీర్థ యాత్రాలు చేస్తే ఫలితం కలుగుతుంది. అన్నింటికి మించి దానధర్మాలు చేతనైనంత అర్హులైన వారికీ, అయిన వారికీ చేయమని శాస్త్రం శెలవిస్తోంది.

ఏ దానం వల్ల పుణ్యం వస్తుంది...

ప్రతిఫలాపేక్ష లేకుండా దానధర్మాలు చేసిన వారికి రావాల్సిన పుణ్యం వస్తుంది. కీర్తి కోసము చేసే దానాల్లో వచ్చేది చాలా కొద్ది శాతం.

లబ్ధికోసమూ, ప్రాపకం కోసం చేసే దానాల వల్ల చేసిన పుణ్యం తరిగిపోతుంది. పుణ్యమంటే ధనం. మన ధనంతో ఎలా అయితే కావాల్సింది కొనగలమో, అలాగే ధనమనే పుణ్యం ద్వారా, ధనంతో కొనలేని సమస్త సుఖాలను పొందగలము. మనుజునికి ధన నిల్వలేకున్నా పుణ్య నిల్వ ఉంటే ఎక్కడ ఉన్నా రాజభోగమే జరుగుతుంది.

గంగాస్నానం చేసిన ఫలం పొందాలంటే...

సృష్టికి ప్రారంభ రోజైన ఉగాది నాడు పదిహేను ధర్మకార్యాలూ చేశాక, పదహారవది అయిన పంచాంగ శ్రవణము వినటం ద్వారా గంగాస్నానం చేసిన పుణ్యం కలుగుతుంది.

మంత్రోచ్ఛాటనలతో ఉగాది పచ్చడిని సేవిస్తే...

ఉగాది రోజు పంచాంగములోని అయిదు అంగములు అనగా అవయవములు అనగా తిథి, వారము, నక్షత్రము, యోగములు, కరణములు ఈ అయిదింటిని తలుచుకొని ఉగాది పచ్చడిని

స్వీకరిస్తే సకల దేవతలను మంత్రాలతో పూజిస్తే వచ్చే పుణ్యం కలుగుతుంది.

మార్గశిర మాసంతో సమానమైన పుణ్య మాసం మరేది లేదు.

– సూత మహర్షి

ధర్మఘట దానము చెయ్యటం ద్వారా ఎంతటి పుణ్యం...

శ్రీరామచంద్రుడు సింహాసనాన్ని అధిష్టించిన పుణ్య రోజైన ఉగాది నాడు బ్రహ్మ, విష్ణు, శివ స్వరూపమైన కలశాన్ని పెట్టి పూజించి, ఉత్తమమైన వానికి ధర్మఘట దానమివ్వటం ద్వారా అపార పుణ్యసంపదను పొందవచ్చునని ధర్మసింధు శెలవిస్తోంది.

ఉగాది రోజు పంచాంగశ్రవణం వల్ల ఎవరెవరికి ఎంత పుణ్యం...

ఆ రోజు పంచాంగశ్రవణం వినటం ద్వారా గోదానం చేసిన పుణ్యం కలుగుతుంది. ఆయుష్షు

వృద్ధి అవుతుంది. ధనాన్ని కోరేవారు తిథి విషయంలో, ఆయుష్షును కోరేవారు వారము విషయంలో, చేసిన పాపాలు పోవాలనుకునేవారు నక్షత్రాల పట్ల, సకల ఆరోగ్యాలనీ పొందగోరేవారు యోగం పట్ల, సకల కార్యసిద్ధి కోరేవారు 'కరణం' పట్ల ఎంతో జాగురూకతతో వ్యవహరించాలని పంచాంగ శాస్త్రం శెలవిస్తోంది.

గాయత్రీ మహాలక్ష్మి అమ్మవారికి రుద్రాభిషేకాలు చేస్తే ఏ దోషాలు పోతాయి...

నవగ్రహ దోషాలున్నవారూ, షట్‌చక్ర దోషాలున్నవారూ, నక్షత్ర దోషాలున్నవారూ, అనేక వ్యధలూ, బాధలూ ఉన్నవారూ గాయత్రీ మహాలక్ష్మికి రుద్రాభిషేకాలు చేయించుకుంటే అన్ని దోషాలు తొలిగిపోతాయని (నవగ్రహ శాస్త్రము) శెలవిస్తోంది.

కృతయుగంతో సమానమైన పుణ్య యుగం మరే యుగం లేదు - సూతమహర్షి

శ్రీరామచంద్రుడైనా దోషం చేస్తే పాపాన్ని అనుభవించాల్సిందేనా...

వాలిని క్షత్రియ ధర్మంగా చెట్టుచాటు నుంచి బాణం వేసి చంపినా అది పాపమే. అందుకే ఆ పాపం మహాపుణ్య పురుషుడైన శ్రీరామచంద్రుణ్ని ఆవహించలేక మరుజన్మలో శ్రీకృష్ణావతారంలో కిరాతకుడిగా పుట్టి చెట్టు చాటు నుంచి బాణం తగిలి వైకుంఠానికి చేరతాడు. మనం శ్రీరామచంద్రుని వంటి ధర్మపరులం కాదు. అందుకే మనం చేసిన పాపం మరుజన్మ వరకూ ఆగదు. అలా ఆపే పుణ్య శక్తి కూడా మనకు లేదు. అందుకే ముఖ్యంగా తెలిసి తెలిసీ ఏ పాపం చేయద్దు.

పక్కవారి పొట్ట గొట్టి సంపాదించిన ధనం వల్ల కలిగే పాపం...

ఎవరికోసమైతే అంత నీచానికి దిగి పక్క వారి కడుపులు కొట్టి తద్వారా వచ్చిన ధనంతో తన కుటుంబ సభ్యుల కడుపులు నింపాడో ఆ ధనము

వానికి గానీ, వాని కుటుంబ సభ్యులకి గానీ అవసర సమయంలో ఒక్క పైసా కూడా ఉపయోగపడదు. ముందు తరం వాళ్ళు కూడా ఆ ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేసి వయసులోనే వ్యాధులని కొని తెచ్చుకుంటారు. వారి చుట్టూ కొంతమంది ధనం కోసం చేరి ఆ ధనాన్ని పొందటానికి అన్ని సమస్యలనీ తెచ్చిపెట్టి తినే తిండిని కూడా ప్రశాంతంగా తినేస్థితిని లేకుండా చేసి మహా నరక సమస్యల్ని సృష్టిస్తారు. ధనంతో తీరని ఆ సమస్యలకి తన వాళ్ళు పడుతున్న వ్యధలకీ అప్పుడు పశ్చాత్తాపం చెందినా, యజ్ఞాలూ, యాగాలూ, వ్రతాలూ, హోమాలూ చేసినా ప్రయోజనం ఉండదు.

శ్రీరామ కోటి రాస్తే కలిగే ఫలం...

శ్రీరామ కోటి భక్తిగా ధ్యానిస్తూ వ్రాయటం ద్వారా సీతారామ హనుమల కృప కలుగుతుంది. తద్వార రాసిన ప్రతి అక్షరం ఒక్కో శక్తిగా మారి, తెలిసీ తెలియక చేసిన పాపాలను ఆ అక్షరాలే పాశాలుగా మారి నిర్మూలిస్తాయని స్వయంగా మహా శివుడు పార్వతీదేవికి వివరించాడు.

ఆంజనేయ స్వామికి ఆకు పూజ చేయిస్తే కలిగే పుణ్యం...

సమస్యలూ, బాధలూ, వ్యధలూ వాటితో పాటు అంతా ఒక్కసారిగా ఎదురు తిరగటము, ఏం చెయ్యాలో, దేన్ని ఎదుర్కోవాలో తెలియని భయంకర స్థితి. అట్టి భయంకర స్థితికి కారణం అన్యాయంగా, అమాయకులైన తన చుట్టూ ఉన్న వార్ని అత్యంత తెలివితేటలతో మోసం చేయించటం ద్వారానే వస్తాయి. ఆ స్థితిలోనూ నిర్భయంగా ఆంజనేయస్వామికి ఆకు పూజ చేయిస్తే మనోధైర్యం పెరుగుతుంది. సమస్యలు వచ్చినట్టే తిరిగి వెళ్ళిపోతాయి. కనీసం ఆకు పూజలు చేయించిన తర్వాతైనా గతంలో చేసిన తప్పులు బేరీజు వేసుకొని చెయ్యకుండా ఉండాలి. తప్పులు తిరిగి చేసి మళ్ళీ సమస్యలు పోవటానికి ఆకు పూజ చేసినా స్వామి క్షమించడు. (హనుమాన్ పురాణం)

గృహంలో హనుమాన్ చాలీసా పారాయణం చేయిస్తే...

మీకేంటి? బాగా సంపాదించారుగా, మీ పిల్లలు ప్రయోజకులయ్యారుగా, మీ ఆయన చాలా

అందంగా ఉంటాడు కదా, ఇలా ఎన్నో మాటలను పొగుడుతూ వినవల్సివస్తుంది. కానీ ఆ మాటల వెనుక ఒకలాంటి కసీ, కోపం, అవన్నీ తమకి లేవే అన్న ఏడ్పు. అది మానవ సహజం. అలాంటి మాటలు అన్ని కాకపోయినా కొన్నైనా ఫలితాన్ని చూపిస్తాయి. నరుని చూపుకి నల్లరాయి పగులుతుంది. అలాంటి దోషాలు పోవటానికి గృహంలో హనుమాన్ చాలీసా చదివించి, భోజనాలు పెడితే, ఆ హనుమంతుడే మీకూ, మీ గృహానికీ, మీ కుటుంబానికీ రక్షణ కల్పిస్తాడు. నరుల మాటల ద్వారా కలిగిన దోషాలను పారద్రోలుతాడు.

సీతారాముల కళ్యాణం శ్రీరామనవమినాడు భద్రాచలంలో వీక్షిస్తే కలిగే ఫలం...

వంద అశ్వమేధ యాగాలు చేసిన మహాఫలం కలుగుతుందని క్షేత్ర మహత్యం శెలవిస్తోంది. అలా వీలుకాకపోతే దగ్గరిలోని పందిళ్ళలో వీక్షిస్తే పది

అశ్వమేధ యాగాలు చేసిన ఫలము. తద్వారా కలిగే ఫలం వల్ల అన్యోన్యమైన దాంపత్యము, చక్కని సంతానము, బంధుమిత్రుల అన్యోన్యతలు, సుఖసంతోషాలు కుటుంబమంతటికీ కలుగుతాయి.

దేవీసప్తశతి చదివితే ఎంతటి పుణ్యం...

మార్కండేయ పురాణంలోని దేవి మహత్మ్యానికి సంబంధించిన సప్తశతి భక్తితో చదివితే అమ్మవారి అపారమైన అనుగ్రహ ప్రాప్తి కలుగుతుంది. ముగ్గురమ్మల మూలపుటమ్మ అని పోతన స్తుతించిన ఆ తల్లి పాదాలు కడిగిన నీటిని తీర్థంగా స్వీకరిస్తే సకల విద్యలూ లభిస్తాయని మార్కండేయ పురాణం శెలవిస్తోంది.

శ్రీరామనవమినాడు గృహంలో తులసీదళాలతో పూజిస్తే కలిగే పుణ్య ఫలం...

ఈ మహా సాగరమనే సంసార సాగరాన్ని దాటటానికి శ్రీరామనవమి రోజు సీతారాములను

గృహంలో తులసీ దళాలతో పూజిస్తే శ్రీరాముని అనుగ్రహంతోపాటు, హనుమ ఆశీర్వాదమూ లభిస్తుంది. తద్వారా ధైర్యమూ, ప్రశాంతతా, సుఖాలూ, ఆరోగ్యమూ కలుగుతాయి.

గంగతో సరిసమానమైన పుణ్య తీర్థం మరేది లేదు.
-శౌనకాదిమునులతో సూతమహర్షి

తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శిస్తే కలిగే పుణ్యం...

కోటి జన్మల పాపాలు శ్రీవేంకటేశ్వరుని దర్శనంతో తొలగిపోతాయి. సుఖాలను కోరుకునే వారికీ, అధికారాన్ని పొందాలనుకునేవారికీ, ఇహపరలోకాల్లో ఆనందించాలనుకున్న వారికీ స్వామి దర్శనంతోనే తీరిపోతాయి. తెలియక చేసిన బ్రహ్మహత్యా పాపమూ, మద్యపానం చేసిన పాపాలూ తొలగుతాయని సూతమహర్షి

శౌనకాదిమునులకు శ్రీ వేంకటేశ్వర వైభవాన్ని గూర్చి చెబుతూ శెలవిచ్చారు.

కాశీ, గయ, ప్రయాగ పుణ్యక్షేత్రాలను దర్శించిన ఫలం...

వైకుంఠవాసుడు ఆ మహావిష్ణువైన కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించినంతనే కాశీ, గయా, ప్రయాగ వంటి పుణ్యక్షేత్రాలను దర్శించిన ఫలం కలుగుతుందని శ్రీ వేంకటాచల మహత్మ్యం శెలవిస్తోంది.

న్యాయం చెప్పకుండా మౌనంగా ఉంటే కలిగే పాపం...

ధర్మం తెలిసిన మీరు న్యాయం అడిగినప్పుడు చెప్పకుండా మౌనంగా ఉంటే అందులో సగం అసత్య దోషం అంటుకుంటుంది. అది కూడా అడిగిన వెంటనే చెప్పాలి. లేదంటే నిండు సభలో ద్రౌపది న్యాయం అడిగితే మౌనంగా ఉన్నవారికి ఏం జరిగిందో అదే జరుగుతుంది. కాకపోతే కొద్దిగా ఆలస్యం. అలాగే చుట్టూ ఉన్నవారు

కూడా ధర్మం చెప్పకపోతే ఆ పాపంలో నాలుగో వంతు కూడా చుట్టూ ఉన్న వారికి అందుతుందని కశ్యపుడు ప్రహ్లాదునికి తెలియ చెప్పాడు.

చిన్న పిల్లలకి పెళ్లి చేస్తే కలిగే పాపం...

ఇలాంటి వివాహం ద్వారా మహా పుణ్యమైన కన్యాదాన ఫలం కలగదు. శ్రీమహావిష్ణువూ, లక్ష్మీదేవిల ఆగ్రహానికి గురవుతారు. పైగా పాపం చుట్టుకుంటుంది. ఆ పాపం శాపమై ఇరువైపుల వారికి దుఃఖాన్ని కలిగిస్తుంది. ఆ దుఃఖము ఒక్కోసారి వారి జీవితాంతము వెంటాడుతూ ఉండవచ్చు. శరీరంలోని అవయవాలు పనిచేయక బ్రతికుండి నరకం అనుభవించాల్సిరావచ్చు.

హితం చెప్పకపోతే వచ్చే ఫలం...

స్నేహితుడికీ, యజమానికీ కటువైనదైన హితం చెప్పాలి. దాని వల్ల మీకు దోషం రాదు. అదే మీ స్వార్థం కోసం అప్రియం చెబితే తాత్కాలికమైన లాభం వారి నుంచి పొందినా ఆ తర్వాత దాని తాలూకు దోషం మీరు అనుభవించాల్సి

ఉంటుంది. అందుకే విదురుడు దుర్యోధనుడితోనూ, శకునితోనూ జూద సమయంలో ఇంతటి ధర్మహితము చెప్పాడు. అందుకే ఆ సమయాన జరిగిన సర్వ పాపాలకి అతను తప్ప అంతా ఏదో రకంగా అనుభవించారు.

ధనమూ, పుణ్యమూ ఎప్పుడు కరిగిపోతాయి...

ఈర్ష్య ద్వేషాలతో, అసూయలతో, బలమున్నదని, అంగబలమున్నదని మాయో పాయం చేత అవతలవారి ధన సంపదలను పొందినా, అది తాత్కాలికమే. ఆ పాపం మహా వినాశనంగా మారి, పొందిన సంపదలతోపాటు, ఉన్న సంపద కూడా నశిస్తుంది. రాజసూయ యాగంలో ధనాన్ని మాయా జూదంతో పొందిన దుర్యోధనుడూ అలాగే తన సమస్త సంపదలనూ, తనవారినీ పోగొట్టుకున్నాడు.

ప్రతి నిత్యమూ నిత్యపూజ చేస్తే ఎంతటి పుణ్యము...

ఇష్టదైవానికి భక్తిగా క్రమం తప్పకుండా పూజ చేస్తే వచ్చే ఫలం ధర్మ ఫలం. ఆ పుణ్య ఫలం వల్ల

మరుసటిరోజు వరకూ ఆ ధర్మ ఫలము తప్పులు చేయించకుండా మీ మనస్సునూ, బుద్ధినీ స్థిరంగా ఉంచుతుంది. తద్వారా తప్పులనే పాపాలను చేయరు. దానితో పాపం వల్ల కలిగే కష్టాలూ, నష్టాలూ, బాధలూ, వ్యధలూ ఉండవు. ధర్మమే అన్ని సుఖాలకీ మూలము. ఈ ధర్మం గూర్చే ధర్మరాజు మహా భారతమంతా మొత్తుకునేది.

అధర్మ పద్ధతిలో జూదమాడి పక్కవాని సొమ్ముని పొందటము ఎంతటి పాపం...

దొంగ ఎత్తులతో, మోసాలతో జూదం ఆడి గెలిచిన సొమ్ము పాపము సొమ్ము. దాన్ని తాత్కాలికంగా పొందినా, ఆ పాపపు సొమ్ము ఏదో ఒకనాడు అదే పద్ధతుల్లో వారి నుంచి దూరమయ్యే దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటారు. పదిమంది చేత తన్నులు తింటాడు. ఏ మోసంతో పక్కవాడి ధనాన్ని పొందాడో, ఆ సమయంలో అతనికి సహాయం చేసినవారే తిరిగి అతన్ని అలానే చేస్తారు. దానితోపాటు అయిన వారినుంచే మోసగించ

బడతాడు. మోసపోవటంలోనున్న బాధ ఏంటో తెలుసుకుని కుమిలిపోతాడు.

శివరాత్రి పూజా పుణ్యం...

మహాశివరాత్రినాడు అనగా కృష్ణపక్షము రాత్రి చతుర్ధశినాడు బిల్వ పత్రములతో శివార్చన, అభిషేకాలు చేసి ఉపవాసముండటం వల్ల ఈ జన్మలో చేసిన పాపాలు సమసిపోయి శివ కటాక్ష సిద్ధి లభిస్తుంది. కిరాతకుడైన వేటగాడు కూడా తెలిసీ తెలియక బిల్వ పత్రాలతో శివుని పూజ చేసినందుకు మహాశివుడు సంతృప్తుడయ్యాడు. అదే భక్తిగా, నిష్ఠిగా చేస్తే అనుకోని మహా ఆనందాలని ఇస్తాడన్నది తథ్యం.

అన్నం పెట్టే సంస్థకి ద్రోహం చేస్తే కలిగే పాపం...

మీకూ, మీ కుటుంబానికీ అన్నం పెట్టే సంస్థ అమ్మ లాంటిది. అలాంటి అమ్మకు ద్రోహం చేస్తే అది మహా శాపమై అన్నం దొరకని స్థితి కలుగుతుంది. ఆహారం కోసం ఏనాటికైనా చెయ్యకూడని పనులనూ, ఇష్టంలేని పనులనూ భరిస్తూ చేయాల్సివస్తుంది.

పూజాదికాలకూ, నోములకూ, వ్రతాలకూ పుణ్య ప్రదమైన సమయము...

- నక్షత్రములలో శ్రవణా నక్షత్రము పుణ్యప్రదం.
- తిథులలో పూర్ణిమ.
- అమావాస్యనాడు దానములు మహాపుణ్యములు.
- అలాగే శివ పూజకు అష్టమీ, విఘ్నేశ్వరునికి చతుర్థి, నాగరాజుకు పంచమి, కుమారస్వామికి షష్ఠి, సూర్యదేవునకు సప్తమీ, చండీదేవికి నవమి, సృష్టికర్త బ్రహ్మకు దశమి, రుద్రునికి ఏకాదశి, దామోదరునికి ద్వాదశి, యమునికి త్రయోదశి బహుప్రియమైనవి. ఈ రోజు వారివారికి చేసే పూజాదికాల వల్ల ఎన్నోరెట్లు పుణ్యఫలం వస్తుందని స్కాందపురాణం శెలవిస్తోంది.

దానమంటే పుణ్య ఫలమే...

దానాలు చేయుట వల్ల ధనం తరగదు. బావిలో నీరు ఎంత తోడినా వస్తున్నట్టే దానాలు

ఇచ్చే కొద్దీ పుణ్యమనే ధనం చేరుతూనే ఉంటుంది. కాశీరాజు ప్రవర్ధనుడు ఓ సత్‌బ్రహ్మణునికి రెండు కనులూ దానమిచ్చి సాటిలేని మహా సౌఖ్యాలను పొందాడు.

మన తర్వాత కనులు దానమివ్వటం దైవకార్యమేనని పురాణాలూ శెలవిస్తున్నాయి. ధనమొక్కటే దానం కాదు. అవసరాన్ని గుర్తించి మేలు చేసే ఏ కార్యమైనా దాన ఫలం ఇస్తుంది.

- దానమనే పుణ్యం శత్రువులని మిత్రులుగా చేస్తుంది.
- దానాల వల్లే పితృదేవతలు పైలోకాల్లో సుఖిస్తారు.
- దాన పుణ్యం ద్వారానే తనవారందరికీ సుఖాలు లభిస్తాయి.
- పుణ్యకార్యాలు, ధర్మకార్యాలద్వారానే ధనాన్ని పొందగలిగేది. పాపమున్నవాని వద్ద ధనముండదు. చంద్రుని వంటి అందగాడైనా, వాణ్ణి ఎవ్వరూ చూడరు. పలకరించరు. ధనమే అన్ని సుఖాలకీ, కీర్తులకు ఆధారము. ఆ ధనము పుణ్యం ద్వారానే ప్రాప్తిస్తుంది. ఆ పుణ్యం ధర్మకార్యాల ద్వారానే వస్తుంది.

పుణ్యక్షేత్రాలను దర్శించుట ఎంతటి పుణ్యం...

పూర్వజన్మ సుకృతం వల్ల గానీ, ఈ జన్మ పుణ్యఫలం వల్ల గానీ మాత్రమే పుణ్యక్షేత్రాలనూ, తీర్థాలనూ దర్శించి, సేవించే భాగ్యము కలుగుతుంది. అటువంటి తీర్థాలను దర్శించుట వల్ల జన్మ ధన్యము. అందు స్నానమాచరించటం మరింత పుణ్యం. ఈ రెంటికి మించి తీర్థ మహత్మ్యాన్ని తెలుసుకోవటము మరింత పుణ్యము. పరులకి చెప్పటం ఇంకా పుణ్యం.

అధర్మ బద్ధంగా సంపాదించమని చెబితే ఎంత పాపం...

అన్యాయంగా, అధర్మంగా అవతలవారి సంపదను, లేదా నాశనాన్ని బలవంతులైనవారి చేత చేయించి కోపాన్నీ, కసినీ తీర్చుకోవటము మహాపాపం. అవినీతిపరులకే అక్రమ సంపాదనలపై ప్రీతి. అలా చేసినవాడూ, ప్రోత్సహించినవాడూ ఇద్దరూ పాపాలకి అర్హులే. అలా చెప్పిన శకునీ, చేసిన దుర్యోధనుడిలా ఏదో ఒక రోజు ఇరువురూ పతనమవ్వక తప్పదు.

మోసం, కుట్రల ద్వారా పరుల సొమ్ము పొందితే కలిగే పాప ఫలం...

శక్తితోనూ, తెలివితేటలతోనూ అవతలవార్ని జయించలేక కుట్రల ద్వారా, కుతంత్రాల ద్వారా అవతలి వారి ధనాన్ని పొందితే, ఆ ధనంతోపాటు తాతముత్తాతల ధనం కూడా గాలిలో కలిసి పోతుంది. దానితోపాటు పుణ్యం కరిగి పాపంగా మారుతుంది. మాయా జూదంలో నలుడిని ఓడించిన పుష్కరుణ్ని మహా పాపం పట్టి పీడించినట్టు ఎంతటి వారినైనా సర్వనాశనం చేస్తుంది.

మహా ఘోర పాపాలకి చెయ్యాల్సిన పుణ్యకార్యము...

కోపావేశాలతో చేసిన పాపము శాపంలా వెంటాడి చిత్రహింస చేస్తుంటే దానికి కొంతైనా పరిహారము దైవారాధనే. ఆ పాపాన్ని తల్చుకుంటూ ప్రాయశ్చిత్తంగా బియ్యాన్ని తీసుకొని మీ ఇష్ట దైవాన్ని తలుచుకొని 'రామా' అని కాని, కృష్ణా, శివా, అమ్మవారు... ఇలా మీ ఇష్ట దైవాన్ని తలుస్తూ,

పఠిస్తూ, మూలమంత్రాన్ని జపిస్తూ ఆ బియ్యంలోంచి తలుచుకున్న ప్రతిసారి ఒక్క గింజను పక్కకు ఉంచుతూ, అలా ఓపికున్నంత వరకు ధ్యానించి ఆ బియ్యాన్ని స్వయంగా వండి నైవేద్యంగా పెట్టి ఆపై భుజించాలి. అలా ఏడు శనివారాలు చేస్తే కొంతైనా పాప ఫలం తొలగుతుంది.

భార్యతో సుఖించిన సుఖానికి సమానమైనదేదీ లేదు.
- శౌనకాది మునులతో సూతమహర్షి

అభం, శుభం తెలియనివార్ని చెడగొట్టే వ్యాపారాన్ని చేస్తే...

పిల్లలనీ, ముఖ్యంగా యువతను చెడగొట్టే పుస్తకాలనూ, బొమ్మలనూ, ఇంకా హింసనూ ప్రేరేపించే వాటిని ప్రచురిస్తూ, నిర్మిస్తూ తయారు చేసి సంపాదించటం మహా నీచాతినీచమైన పాపం. ఆ పాపపు సంపాదన పొందిన అతనూ, అతని కుటుంబమూ ప్రతినిత్యమూ భయంతో బ్రతకాల్సివస్తుంది. చేసిన పాపానికి వాని తరతరాలు

అలా తప్పుడు బ్రతుకు బ్రతుకుతూ సమాజంలో పొందాల్సిన గౌరవాలన్నీ కూడా కోల్పోతారు. ఇలాంటివి అటు, ఇటుగా చెయ్యటం వల్లే ఇంద్రుడు చాలాసార్లు పదవి పోగొట్టుకొని భయం భయంగా ఎన్నోసార్లు బ్రతికాడు.

తల్లికీ, తండ్రికీ, గురువుకీ, స్నేహితునికీ చేసిన పాపం పోవాలంటే...

మహాపర్వతం మీద వెలిసిన స్వామిని ధ్యానిస్తూ ఆ గిరి చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేస్తే భూప్రదక్షిణ చేసిన ఫలం వస్తుంది. ఆ పుణ్య ఫలం వల్లే వారు చేసిన మహాపాపం పోతుంది. భద్రాచల శ్రీరామచంద్రుని గిరి చుట్టూ ఒక్క ప్రదక్షిణ, రెండు సార్లు భూప్రదక్షిణ చేసిన ఫలమని ధర్మశాస్త్రాలు శెలవిస్తున్నాయి.

అనుమాన పిశాచంతో భార్యని వేధిస్తే కలిగే పాపం...

తిట్టినా, కొట్టినా భరించి ఆపై మరిచిపోయే స్త్రీ దేవతలాంటిది. ఏం చేసినా భరించే గృహలక్ష్మి

తన శీలాన్ని శంకిస్తే మాత్రం పూరుకోదు. భద్రకాళి అవుతుంది. లేదా కుళ్ళి కుళ్ళి కుమిలి పోతుంది. ఆ పాపము శాపమై భర్తను చుట్టుకుంటుంది. తద్వారా అనారోగ్యం వచ్చి, చేయించుకోకూడని పనులన్నీ ఆ భార్యతోనే చేయించుకునే స్థితి వస్తుంది. అప్పుడు పశ్చాత్తాపం చెందినా ప్రయోజనం లేదు. పురుషుడు ధనం కోసం, సుఖం కోసం, ఒంటి మదం కోసం పరస్త్రీ వెంట పడతాడు. అదే స్త్రీ ఆకలితో మాడి చస్తుందే కానీ శీల దోషం కలిగించుకోదు. ఈ భూమి శూన్యంలో నిలబడిందంటే భూమి మీద పుణ్యం ద్వారానే. అలాంటి పుణ్య ధర్మకార్యాలు స్త్రీలే తొంభై శాతం చేస్తున్నారు. వారి వల్ల భూమి భూమిగా నిలిచి ఉంది. గృహలక్ష్మిలే ధర్మం తప్పితే వచ్చేదే మహా ప్రళయం. (స్వధర్మ స్త్రీ శాస్త్రం)

కూతురి ధనాన్ని పొందితే కలిగే పాపం...

ఆడపిల్ల సొమ్ము అర్ధరూపాయి కూడా ఆశించకూడదని ధర్మం శెలవిస్తోంది. అలా ఆశించి, పొందితే, ఆ ధనముతో బంగారాన్ని కొని దాచినా

నిలవదు. పైగా వడ్డీ, చక్రవడ్డీ కలిసి స్వంత ధనం కూడా పోతుంది. అప్పులపాలై ఆ ఆడపిల్ల దగ్గరే చులకన అవ్వాల్సి వస్తుంది. స్త్రీ సొమ్ము కట్టపాము వంటిది. ఏ విధంగానైనా ఏ సమయంలోనైనా కాటు వేస్తుంది.

వివాహానికి ముందే శారీరక సంబంధం పెట్టుకుని ఆపై మరొకర్ని వివాహం చేసుకుంటే కలిగే పాపం...

ఏ పేరుతో సంబంధం పెట్టుకున్నా పాపమే. అట్టి స్త్రీకి గానీ, పురుషునికి గానీ వేదమంత్రాల దీవెనలు ఫలించవు. పూజాదికాల ఫలం పొందరు. పురుషునికీ అదే పరిస్థితి వస్తుంది. అర్థాంతరంగా ఏదైనా జరగవచ్చు. తద్వారా ఒకప్పుడు తాను ఎంగిలి చేసినట్టు, తమనుభవించే సుఖాలన్నీ ఎవరో అనుభవించగా మిగిలినవే అవుతాయి. లేదా భయంకర అనారోగ్యం రావచ్చు.

జలదానం ఎంతటి పుణ్యం...

ఈ భువిపై జలదానానికి మించిన పుణ్యం లేదు. బావి త్రవ్వించటమూ, బాటసారులకు

దాహార్తిని తీర్చటమూ మహా పుణ్యప్రదం. మీరు చేసిన జలదానం ద్వారా జరిగే అన్ని పుణ్య యజ్ఞ పూజాదికాల్లోని ఓ వంతు పుణ్యం జలదానాన్ని చేసిన మీకూ, మీ కుటుంబానికీ అందుతుంది.

అక్క చెల్లెళ్ళని మోసం చేస్తే కలిగే పాపం...

అవకాశం దొరికింది కదాని ఆడపిల్లలని మోసం చేస్తే తాత్కాలికమైన ధన లాభాన్ని పొందినా, ఎప్పటికైనా శిక్ష అనుభవింపక తప్పదు. ఆ ఆడపిల్లల ఇంటికే హీనంగా, అనారోగ్యంగా వెళ్ళే దుస్థితి కలుగుతుంది. అలా కాకపోతే కనీసం తన కూతురింటికైనా అలా వెళ్ళే దీనస్థితి కలుగుతుంది.

స్త్రీ పురుషుల సంయోగాన్ని భంగం చేస్తే కలిగే పాపం...

సృష్టికార్యం చేసుకుంటున్న స్త్రీ పురుషులు దైవ స్వరూపాలు. అట్టివార్ని శబ్దం ద్వారా, చర్యల ద్వారా భగ్నం చేస్తే కలిగే పాపం భార్యా వియోగం. లేదా తనకిష్టమైన వారి వియోగము. తద్వారా వచ్చే అనారోగ్యమే ఆ పాపానికి ఫలం. దానికి

ప్రాయశ్చిత్తంగా ఇష్టదైవానికి కళ్యాణోత్సము జరిపించి ఆ పాపాన్ని పోగొట్టుకోవాలి. ఇట్టి కార్యాన్ని తెలియక చేసినా కూడా మహా భారతంలో ధర్మాత్ముడు పాండురాజు భార్యా, పుత్రులను వదిలి పైలోకాలకి వెళ్ళవల్సివచ్చింది.

భద్రాద్రి సీతారాముల కళ్యాణం చూడటం ఎంతటి పుణ్యం...

భద్రాచలంలో సీతారాముల కళ్యాణంలో సీతమ్మవారికి మూడు మంగళ సూత్రాలు గల మాంగల్యాన్ని స్వామివారు కడతారు. ఒకటి దశరథ మహారాజులవారిది, రెండొవది జనకునిది, మూడోది శ్రీరాముని భక్తుడు భక్త రామదాసుది. అట్టి మంగళ సూత్రాన్ని కనులారా వీక్షించి నమస్కరిస్తే మహా సౌభాగ్య సిద్ధి కలుగుతుంది.

పసివాళ్ళనీ, పిల్లలనీ హింసిస్తే కలిగే పాపం...

దైవస్వరూపాల వంటి పిల్లల్ని హింసకి గురి చేస్తే, పెద్దల మీద కసిని పిల్లల మీద తీర్చుకుంటే అంతకన్నా ఘోరపాపం మరొకటి ఉండదు. అదే

పిల్లలు దూరమై ప్రత్యక్ష నరకం చవిచూడాల్సి వస్తుంది. కోట్లాది రూపాయిల ధనమున్నా అవసరానికి తన పిల్లలకి రెండు ఇడ్లీ కూడా దొరకని సమయం వస్తుంది. పిల్లలు అనుభవించే భయంకర అనారోగ్యము పెద్దలు చేసిన పాపమే. అలా తెలియక చిన్న పిల్లవానికి చేసిన పాపం కారణంగానే మహాచక్రవర్తి అయివుండీ తన కళ్ళ ముందే తన బిడ్డ శ్రీరాముడ్ని అరణ్యానికి పంపాల్సిన దుస్థితి తెచ్చుకుని కుమిలిపోయాడు దశరథుడు. మరి తెలిసి చేస్తే అంతకు వెయ్యిరెట్లు అనుభవించాల్సి వస్తుంది.

ప్రేమపేరుతో ఓ ఆడపిల్లని మోసం చేస్తే కలిగే పాపం...

వివాహమాడిన స్త్రీ వల్లే పురుషునికి సుఖాలు అందుతాయి. పెళ్ళి పేరుతోగాని, ప్రేమపేరుతో గాని ఆడపిల్లకి అన్యాయం చేస్తే వచ్చే భార్య హీనాంగములు కలదీ, దుష్ట మాటలను చేరవేసేదీ, మగవారివలె మీసాలూ, గడ్డాలూ కలదీ, నవ్వుతుంటే చెక్కిళ్ళలో సొట్టపడునదీ, కలిసి ఉన్న కనుబొమలు కలదీ, ఎడమైనదంతాలు కలదీ, అతి

పొడవైనదీ, అతి లావైనదీ ఇలా ఎన్నో కొన్ని లక్షణాలతో భార్యగా వచ్చి, ఆపై రోగిష్ఠయి పాపకసిని తీరుస్తుంది. ఈ సప్త శతీ మహత్మ్యాన్ని వినుట వల్ల నవగ్రహ బాధలు తొలిగిపోతాయి. చెడు కలలు కూడా తొలిగి మంచి కలలిచ్చు ఫలాలను ఇస్తాయి. చిన్నపిల్లలకి వికార చేష్టలూ, దోషాలూ తొలగిపోతాయి.

ఉపవాసానికి మించిన పుణ్యమూ తప్పస్సుతో సరి సమానమైన తపస్సేది లేదు.

- సూతమహర్షి

పేదింటి ఆడపిల్ల పెళ్ళికి ధన సహాయం చేస్తే కలిగే పుణ్యం...

పెళ్ళికి సహాయం చెయ్యటమంటే ఆదిలక్ష్మిని పూజించటమే. వివాహంలో స్త్రీ లక్ష్మి, పురుషుడు శ్రీమహావిష్ణువు. అట్టి వధువైన శ్రీమహాలక్ష్మి వివాహానికి ధన, వస్తు సహాయం చేయటం ద్వారా లక్ష్మీదేవి దీవెనలు మీ కుటుంబ స్త్రీలందరికీ

లభిస్తాయి. సౌభాగ్యమూ, ఆరోగ్యమూ, ఆనందాలూ కలుగుతాయి. ఆడపిల్ల, లేదా మగ పిల్లాడి పెళ్ళికి అప్పు ఇచ్చినా పుణ్యమే. అలాంటి పుణ్యం ద్వారానే శ్రీ వేంకటేశ్వరుని వివాహానికి అప్పిచ్చిన కుబేరుడు తన సంపదలను స్థిరంగా ఉంచుకోగలుగుతున్నాడు.

కుంకుమార్చన ద్వారా కలిగే పుణ్యం...

కుంకుమార్చన ద్వారా రెట్టింపు పుణ్య ఫలం వస్తుంది. అందుకే వివాహాది శుభకార్యాలప్పుడు అమ్మవారికి కుంకుమార్చన చేయిస్తారు. దేవుని కళ్యాణ సమయంలోనూ కుంకుమార్చన చేస్తారు పండితులు. భర్త అనారోగ్యమప్పుడూ, సంతానానికి జరిగే సకల పుణ్య కార్యాల్లోనూ శుభకార్యాల్లోనూ అమ్మవారికి కుంకుమార్చన చేస్తే మహాపుణ్యం కలిగి ఆ స్త్రీకి సుఖ శాంతులు కలుగుతాయి.

పశుపక్ష్యాదులను హింసిస్తే, బంధిస్తే కలిగే పాపం...

అట్టి వానిని బంధిస్తే ఆ పాపం శాపమై తగులుతుంది. పాతకమవుతుంది. ఎంత గొప్ప

పుణ్యాత్ముడైనా తెలిసిగానీ తెలియకగానీ చేసిన పాపాన్ని అనుభవింపక తప్పదు. భక్తరామదాసు దంతటి వాడూ ఓ చిలుకను బంధించినందుకు కారాగారంలో గడపాల్సి వచ్చింది. వాటిని హింసిస్తే ఆ బాధ వ్యాధిరూపేణా కూడా అనుభవించాల్సి రావచ్చు.

షష్టిపూర్తి అయిదురోజుల వివాహంలా వైభోగంగా జరగాలంటే ఏ పుణ్యం చేయాలి...

ఓ పేద కుటుంబంలో ఆడపిల్లకి అన్నీ తానే అయి వివాహం జరిపిస్తే శ్రీమహాలక్ష్మీదేవికి వివాహం చేసినంత ఫలం దక్కుతుంది. అలాంటి పుణ్యం ద్వారా మీకు లేదా మీ సంతతికి మహావైభోగంతో అయిదు రోజుల వివాహ వైభోగం జరుగుతుంది.

అధిక వడ్డీలతో ధనాన్ని సంపాదిస్తే కలిగే పాపం...

ఆ కట్టేవాడు ఆ ధనాన్ని ఎన్ని పాపాలు చేసి సంపాదించినా అందులో వడ్డీని తీసుకునేవాడు

నాలుగురెట్లు పాపాల్ని పొందాల్సివుంటుంది. అలా సంపాదించిన ధనం ఆ తరం వరకే నిలుస్తుంది. వారి సంతాన వివాహ సమయాల్లోనూ, వైవాహిక జీవితాల్లోనూ అశాంతి చెలరేగుతుంది వడ్డీలు కట్టిన వాడి కుటుంబంలోని అశాంతి వలె. వడ్డీల ద్వారా ధనం సంపాదించటం ద్వారా అందము పోతుంది. ఆరోగ్యము తరుగుతుంది. అలా సంపాదించిన ధనము ఆ వ్యక్తికి ఎలాంటి సుఖాన్నీ ఇవ్వదు. వడ్డీల ద్వారా ధనాన్ని స్త్రీలు మాత్రమే పొందవచ్చునని ధర్మశాస్త్ర సారాంశము.

దేశాన్నేలే పుత్రుడు జన్మించాలంటే చెయ్యాల్సిన పుణ్యవిధి...

శుచిగా స్నానం చేసినవారై మిత భోజనధారులై తూర్పు లేదా దక్షిణ తలాపి గాని ఉండి ఋతుకాలమందు సంగమం చేయాలి. అశ్వినీ, కృత్తికా, రోహిణీ, పునర్వసు, పుష్యమీ, హస్త, అనురాధ, శ్రవణ, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర కాలములందూ శుభకరమైన సమసంఖ్యల రోజులలో కలయిక మహా దివ్యములని విష్ణు

పురాణం శెలవిస్తోంది. అలా కలిసిన దంపతుల సంతానము రాజ్యమేలుతారు. తల్లీ, తండ్రికీ, కుటుంబానికీ కీర్తిని తెచ్చిపెడతారు.

ధనాన్నీ, అవసరాలనీ, కోర్కెలనీ ఎరగా చూపి వ్యభిచారంలోకి దింపితే కలిగే పాపం...

ఆ తర్వాత అలా దిగి పతనమైనవారు ఈ పని ఎందుకు చేశామా అని కుమిలి పోయే ఆ ఆక్రోశం శాపమై తగులుతుంది. అలా వారి ద్వారా సంపాదించిన ధనము ఎలా వచ్చిందో అలానే పోయి అర్ధాంతరంగా ఇహలోకాన్ని విడవాల్సివస్తుంది. ఆ తర్వాత వారి సంతానం పూర్తి ఇష్టంతోనే ఆ పనిలోనే మగ్గిపోవాల్సివస్తుంది.

పెళ్ళి పేరుతో అమ్మాయిని లొంగదీసుకుంటే...

కోటి కోర్కెలతో, ఆశలతో తన్నుతాను అర్పించుకున్న ఆ స్త్రీని వివాహం చేసుకోకుండా మోసం చేస్తే ఆ ఆడపిల్ల ఆక్రోశం మహాశాపమై, కొండంతై ఆవహిస్తుంది. అతని జీవితంలో తల్లీ,

తండ్రీ, భార్యా, స్నేహితుడూ, చుట్టూ ఉన్నవారూ అంతా వాణ్ని అనేక విధాలుగా నమ్మించి మోసం చేస్తునే ఉంటారు. జీవితం ప్రారంభించిన దగ్గరే ఆగిపోతుంది. దాన్నే ఆడదాని ఉసురు అని కూడా అంటారు.

అమ్మవారికి కుంకుమాక్షతల తర్వాత అత్యంత ఇష్టమైనవి పూలు. ముఖ్యమైన పర్వదినాల్లో చామంతి, కనకాంబరాలు, గులాబీలూ, మరువాలతోనూ, మల్లెలూ వంటి వాటితోనూ పూజిస్తే కోరిన కోర్కెలను తల్లి తీరుస్తుంది.

దుర్మార్గుడితో చెలిమి, సఖ్యత ఎంతటి పాపం...

మీరు నీతిపరులైనా, ధర్మవంతులైనా నీచులూ, దుర్మార్గులతో కలిసి ఉన్నా, వారి క్రింద పని చేసినా,

ఆ పాపాల్లో భాగం మీకూ రాక తప్పదు. పాపాత్ములైన దుర్యోధనాదుల పాలనలో ఉండలేమని పాండవులతో అరణ్యవాసానికి అంతా వచ్చేస్తామని, వారు చేసే పాపాల్లో మాకేభాగం వుండకూడదని హస్తిన ప్రజలంతా ధర్మరాజుని అడుగుతారు. కాన పాపం చేసిన వారిదే పాపం కాదు. చూస్తూ ఉన్నవాడు కూడా, పక్కనున్నవారు కూడా ఆ పాపంలో భాగం పంచుకోకతప్పదు.

సూర్యనమస్కారాల వల్ల కలిగే ఫలం...

సూర్యభగవానుడు వేదస్వరూపుడు. త్రిమూర్తులతో సమానమైనవాడు. లోకాలకి రక్షకుడు. ఈ ప్రకృతిలో లభించే సమస్త ఆహారము సూర్యమయము. అట్టివానికి నమస్కారాలు చేయుట మహాపుణ్యం. తద్వారా అనారోగ్యం దరిచేరదు.

తీర్థ యాత్రలు చెయ్యటం ద్వారా కలిగే పుణ్యం...

మహా వైభోగాలకీ, అధికారాలకీ పాపం అడ్డం... పాపమంటే ధర్మాన్ని అడ్డగించటము.

సకల జనులకు కావాల్సిన వాటిని ఆపితే అది ధర్మ విరుద్ధం. దాన్నే పాపమంటారు. పాపమంటే పూజ, ధర్మ, వ్రత, హోమాల ద్వారా పోగొట్టుకునేది. పాతకమంటే అనుభవించాల్సింది. అందుకే దేవేంద్రుడు రోమశుడు అను మహర్షిని పంపించి అరణ్యవాసమప్పుడు ధర్మరాజును తీర్థయాత్రలను చేయించమని పంపుతాడు. ఆ తర్వాతే పాపమన్నది అణువంత కూడా లేకుండా ఈ సమస్త భూమినీ, సకల వైభోగాలనూ పొందాడు ధర్మరాజు.

అక్రమ ధనార్జన పాపం ఎలా ఉంటుంది...

వృక్షం తొర్రలో రగిలిన జ్వాల ఎలా అయితే సమస్త వృక్షాన్ని దహించి వేస్తుందో అట్లే అధర్మ ధనం కూడా ఆ ధనాశాపీడుతుణ్ని నాశనం చేస్తుంది. అలాంటి సంపాదన దొంగల వల్లా, బంధువుల వల్లా, అగ్ని వల్లా, నీటి వల్లా ఏదో ఒక రూపేణా పోతుంది. పోయిన ధనంతోపాటు తీరని దుఃఖాలూ జీవితమంతా పట్టి పీడిస్తాయి. ఇంతటి ధర్మ సూత్రాన్ని చెప్పింది మహాధర్మనీతికోవిదుడు ధౌమ్యుడు.

పూజాదికాల్లో మంత్రాలను ఎలా పఠిస్తే పరిపూర్ణ ఫలం అందుతుంది...

మంత్రోపాసనతో పఠించే మంత్రాల సుస్పష్టమైన భావాన్ని తెలుసుకోవాలి. ఆపై ఉచ్ఛారణగా ప్రతి అక్షరం పలకాలి. అప్పుడే అభీష్ట ప్రాప్తి కలుగుతుందని ధర్మకోవిదులూ, శాస్త్రమూ శెలవిస్తోంది. అందుకే ఏ మంత్రమైనా, పూజైనా గురువు ద్వారా ఉపదేశం పొంది చేయాలి. ధర్మరాజంతటివాడు కూడా గురువు నుంచి ఉపదేశం పొందకుండా ఏ ధర్మకార్యమూ, పూజలూ చేయలేదు.

బదరీనాథ్‌ను దర్శించటము ఎంతటి పుణ్యం...

బదరీనాథ్ అనగా బదరీవనం. రేగు చెట్లు విస్తారంగా ఉండే ఆ ప్రాంతంలోనే శ్రీ మహావిష్ణువు ఒంటి కాలిపై అనేక సంవత్సరాలు తపస్సు చేశాడు. అంతటి పుణ్య ప్రాంతంలోనే సరస్వతీ, అలకనందా నదులు దేవప్రయాగ వద్ద మందాకినీ నదిలో

కలుస్తాయి. అక్కడ్నించి అఖండ గంగగా భూమిపై ప్రవహిస్తోంది. అంతటి పుణ్యక్షేత్రం బదరీనాథ్. త్రివిక్రముడైన శ్రీ మహావిష్ణువు సంచరించిన ప్రదేశాన్ని ఎంతో పుణ్యం చేస్తేగాని దర్శించే అవకాశంరాదు. రెండుసార్లు దర్శించటమంటే ఎన్నో జన్మల పుణ్యం కలిస్తే గాని సాధ్యపడదు.

కలియుగమున పాప కార్యాల వల్ల ఏ వికృతాలు జరుగుతాయని పరాశర మహర్షి చెప్పాడు...

- H గురుశిష్యుల బంధము ఉండదు.
- H వివాహ వ్యవస్థ, దాంపత్య వ్యవస్థ చిన్నా భిన్నం అవుతాయి.
- H ఎవరేం చెబితే అదే వేదం.
- H స్వమతంలో, స్వజాతిలో వివాహాలుండవు. ధనవంతుడు చెప్పిందే శాస్త్రం.
- H ఆడవాళ్ళు జుట్టు చూసుకుని పొంగిపోతుంటారు.
- H ధనం లేని మగవాడికి ఇంటా, బయటా విలువుండదు.

- H ధనమున్నవాడే స్త్రీలకి ఆదర్శ పురుషుడు.
- H ఇల్లు కట్టుకోవటమే పెద్ద కార్యమవుతుంది.
- H కొంతమంది స్త్రీలు మొరుగుల కోసం వ్యభిచరిస్తారు.
- H స్నేహధర్మం పూర్తిగా నశించి, మిత్రుడే శత్రువై పొడుస్తాడు.
- H చిల్లి గవ్వకు కూడా ప్రాణాలు తీస్తారు.
- H ఎండకీ, వానకీ అల్లాడతారు. వాటి కోసమే ఆక్రోశిస్తారు. తినటమే పనిగా పెట్టుకుంటారు.
- H స్త్రీలు రెండు చేతులతో జుట్టు గోక్కుంటారు.
- H అల్పులు సేవకులుగానే మిగిలిపోతారు.
- H ఉన్నవాడి దగ్గర తిండెక్కువ ఉంటుంది. కాని తినలేడు. లేనివాడి దగ్గర మెతుకుండదు. దాని కోసం అన్ని నీచాలకూ పాల్పడతాడు.
- H భర్తల మాటలను భార్యలు ధిక్కరిస్తారు.
- H మగవాళ్ళు రాక్షసుల్లా ప్రవర్తిస్తారు.
- H వేదము రానివారు వేదపండితులవుతారు.
- H దానములూ, ధర్మములూ, యాగాలూ వినటం మాత్రమే చేస్తారు.
- H సన్యాసులు చేయగూడని నీచ పనులన్నీ చేస్తారు.

- పండేది తక్కువ తినేది ఎక్కువ.
- ఇన్ని వ్యధలూ, ఘోరాలూ వల్ల పాపం పెరిగిపోతుంది..... పాపమంటే క్షణక్షణం చస్తూ బ్రతకటం. మనకి నీళ్ళు కొనుక్కోవటం చిన్నతనంలో తెలియదు. ఇప్పుడు కొనుక్కుంటున్నాము. రేపు మనమే గాలి కొనుక్కునే రోజు వస్తుంది. అందుకే 'ధర్మో రక్షతి రక్షితః!'

సంకీర్తనల ద్వారా ఎంతటి పుణ్యం...

లయ, తాళములతో స్వామి నామాలను కీర్తిస్తూ సంకీర్తనలు చేస్తే మహా పుణ్య ఫలం. అట్లా చేయలేనివారు, గీతమాధుర్యము తెలియనివారు అట్టి సంకీర్తనలు చేసే వారిని అనుసరించినా ఆ ఫలం కలుగుతుందని స్కాందంలోని వైష్ణవ ఖండము శెలవిస్తోంది.

రథయాత్ర చేస్తున్న స్వామిని దర్శిస్తే ఎంతటి పుణ్యం...

సకల లోకాలకి అధినాథుడైన స్వామి రథయాత్రను వీక్షించటము వల్ల నూరు జన్మల

పాపము నశిస్తుంది. ఆ రథ నీడ మీద పడితే మహా ఘోరమైన బ్రహ్మహత్యా పాతకము తీరిపోతుంది. ఆ రథ ధూళి మీద పడటం ద్వారా మహా పాతకములైన మూడు పాపాలూ పోతాయి. పవిత్రమైన భాగీరథీలో స్నానం చేసిన ఫలము కలుగుతుంది.

అగ్ని స్తవము స్తుతిస్తే ఎంతటి పుణ్యం...

సప్తశిఖాయక్తుడైన అగ్నిదేవుణ్ని అగ్నిస్తవము ద్వారా పూజిస్తే సకల కోరికలూ తీరతాయి. యజ్ఞయాగాది వ్రతాలప్పుడూ, తీర్థయాత్రలు చేసినప్పుడూ చేసే దోషాలు తొలిగిపోతాయి. పౌర్ణమి, అమావాస్యలలో ఈ స్తవము విన్నచో పాపములు తొలగిపోతాయి. ఒక్కసారి శ్రవణముచే పగలూ, రాత్రీ చేసిన పాపాలు పోతాయి. తను చేసిన దోషానికి ఈ స్తవం పఠించే భూతి శిష్యుడు శాంతి అను ముని దోషాల్ని పోగొట్టుకున్నాడు.

వాక్ దోషం ఎంతటి దోషము...

వ్యాపార, వ్యవహారాల్లో చెప్పే అసత్య వలుకులు మహా దోషాన్ని కలిగిస్తాయి.

పక్కవాడిచ్చిన దానాన్ని తనిచ్చినట్టు, లేనిది కల్పించి చెప్పటమూ ఇత్యాదివన్నీ ఏ లాభాన్ని తీసుకురాకపోగా దోషాన్ని కలిగిస్తాయి. మనం మనకి గొయ్యి తీసుకున్నట్టే. ప్రతిఫలం ఆశించి చెప్పే అబద్ధం కన్నా, ఏ ప్రతిఫలం లేకుండా నోటి దూలకోసం చెప్పే అసత్యాలు రెండు రెట్ల పాప ఫలాన్నిస్తాయి.

దక్షిణాయన పుణ్యకాలంలో స్వామిని పూజిస్తే కలిగే పుణ్యం...

అగరు, చందనములతో, సుగంధాలతో, పూలమాలలతో, వస్త్ర అలంకరణలతో, అనేకానేక భక్ష్యములతో, ఫలాలతో, నీరాజనములతో, నృత్యమంగళ గీతహారములతో శ్రీమహావిష్ణువును పూజిస్తే రెండు రెట్లు పుణ్యం కలుగుతుంది.

స్వామి భోజనానికై సకల శుద్ధితో చేసి వండిన పదార్థాలను నైవేద్యంగా అర్పించి ఆపై ప్రసాదంగా స్వీకరిస్తే మహా పుణ్యం. మాంసాహారం తినుట వల్లా, మద్యపానం చేయుట వల్లా, చెడు చూడుట వల్లా, చెడు వినుట వల్లా, చెడుని తాకుట వల్లా,

అబద్ధాలు చెప్పుట వల్లా కలిగిన మహాపాతకములన్నీ నశిస్తాయి. ఈ స్వామి ప్రసాదాన్ని సాక్షాత్తు శ్రీమహాలక్ష్మీ దేవియే దగ్గరుండి జరిపిస్తుందని స్కాందపురాణం శెలవిస్తోంది.

కష్టాల కడలి నుంచి ఒడ్డుకి చేర్చేది సుందరకాండ. అనేక వ్యధల్లో ఉన్నవారూ, సమస్యల్లో ఉన్నవారూ సుందరకాండను చదివితే హనుమ సీతను దర్శించి తీరం దాటినట్టు సకల సమస్యలనీ దాటగలుగుతారు.

పాపాత్మున్ని మార్చాలని చూస్తే సజ్జనుడికి కలిగే ఫలం...

ప్రసవ వేదన గూర్చి గొడ్రాలికి ఎంత చెప్పినా వ్యర్థమే. మైత్రేయుడంతటి ఋషి దుర్యోధనున్ని మార్చాలని చూసి, అతనే కోపంగా మారిపోయి శాపం ఇచ్చే స్థితికి తెచ్చాడు దుర్యోధనుడు. చెడ్డవాన్ని

మార్చబోయి దానికి పరిహారంగా శాపమిచ్చి నందుకు తాను కొంత పుణ్యాన్ని పోగొట్టుకోవాల్సి వచ్చింది. కాన పూర్తిగా పాపాలతో మునిగినవాణ్ని బైటికి తేవాలని ప్రయత్నిస్తే ఎవ్వరైనా మునగక తప్పదు. పాపం అనగా కుళ్ళిన పండు. నేల రాలాల్సిందే.

పురాణ శ్రవణాన్ని ఇలా వినటం దోషం...

వ్రత, పూజా సమయాల్లోనూ, పంచాంగ శ్రవణము వంటి సమయాల్లోనూ, వ్రతాది శుభకార్యాల్లోనూ పురాణ జ్ఞానాన్ని బోధించేవారికి తప్పక దక్షిణ ఇవ్వాలి. అటువంటివాటిల్లో దక్షిణ ఇవ్వటం పుణ్యప్రదం. అటుల ఇవ్వనిచో భర్తలేని సౌందర్యవతి అందమూ, పారిపోయేవాణ్ని తరమటమూ, అన్ని శాస్త్రాలు తెలిసినా చెప్పుట తెలియనితనమూ ఎలాంటి వ్యర్థ ప్రయోజనాలని ఇస్తాయో అంతటి వ్యర్థ ప్రయోజనం కలుగుతుంది. ఎన్ని యాగాలూ, యజ్ఞాలూ చేసినా పుణ్యంరాదు. అట్టి పురాణ ప్రవచనాన్ని అందించేవాడు, శాంత స్వభావం కలవాడై, తెల్లని చక్కని వస్త్రములతో

మెడలో పూలమాల ధరించి పురాణశ్రవణాన్ని చేయాలి. అందరికన్నా ఎత్తైన ఆసనం మీద కూర్చుని చెప్పాలి. అలా చెప్పిన వాని పురాణ శ్రవణాన్ని విని దక్షిణ ఇచ్చినవారికి అనేక దోషాలు కూడా తొలగిపోతాయి.

భర్త కోరికలకీ, ఇష్టానికీ అడ్డం చెప్పి సాధిస్తే కలిగే ఫలం...

భర్త సంపాదనలో తాను అనుభవించేది కేవలం అయిదు శాతమే. మిగిలిన భాగమంతా ఆ స్త్రీ, ఆమె సంతానమే అనుభవిస్తుంది. అట్టి భర్త ఇష్టాలకీ, కోర్కెలకీ అడ్డు చెప్పటం వలన, అయిష్టత ప్రకటించటం వల్ల ఆ స్త్రీ వైభోగాన్ని, ప్రేమాభిమానాలనూ కోల్పోతుంది. అనారోగ్యంతో వ్యధ చెందుతుంది.

భార్య కోరికలనూ, ఇష్టాలనూ పట్టించుకోని భర్తకే ఫలం అందుతుంది...

పురుషుడు సంతానము ద్వారా, తన వృత్తిలో విజయం ద్వారానే మనుగడ సాగిస్తాడు. ఇంటి

ఇల్లాలిని కంటతడి పెట్టించటమంటే లక్ష్మీదేవిని బాధపెట్టినట్లే. తద్వారా పురుషుని అహాన్నీ, ఆనందాన్నీ, కీర్తినీ తీర్చే ధనం దూరమవుతుంది. కనీస కోర్కెలకి కూడా అనర్హుల వద్ద చెయ్యి చాచవల్సివస్తుంది. నలుగురిలో తక్కువగా అవ్వాల్సిన స్థితి వస్తుంది.

రామేశ్వరము ఎంతటి పుణ్య ప్రదేశం...

సత్యవతీ పుత్రుడైన వ్యాసుని నుంచి పొందిన జ్ఞానము గల సూతుణ్ణి నైమిశారణ్యంలో మహాములులు రామేశ్వరక్షేత్ర మహత్మ్యాన్ని అడుగుతారు.

అందుకు సూతుడు మహాములులారా, ఈ భూమిపై రామేశ్వరము పవిత్ర పుణ్యక్షేత్రం. అందున్న రామసేతువు తీర్థము సకల తీర్థముల కన్నా పవిత్రము.

H రామసేతువును చూసినంతనే ముక్తి లభిస్తుంది. పుణ్యం సమృద్ధి అవుతుంది.

H భూమి యందు రేణువులనూ, ఆకాశము నందు నక్షత్రాలనూ లెక్కింపవచ్చు. కాని

రామసేతు దర్శనముతో కలిగే పుణ్యాన్ని లెక్కింప సాధ్యం కాదు.

H సేతు బంధనము సమస్త దేవతల రూపము.

H రామసేతువును దర్శించు అని చెప్పుట చేతనే దర్శించిన పుణ్యం కలుగును.

H రామేశ్వర లింగాన్ని, గంధమాదన పర్వతాన్ని తలుచుకున్నంతనే దర్శించిన పుణ్యం.

H ఈ రామేశ్వర సేతు బంధ దర్శన పూజా, స్నానాదుల ద్వారా పైలోకంలో చేసిన పాపాలకి విధించే శిక్షలు అనగా మూత్రపానమూ, కుక్కను తినుటా, ఎలుక దుస్థితీ, కాల్చిన శూలాలను కౌగిలించుకొనుట వంటి శిక్షల నుంచి బైటపడగలుగుతాడు.

H అందమైన అతివలతో వారు ఇష్టపడినా లేదా కోరివచ్చిన స్త్రీలను పొందినా కలిగే దోషాలూ, పాపాలూ ఈ రామసేతు స్నానం ద్వారా తొలగిపోతాయి.

H ఈ రామసేతు స్నాన ఫలం సకల మంత్రసిద్ధి. మహా దారిద్ర్యము నుంచి విముక్తి అని ఇంకా ఎన్నో ఫలముల గూర్చి బ్రహ్మ ఖండములో ఈ క్షేత్ర మహత్మ్యం శెలవిచ్చి ఉన్నది.

పరస్త్రీలను తలచుకొని స్కలనం చెందితే కలిగే పాపం...

పరస్త్రీని మనసు ద్వారా బలాత్కారం చేసిన పాపం కలుగుతుంది. వ్యర్థమైన వీర్యంలా భార్యా సుఖం దూరమవుతుంది. సంతానం వల్ల అవమానమూ, నష్టమూ జరుగుతాయి. గృహస్థు ధర్మాలకి అనర్హుడవుతాడు. ఆ కామము వల్ల క్రోధము పుడుతుంది. క్రోధము వల్ల శాంతిని కోల్పోతాడు. దానితో పూజలకీ, వ్రతాలకీ దూరమవుతాడు. తద్వారా పాపాత్ముడవుతాడు. పాపాలని తెచ్చేవి ముఖ్యంగా రెండు ఒకటి ధనం. రెండు స్త్రీ.

సంతానమూ, భర్తా చెడు సావాసాలతో పక్కదారి పడుతుంటే ఇల్లాలు చెయ్యాల్సిన పుణ్యం...

మెట్లపూజ. అమ్మవారి ఆలయమెట్లకు, లేదా శ్రీ మహావిష్ణువు ఆలయాల మెట్లకు పసుపు,

కుంకుమ రాసి కర్పూరం వెలిగిస్తూ పూర్తి చేయటం ద్వారా సౌభాగ్యమూ, సంపదలు ఆ ఇల్లాలి గృహంలో ఉంటాయి.

ఆ పూజప్పుడు పుత్రునితో మెట్లను శుభ్రం చేయించటమూ, ఆ ప్రదేశంలో మీరు పసుపూ, కుంకుమ రాయటమూ కూతురితో కర్పూరం వెలిగించటమూ చేయిస్తే వారి తలరాత వక్రరీతిలో ప్రయాణించకుండా మీరు మెచ్చుకునే రీతిలో నడుచుకుంటారు.

పుత్రునితో సోమవారం పూట మహాశివునికి అభిషేకం చేయించటం ద్వారా శక్తివంతుడవు తాడు. గుణవంతుడవుతాడు.

శ్రీ మహావిష్ణువు యజ్ఞ యాగాదులతోనూ, ఉపవాసములతోనూ సంతృప్తుడై భోగ భాగ్యము, స్వర్గ సుఖాలని అందిస్తాడని స్కాందపురాణము శెలవిస్తోంది.

పర పురుషుణ్ణి తలచుకొని భర్తతో సుఖిస్తే కలిగే పాపం...

స్త్రీ గృహస్థు ధర్మము ద్వారా, పూజాదికాల వల్ల కుటుంబము సుఖంగా ముందుకు కదులుతుంది. పరపురుషుణ్ణి తలుచుకొని సుఖిస్తే అలాంటి స్త్రీ చేసే ఏ పూజలూ, పునస్కారాలూ ఫలితాన్నివ్వవు. అశ్వమేధ యాగం చేసినా ఫలితం ఉండదు. భర్త భార్యకి చేసే ద్రోహంతో లెక్కిస్తే అదే తప్పు భార్య చేస్తే ఆ పాపానికి నాలుగింతలు అనుభవించాల్సి వస్తుందని గృహస్థాశ్రమ ధర్మాలు శెలవిస్తున్నాయి.

వివాహం అవ్వాలంటే చెయ్యాల్సిన పుణ్య పూజా విధి...

శ్రీవైభవలక్ష్మి వ్రతం. స్త్రీలకు సకల సౌభాగ్యములూ ఇచ్చు ఈ వ్రతగాథ పరమేశ్వరుడు పార్వతీదేవికి చెప్పాడు. శ్రీవైభవలక్ష్మి వ్రతం చేసిన వారికి లేమి అన్నది ఉండదు. సిరిసంపదలూ, ధనమూ, కీర్తి లభిస్తాయి. పెళ్ళికానివారు ఈ వ్రతం చేస్తే పుణ్య పురుషుడు లభిస్తాడు. నూతన వధువు

ఈ వ్రతం చెయ్యటం ద్వారా అత్తింట్లో సమస్త సుఖాలనూ పొందుతుంది. సంతానం లేనివారికి ఆ తల్లి సంతానం కలిగేలా దీవిస్తుంది.

వినాయకుని పూజ ఎంతటి పుణ్యం...

పరమశివుడు కూమరస్వామికి చెప్పిన వ్రతము. భాద్రపద శుక్లచతుర్థినాడు సకల పూజాదికాలతో వినాయకుణ్ని పూజించినవారికి సకల కష్టములు తీరి సుఖశాంతులు కలుగుతాయని సూతమహాముని ద్వారా ఉపదేశం పొంది ధర్మరాజు ఆ వ్రతాన్ని ఆచరించి సకల శత్రువులను జయించి వైభవోపేతంగా భూమిని ఏలాడు.

అలాగే దమయంతి ఈ వ్రతాన్ని చేసి నల మహారాజును వివాహం చేసుకుంది. శ్రీకృష్ణుడు ఈ వ్రతాన్ని ఆచరించి శమంతకమణిని పొందాడు.

అలాగే వృత్రాసురుణ్ని సంహరించే ముందు దేవేంద్రుడూ, సీతాన్వేషణకై శ్రీరాముడూ, దేవలోకాలలో ప్రవహించే గంగను భూమిపైకి తెచ్చేందుకు భగీరథుడూ, అమృతాన్ని సాధించే ముందు దేవతలూ, రాక్షసులూ, మహాకుష్ఠ వ్యాధి

నివారణకై సాంబుడూ ఇలా ఎందరో ఈ వ్రతాన్ని చేసి ఫలితాన్ని పొందారు.

భర్తనూ, అత్తమామలనూ నిందించిన పాపం, పరపురుషుని వాంఛా వంటి పాపములూ పోవుటకు చెయ్యాలిన వ్రతం...

శ్రీకేదారేశ్వరవ్రతము. సకల సౌభాగ్యాలనిచ్చే ఈ వ్రతవిధానం గౌతమ ఋషిచే తెలియచెప్ప బడింది. స్కాందపురాణంలోని ప్రకారం శ్రీ కేదారేశ్వర వ్రతాన్ని ఇరవై ఒక్కసార్లు ఆచరించిన వారికి మహాసంపదలు కలుగుతాయి.

శివానుగ్రహాన్ని పొందటానికీ, చేసిన అనేక పాపాలు పోవటానికీ ఆషాఢశుద్ధ దశమిరోజు చేయాల్సిన ఈ వ్రతం వల్ల భర్తను నిందించిన పాపములూ, అత్తమామలను దూషించిన పాపములూ, దేవకార్యములప్పుడు రజస్సు కనపడినప్పుడు వంట పాత్రలను పట్టుకొనుట వల్ల కలిగిన పాపాలూ నశిస్తాయి. ఈ వ్రతం చేసిన స్త్రీకి సకల సౌభాగ్యాలూ, సుఖాలూ సిద్ధిస్తాయి.

వివాహ సమయంలో ఈ దోషాలు జరగకుండా చూడండి...

పుణ్యాహవచనం అనగా సకల అమంగళాలు తొలిగించే ఈ కార్యక్రమప్పుడు వధువు వరునికి ఎడమ పక్క ఉండాలి. అలాగే సంకల్పమప్పుడూ ఎడమ పక్క ఉండాలి. వాటితోపాటు రక్షా బంధనమప్పుడూ వధువు ఎడమ పక్కనుండాలి. ఆశీర్వచన సమయంలోనూ వరునికి ఎడమపక్క నుండాలి.

అదే ప్రధాన, ప్రవేశ, శేష హోమాలప్పుడు వధువు వరునికి కుడివైపు నుండాలి. కన్యాదానం చేస్తున్న సమయాన కన్యాదాతకు తన భార్య కుడివైపునా, వధువు ఎడమవైపునా ఉండాలి.

అయా సమయాల్లో వ్యతిరేకంగా చేయటం ద్వారా క్లేశాలు కలిగి ఇరువైపులవారూ వ్యధ చెందుతారు.

కాని మిగతా కొన్ని సమయాల్లో వధువూ, వరుడూ ఎదురెదురుగా కూర్చొని వివాహాన్ని జరిపించుకోవాలి.

అనగా వరుని కాళ్ళు కడిగేటప్పుడూ, మధుపర్కాన్ని పెళ్ళికొడుక్కి ఇచ్చేటపుడూ.

వరలక్ష్మీ వ్రత పూజాదికాల వల్ల ఏ పుణ్యం సిద్ధిస్తుంది...

నైమిశారణ్యంలోని మహర్షులకు శౌనకుడు చెప్పిన వ్రతమే వరలక్ష్మీ వ్రతం. మహాశివుడు పార్వతీదేవికి చెప్పిన వ్రతం వరలక్ష్మీవ్రతం. స్త్రీలకు సర్వసుఖములనూ, పుత్ర పౌత్రాదులనూ సిద్ధింప చేసే మహావ్రతము వరలక్ష్మీవ్రతము. శ్రావణ మాన శుక్లపక్ష పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారమునాడు ఈ వ్రతము చేసిన స్త్రీలకు సకల భోగభాగ్యములు కలుగుతాయనీ, ఈ వరలక్ష్మీ వ్రత ప్రసాదాన్ని స్వీకరించినవారికి కోరుకున్న కార్యము నెరవేరుతుందనీ భవిష్యోత్తర పురాణం శెలవిస్తోంది.

విఘ్నేశ్వరుడు అర్ఘ్య పాద్యాదులతో, మంత్రోచ్చాటనలతో సంతృప్తుడై అనేక విఘ్నాలు తొలగిస్తాడని స్కాందపురాణం శెలవిస్తోంది.

సకల కష్టాలను తొలగించే పుణ్యవ్రతం శ్రీ సత్యనారాయణ వ్రతం...

శౌనకాది మునులకు సూతమహాముని చెప్పిన వ్రతము శ్రీ సత్యనారాయణవ్రతం. తొలుత శ్రీమహావిష్ణువు నారదునికి ఉపదేశించిన వ్రతము. పౌర్ణమి తిథినాడూ, లేదా ఏకాదశినాడూ వైశాఖమాసమునందూ, మాఘమాసమందూ, కార్తీక మాసమునందూ వ్రతం చేసుకున్నవారికి సకల హితములు జరుగుతాయి. అన్ని కష్టాలూ తొలగి కుటుంబము సుఖశాంతులతో ఉంటుందని శ్రీమహావిష్ణువు నారదునికి చెప్పి ఈ వ్రత విధానం శెలవిచ్చాడు.

స్త్రీలకు రజో దోషములు పోగొట్టు వ్రతం లక్షవర్తి వ్రతం...

స్త్రీలకు రజో దోషాల వల్ల అనేక పాపాలు కలుగుతాయి. వాటి వల్ల అనేక స్త్రీ వ్యాధులూ, బాధలూ కలుగుతాయి. వాటిని తీర్చే వ్రతమే లక్షవర్తి వ్రతము. భర్త వ్యతిరేకత, భ్రూణహత్య, పర పురుష

వాంఛా, అబద్ధాలు చెప్పుట, లోభితనమూ వంటి దోషాలు తొలగిపోతాయి.

దేవీసప్తశతి, దేవి స్తోత్రము చదివితే ఎంత పుణ్యం...

మహా విఘ్నములు కలుగుతున్నా, కారణం లేకుండా అసూయలతో మిమ్ము పీడిస్తున్నవారూ నశించాలంటే దేవీసప్తశతి చదివితే సకల భయాలూ పోతాయి. అన్ని కార్యాలూ నెరవేరుతాయి. శ్రీ మార్కండేయ పురాణ హితోక్తి ఇది. రాక్షసులతో అన్ని రకాల బాధలు పడి, అవి తొలగించిన దేవి ఎదుట ఇంద్ర, అగ్నితోపాటు సకల దేవతలూ చేసిన స్తోత్రం... దేవీ సప్తశతి...

నదీ జలాల్లో, స్నానకుండాల్లో ప్రకృతి ధర్మాన్ని నిర్వర్తిస్తే కలిగే పాపం...

పవిత్రమైన జలాశయాల్లో స్నానం చేస్తూ ఆ కార్యాలు చేస్తే ముసుగులో అనగా నమ్మక ద్రోహం చేసినట్టే. దానితోపాటు గంగాదేవిని అవమానించటమే. భగవంతుణ్ని దూషిస్తే కలిగే పాపం కలుగు

తుంది. వేదశాస్త్రాలని అవమానించిన ఫలితం అందుతుంది. వాటితోపాటు వానికి అంతకు మించిన అవమాన హేళన సంఘటనలు జరిగి అనేక రోజులు పట్టి పీడిస్తాయి.

ఎవర్ని పిలిస్తే పుణ్యం బదులు పాపం వస్తుంది...

శ్రాద్ధంలో స్నేహితుణ్ని భోక్తగా పిలవకూడదు. అలా పిలిస్తే శ్రాద్ధకార్యాలందూ, దేవతాకార్యాలందూ, ఆయా ధర్మాలు చేసిన ఫలం లభించదు. ఎన్ని పుణ్యాలు చేసినా ఆ పుణ్యఫలం వానికి చెందదు. శ్రాద్ధం తాలూకు ఫలాలనీ, సుఖాలనీ స్నేహద్రోహమూ, భర్తద్రోహమూ, సంతాన ద్రోహమూ చేసినవార్ని పిలిచినా ఆ ఫలం లభించదు. పైగా దోషం కలుగుతుంది.

అశ్లీలమైన వాటిని అమ్మి ధనం సంపాదించటం ద్వారా కలిగే పాపం...

ఉరుములు, మెరుపులు వస్తున్నప్పుడూ, కుక్కలూ, గాడిదలూ అరుస్తున్నప్పుడూ, అనేక

మంది సరస సంభాషణలు చేస్తున్నప్పుడూ వేద పఠనం చేస్తే కలిగే పాపం ఆవహిస్తుంది. సమాజాన్నీ, రేపటి తరం పిల్లలను చెడగొట్టే పనుల ద్వారా ధనం సంపాదిస్తే పాపం వస్తుంది. బూతు పుస్తకాలు ప్రచురించడం, నీలి చిత్రాలను అమ్మటం, తయారు చేయటం ఎంత పాపమో వాటిని మరొకరికి ఇవ్వటం కూడా అంతే పాపం. తద్వారా వినకూడనవి, ఎంతఖర్మపడితే గాని చూడకూడనవి చూడాల్సి, వినాల్సిన ఖర్మ పడుతుంది.

వావివరుసలు మరిచి శరీర సుఖాన్ని పొందితే కలిగే పాపం...

రోగాలతోనూ, రొప్పులతోనూ, ఈర్ష్య, అసూయలతోనూ, దురలవాట్లతోనూ, వివాహానికి ముందే కన్యత్వాన్ని పోగొట్టుకున్న జీవిత భాగస్వామి లభిస్తుంది. తద్వారా అశాంతి, దుఃఖం. అదే వివాహం అయ్యాక చేస్తే, ఆ పాపం రెండు రెట్లై శరీరంలో అవయవాలు పనిచెయ్యక బ్రతికినంత కాలం నిస్తేజంగా బ్రతకాల్సివస్తుందని ధర్మశాస్త్రం శెలవిస్తోంది.

మత్తు పదార్థాలూ, జూదం వంటి వాటి ద్వారా ధనాన్ని సంపాదిస్తే కలిగే పాపం...

వాటి ద్వారా సకల బాధ్యతలూ విస్మరించి మత్తులో మగతగా ఉండే వేలాది మంది వారివారి భార్యల, పిల్లల ఉసురు తగిలి, చిన్నతనంలోనే వారి సంతానము మత్తు పదార్థాలను స్వీకరించకుండానే మత్తుగా, పిచ్చిగా ఉంటారు. ఎంత ధనాన్ని ఖర్చు పెట్టినా ఆ బాధ తీరక జీవితాంతం వాణ్ని వెంటాడుతూనే ఉంటుంది. లేదా ఆ జూదగాళ్ళు వంటి వారితోగానీ, మత్తుమందు స్వీకరించిన వారితోగానీ అపరిమితమైన తీరని దుఃఖం కలుగుతుంది.

భగవంతుడిచ్చిన తెలివితేటలతో వందలాది మందికి ద్రోహం చేస్తే కలిగే పాపం...

ఏ రూపేణా అయిన అలా మోసం చేసిన వ్యక్తీ, వాని తాలుకూ కుటుంబమూ ఆ పాపాన్ని భరించాల్సిందే.

భార్యతోపాటు పుత్రికలు పరధార లవుతారు. పిల్లలు తిండి కోసము నీచమైన కార్యాలు చేస్తారు. బ్రతికినంతకాలం ధనమెంత ఉన్నా దిగులుతో వేదనలతో మగ్గిపోతాడు.

సూర్యభగవానుడికి నమస్కరించినంతనే ప్రసన్నుడవుతాడని ధర్మశాస్త్రాలు శెలవిస్తున్నాయి.

సకల తీర్థాలు సేవించినా పోని పాపములు పోగొట్టే క్షేత్రం...

ఆ మహా క్షేత్రం పేరే గోకర్ణ క్షేత్రము. నూరు పాపములు చేసినవారూ, బ్రహ్మహత్యాపాతకములూ, కులపాతకములూ చేసిన వారూ ఒక్కసారి గోకర్ణ క్షేత్రాన్ని దర్శించినంతనే తొలగిపోతాయని అష్టాదశ పురాణాల్లోనే అతి పెద్దదైన స్కాంద పురాణము శెలవిస్తోంది.

కైలాసమునందూ, మందార మూర్ధము నందూ మహాశివుడు ఉన్నట్టు, ఈ క్షేత్రంలో మహాశివుడు పార్వతితో కూడి ఉంటాడు.

సోమవార వ్రతమెంతటి పుణ్యం...

సోమవారంనాడు మహాశివుణ్ని బిల్వ పత్రాలతో పూజిస్తే ఇహలోకంలోనే సమస్త సుఖాలూ లభ్యమవుతాయి. మహాలక్ష్మి వంటి లక్షణాలు గల భార్య లభిస్తుంది. శ్రీ మహావిష్ణువు వంటి సుందరమైన భర్త లభిస్తాడు. బహు సంతానముతో, కీర్తితో సుఖిస్తారు. ఈ వ్రత విధానము బ్రహ్మఖండములో వివరంగా చెప్పబడింది.

ఆయుష్యము, కీర్తి, ధనములిచ్చే పుణ్యకార్యాలని ఎవరికి చెప్పకూడదు...

ఏకాగ్రమనస్సును నిలిపి ఆలకించని వారికీ, నీచాతినీచమైన పనులు చేసినవారికి అనగా భర్తను మోసం చేసినదీ, భార్యను మోసం చేసినవాడూ, స్నేహితుణ్ని వంచించినవానికీ, కృతఘ్నునికీ ఇట్టివారికి కీర్తి ప్రదమైన పురాణ ఇతిహాస రహస్యాలను చెబితే చెప్పినవారికి దోషములు

వస్తాయని బ్రహ్మపురాణంలో రోమహర్షణుడుకి మహర్షులు పుణ్య విషయాలను రహస్యంగా చెబుతూ పై విషయాన్ని వివరించారు.

మహాశివుని భస్మమెంతటి పుణ్యశక్తి కలది...

జంబూనదిని పొంది అక్కడి మట్టి బంగార మైనట్టూ, మానససరోవరాన్ని చేరి కాకులు హంసలైనట్టూ, అమృతాన్ని త్రాగితే దైవత్వము వచ్చినట్టూ, శంభుని భూషణమైన భస్మధారణ ద్వారా మహా పుణ్యశక్తి కలుగుతుంది.

మంథర పర్వతంపై సనత్కుమారునికి మహాశివుడు భస్మ మహత్యాన్ని వివరిస్తూ, కాల్చిన గోమయమును ఐదు మంత్రాలతో అభిమంత్రించిన భస్మాన్ని లలాటమందూ, రెండు భుజములపై ధరించిన వారికి మహాపాతకాల నుంచి విముక్తి. పరుల ధనము అపహరించిన పాపమూ, చేయకూడని వారితో చేసిన సంపర్క పాపమూ, అసత్య దోషాలూ, పరస్త్రీ స్పర్శలవల్ల కలిగిన పాపాలూ, ఉప పాతకములూ తొలిగిపోతాయి అని పరమేశ్వరుడే శెలవిచ్చాడు.

కొత్త బంగారు ఆభరణాలను నలుగైదులవారికి చూపించి గర్వపడితే ఎంతటి దోషము...

వివాహాదిశుభకార్యాలున్నది సంతోషంగా నగలూ, వస్త్రాలతో వైభోగంగా అలంకరించుకొని సంతోషించటానికి, ఆ సమయంలో తప్ప భర్త, అత్తా, అమ్మ వంటివారు కొనిచ్చిన నగలను వస్త్రాలనూ చుట్టు పక్కలవారికి చూపించటము దోషము. పాపం కూడా.

అవి చూసిన వారు ఆనందపడినా, అవి లేనందుకు, తనభర్త కొననందుకు బాధపడతారు. ఆ తర్వాత భర్త అసమర్థతగా ఆ బాధ మారుతుంది. తద్వారా గొడవలు. అశాంతి.

దానికి కారణమైన ఆ సంపన్నురాలు ఆ దోషంలో పాలుపంచుకోవాల్సి ఉంటుంది.

ఏదో రకంగా ఆ నగలూ, సంపదా తరిగి పోవచ్చు. లేదా అవి పెట్టుకొనే పరిస్థితే ఉండక పోవచ్చు.

ఏదైనా శుభకార్యాలప్పుడు వైభోగ ప్రదర్శన చేయటం ద్వారా దోషముండదు.

అన్యోన్యదాంపత్యానికి చెయ్యాల్సిన పుణ్య వ్రతం...

చైత్ర మాసంలో వచ్చే అనంగత్రయోదశినాడు శివ పూజ చేస్తే అన్యోన్యదాంపత్య సుఖం లభిస్తుంది. చైత్రమాసంలో శుక్లపక్ష త్రయోదశినాడే మహాశివుడు భస్మమైన మన్మథుణ్ణి తిరిగి బ్రతికించింది. ఈ రోజున మన్మథరతీదేవిలను పూజించటం ద్వారా సకల సుఖాలతో దాంపత్య ముంటుందని ధర్మసింధు స్పష్టం చేస్తోంది.

ఏ శివ లింగాన్ని పూజిస్తే ఎంతటి పుణ్యం...

- H వజ్ర లింగాన్ని పూజిస్తే ఆయుష్షు వృద్ధి చెందుతుంది.
- H ముగ్తామయ లింగాన్ని పూజిస్తే రోగాలు పోతాయి.
- H వైధూర్య లింగాన్ని పూజిస్తే శత్రువులు నశిస్తారు.
- H పద్మరాగ శివలింగాన్ని పూజిస్తే అపార ధనప్రాప్తి.

- H సకల సుఖాలూ కోరుకునేవారు పుష్యరాగ లింగాన్ని పూజించాలి.
- H ఇంద్రనీలాలు గల శివలింగాన్ని పూజిస్తే కోరుకున్నది వశమవుతుంది.
- H మరకత లింగాన్ని పూజిస్తే శక్తి, అట్లే స్ఫటిక లింగాన్ని పూజిస్తే సకల కోరికలూ తీరుతాయి.
- H బంగారు శివలింగాన్ని పూజిస్తే ముక్తి కలుగుతుంది.
- H రాగి లింగము పుష్టినీ, దీర్ఘాయుష్షునీ, ఇత్తడి ఆశలనూ తీరుస్తుంది. కీర్తి కోసం కంచు శివలింగాన్ని పూజించాలి.
- H అలాగే గంధ లింగాన్ని పూజిస్తే సుఖాలూ, గోమయ శివలింగము ఆరోగ్యాన్నీ కలిగిస్తుంది అని ధర్మసింధు స్పష్టం చేస్తోంది.

ఎవరికి నమస్కారం చేస్తే రెట్టింపు పుణ్యం...

వర్షాలు కురవని రోజుల్లో అనగా కరువు రోజుల్లో అన్నదానం చేసేవారికీ, పంటకై ధన మిప్పించు వానికీ, ధర్మం కోసం పోరాడేవానికీ, అస్సలప్పన్నదే చేయనివారికీ పెట్టే నమస్కారం

రెండింతలు పుణ్యం ఇస్తుందని ధర్మసింధు శెలవిస్తోంది.

జ్యేష్ఠమాసం వ్రతం ఎంత పుణ్యం...

జ్యేష్ఠమాసంలో పౌర్ణమి వెళ్ళిన పదమూడో రోజు వటసావిత్రి వ్రతం చేసుకున్న స్త్రీలకు ఐదవతనం కలకాలం నిలుస్తుంది.

ఈ మాసంలోనే పదమూడోరోజున సావిత్రి యమునితో పోరాడి భర్త ప్రాణాలని తిరిగి తెచ్చుకుంది. వట వృక్షాన్ని పూజిస్తూ చేసే వ్రతం కాన వటసావిత్రి వ్రతమని అంటారు.

అగ్ని పురాణం ప్రకారం ఉపవాసం నాడు తీసుకోవాల్సినవి...

పండ్లూ, నీరూ, పంచగవ్యములు తీసుకున్నా ఉపవాసఫలం కలుగుతుందని వాయు పురాణ వచనము. అయితే ఉపవాసం వల్ల శక్తి క్షీణించిన వారు మాత్రమే తీసుకోవాలని చెబుతోంది.

స్త్రీని ఏ నక్షత్రాల్లో కలిస్తే దోషము...

మహా గ్రంథమైన ధర్మసింధు నందు మాఘ కృత్తికాత్యుత్తరములందు స్త్రీ సంగమము పనికిరాదని, అది దోషమని, ఆ సమయంలో కలవటం ద్వారా పుట్టే సంతానము వంశానికి అప్రతిష్ఠ తెస్తుందని లేదా చెడు వ్యసనాలకి బానిసలవుతారని తెలుపబడింది.

అగ్నిపురాణం ప్రకారం ఉపవాసం ఎలా ప్రారంభించాలి...

భర్త అనుమతితో ఉపవానవ్రతాన్ని ప్రారంభిస్తూ రాగిపాత్రతో నీరు తీసుకొని తూర్పుదిశగా ఉండి, తానీ వ్రతాన్ని ఎందుకు చేస్తున్నానో చెప్పుకుని, మనసులో ధ్యానించుకొని, ఆపై నీటిని తులసి కోటలో పోసి ఆపై ఉపవాస దీక్ష చేస్తే మహాపుణ్యమని అగ్ని పురాణం శెలవిస్తోంది.

సముద్ర స్నానవిధి ప్రకారం సముద్రస్నానం ఎప్పుడు చేయాలి...

పౌర్ణమి, అమావాస్యనాడు లేదా అనేక పర్వదినముల సమయాల్లో చేయాలి. శుక్రవారం, మంగళవారం చేయకూడదు. పైన చెప్పిన అలాంటి పర్వదినాల్లో చేస్తేనే పుణ్యం. మిగతా సమయాల్లో చేసే సముద్ర స్నానం దోషము. దాని వల్ల అరిష్టములు కలుగుతాయి.

ఎనభై కోట్ల మైళ్ళ విస్తీర్ణం గల ఈ భూమి మీది పుణ్య క్షేత్రాలూ, తీర్థాలూ దర్శించిన పుణ్యం కేవలం ధర్మనిరతితోనూ అందు తుంది.

మహాపుణ్య తిథి...

రోహిణి నక్షత్రము బుధవారముతో కూడిన మహా పుణ్య తిథి. ఆ తిథిలో మొదలు పెట్టిన ఏకార్యమైనా అనంతమైన ఫలమునిస్తుంది.

కార్తీక నదీస్నానము ఎలా చేస్తే పుణ్యమని నిర్ణయసింధు చెబుతోంది...

కార్తీక మాసంలో ప్రాతః సమయంలో శివకేశవులను అనగా ఇష్టదైవాన్ని ధ్యానిస్తూ, శివుడూ గంగలనూ, మహావిష్ణువు లక్ష్మీదేవిలనూ స్మరిస్తూ జలముతో నాభి మునుగునంత వరకూ మునిగి యథావిధిగా స్నానము చేయాలని శాస్త్రం శెలవిస్తోంది.

ఏ పూజ ద్వారా మహాగండ దోషాలు పోతాయి...

తులసి ఆకులతో శ్రీ మహావిష్ణువుని పూజిస్తే మహాగండ దోషాలు తొలగిపోతాయి. తులసీ ఆకులను శ్రీమహావిష్ణువుకు అర్పిస్తే ఎంతటి పుణ్యమో, తులసి చెట్టు నాటినా, నీరును పోసినా అంతటి పుణ్యం కలుగుతుందని తులసీ మహత్మ్యంలో వివరించబడింది.

నిత్య తులసి పూజ ఉన్న గృహాన యమ కింకరులు రాలేరు. అలాగే ఊహించనవీ,

అపాయకరమైనవీ అయిన గండాలు తొలగి పోతాయి.

గోసహస్ర దాన ఫలం పొందాలంటే...

కార్తీక మాస అరుణోదయకాలములో శ్రీహరి ఎదుట జాగరణ చేస్తే గోసహస్రదాన ఫలం కలుగుతుందని ధర్మసింధు స్పష్టం చేస్తోంది.

ధర్మసింధు గ్రంథం ప్రకారము నవగ్రహ దోషాలున్నవారు ఎలా స్నానం చేయాలి...

H గజమదమూ, కుంకుమా, ఎర్ర చందనము లను, నీటితో నిండిన రాగిపాత్రలో వేసి, సూర్యదేవుణ్ని స్మరించి స్నానం చేస్తే సూర్య గ్రహ దోషాలు పోతాయి.

H నీటితో నిండిన పాత్రలో వట్టివేళ్ళూ, గంధమూ, కుంకుమ, ఎర్ర చందనములు వేసి చంద్రుణ్ని స్మరించి ధ్యానించి శంఖము ద్వారా స్నానం చేసిన చంద్రగ్రహ దోషాలు పోతాయి.

H అంగారక గ్రహ దోషాలు పోవటానికి రజిత పాత్రలో దేవదారు గంధమూ, తిలలూ, ఉసిరిక పప్పు కలిపి, అంగారకుణ్ని స్తోత్రము చేసి స్నానము చేస్తే ఆ గ్రహ దోషాలు పోతాయి.

H పవిత్ర సంగమస్థల జలాన్ని మట్టి నీటి పాత్రలో కలిపి స్నానము చేస్తే బుధగ్రహం సంతృప్తి చెంది దోషాలను అరికడుతుంది.

H బృహస్పతి గ్రహ ప్రీతి కొరకూ, దోషాల నివారణకు మారేడూ, మర్రీ, ఉసిరికా వంటి ఫలాలను బంగారు పాత్రలో వేసి ఆ నీటితో స్నానం చేస్తే ఆ గ్రహశాంతి జరిగి దోషాలు కరిగిపోతాయి.

H గోరోచనమూ, వంద పుష్పాలనూ రజిత నీటి పాత్రలో వేసి శుక్ర గ్రహాన్ని ధ్యానించి స్నానము చేస్తే శుక్రగ్రహ దోషాలు సమసిపోతాయి.

H శని దేవుని ప్రీతి కొరకూ, దోషాల నివారణకు తిలలూ, మినుములూ, గంధ పుష్పములనూ నీటితో నిండిన లోహపాత్రలో వేసి శనీశ్వరుణ్ని ధ్యానించి స్నానం చేసిన ఆ గ్రహ దోషాలు నశిస్తాయి.

H హరి దళాలను పాత్రలో వేసి గేదెకొమ్ముతో రాహు గ్రహాన్ని ధ్యానిస్తూ స్నాన విధి పూర్తి

చేస్తే రాహు గ్రహ ప్రీతి జరిగి దోషాలు పరిహార మగును.

H కేతువు గ్రహ తృప్తికీ, దోష నివారణలకూ పవిత్ర పర్వతం పైనున్న మట్టిని పాత్రలో వేసి కేతువుని ధ్యానించి స్నానం చేస్తే ఆ గ్రహ దీవెనలు లభిస్తాయి. ఆ గ్రహ దోషాలు పోతాయి.

నవగ్రహ దానాలు ధర్మశాస్త్రాల ప్రకారము, ధర్మసింధు ప్రకారం ఏ గ్రహానికి ఏ దానాలివ్వాలి...

నవగ్రహాల్లోని తొమ్మిది గ్రహాల దోషాలకీ, సంతృప్తికీ పవిత్రమైన ధర్మసింధు గ్రంథం ప్రకారం ఎవరి శక్తిని బట్టి వారిస్తే ఆ గ్రహ దోషాలు నివారణై సుఖశాంతులు కలుగుతాయని శెలవిస్తోంది.

H సూర్యగ్రహ దోష నివారణకు గోధుమలు, ఎర్రని వస్త్రములు, ఎర్ర చందనము, పూలు, బంగారములు... వీటిలో ఏదో ఒకటి దానమిచ్చినా సూర్య గ్రహ దోషములు తొలుగుతాయి.

H చేటలో నిండిన బియ్యమూ, కర్పూరములు, తెల్లని వస్త్రములు, కలశము, వంటివి చంద్రగ్రహాన్ని ధ్యానించి దానమిచ్చిన చంద్రుడు ప్రీతికరమవుతాడు.

H గోధుమలు, మొసరులు, ఎర్రని వస్త్రాలు, రాగి చెంబు వంటివి దానమివ్వుట ద్వారా అంగారకుడు సంతృప్తి చెంది ఆ గ్రహ దోషాలను పోగొడతాడు.

H నీలము వస్త్రములు, కాంస్యపాత్రలు, పెసలు, పుష్పములు బుధ గ్రహ స్మరణతో దానమిచ్చిన ఆ గ్రహ దోషాలు తొలుగుతాయి.

H పసుపు, పచ్చని ధాన్యములు, పచ్చని వస్త్రములు, లవణము, బంగారములు దానమిచ్చిన బృహస్పతికి ప్రీతికరమై ఆ దానము వల్ల ఆ గ్రహ దోషాలు తొలుగుతాయి.

H చిత్ర వస్త్రములు, బంగారము, గంధములు, తండుకులములు శుక్ర గ్రహాన్ని ధ్యానిస్తూ దానమిచ్చిన శుక్రగ్రహ దోషాలు తొలుగుతాయి.

H తైలము, తిలలు, లోహము, నల్ల ఆవు శనీశ్వరునికి ప్రియము. అట్టి దానములు

శనీశ్వరుణ్ని ధ్యానిస్తూ, స్మరిస్తూ చేసిన శనిగ్రహ సంతృప్తుడై ఆ గ్రహ దోషాలు నివారణ మవుతాయి.

- నీల వస్త్రములు, కంబలము, తైలము, తిలలు, లోహము రాహు గ్రహానికి ప్రియము. ఆ దానమునిచ్చిన ఆ గ్రహ దోషములు తొలగిపోతాయి.
- తైలము, తిలలు, కంబలము, కస్తూరి వస్త్రములు కేతువును స్మరిస్తూ ధ్యానించి దానమిచ్చిన కేతు గ్రహ దోషాలు తొలుగు తాయి.

వీరుడ్ని భర్తగా పొందటానికి చెయ్యాల్సిన పఠనము, శ్రవణము...

సాహసుడైనవాడూ, మహాప్రేమను ఇచ్చు వాడూ అయిన భర్త కావాలనుకున్నవారు ఉమా మహేశ్వర కళ్యాణ వైభవము చదివినా, విన్నా ఆ కోర్కె తీరుతుంది. ఆది దంపతుల వివాహం గూర్చి బ్రహ్మదేవుడు మునిపుంగవులకు వివరించిన అపూర్వ ఘట్టము శ్రీ ఉమామహేశ్వర కళ్యాణము.

శివస్తవము పారాయణము చేసిన ఎంతటి ఫలము...

దక్షుడు మోకాళ్ళ నేలపై ఆనించి త్రినేత్రుణ్ని స్తుతించినదే శివస్తవము. దీన్ని పారాయణము చేసినవారు దీర్ఘాయువులవుతారు. అనారోగ్యాలు దూరమవుతాయి. మహాకీర్తి కలుగుతుంది. భయం నుంచీ, రోగాల నుంచీ విముక్తి. పెళ్ళి కానివారు పఠిస్తే అత్తింట్లో పుట్టింటి వైభోగమును మించి అందుతుంది. శివస్తవము పఠించి ఏదన్నా కోరుకుంటే జరిగి తీరుతుంది. విఘ్నేశ్వరుడు విఘ్నాలు కలిగించడు.

ప్రథమ రజస్వల సమయాల్లో ఏ దోషాలు జరగకుండా ఎలా ఉండాలి...

ప్రథమ ఋతువు నందు నక్షతలచే నాసన ఏర్పరచాలి. భర్త, పుత్రులూ, పుత్రికలూ గల పుణ్యస్త్రీలు పసుపూ, కుంకుమా, గంధమూ, పుష్పాలూ గల తాంబూలము ఇచ్చి దీపములచే నీరాజనాలను ఇవ్వాలి.

దీపముతో కూడిన చాపను ఏర్పరచి, గంధ పుష్పాదితాంబూలాన్నిచ్చి చాపపై కూర్చోండ బెట్టాలి.

H మూడు రోజుల వరకూ ఎవ్వరూ తాకరాదు.

H అభ్యంగ, కాటుక, స్నానాలు నిషిద్ధము.

H పగలు నిద్రా, నేలపై గీతలు గీయుట చేయరాదు.

H శయ్యపై నిదురించరాదు.

H దోసిలితోగానీ, రాగిలోహ పాత్రలచే జలము త్రాగరాదు.

H చిన్న చిన్న గిన్నెలతో నీరు త్రాగితే వివాహానంతరం పొట్టివాళ్ళు పుడతారు.

H ఆకులను దొప్పిగా చేసి నీరు త్రాగితే జ్ఞానంలేని సంతానం కలుగుతుంది.

H రెండు నెలలు వరకూ ఆవుపాలూ, తాంబూలమూ, పెరుగూ తీసుకొనరాదు.

H పీటను ఎక్కుటా, కూర్చొనుటా, అట్లే ప్రయాణములు నిషిద్ధములు.

H మృణ్మయపాత్రలో గానీ, ఇనుపపాత్రలోగానీ, భూమిపైగానీ భోజనం చేయాలి.

H గ్రహణాదుల సమయాల్లో స్నానము చేయరాదు.

H బట్టలు పిండకూడదు. స్నానం చేసి విడిచిన బట్టను చూడకూడదు.

H ఏకగోత్రము కలవారూ మేనత్తా, మేనకోడలు గలవారు రజస్వలను తాకితే, స్నానము ద్వారా శుద్ధి చేసుకోవాలి.

H సరదాకి, కావాలని తాకితే ఓ రాత్రి ఉపవాసం చేసి ఆ దోషాన్ని పోగొట్టుకోవాలి.

H ఏ చుట్టరికం లేనివారు రజస్వలను తాకితే స్నానము చేసి ఆ రోజు ఉపవాసం ఉండాలి.

ఉపవాసమంటే శరీరానికి విశ్రాంతినిచ్చి మనస్సును భగవంతునిపై ఉంచటము. అది పుణ్యం. లంకణమంటే అనారోగ్యంతో ఏమీ తినలేక పోవటము. అది పాపం. పుణ్యం వల్ల చేసేది ఉపవాసం. పాపం వల్ల తినలేని స్థితి లంకణము.

భోజ్యాన్న దోషాలు పోవాలంటే...

తెలిసీ తెలియక భోజనానికి కూర్చున్నవారిని లేపితే మహా దోషం. అన్నదానానికి అడ్డం వచ్చినంత పాపం. ఆ దోషం పోవటానికి వారం రోజులపాటు పళ్ళు, దుంపలు, పాలు, పెరుగు, మజ్జిగ తీసుకుంటూ దైవచింతనతో గడిపితే ఆ దోషము పోతుంది. దానికి ప్రాయశ్చిత్తమదేనని ధర్మ పురాణశాస్త్రం శెలవిస్తోంది.

పిల్లలు లేని దోషాలను పోగొట్టే పూజా పుణ్యవ్రతం...

శక్తి ఉంటే ఉయ్యాలలో ఊగుతున్న వెండి శిశువు ప్రతిమను పుత్రులూ, పుత్రికలూ గల పుణ్యదంపతులకి దానం ఇచ్చి ఆశీర్వాదం తీసుకోవాలి.

పేద పిల్లకి వివాహం చేయటమూ, మహా శివునికి మహారుద్రము జరిపించటమూ, లేదా లక్ష పద్మములతో మహాశివుణ్ని పూజిస్తే సంతానం కలుగుతుందని ధర్మసింధులో తృతీయపరిచ్ఛేదము స్పష్టం చేస్తోంది.

పుణ్యకార్యాలను చేయిస్తే ఎంతటి పుణ్యం...

ధర్మకార్యాలు, పుణ్యవ్రతాలు చేసిన వారి పుణ్యంలో చెప్పి చేయించిన వారికి సగం పుణ్యం కలుగుతుంది. ధర్మవ్రతకార్యాల్లో పరాన్నము భుజిస్తే, చేసిన పుణ్యము వానికి కొంత చెందుతుంది. పరాన్నమనగా ఆయా సమయాల్లో ఎవరింటికి భోజనానికి వెళ్ళకూడదు. శుభకార్యాలకి వెళ్ళినా హాజరై వచ్చేయాలి. కాన పరాన్నము ఏదీ స్వీకరించరాదు.

వర్షాలు పడని పాపం ఎవరిది...

సరైన సమయంలో వర్షాలు పడాలి. మానవులు చేసిన పాపకర్మలను భరించలేక ప్రకృతి కోపమే వర్షాలు పడకపోవటం – భారతం.

చేతితో ఏవి వడ్డిస్తే మహా దోషం...

ఉప్పు, ఊరగాయా, నెయ్యి, నూనె, పచ్చడీ, ద్రవ్యములు చేతితో వడ్డిస్తే స్వీకరించవలదని, దోషమని గృహస్థ శాస్త్రం శెలవిస్తోంది.

పంక్తి భోజనంలో కూడా పాపం అంటుతుందా...

పాపములు చేసినవారితో కలిసి ఉండటమూ, పాలు పంచుకున్నా పాపం ఎలా వస్తుందో, ఏక పంక్తిలో భోజనం చేసినా కలుగుతుందని శాస్త్రం శెలవిస్తోంది. అందుకే ఎవరి పక్కన పడితే వారి పక్కన పంక్తిలో కూర్చోకుండా యాజమాని ఇరువైపులా భార్య పిల్లలనుంచుకొని భుజించాలి.

మహా హోమాలూ, యాగాలూ చేసినా పోని పాపాలు...

సమస్యలతోనూ, వ్యధలతోనూ, పాపపుణ్యాల తలంపుతోనూ ప్రతిరోజు మహా యాగాలూ, పూజలూ చేసినా, గతంలో చేసిన పాపాలుపోవు. వాటి ఫలితాన్ని అనుభవింపక తప్పదు. కానీ ఆ యాగ పుణ్యం వల్ల, మీ ప్రవర్తన వల్ల నష్టపోయిన వారు శాంతిస్తే ఆ పాపం మిమ్మల్ని పీడించి శపించకుండా ఉంటుంది. పాపాలు చేయటం చాలా తేలిక. కానీ ఆ పాపాలను పోగొట్టుకోవటానికి మహా తపస్సులే చేయాల్సి ఉంటుంది.

దేవతార్చనలో ఇలా ఉండుట దోషాలు...

- రెండు శివలింగములుండరాదు.
- రెండు సాలగ్రామములుండరాదు.
- ద్వారకా చక్రములు రెండు కూడదు.
- సూర్యాధిష్ఠానములు రెండు వలదు.
- రెండు శంఖములు ఉండరాదు.
- శక్త్యధిష్ఠానములు మూడు వద్దు.

తోటలు వేయుటకు ఏవి శుభ పుణ్య నక్షత్రములు...

అనేక విధాల తోటలు వేయుటకు అశ్వినీ, రోహిణి, మృగశిర, పుష్యము, మఘ, ఉత్తర, ఉత్తరాషాడ, ఉత్తరభాద్ర, హస్త, చిత్తా, విశాఖ, అనురాధా, మూల, శతభిషము, రేవతి నక్షత్రములు యోగ్యమైనవి, మహాప్రశస్తమైనవని కాశీనాథ పండితులవారిచే రచించబడిన మహా ధర్మశాస్త్ర గ్రంథము శెలవిస్తోంది.

ఆశ్లేష నక్షత్రమందు సోమవారం చంద్రుడు బలంగా లగ్నమందు ఉన్నచో అప్పుడు చెరకూ,

అరటి, పోక వంటివి వేయాలని, అశ్వినీ యందు సూర్యుడు లగ్నమందు ఉన్నచో కొబ్బరి వంటివీ, బృహస్పతి లగ్నమందు చంద్రుడు లగ్నాంశమందున్న తమలపాకు వంటివి పాతించాలని, అలా చేస్తే మహా కాపు వచ్చునని పురాతన శాస్త్రసారాంశము.

పుణ్యమైనా, పాపమైనా నీటితో సమానం. అయితే పుణ్యం నదీ జలాలవంటిది. మీకు ఎప్పటికప్పుడు దాహార్తిని తీరుస్తుంది. పాపం సముద్ర జలం వంటిది. చుట్టూ నీళ్ళే. కాని ఒక్క చుక్క కూడా పనికిరాదు.

సాలగ్రామమును దోషాలు లేకుండా ఎలా పూజించాలి...

H స్త్రీలు సాలగ్రామాలను తాకకుండా పూజించాలి.

H రెండింటిని పూజింపకూడదు. కానీ సాల గ్రామములు సరి సంఖ్యలో పూజించాలి.

H ఉసిరికాయంత సాలగ్రామము మహా ప్రశస్తమైనది.

ఏ దేవతా, దేవతలని ఏ పూలతో పూజిస్తే దోషం రాదు...

జాజి, మల్లె, గన్నేరు, అశోకము, కలువ, సంపంగి, పగడ, మారేడు, జమ్మి, కుశ సకల దేవతలకు ప్రీతికరములు.

శమీ పత్రము దుర్గాదేవికీ, మల్లె, మోదుగ, పగడ, దూర్వ మహాశివునికీ, తెల్లకలువ, తగర పూవులు సూర్య భగవానునికీ, ఆగిసె, కురివింద విష్ణుశివులకు ప్రీతికరములు. ఉమ్మెత్త, మందారములు పూజకు వలదు.

H మహా విష్ణువునకు బిల్వ తులసీ పత్రములు అత్యంత ప్రీతిపాత్రము.

H తులసి, జాజి పువ్వులమాలతో శ్రీమహా విష్ణువుని సేవిస్తే మహాపుణ్యం.

H ఉమ్మెత్త పువ్వులూ, కడిమి పువ్వులూ మహా శివుని రాత్రి పూజలో అర్పించిన రెట్టింపు ఫలం.

H బాగా పండిన మామిడి పండు శివునికి అర్పిస్తే పదివేల సంవత్సరాలు శివనామము చేసిన ఫలం.

సంతానము కోసం చెయ్యాల్సిన వ్రతం...

పెళ్లై సంవత్సరాలు గడుస్తున్నా సంతానం కలగకపోతే సంతానవ్రతం చేస్తే మహా కీర్తిని తెచ్చే పిల్లలు జన్మిస్తారు.

వైశాఖ, మాఘ, ఆశ్వయుజ నెలల్లో పూర్ణ, భాద్ర తిథుల్లో గురువారం, శుక్రవారం బుధవారాలలో హస్త, శ్రవణ, పుష్యమీ, మూల, పునర్వసు, మృగశిర, ధనిష్ఠ, రేవతి అశ్వనీ నక్షత్రాలలో తొలుత గణపతిని పూజించాలి. విప్రులచే రుద్ర జపం చేయించాలి. దానాలివ్వాలి. పూజలో దోషాలు పోవటానికి విష్ణు సహస్ర నామం చదివించి, దంపతులకి భోజనాలని పెట్టుకోవాలి. పురాణ కాలక్షేపం చేయించి వినిన అందరి వద్దా ఆశీర్వాదాలను పొందాలి. అట్టి పుణ్య దంపతులకి పుణ్యం ఒప్పి ఆ స్త్రీ గర్భం ధరిస్తుందని ఇతిహాస సారాంశము.

ఏ నక్షత్రమందు ఏ కార్యం చేస్తే దోషం...

H పుష్య పునర్వసుల యందు స్త్రీలు నూతన వస్త్రాలను ధరించటం దోషము.

H శతభిష నక్షత్ర మందు స్నానమాడరాదు.

H వస్త్రము మధ్య చినిగినా, కాలినా వాటిని ధరించరాదు.

H మృగ శీర్ష, పునర్వసులందు బట్టలు నేయరాదు.

H చిత్త, స్వాతి, విశాఖ, అనురాధా, జ్యేష్ఠ, శ్రవణము, పుష్యమూ, పునర్వసు వీటి యందు ధ్రువ నక్షత్రములందు ప్రయాణం క్షేమం.

ఏ నక్షత్రమున ఏ వ్యాధి కలిగిన ఎంతటి దోషము...

H అశ్విని యందు వ్యాధి కలిగితే ఒక్కరోజే బాధిస్తుంది.

H భరణి యందు వచ్చిన రోగ పీడ పదకొండూ లేదా ఇరవై ఒక్కరోజులు బాధిస్తుంది.

H కృత్తిక నాడు అనారోగ్యం కలిగితే తొమ్మిది నుంచి ఇరవై ఒక్క రోజులు ఇబ్బంది కలిగిస్తుంది.

- రోహిణి యందు వ్యాధి మూడు రోజులైనా తగ్గకపోగా ఇంకా ముల్లులా గుచ్చుతూనే ఉంటుంది.
- మృగశీర్ష యందు వచ్చిన శరీర ఇబ్బంది తొమ్మిది రోజులు చికాకులను తెప్పిస్తుంది.
- ఆర్ధ్రనక్షత్రమున వచ్చిన వ్యాధి పది దినాలు అతలాకుతలం చేస్తుంది.
- పునర్వసు నందు కలిగిన వ్యాధి ఏడు రోజులు తిష్ఠవేసుకొని ఉంటుంది.
- పుష్యము నందు కలిగిన అనారోగ్యము మహా వ్యధలను కలిగిస్తుంది.
- ఆశ్లేషా నక్షత్రమున వచ్చిన వ్యాధి మంచం పట్టిస్తుంది.
- మఘ యందు వచ్చిన వ్యాధి మాసముంటుంది.
- పుబ్బ యందు కలిగిన శరీర బాధ ఎక్కువ రోజులుంటుంది.
- ఉత్తర యందు వచ్చిన వ్యాధి పదిహేడు రోజులుంటుంది.
- హస్త యందు ఎనిమిది లేదా తొమ్మిది రోజులు బాధిస్తుంది.
- చిత్త యందు కలిగిన రోగము పక్షముంటుంది.

- స్వాతి నక్షత్రమున కలిగిన వ్యాధి పది దినాలు బాధిస్తుంది.
- విశాఖ నక్షత్రమున కలిగిన రోగము పక్షము రోజులుంటుంది.
- అనురాధ నక్షత్ర మందు కలిగిన శరీర బాధ పదిరోజులు పీడిస్తుంది.
- జ్యేష్ఠ నాటి వ్యాధి ఇరవై ఒక్కరోజులుంటుంది.
- మూలానక్షత్రమున కలిగిన వ్యాధి తొమ్మిది రోజులు పీడిస్తుంది.
- పూర్వాషాఢ నక్షత్రాన కలిగిన వ్యాధి రెండు లేదా మూడు వారాలుంటుంది.
- ఉత్తరాషాఢ యందు వ్యాధి కలిగితే నలభై అయిదు రోజులు ఆ రోగం బాధిస్తుంది.
- శ్రవణా నక్షత్రాన కలిగిన వ్యాధి పది రాత్రులు బాధిస్తుంది.
- ధనిష్ఠ యందు పదిరాత్రులు లేదా పక్షము లేదా మాసము పదమూడు రాత్రులు గాని బాధిస్తుంది.
- శతభిషా నక్షత్రమున కలిగిన రోగము పదకొండూ, లేదా ఎనిమిది రోజులు హింసిస్తుంది.

- పూర్వాభాద్ర యందు కలిగిన శరీర వ్యాధి రెండు మాసములకు గానీ తగ్గదు.
- ఉత్తరాభాద్ర యందు కలిగిన అనారోగ్యము మాసం లేదా పక్షముంటుంది.
- రేవతి నందు జ్వరమొచ్చిననో ఇరవై దినాలుంటుంది.

అట్టి నక్షత్ర దోషాలున్నవారు శ్రీ మహావిష్ణువును వెయ్యి సార్లు పురుషసూక్తముతో పూజించి, పఠించి అభిషేకం చేస్తే రోగ దోషాలు తొలుగుతాయి. లేదా శ్రీ భాగవత మందున్న జ్వరస్తోత్రము పఠించిన ఆయా గ్రహ నక్షత్ర దోషాలు తొలుగుతాయి.

సర్వరోగాలు పోగొట్టు జప పుణ్యం...

వైద్యుని చికిత్సతోపాటు భగవంతుని కృపకొరకు మహారుద్రాతి రుద్రమాల జపము చేయించిన ఆయుష్షు పెరుగును. అట్లే విష్ణు సహస్ర నామము వెయ్యి, పదివేలు చదివించుట, ఇంకా మృత్యుంజయ జపములు వంటివి సకల రోగపాపహరములు. పుణ్యప్రదములు.

ఏ రోజు ఏ దిక్కు వెళితే దోషము...

సోమ, శనివారములు తూర్పువైపుకూ, గురువారము దక్షిణ దిశగానూ, రవి, శుక్రవారములు పశ్చిమ దిశకూ, బుధ, మంగళవారములు ఉత్తరం వైపుకు ప్రయాణములు దోషాలగును. కాన యాత్రలకూ, వివాహాది కార్యాలకి వెళ్ళేటప్పుడు ఒకింత శాస్త్రాన్ని ఆచరించి శుభాలను పొందండని ధర్మశాస్త్ర కోవిదము శెలవిస్తోంది.

చేసుకున్న ఒప్పందాన్ని మీరితే కలిగే పాపం...

అలా మీరటం అసత్య దోషం క్రిందకు వస్తుంది. అబద్ధం ఆడితే వచ్చే అసత్య దోషం కన్నా, ఒప్పందాన్ని మీరితే కలిగేపాపం పదిరెట్లు ఎక్కువ. ఆ పాపానికి ఎప్పటికైనా మహా వ్యధను అనుభవించాలి. వానికున్న ధనమూ, అంగబలమూ ఏవీ దాని నుంచి కాపాడలేవు. కాకపోతే అనుభవించటానికి కొంత సమయం పడుతుంది.

ప్రయాగ ఎంతటి పుణ్యక్షేత్రం...

ప్రయాగ తీర్థ పుణ్యక్షేత్రం బ్రహ్మదేవుడి యజ్ఞ వేదిక. అందు నిరంతరమూ మూడు అగ్నికుండాల్లో త్రేతాగ్నులు వెలుగుతూ ఉంటాయి. వేదాలు, యజ్ఞాలు ఆకార రూపం దాల్చి, అరవై కోట్ల పదివేల తీర్థాలూ కలిసి గంగా, యమునా సంగమంలో తీర్థాల్ని సేవిస్తాయి.

ప్రయాగలో స్నాన మాచరించినవారు రాజసూయయాగం చేసిన పుణ్యమూ, అశ్వమేథ యాగాలు చేసిన పుణ్యమును పొందుతారు. సత్యవ్రతాన్ని ఆచరించే వారికి కలిగే పుణ్యమూ, చతుర్వేదాలనూ అధ్యయనం చేసిన పుణ్యం లభించటం వల్ల మహోత్తర సుఖాలని పొందుతారని శ్రీ వ్యాసమహర్షి మహా పుణ్యక్షేత్రమైన ప్రయాగ క్షేత్రం గూర్చి వివరించారు.

మనం చేసే పుణ్యమైనా, పాపమైనా భరించేది వృద్ధాప్యం లోనే. అనగా శరీరంలో శక్తి నశించినప్పుడే.

పుణ్య తీర్థాలని సేవించాలన్నా పుణ్యం చేసుకొని ఉండాలి...

అందరికీ తీర్థాలనూ, క్షేత్రాలనూ సేవించే అదృష్టం ఉండదు. పుణ్యం ద్వారానే, ధర్మప్రవర్తన ద్వారానే అవి కలుగుతాయి.

నోములూ, వ్రతాలూ చేయనివారూ, శుభ్రత లేనివారూ, అధర్మంగా ఆలోచించేవారూ, ఉపవాసాదులు చేయనివారూ పుణ్యక్షేత్రాలను దర్శించటం అటుంచి కనీసం దరిచేరరు. సర్వపుణ్య తీర్థాల మహత్మ్యాన్ని చెప్పిన పులస్త్య మహర్షి సత్యవాక్కులివి.

అనారోగ్య దోషాలను పోగొట్టే పుణ్యగాథ...

మహాశివుడు కాలనేత్రుడై దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసినప్పుడు పరమేశ్వరుని ఫాలభాగం నుంచి ... ఆ మహా కోపం నుంచి చెమట బిందువు నేలరాలింది. ఆ చెమట బిందువు భూమిపై పడి మహాగ్నికీల అయింది. అందునుంచి ఎర్రని కనులతో, నల్లని రూపంతో, మహారోమాలు గల

భయంకరమైన భయాన్ని కలిగించేవాడు జన్మించాడు. వాడే జ్వరుడు.

మహాశివుడు ఆ జ్వరుడ్ని అనేక ప్రాణాలపైకి పంపించాడు. ఏనుగుకి తలనొప్పిగా, పాముకి కుబుసంగా, ఆవులకి గిట్టలలో నొప్పిగా, లేళ్ళలో తమని తాము స్పష్టంగా చూసుకోలేని విధంగా, గుర్రాలకు వృషణాల్లో నొప్పిగా, నెమలికి ఈకలు ఊడిపోయేలా, కోకిలకి కళ్ళ జబ్బుగా, చిలకలకి వెక్కిళ్ళుగా, మేకలకి భ్రాంతిగా, మనిషికి దుఃఖంగా తద్వారా చావు పుట్టుకలను కల్పించాడు. అట్టి జ్వరుని గాథ చదివినా, విన్నా వ్యాధి దోషాలు పోతాయి.

కురుక్షేత్రం ఎంతటి పుణ్య క్షేత్రం...

ఈ కురుక్షేత్రంలోనే శమంత పంచకాల నడుమ రామప్రదమనే సరస్సు మధ్య బ్రహ్మదేవుడి ఉత్తర వేది ఉంది.

అట్టి కురుక్షేత్రాన్ని దర్శించినవారికి, దర్శించాలని అనుకున్నవారికి సకల పాపాలూ నశిస్తాయి. ఈ క్షేత్ర దర్శనము శత్రు నాశనం.

మహా విజయం. దర్శించి సేవించిన వారికి మహోన్నతమైన కీర్తి కలుగుతుంది.

వేదమంత్ర పఠనం సమస్త పాపహరమని ఆర్ష సంప్రదాయం శెలవిస్తోంది.

నైమిశాన్ని సేవిస్తే కలిగే పుణ్యం...

కేవలం దర్శించినంతనే పాపాలన్నీ తొలగిపోతాయి. దర్శించాలని భావించినంతనే కొన్ని పాతకాలు పోతాయి. ఆ క్షేత్రమందు ఓ మాసం నివసిస్తే అనంతమైన పుణ్యం కలుగుతుంది. ఒక్కరోజు అచట ఉపవాసం ఉంటే అనేక తీర్థాలను సేవించిన పుణ్యం కలుగుతుంది.

గయలో స్నానం ఎంతటి పుణ్యాన్నిస్తుంది...

గయలో పిండ ప్రదానాలు చేసిన పితురులు సంతృప్తులై దీవిస్తారు. నదీ, నివాస ప్రాంతాల్లో పెట్టిన పిండప్రదానాలకన్నా గయలో పెట్టినదానికి వంద రెట్లు సంతృప్తి చెందుతారు పితురులు.

తద్వారా పితురులు దేవతల ద్వారా శుభాలను కలిగిస్తారు. అందు ఫల్గుణీ తీర్థంలో స్నానమాచరిస్తే పుణ్యాలతోపాటు కీర్తి లభిస్తుంది.

పాపాలనే వ్యాధులు దరిచేరకుండా ఉండాలంటే...

గతజన్మలో చేసినవి కొన్ని, ఈ జన్మలో చేసినవి మరికొన్ని ఆ పాపాలే మనకు కలిగే రోగాలు.

అలాంటి పాపకర్మలు రోగాలనే పేరుతో పీడించకుండా ఉండటానికి దుర్గతి నాశినైన దుర్గాదేవిని ఉపాసించాలని గర్గుడను మహర్షి శెలవిచ్చాడు. తల్లికి కుంకుమ పూజలు... చీరా రవికా పెట్టి సేవిస్తే దీర్ఘ వ్యాధులు నయమవుతాయి.

సరయు నదిలో స్నానం చేస్తే ఎంతటి పుణ్యం...

శ్రీరాముడు సరయు నదిలోంచే వైకుంఠాన్ని చేరాడు. సరయు నదీ తీర ప్రాంతంలోని గోప్రదానమను పుణ్య తీర్థంలో స్నానం చేసినవారు అశ్వమేధయాగ ఫలాన్ని పొందుతారు.

అపవాదులకి పరిష్కారం దొరకనివారు చెయ్యాల్సిన పుణ్యశ్రవణం...

శమంతకమణిని అపహరించిన అపవాదును పోగొట్టుకోవటానికి శ్రీకృష్ణుడు ప్రసేనుడిని వెదుకుతూ అరణ్యానికి వెళ్ళాడు. ఎంతకీ అతని ఆచూకీ తెలియకపోవటంతో శ్రీదేవీభాగవతాన్ని దీక్షతో ఆలకించాడు.

ఆపైనే సమస్య పరిష్కారమైందని, శ్రీదేవీ భాగవతాన్ని మునులకు చెబుతూ తెలియ చెప్పాడు సూతమహర్షి.

అభాండాలూ, అభియోగాలు పడ్డవారు దేవీ భాగవతాన్ని చదివితే అన్నీ తొలిగి మీ ధర్మ నిజాయితి అందరికి అర్థమవుతుంది.

నిద్రాభంగం ఎంతటి పాపం...

మహాయుద్ధం ముగిసిన తర్వాత వింటి మీద తల ఆన్చి నిద్రిస్తున్న శ్రీమహావిష్ణువును ఎలా నిద్రలేపాలో తెలియలేదు. లేపితే కలిగే నిద్రాభంగ పాపము, లేపకపోతే దేవతలకి అరిష్టం.

అయినా శ్రీ మహాలక్ష్మీదేవి ఎంత నష్టం జరిగినా పర్వాలేదనుకుంది. శ్రీ మహావిష్ణువును నిద్రలేపి ఆ దోషాన్ని మాత్రం పొందకూడదనుకుంది.

ఆ పాపానికి దేవతలే భయం చెందుతారు. నిద్రాభంగముతోపాటు కథాభంగము, దాంపత్య భంగము, తల్లీ, బిడ్డను విడదీయటం వంటివి కూడా మహాపాతకాలు. పాపమంటే పుణ్యం ద్వారా పోగొట్టుకోవచ్చు. పాతకమంటే అనుభవించాల్సిందే. వేరే దారి లేదు.

కోపమే పాపమా...

తప్పులూ, మోసాలూ, నీచాల వల్ల అసహనం కలుగుతుంది. దాని నుంచి కోపం. ఆ కోపం నుంచి ఆవేశం. ఆ ఆవేశం నుంచి క్రోధం. అప్పుడే సరిదిద్దుకోలేని తప్పులు చేసి బ్రతుకును నరకం చేసుకుంటాడు. తనకి తెలియకుండానే తను చేసిన పాపాలకి తానే శిక్ష విధించుకుంటాడు. సాటివానికి చేసిన ద్రోహమే క్రోధంగా మారి ఆ మనిషిని దహిస్తుంది. కాన ధర్మమే సుఖాలకి మూలం. అధర్మమే దుఃఖానికి కారణము.

మట్టి తినటం వల్ల దోషమూ, రోగమూ ఎందుకు కలుగుతాయి...

ప్రళయకాలంలో శ్రీ మహా విష్ణువు గుబులు నుంచి జన్మించిన మధుకైటుభులను శ్రీ మహా విష్ణువు తన తొడల మీద ఉంచి ఖండించాడు. వారి శరీరాల నుంచి వచ్చిన నెత్తురూ, చీమే ఈ నేల. అందుకే దాన్ని తినటం ద్వారా దోషాలూ, రోగాలు కలుగుతాయి.

పరమ ధర్మం ఎంతటి పుణ్యం...

సాటి మనిషికీ, మనుష్యులకీ సహాయం చెయ్యటం అత్యుత్తమమైన పుణ్యకార్యం. లోకహితం కోసం శివుడు హాలాహలాన్ని మింగటానికి వెళ్తున్నప్పుడు, పార్వతీదేవితో ఇంతటి పరోపకార ధర్మాన్ని, తద్వార వచ్చే పుణ్యాన్ని చెప్పాడు. సాటి వారికి చేసే మేలు మహోన్నతమైన విజయుణ్ని చేస్తుంది. దానాలూ, ధర్మాలూ, యాగాలూ, వ్రతాలూ వంటివాటన్నింటికన్నా ఎక్కువ పుణ్యఫలం ఇస్తుంది.

గర్భంలో శిశువుని చంపితే కలిగే పాపం...

బ్రహ్మహత్యా పాతకము కన్నా ఘోర పాపం. ప్రేమా, ఆకర్షణ వల్లా, ఆర్థిక సామాజిక కారణాల వల్ల చేసినా పాపం పాపమే. ఆ పాపానికి జీవితాంతమూ సుఖాన్నీ, దుఃఖాన్నీ సమపాళ్ళలో అనుభవిస్తూ, అనుక్షణం ఏదో ఒక సమస్యతో నతమతమవుతూ గడపాల్సిందే. దానికి ప్రాయశ్చిత్తం ఒక్కటే... ఎంతో ధర్మబద్ధంగా జీవితాన్ని మలుచుకొని, చిన్న తప్పుకూడా చేయకుండా జాగ్రత్త వహించాలి. అప్పుడే ఎంతోకొంత ఉపశమనం.

ధన సంపాదన దుఃఖంతో కూడినది. అంతకు మించిన దుఃఖము ఆ ధనాన్ని రక్షించట మని పంచమ వేదమైన మహా భారతంలో అరణ్య పర్వం శెల విస్తోంది.

పరస్త్రీ సంగమం ఎంత వరకు పాపం...

బార్హస్పతుడు రాసిన ధర్మశాస్త్రం ప్రకారం ఇష్టపడి వచ్చిన స్త్రీని వద్దనటం, కాదనటం పాపం. కానీ వచ్చే స్త్రీ భర్త మీద విరక్తి, విసుగులతోనూ దగ్గరికి వస్తే అలాంటి స్త్రీని పొందితే పొందిన వానికి పాపమంటదు. సమస్త పాపం ఆ స్త్రీదే. ఆ స్త్రీని ఆ పరిస్థితికి తెచ్చిన పురుషునిది కూడా. మధ్యలో పొందిన పురుషునికి ఏ పాపమూ ఉండదని ధర్మశాస్త్రము శెలవిస్తోంది.

దేవీ స్వరూపాన్ని పూజిస్తే కలిగే పుణ్యం...

సకల చరాచరసృష్టికి తల్లి ఆదిపరాశక్తి. సహస్రవదన మహాదేవి. విశ్వేశ్వరి ఎర్రని వస్త్రాలతో, ఎర్రని పూలమాలలతో, ఎర్ర చందనం రాసుకొని, కనులను ఎర్రగా ఉంచుకొని, ఎర్రని పెదవులలో కోటి మెరుపులను మెరిపించే ఆ తల్లి, పాశాంకుశాలు ధరించిన ఆ దివ్యసుందర మూర్తిని అలాగే పైన చెప్పిన వర్ణన గల ఆ రూపంలో కొలిస్తే

కోరిన కోర్కెలను తీరుస్తుందని దేవీభాగతం శెలవిస్తోంది. సంతానం లేనివానికి పుత్రసంతానం కూడా కలుగుతుంది.

అన్యాయంగా సంపాదించిన ధనం పుణ్యం ఇవ్వదు...

ఎంతటి ధర్మాత్ములైనా వారి వారి వృత్తి ధర్మాన్ని అనుసరించి సంపాదించినా, అది న్యాయధర్మ సంపాదన కానప్పుడు ఆ ధనంతో మహాయజ్ఞాలూ, పూజలూ, వ్రతాలూ, దానాలూ, ధర్మాలూ ఎన్ని చేసినా ఆ ధనం తాలూకు అనగా పాపపు సంపాదన ద్వారా ఎలాంటి పుణ్యం లభించదు.

దాని తాలూకు పాప ఫలాన్ని అనుభవించాల్సిందే. మహా రాజసూయయాగం చేసి పాండవులు సకల యజ్ఞ, ధర్మ, పూజకార్యాలు చేశారు.

అయినా వాళ్ళు అడవులకి వెళ్ళాల్సివచ్చింది. దానికి కారణం రాజసూయయాగ ధనమంతా రాజులందరినీ కొట్టి, చంపి, భయపెట్టి తెచ్చిన సంపద కావటం వల్లే.

శృంగారం పగలు చేస్తే దోషమెందుకవుతుంది...

పశువులకు పగలూ, దెయ్యాలకి అర్ధరాత్రి, మనుష్యులకు రాత్రి. ఇవి సంభోగ సమయాలు. దంపతులు రాత్రి సమయము అనగా అర్ధరాత్రికి ముందు కలిస్తే అప్పుడు పుట్టే సంతానం కీర్తి గడించేవారు పుడతారు. పరాశరుడంతటి వానికి యోజనగంధి ఈ ధర్మాన్ని చెప్పి, చీకటిపడే వరకు ఆగి పరాశరుని ద్వారా మహానుభావుడైన వ్యాసుణ్ని కన్నది. పగటి పూట కలిసే సంగమం ద్వారా మందబుద్ధులూ, లేదా రాక్షస కార్యాలు చేసేవారు జన్మిస్తారు.

అసత్యము చెప్పినా దోషం కానివి...

స్త్రీ తన మానం విషయంలోనూ, పక్క స్త్రీ శీలం విషయంలోనూ, హితం కోసం చెప్పే అబద్ధమూ, హింసకు కారణమయ్యే అసత్యాలూ అలాంటివి చెప్పినా అనత్యదోషమంటదు. పదిమందికి మేలు చేసే కార్యం కోసము చెప్పిన

అబద్ధమూ, భార్యభర్తలను కలిపే అబద్ధములకు దోషములూ, పాపములూ అంటవు సరికదా పుణ్యమే లభిస్తుంది.

అన్యాయంగా ధనం సంపాదించిన కొద్దీ గర్వము పెరుగుతుంది. ఆపై పిసినారి తనము. ఈ రెంటికి మించిన ప్రమాదకరమైన అహంకారము వెరిసి ఆపై భీతి, భయాందోళన. అదే అక్రమ సంపద ద్వారా కలిగే పాపము.

భర్త తిరుగుబోతని భార్యకి చెప్పటం ఎంతటి పాపం...

తల్లినీ, బిడ్డనూ విడదీసిన పాపం అంటు కుంటుంది. భార్య కన్నా ముందు స్త్రీ. స్త్రీకి పురుషుని గూర్చి తెలియనిది ఏమీలేదు. అయినా నమ్మకంతో ఏమీ తెలియనట్టు సంసారాన్ని నడిపిస్తుంటుంది.

అలాంటి స్త్రీమూర్తికి, తల్లి వంటి పరపురుషుని భార్యకి, భర్త తిరుగుళ్ళు గూర్చీ, వ్యసనాల గూర్చీ చెప్పటం మహా దోష పాప పాతకము.

ఆ పాపం ద్వారా ఆ భార్య అనుభవించిన యాతనకూ, దుఃఖాలకీ పదిరెట్లు ఎక్కువగా అనుభవించాల్సిన దుస్థితి అలాంటి నీచ వార్తాహరునికి కలుగుతుంది.

ఎలాంటి దానాల ద్వారా పాపం కలుగుతుంది...

పాడైపోయిన పళ్ళనూ, ఆహారాన్నీ తెలిసి తెలిసి ఇవ్వటం ద్వారా, తన కుటుంబానికి పనికిరాని వస్తువులను ఇవ్వటం ద్వారా, దేవుని ప్రసాదాలను నిల్వ ఉంచి ఆపై ఇచ్చిన వాటి ద్వారా మహాదోష పాపం వస్తుంది.

దాని ద్వారా తన సంతానం విషయంలోగానీ, భర్త విషయంలో గానీ, తన విషయంలోగానీ తమ అనుకున్న సంపద, పనికిరాకుండా పోయే పరిస్థితి వస్తుంది. వ్రతాలూ, నోములూ, పూజలప్పుడూ, తాంబూలం ఇచ్చేటప్పుడూ ఒకటికి రెండు సార్లు ఆకులనీ, పండ్లనూ చూసి అర్పించాలి.

ఆ సమయాల్లో దోషం జరిగితే భగవంతుని కోపానికి గురికావాల్సి ఉంటుంది.

మహాపుణ్యం దేవి ఆలయస్థాపన...

వ్యాసభగవానుడు శ్రీదేవీమహత్మ్యము చెబుతూ, దేవి ఆలయాన్ని కట్టించడమూ, శ్రీదేవీయజ్ఞం చెయ్యటమూ, శ్రీదేవిని స్మరించటము మహా పుణ్యప్రదమని, సకల విజయాలకి అవే మూలమని శెలవిచ్చారు.

దేవి మహత్మ్యాన్ని విన్నా, వినిపించినా పుత్ర పౌత్రాదులతో సుఖిస్తారు. దేవి ఆలయాన్ని బాగు చేయించినా, నూతన శోభ కలగచేసినా ఆ దంపతులకు షష్ఠి పూర్తి యోగం కలుగుతుంది. మహా కీర్తి వస్తుంది.

ఆ స్త్రీ మంచిదికాదని చెప్పటం ఎంతటి పాపం...

వ్యాపార లబ్ధికోసమూ, తన కోపక్రోధాలను తీర్చుకోవటము కోసమూ, ఓ స్త్రీ మానాన్ని కళంకం

చేసేలా ప్రచారం చేస్తే ఆ పాపం ఊరికేపోదు. ఉసురు తగులుతుంది. ఆ స్త్రీ ఆక్రోశం శాపమై అతన్ని పట్టి పట్టి పీడిస్తుంది. యవ్వనకాలంలో చేసిన ఆ పాపం వృద్ధాప్యంలో అది కూడా మంచంలో మగ్గి మగ్గి పురుగులు పట్టి పోవాల్సి వస్తుంది.

జంతు బలి ఎప్పుడు పాపం కాదు...

ఉత్సవాలప్పుడూ, ఆయా ప్రదేశాల ఆచారాల ప్రకారము జంతుబలి అనగా గొర్రె, కోళ్ళు వంటివి బలివ్వటం ధర్మశాస్త్రాలు పాపం క్రింద పరిగణించవని, దేవతల కోసం ఇచ్చే ఆ బలుల వల్ల వాటికి పుణ్యమని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. మాంసాహారం తినేవారు అలాంటి సమయాల్లో తినటం వల్ల మాంసాహారాన్ని భుజించిన దోషము కూడా కలగదు.

కుమారీ పూజల వల్ల ఏ ఫలం, పుణ్యం...

రెండు సంవత్సరాల నుంచి పదిసంవత్సరాల లోపు వయస్సున్న కుమారిలను అనగా రెండు

సంవత్సరాల పిల్ల కుమారి, మూడు సంవత్సరాల పిల్ల త్రిమూర్తి, నాలుగు సంవత్సరాల పిల్ల కళ్యాణి, అయిదు సంవత్సరాల పిల్ల రోహిణి, ఆరు సంవత్సరాల పిల్ల కాళిక, ఏడు సంవత్సరాల పిల్ల చండిక, ఎనిమిది సంవత్సరాల పిల్ల శాంభవి, తొమ్మిది సంవత్సరాల పిల్ల దుర్గ, పదేళ్ళ కన్య సుభద్రగా ఆయా పూజ కోసం బోధించి ఆ కన్యకలకు నూతన వస్త్రాలనూ, పూలనూ, అలంకరణ సామాగ్రినీ ఇచ్చి సంతృప్తి పరిస్తే సకల సుఖాలూ లభ్యమవుతాయి. తెలిసీ తెలియక ఆడవాళ్ళ ఉసురుని పోసుకున్నవారి పాపం పోతుంది.

- H కుమారీ పూజ దరిద్ర్యాన్ని, దుఃఖాన్ని హరించి వేస్తుంది.
- H త్రిమూర్తి పూజ వల్ల మూడు అపూర్వ ఫలాలను పొందుతారు. పుత్రసంతానం కలుగుతుంది.
- H కళ్యాణి పూజ మహా విద్య కలిగిస్తుంది.
- H అనేక వ్యాధులతో పీడించబడేవారు రోహిణి పూజ చేయటం ద్వారా వ్యాధులనుంచి శాంతి కలుగుతుంది.

- H కాళిక పూజ సకల శత్రు వినాశకము.
- H చండికా పూజ మహా ఐశ్వర్యము.
- H శాంభవి పూజ కోరినవార్ని దగ్గరికి చేరుస్తుంది.
- H దుర్గా పూజ ద్వారా ఆజన్మ శత్రువులపై విజయం.
- H సుభద్రా పూజ వల్ల సంవత్సరాలుగా తీరని కోరికలు సిద్ధిస్తాయి.

నమ్మించి, వంచించి స్త్రీ మోసం చేస్తే కలిగే పాపం...

అదే స్త్రీకి ఏదో ఒకసారి అలాంటి స్థితే వస్తుంది. తను పురుషుణ్ని చేసినట్టుగా తనని మరో పురుషుడు నిండా ముంచుతాడు.

లేదా వ్యామోహంలో పడేసి, అందకుండా అతలాకుతలం చేస్తాడు. మానసికంగా, ఆర్థికంగా అందకుండా అందేలా ఉండి సర్వమూ దోచుకుంటాడు. అలా ఆ స్త్రీకి వృద్ధాప్యం వచ్చిన దానిలా కళపోతుంది.

మూత్రాగార వ్యామోహంతో వెంపర్లాడేలా చేసిన పాపం శాంతిస్తుంది.

అప్పటికే ఆ స్త్రీ కోల్పోవాల్సినదంతా కోల్పోతుంది.

దేవీ నవరాత్రి వ్రతం చెయ్యటం ఎంతటి ఫలం...

సకల మోక్షసుఖాలనిచ్చే అపూర్వ వ్రతం. సీత జాడ తెలియక శ్రీరామచంద్రుడు ప్రస్రవణాద్రిపై నవరాత్రి వ్రతాన్ని ఆచరించి సీతజాడ తెలిసి ప్రీతి చెందాడు. ఈ వ్రతమంత ఫలితమిచ్చే వ్రతం ముల్లోకాల్లోనూ లేదని వ్యాసుడి ఉవాచ.

పతివ్రతను కోరితే, ఆశిస్తే కలిగే పాపం...

నహుషుడు మహా ధర్మాత్ముడు. సకల శాస్త్రాలను చదివినవాడు. అందుకే ఇంద్ర పదవి వచ్చింది. కానీ పతివ్రతా శిరోమణి శచీదేవిని కోరి, సర్వమూ కోల్పోయి భ్రష్టుడయ్యాడు. దేవగురువు బృహస్పతినే మధ్యవర్తిత్వము నడిపి శచీదేవిని పొందాలనుకున్నాడు. ఆ పాపంతోనే భ్రష్టుడయ్యాడు. కాన పతివ్రతను, భర్తచాటు భార్యను కేవలం కోరినంతనే, ఆశించినంతనే ఆ

పాపం మహాశక్తిగా మారి వాణ్ని సర్వ విధాలా విఫలుడ్ని చేస్తుంది. మామూలు స్త్రీని ఆశించిన పాపానికి వెయ్యిరెట్లు పాపం పతివ్రతను కోరుకోవటము వల్ల కలుగుతుంది.

చాతుర్మాస్య వ్రతాన్ని చేస్తే గడ్డిని నిప్పు దహించివేసినట్టు ఈ జన్మలో చేసిన పాపాలన్నీ బూడిద అవుతాయి.

ఆత్మహత్య ఎంతటి పాపం...

కష్టాలకి భయపడో, ధనాన్ని పొందలేకో, తీర్చలేకో, కోరినది లభించక విరక్తితో అంతటి దుస్సాహసం చెయ్యటం ఘోరాతి పాపం. భూమిపైనున్న అందరూ అనుభవించిన మహాతి మహాభయంకరమైన శిక్ష మలమూత్రాల మధ్య, క్రిమికీటకాల మధ్య, మహా దుర్గంధము మధ్య తల్లి కడుపులో ఉండి యోని మధ్య నలుగుతూ రావాలి. అంతకు మించిన నరకం ఇంకోటిలేదు. దానికన్నా పెద్ద బాధలుండవు. భగవంతుడిచ్చిన ఆత్మ పీక నొక్కటము భగవతాద్రోహం. దానికి అనేక జన్మలు

ఇహలోకంలో పడాల్సివుంటుంది. ఎన్నో వేల జన్మలు నీచంగా నికృష్టంగా బ్రతికితే తప్ప ఆ పాపం పోదు.

మన చుట్టూ బ్రతికే అంత ఘోరమైన పరిస్థితి గల వాళ్ళు అలాంటి పాపం చెయ్యబట్టే ఈ జన్మలో అలా అనుభవిస్తున్నారు.

ఆత్మహత్యంటే ఆ పరిస్థితి తెచ్చిన వారికి సుఖాలనిచ్చి గెలిపించి ఓడిపోవటమే. ఓడిపోయే వారిని దేవుడు కూడా క్షమించడు.

సద్గుణ సంపన్నుడైన వాణ్ణి తిరస్కరిస్తే స్త్రీకి కలిగే దోషము...

తన అందంపై అహంతోనూ, ధన బలం వల్లా, అందగాడూ, మంచివాడూ అని తెలిసినా తల్లీ, తండ్రీ చెప్పినా అర్థంలేని ఆలోచనలతో తిరస్కరిస్తే ఆ స్త్రీకి దోషం కలుగుతుంది.

తద్వారా కలిగే దోషం భవిష్యత్తులో ఏకాంతంగా ఒక్కతే ఒంటరిగా బ్రతకాల్సివస్తుంది.

చారుదేష్ణిని చేసుకున్న మండోదరిలా విలపించాల్సి వుంటుంది.

ఈర్ష్యాసూయలతో పక్కవారి కడుపు కొడితే కలిగే పాపం...

అవి ఎంతటి నీచానికైనా ఉసికొల్పుతాయి. చేసిన తర్వాత జీవితాంతము దాని తాలూకు పాప ఫలాన్ని అనుభవించాల్సిందే.

అదితికి దేవేంద్రుడు జన్మించాడు. వానితో సాటైన పుత్రుణ్ణి దితి ఎక్కడ కంటుందోనని కసితోనూ, ద్వేషంతోనూ అదితి తన బిడ్డ ఇంద్రుడి చేత దితి గర్భాన్ని ముక్కల్ని చేయించింది. దానికి ప్రతిగా అదితి కారాగార శిక్షతోనూ, పుత్రశోకం తోనూ కృశించిపోయింది. కాన పక్కవారిపై కడుపుమంట, దావాగ్ని కన్నా వేగంగా వారినే దహించి వేస్తుంది.

తల్లీ, తండ్రికీ తెలియకుండా పిల్లని లేపుకొచ్చి పెళ్ళి చేసుకుంటే కలిగే పాపం...

ప్రేమ పేరుతో ఇరువురూ ఇష్టపడి వివాహం చేసుకున్నా, ఆడపిల్ల తల్లీ, తండ్రీ దుఃఖం మాత్రం పురుషుడు భరించక తప్పదు. అలాంటి పరిస్థితి

తనకో, తన సోదరుల బిడ్డలకో వచ్చి, అనాడు తాను చేసిన దానికి ఆ పిల్ల తల్లీ, తండ్రీ, సోదరులు ఎంత వేదనకు గురయ్యారో ప్రత్యక్షంగా అనుభవించి తెలుసుకొని భరించాల్సి ఉంటుంది. శిశుపాలునికి ఇవ్వాలనుకున్న కన్యని రుక్మిణిని తీసుకొచ్చిన దోషము శ్రీకృష్ణుడంతటివాడూ పడాల్సి వచ్చింది. అర్జునుడు సుభద్రను తీసుకెళితే తన కిష్టమైన బలరాముని రూపేణా సకల బంధుమిత్రులు పడిన ఆవేదనా, అవమానాన్ని వారి ద్వారా శ్రీకృష్ణుడంతటి వాడు కూడా అనుభవించాడు.

అలాగే మహాశివుడు దాక్షాయణిని తీసుకొచ్చి నందుకు ఆ దోష పరిహారంగా సకల హిత బంధు, దేవతల ఎదుట దక్షుడి చేత పరాభవం చెందాడు. అలా పిల్లను తీసుకొచ్చిన వారు ఆ దోషానికి ఎప్పుడో ఓసారి అవమానం పొందాల్సిందే.

బిడ్డ వివాహానికై చెయ్యాల్సిన పుణ్యం...

వివాహం ఆలస్యమవుతున్నా, సరైనా సంబంధాలు దొరక్కపోతున్నా, దగ్గరదాకా వచ్చి వెనక్కి పోతున్నా, అలాంటివారు శ్రీరామనవమి

పందిట్లో, లేదా అమ్మవారి కళ్యాణాల్లోగాని, మీ ఊరి దేవాలయంలోని అమ్మవారి అయ్యవారి కళ్యాణానికి గానీ తాళిబొట్లు సమర్పిస్తే వివాహ దోషం పోతుంది. చక్కని సంబంధాలు వెదుక్కుంటూ వస్తాయి. ఇరు కుటుంబాలు హాయిగా సుఖంగా ఉంటాయి.

నిండు సభలో ద్రౌపది వస్త్రాలను ఊడదీయటానికి దుశ్శాసనుడు ప్రయత్నిస్తున్న సమయంలో శ్రీకృష్ణుడు సాల్వుడితో మహా యుద్ధంలో నిమగ్నమై ఉన్నాడు.

ప్రతి కష్టం వెనుక తెలిసీ తెలియక చేసిన దోషముంటుంది...

కష్టాలొచ్చాయని కృంగిపోవటమూ, సుఖాలొచ్చాయని పొంగిపోవటమూ రెండు అనర్థాలే. కష్టసుఖాలు మనం చేసిన కర్మని బట్టే

వస్తాయి. ఆ కర్మ అధర్మమైతే మహాకష్టాలు మనకే కాదు, మనల్ని పాలించి లాలించే దేవతలకీ వస్తాయి. సూర్యచంద్రులకీ శత్రువులున్నారు. గ్రహణాల పేరుతో వేదనకి గురవుతున్నారు. చంద్రుడికి క్షయరోగము. మహాశివుడంతటివాడు భార్య వియోగంతో కాళిందిలో దిగితే ఆ వేడికి శివుని రహస్యాంగం నల్ల బడింది.

అలానే తిరుగుతూంటే భృగుమహర్షి శాపానికి గురయ్యాడు. దేవేంద్రుడు వృషభ అవతారాన్ని ఎత్తి చేసిన పాపానికి శిక్ష అనుభవించాడు. శ్రీరాముడంతటివాడు సీతాదేవి కనపడలేదని మరణిద్దామనుకున్నాడు. కాన కష్టాల్లో పెద్ద కష్టాన్ని ఊహించుకొని అది రానందుకు అనందపడుతూ, కష్ట తీరాన్ని ధర్మమనే పడవపై దాటి సుఖాలను పొందాలి.

భార్యా బిడ్డల్ని నిర్లక్ష్యం చేసి తన సుఖాన్ని చూసుకున్న వారికి కలిగే పాపం...

వయసు మదంతో, తన కోర్కెలకీ, వ్యసనాలకీ భార్యా బిడ్డల జీవితాన్ని బలి చేసినవాడు

అర్ధాంతరంగా కృంగిపోవటమో, వయసయాక, ఏకాకిగా దిక్కూ మొక్కూ లేని జీవితాన్ని దుర్భరంగా గడపటమో చేయాల్సి వుంటుంది. పురుగులు పట్టి మరీపోతాడు.

భార్య ధర్మం భార్య చెయ్యాలి. భర్త ధర్మం భర్త చెయ్యాలి. సంతానం యొక్క ధర్మం సంతానం చెయ్యాలి. లేకపోతే గృహస్థ ధర్మము శపిస్తుంది. తద్వారా క్లేశములు.

ఏ యజ్ఞ యాగాదుల ద్వారా పాపం కలుగుతుంది...

స్త్రీలను మోసం చేసి సంపాదించిన ధనం ద్వారా యజ్ఞాలు, దానాలూ చేయటం వలన పుణ్యానికి బదులు పాపం సంక్రమిస్తుంది.

యజ్ఞం చేసేవారూ, చేయించేవారూ భక్తితో, ఏక చిత్తంతో చేయకపోతే కూడా దోషం కలుగు తుంది.

యజ్ఞం చేయించేవాని ధనము న్యాయ ఫలమూ, మంత్రశుద్ధి చేసేవాని శాస్త్రము ఆగమ శాస్త్ర ప్రకారము లేకపోతే పరిపూర్ణ యజ్ఞ ఫలం లభించదు.

ఎలాంటి వాడు తీర్థ సిద్ధి ఫలాన్ని పొందలేడు...

మనస్సుశుద్ధీ, ద్రవ్యశుద్ధీ, ఆచార శుద్ధీ లేకుండా ఎంత పవిత్ర క్షేత్రంలో మునిగినా అది ఓ సాధారణ కాలువలో మునిగినట్టే. గంగలో కోటానుకోట్ల మంది స్నానాదులు చేస్తారు.

అందరికీ పుణ్యం రాదు. ఐహిక విషయాలపై వ్యావోహాలతో గంగ పుట్టిన ప్రదేశంలో స్నానాదులు చేసినా ఫలం ఇసుమంత కూడా రాదు. ఇంతటి పుణ్యసూత్రాన్ని చ్యవనుడు ప్రహ్లాదునికి వివరించాడు.

అయినవారితో మహా గొడవలు తీసుకొచ్చే పాపాలు...

అహంకారం, నేను అన్న అహం. ఆ అహం నుంచి గర్వం పుడుతుంది. ఆ గర్వంతో అంత వరకూ తన ఎదుగుదల కోసం శ్రమించినవార్ని అణగదొక్కాలన్న ఆలోచన వస్తుంది. అదే పాపం. తన అహంకారం వల్ల కలహం వస్తుంది. తద్వారా వియ్యాలన్నీ కయ్యాలుగా మారుతాయి. దానితో

తన చుట్టూ వారి నుంచి పొందిన సుఖాలన్నీ పోయి దుఃఖాలొస్తాయి.

మనం మాత్రమే ఎదిగి అనగా సుఖాలను అనుభవిస్తుంటే చుట్టూ వారంతా దరిద్రంలో ఉంటే ఖచ్చితంగా పాపం చేస్తున్నట్టే.

అహంకారమే మహాపాతకమవుతుందా...

సుఖ, ధన, భోగ, బల, మదాలతో, అహం కారములతో మంచివారిని, తమ పని తాము చేసుకునే వారిని అపహాస్యములపాలు చేస్తే ఆ ధర్మపరుల ధర్మము కాలసర్పమై కాటువేస్తుంది.

అట్టి పాపానికి స్నానమూ, జపమూ, భోగమూ, విలాసములూ వంటివి దూరమై బ్రతుకు బండిని దీనంగా నడిపించుకునే పరిస్థితి వస్తుంది.

పరీక్షిత్తు మహారాజంతటివాడు తపసి మెడలో మృత సర్పాన్ని వేసి అవమానించి నందుకు పైవాటి అన్నింటికీ దూరమయ్యాడు.

సత్యగుణ సంపనుడైన శ్రీమహావిష్ణువు తామసగుణంతో భృగుమహర్షి పత్నిని సంహరించి నందుకు అనేక జన్మలను ఎత్తవల్సివచ్చింది.

అల్ప ప్రయోజనము కోసం అల్పుడ్ని అణగదొక్కాలనుకుంటే కలిగే పాపం...

అన్ని వేళలా అందరి విషయాల్లోనూ సాధ్యంకాదు. ఒక్కోసారి ఆ అల్పుడే ఎదురు తిరిగితే మహా నాశనమే సంభవిస్తుంది. మహా దుఃఖాలని కొని తెస్తుంది.

తనెంతో కష్టపడి సాధించుకున్న సామ్రాజ్యం సహితం ఆ అల్పుడి వల్లే కూలిపోతుంది. ఓ స్త్రీయే కదాని శంభుడూ, నిశంభుడూ అంబికాదేవి మీదకెళ్ళి సర్వనాశనమయ్యారు.

సంతానం కావాలనుకున్నవారు ఏ పుణ్య పఠనం చేయాలి...

కాళికాదేవి సన్నిహితురాలు, మహా సౌందర్యరాశి మాలతీలత వంటి సుకుమారి అయిన అంబికాదేవిని ఆరాధిస్తే సంతానం కలుగుతుంది. శ్రీదేవీ మహత్మ్యంలో అంబికాదేవి ఉత్తమోత్తమైన ఆ ఘట్టాన్ని చదివినా, విన్నా, సంతానం లేనివారికి ఆ దోషాలు పోగొట్టి

సంతానాన్ని ప్రసాదిస్తుందని వ్యాసులవారు పరమిచ్చారు.

శ్రీ కృష్ణుణ్ణి తలుచుకొని ఎంత చిన్న దానము చేసినా మేరు పర్వతమంత దానం ఇచ్చిన ఫలం కలుగుతుంది.

ఏ తిథిలో అమ్మవారికి పూజ చేస్తే మహాఫలం...

ప్రతినెలలోనూ అష్టమీ, చతుర్దశి తిథులలో దేవీ పూజ మహోన్నతమైన ఫలమిస్తుంది. అమ్మవారికి బిల్వపత్రాలూ, ఎర్రని పూలూ ప్రీతి. ఇష్ట కామ్యార్థాలు నెరవేరుతాయని సుమేధు మహర్షి శెలవిచ్చాడు.

ధర్మంగా గెలవలేక అధర్మంగా ఆడదాన్ని అడ్డం పెట్టి నిరాశక్తుడ్ని చేస్తే కలిగే పాపం...

వ్యాపార, వ్యవహారాది విషయాల్లో గెలవలేక సాధించలేక వారి స్త్రీల గూర్చి విషప్రచారం చేసి

గెలవాలనుకున్నవానికి పాతకాలు చుట్టుకుంటాయి. తాత్కాలికంగా వారిని బాధపెట్టినా ఆ పాపం నిదానంగా శాపమై సంసారసుఖాన్ని విషప్రచారం చేసినవాడికి పూర్తిగా దూరం చేస్తుంది.

భార్య సేవలు చేసే స్థితిలో లేకపోవటమో, స్నానాదికాలవంటి వాటికి కూడా సరైన సమయంలో నోచుకోకపోవటమో, నిద్రపట్టని వ్యాధి రావటమో, రుచికరమైన భోజనం ఉన్నా తినలేని స్థితిలో, లేదా తినాలని ఉన్నా ఆ సమయానికి జేబులో ఒక్క పైసా కూడా లేకపోవటమో జరుగుతుంది.

క్షమా గుణం ఎంతటి పుణ్యం...

తప్పులూ, పొరపాట్లూ, అవమానాలూ, ద్రోహాలూ ఇలా ఎన్నో చెయ్యటం మానవుల నైజం. వాటికి ప్రతిగా ప్రతీకారం, పగా, కసిలతో తిరిగి చెయ్యటం వలన వారికీ, మీకూ తేడా ఉండదు. కౌరవులు చేసిన అవమానానికి ద్రౌపది అరణ్య వాసంలో అర్జునుడితో చెబుతుంది.

ఆవేశమూ, అవమానాన్ని రవ్వంత కూడా భరించలేని క్షత్రియ జన్మ నాకు మళ్ళీ వద్దు. మళ్ళీ

జన్మ ఉంటే ఎంతో క్షమాగుణం గల విప్ర వంశంలో జన్మిస్తాను అంటుంది. విప్ర వంశమంటే ధర్మ గృహస్థ జీవితం. పూజలతో, వ్రతాలతో, అతిథులతో ఆనందంగా గడిపే జీవితం.

అలాంటి జీవితం అంటే మనలాంటి జీవితం ద్రౌపది కోరుకుంది.

కాన తప్పు చేస్తే క్షమించటం మానవత్వం, పుణ్యం. సకల పురుషార్థం.

క్షమ వల్లనే అవతలివారి పాపం పండుతుంది. నేల రాలుతుంది.

మాఘమాసంలో త్రివేణి యందు స్నానమాచరిస్తే బదరీ నాథ్ స్వామిని సంకీర్తన చేసిన ఫలం కలుగుతుంది.

స్నేహితుడి భార్యని కోరుకుంటే కలిగే మహాపాపం...

ఎంతటి ధర్మపరుడైనా, మహాపుణ్యం ఉన్నవాడైనా ఆ కార్యం కోసం ప్రయత్నిస్తేనే

మహాపాపం చుట్టుకుంటుంది. నిద్రపోయే సమయంలో మేల్కొనేలా, మేల్కొనే సమయంలో నిద్రపోయేలా పీడిస్తుంది. త్రాగకుండానే మత్తూ, దిగులూ వచ్చే సమస్యలు ఏర్పడతాయి.

ఎంతటివానికైనా మరెంత పుణ్యకార్యాలు చేసిన వానికైనా పతనం తప్పదు. అలా ఇంద్రుని భార్య శచీదేవిని కోరుకున్నందుకే నహుషుడు శాశ్వత నరకానికి వెళ్ళాడు.

గౌతముని భార్యని అనుభవించినందుకు దేవేంద్రునకు మహా కష్టం వచ్చింది. బృహస్పతి భార్యని పొందినందుకు చంద్రునికి క్షయవ్యాధి కలిగి బాధించబడుతున్నాడు.

ఏ రెండూ అధర్మాన్ని చేయించి పాపాత్ముడిని చేస్తాయి...

ఈ కలియుగంలో ధనం కోసమూ, స్త్రీ కోసమూ ఏం చెయ్యటానికైనా సిద్ధపడే వారే జన్మిస్తారని, నరకలోకంలో శిక్షలు పూర్తి అయిన వారంతా తిరిగి ఈ యుగంలోనే జన్మిస్తారని మంత్రబద్ధమైన గ్రంథాల్లో ఉంది. వాటి వల్లే అక్కడ ఆ నరక లోకంలో పడిన బాధలే భువిపై పరస్త్రీని

పర ధనాన్ని ఆశిస్తే తిరిగి భూమిపైనా అలాంటి వ్యధలే పడతారు. కాన ఆ రెంటి విషయంలో ధర్మంగా ఉండటమే సుఖాలకీ, పుణ్యాలకీ మూలము.

పుస్తకాన్ని దొంగిలిస్తే కలిగే పాపం...

సరస్వతీదేవికి అపచారం చేసిన దోషము కలుగుతుంది. సరస్వతి ఆలయమే గ్రంథమైనా పుస్తకమైనా. దాన్ని తస్కరిస్తే ఆ తల్లి దీవెనలు కలగవు.

మంద బుద్ధితో జ్ఞానం లేకుండా, కడుపు కోసం రెక్కలని మాత్రమే ఉపయోగించే పరిస్థితి వచ్చి జీవితాంతము శ్రమ చేస్తే గాని బ్రతుకు గడవని స్థితి, ముద్ద దిగని పరిస్థితి వస్తుంది.

ధర్మ, విద్య, పూజాది పుస్తకాలని దానంగా ఇస్తే కలిగే పుణ్యం...

వాటిని తీసుకున్నవారు వాటిల్లోని ధర్మ, పూజాది కార్యాల విషయాలను చదివి, వాటిని నిర్వర్తించే అన్ని పుణ్య కార్యాల్లో వితరణ

ఇచ్చినవారికి ఒక్క శాతం పుణ్యం వస్తుంది. ఓ మహా ధర్మజ్ఞాన విద్యాపుస్తకాన్ని శుభకార్యాలప్పుడు ఇస్తే ఎంతటి పుణ్యం వస్తుందో, ఆ జ్ఞాన సంబంధిత గ్రంథ విషయాన్ని చెప్పినా ఆ ఒక్క శాతం పుణ్యం వస్తుంది.

అయితే వితరణ ఇచ్చే పుస్తకం వందశాతం అచ్చు శబ్ద దోషములు లేనిదై ఉండాలి. ఆశ్రమ, దేవాలయ సంబంధిత గ్రంథాలలోనయితేనే ఆ దోషాలుండవు. వ్యాపారం కోసం చేసే పుస్తకాలని ఇచ్చి దోషాలు తెచ్చుకోకండి.

మునిమనవడూ, మనవరాలి వివాహం చూడాలంటే చెయ్యాల్సిన పుణ్యం...

గృహస్థు ధర్మాన్ని ఖచ్చితంగా నియమాను సారంగా పాటించాలి. భార్యని నొప్పించకుండా, పిల్లలని ధర్మ శిక్షణలో పెంచి వివాహాలు చేయటము, మనవళ్ళ గూర్చి, మనవరాళ్ళ గూర్చి, అల్లుడూ, కోడలూ ఇలా అందరిని ఆదరించి పెద్దరికంగా నేనున్నానని ధైర్యం చెబుతూ ధర్మ మార్గాన

ప్రయాణిస్తూ, సంపాదించిన ధనంలో పది శాతం దేవాలయాలకి, మరో పది శాతము దానాలూ, ధర్మాలకూ కేటాయిస్తూ, గృహంలో వేదపఠనాలూ, పురాణశ్రవణములూ, పూజాదికాలు నిర్వహిస్తూ జీవితాన్ని సాగించేవారు ఖచ్చితంగా ముని మనవరాళ్ళ వివాహం చూసే మహా అదృష్టాన్ని పొందుతారు.

ఎలాంటి ప్రదేశాల్లో జపిస్తే మహా పుణ్యశక్తి వస్తుంది...

తీర్థాల్లో స్నానాదికాలనూ, పూజాదికాలనూ పరిశుభ్రమైన ప్రదేశంలో చేస్తేనే పుణ్యం వస్తుంది. అపరిశుభ్ర ప్రదేశంలో చేస్తే సూర్యచంద్ర కిరణాలు అపరిశుభ్ర వాతావరణంలో మృత కిరణాలై దోషాలని తెచ్చిపెడతాయి.

చక్కని ప్రదేశంలో స్నాన జపాదులు నిర్వహిస్తే సూర్య చంద్ర కిరణాలు అమృతమై శుభాన్ని కలిగిస్తాయి. అపరిశుభ్ర ప్రాంతంలో ఆ కార్యాలు చేస్తే అక్కడి విష ఔషధులని సూర్య కిరణాలు గ్రహించి అవి మీ మీద ప్రసరించటంతో అమూల్యమైన మహా పుణ్యశక్తి కాస్తా పాపశక్తి అవుతుంది.

ఎన్ని మందులు వాడినా తగ్గని రోగాల పాపమేంటి...

వైద్యుల ద్వారా ఎంత ప్రయత్నించినా వ్యాధి కుదరకపోవటమంటే, ఆ వ్యాధి శాపాల వల్ల వచ్చినదై ఉంటుంది. అసత్యదోషం వల్ల కానీ, పరుల పొట్టగొట్టటం ద్వారా వచ్చినది కానీ, ఆడదాని ఉసురు వల్ల కానీ వచ్చి వుండవచ్చు. అలాంటివి చేసి వుంటే పాపప్రాయశ్చిత్తం చేసుకుంటే వారివారి వద్దకెళ్ళి క్షమించమనీ, నష్టాన్ని భర్తీ చేసే ప్రయత్నం చేస్తే ఫలితం ఉండొచ్చు.

కాశీ నందు వెయ్యి సంవత్సరాలు చేసిన తపస్సుకు సమ పుణ్యం రేగుచెట్టు నుంచి అమృతము స్రవించుట వల్ల కలిగిన బదరిని దర్శించినంత మాత్రమునే కలుగుతుందని వైష్ణవ ఖండము శెలవిస్తోంది.

మహాశక్తి వంతుడైన బిడ్డ కావాలంటే చెయ్యాల్సిన పుణ్యం...

తీర్థ, నదీ ప్రదేశాలలో మట్టితో గౌరీ ప్రతిమను చేసి విధిగా పూజిస్తే మహాశక్తి వంతుడైన పుత్రుడు జన్మిస్తాడు. అలా ఉపవాస దీక్ష చేసి నదీతీరాన గౌరీ ప్రతిమను పూజించిన భృగుపత్నికి మహాశక్తివంతమైన పుత్రుణ్ని ప్రసాదించింది జగన్మాత.

చంచల స్వభావం గల స్త్రీ ఎంతటి దోషాలకి గురవుతుంది...

చంచల స్వభావం గల స్త్రీ అనేక బాధలు పడుతుంది. ఇక్కడవుంటూ, అక్కడికి వెళ్ళాలనుకోవటమూ, ఒకరితో మాట్లాడుతూ మరొకరి ఆలోచనలూ, భర్త పక్కనున్నా పరాయి మగవాణ్ని కన్నార్పకుండా చూడటమూ, ప్రతిదాని పైన వ్యామోహమూ ఇవన్నీ చంచల తనపు

చిహ్నాలు. అలాంటి స్త్రీ పరివర్తన చెందకపోతే కోరి కష్టాలను కొనితెచ్చుకుంటుంది. శ్రీమహాలక్ష్మి కూడ ఆ చంచలత్వంతోనే విష్ణుమూర్తి శాపానికి గురై భూలోకంలో అడగుర్రంగా జన్మించింది.

భార్యా వియోగమనే మహాదుఃఖం ఏ పాపం ద్వారా కలుగుతుంది...

సేవకుల్ని కాలితో తన్నటమూ, పసి పిల్లల చేత వెట్టి చాకిరీ చేయించటమూ, పిల్లల సొమ్ముని తినేయటమూ, పిల్లల ఆహార పదార్థాలను కలుషితము చేయటమూ, భర్తలేని స్త్రీని బెదిరించి, ప్రలోభ పెట్టడమూ వంటి వాటి వల్ల అసలైన, అవసరమైన సమయంలో కావాల్సిన భార్య దూరమవుతుంది. మంచంమ్మీద ఉండి చూసే దిక్కులేక గంజి నీళ్ళు పోసేవాళ్ళు లేక పైవాడి పిలుపు కోసం ఎదురు చూసే దుస్థితి వస్తుంది.

వికారికి భార్యగా అయ్యే పాపం...

తెలిసీ తెలియని తనంతో యవ్వనంలో మహా అందగత్తెనని, ధన బలగర్వాలతో, భక్తులను పరిహసించినా, బాధించినా, శరీర బలహీనతలున్న

వార్ని హేళన చేసినా దోషం కలుగుతుంది. లోకోత్తర సౌందర్యవతియైనా పరిస్థితుల వల్ల అనామకుణ్ని, వికారిని చేసుకునే పరిస్థితి వస్తుంది. సాధుజంతువులను హింసించటమూ, గాయపర్చటము మహా పాపాలు. అలాంటి పాపానికే మహా సుందరీమణి సుకన్య కురూపి అయిన చ్యవనుణ్ని చేసుకోవాల్సివచ్చింది.

సంసారముండి పెళ్ళికాని అమ్మాయిని లోబరుచుకుంటే కలిగే పాపం...

గృహస్థు యవ్వనాన్ని రుచి చూసినవాడు. అలాంటి వ్యక్తి యవ్వనంలోనున్న పడతిని... మన్మథుడు పూర్తిగా ఆవహించిన ఆ పిల్లను ఆ సమయంలో ఏ పద్ధతుల ద్వారా లోబరుచుకున్నా, ఆ పాపం కొన్నాళ్ళ తర్వాత అనుభవింపక తప్పదు. వారి కుటుంబంలోని స్త్రీ కళంకిణి అనే మచ్చ అనుభవించాల్సి వుంటుంది. తాను రహస్యంగా అనుభవించినది పాపమై, తన ఆడపిల్ల, సోదరి, కోడలు వంటివారి విషయంలో బైటపడి తలొంచుకొని కుమిలి పోయే స్థితి వస్తుంది.

పెళ్ళికుదిరిన తర్వాత ఆ పిల్లను లేపుకొస్తే కలిగే పాపం...

పసుపు కొట్టి పదిమందికీ పత్రికలు పంచి, బంధుమిత్రాదులను ఆహ్వానించి అంతా ఆనందంగా ఉన్న సమయాన అలా చేస్తే ఆ పాపం ఇద్దరికీ సమంగా సంక్రమిస్తుంది.

తద్వారా వారు వివాహం చేసుకున్నా, మహాభయంకర కరువులో జీవించవల్సి ఉంటుంది. పదిమందిచే బహిష్కరించే పరిస్థితులు ఎదురవు తాయి.

సంతానం వల్ల సుఖం కన్నా, దుఃఖమే ఎక్కువ కలుగుతుంది.

వ్యాధీ, అలసట, ఇష్టంలేని కార్యాలని చేయటమూ, ఇష్టమైన వాటిని వదిలెయ్యటమూ వంటి వాటి ద్వారా దుఃఖాలు కలుగు తాయని శౌనకుడను ఋషి శెల విచ్చాడు.

ధనముండి కూడా మహానరక సమస్యలు ఎదురైతే చెయ్యాల్సిన పుణ్యం...

ధనం ద్వారా సుఖమొస్తుందనుకుంటే చాలా పొరపాటు. ఎంత ధనమున్నా సమస్యలు సుడి గుండాల్లా మారి ఆవహించాయంటే, ఆ ధన సంపాదన సమయంలో చేసిన పాపాలు, ఆ ధనం తాలుకూ వారి బాధే సమస్యల రూపేణా ఆవహించి నట్టు.

దానికి ప్రతిగా చేసిన పాపాలను వారికి చెప్పి జరిగిన అన్యాయానికి ఎంతో కొంత మేలు చేసి, వారిని క్షమాపణ అడగటం ద్వారా కొంత కాలానికైనా ఆ సమస్యలన్నీ మాయమవుతాయి.

బెజవాడ కనకదుర్గ ఎంతటి మహత్మ్యం కలది...

చంద్రవంశ రాజుకి పిల్లలు కలగక పోవటంతో అనేక తీర్థాలూ, క్షేత్రాలూ దర్శించాడు. అయినా సంతానము కలగలేదు.

చివరికి కృష్ణా తీరంలోని అమ్మవారిని దర్శించాక సంతానయోగం కలిగింది.

ఈ అపూర్వ విషయాన్ని పరమేశ్వరుడు నారాయణగాన ప్రీతి గల నారదునకు తెలియ చెప్పాడు.

అడవులూ, కొండలూ, పర్వతాల మీద వెలిసిన బెజవాడ కనకదుర్గాదేవిని దర్శించటం మహాపుణ్యమని బ్రహ్మాండపురాణం తెలియ చెబుతోంది.

ధనం వల్ల లోభితనం పెరుగుతుంది. దానితోపాటు అహంకారం వస్తుంది. ఆ రెంటివల్ల రోగాలొస్తాయి. ఆ రోగాలు ధనం వల్ల పోవు. కాన ధనాన్ని అత్యాశతో కాకుండా ధర్మంగా సంపాదించాలి. ధర్మంగా సంపాదించిన ధనము కీర్తీ సుఖాలూ తెస్తాయి.

వ్యసనాలని వదిలిన వారికి తిరిగి గుర్తు చేస్తే ఎంతటి పాపం...

జూదమూ, మద్యమూ, స్త్రీ, శాడిజమూ వంటి మహావ్యసనాలని వదిలి ప్రశాంతంగా జీవిస్తున్న వారికి తిరిగి వాటిని గుర్తు చెయ్యటం ద్వారా, మానేసినవారికి తిరిగి ఏ విధంగా అలవాటు చేసినా, ఆ పాపం ఈసారి అలా చేసిన వారికే చెందుతుంది. తద్వారా మహా అనారోగ్యం సంభవిస్తుంది.

మహా పాపాలను పోగొట్టుకునే పుణ్యం...

మహా మునీశ్వరుడైన మార్కండేయ మహర్షి నిరంతర ధర్మపరాయణం వల్లా, సత్యవాక్కు వల్లా, యజ్ఞయాగాదుల వల్లా, తపస్సు ద్వారా తన పాపాలను పోగొట్టుకున్నాడు.

చేసిన పాపాలకి ప్రాయశ్చిత్తం చెందితే అది అప్రయోజనమే.

ధర్మ కార్యాలు చెయ్యటం వల్లే కొన్ని పాపాలు సమసిపోతాయి. స్త్రీని లొంగదీసు కోవటమూ,

స్నేహితుణ్ని మోసం చెయ్యటమూ, తమ్ముడ్ని మోసం చెయ్యటం వంటివి ఏం చేసినా, మహా యజ్ఞలు చేసినా ఆ పాపాలు పోవు.

దరిద్రంలోనున్నవారు శాకంబరీ దేవిని పూజిస్తే ఎంతటి పుణ్యం...

రురుడనే రాక్షసుడు లోకాలనీ, దేవతలనీ నాశనం చెయ్యటానికి బ్రహ్మదేవుడి గూర్చి వెయ్యి సంవత్సరాలు తపస్సు చేసి సకల లోకాల్లో వేద జ్ఞానం లేకుండా చేశాడు. దానితో దేవతల శక్తి సన్నగిల్లింది. వర్షాలు పడలేదు. భయంకరమైన కరువు.

నేల బీటలు బారి మహోక్షామం ఆవహించింది. అప్పుడు జగన్మాతను ప్రార్థిస్తే నవరాత్రులు వర్షాలు కురిపించింది.

ఓషధులు వృద్ధి చెందాయి. మహోక్షామాన్నీ, దరిద్రాలను రూపుమార్చటంతో జగన్మాతకు శాకంబరీ అన్న నామం ఏర్పడింది. ఆ తల్లిని పూజిస్తే ఎంతటి దరిద్రమైనా తొలగి సుఖాలొస్తాయి.

దేవీ వ్రతం ఏ సమయంలో పుణ్యం...

ప్రదోషవేళలో అనగా సాయంసంధ్య సమయంలో మహా శివుడు పార్వతీదేవితో ఆనంద నృత్యం చేస్తుంటాడు.

ఆ సమయంలో జగన్మాతకు పూజాదివ్రతాలు చేస్తే జగన్మాత అపార కరుణనూ, సంపదలనూ ఇస్తుందని దేవీవ్రతాల్లో నిక్షిప్తమై ఉంది.

వయసులోనున్నప్పుడు సంతానాన్ని పట్టించుకోకపోతే కలిగే పాపం...

ఆ మహాపాపానికి ఫలితం వృద్ధాప్యంలో అనుభవించాల్సి ఉంటుంది. త్రాగుడూ, వ్యసనాలూ వంటి వాటితో బిడ్డల అలనా పాలనా చూడకుంటే ఆ బాధ ముసలి తనంలో పట్టి పీడిస్తుంది. చూసే వారు లేక పలకరించే బిడ్డలు అయిష్టతతో దూరమయి ఒక్కడే దుప్పటిని కూడా శుభ్రం చేసేవారులేని పరిస్థితుల్లో దుర్భర నరకాన్ని

అనుభవిస్తాడు. అప్పుడెంత విలపించినా ప్రయోజనం ఉండదు. పిల్లలకి అందించాల్సినవి సరయిన సమయాల్లో అందిస్తేనే, పిల్లలు వారు అందించాల్సిన సమయాల్లో కొన్నైనా అందిస్తారు.

సకల అరిష్టాలకి ధనమే కారణము. సంపాదించిన కొద్దీ దుఃఖము పెరుగుతుంది. ధనం పెరిగే కొద్దీ వ్యయము పెరుగు తుంది. అది మరింత దుఃఖము. అపరిమిత ధన కాంక్ష దుఃఖానికి కారణము.

సాలగ్రామ పూజాదికాలు ఎంతటి పుణ్యం...

సాలగ్రామ సన్నిధిలో చేసే ఏ దానమైనా, పూజైనా రెట్టింపు ఫలితాన్ని ఇస్తుంది.

సాలగ్రామ శిలార్చన సకల వేద పఠనము చేసిన పుణ్యాన్నీ, అనేక యజ్ఞాలు చేసిన పుణ్యాన్నీ,

సకల పుణ్య తీర్థ ఫలాన్నీ అందిస్తుంది. సాలగ్రామ నిత్య సేవ ద్వారా మహాశక్తివంతుడవుతాడు. పుణ్యవంతుడవుతాడు.

అయితే సాలగ్రామ అర్చన చేస్తూ అసత్య మాడినా అధర్మ పద్ధతిలో ప్రవర్తించినా, మహా నరకాన్ని భువిలో చవి చూస్తాడు. సాలగ్రామ పూజలో తులసి లేకుండా ఎట్టి పరిస్థితుల్లో పూజింపరాదని శ్రీదేవీ భాగవతం నిశ్చయంగా చెబుతోంది.

తులసిని ఏ రోజున పూజిస్తే కోరిన కోర్కె నెరవేరుతుంది...

తులసి చెట్టు నుంచి తులసీదేవి కార్తీక పౌర్ణమినాడు ఆవిర్భవించింది.

ఆనాడు ఆ తల్లినీ, విశ్వపావనినీ పూజిస్తే వేల ఆవులను దానం చేసిన ఫలం కలుగుతుందని విష్ణు పురాణం చెబుతోంది.

సంతానము కోరేవారూ, వివాహం ఆలస్యం అయినవారూ తులసీ స్తోత్రాన్ని పఠిస్తే తప్పక దోషాలు పోయి సుఖాలు కలుగుతాయి. ప్రతిరోజు తులసి చుట్టూ ప్రదక్షిణలు చేస్తే కన్యకు పుణ్యపురుషుడు లభిస్తాడు.

సహనంతో ఉండటం ఎంతటి పుణ్యం...

కశ్యపమహాముని లోకహితంకై చెప్పిన ధర్మ ఉవాచ ఇది. మహాపుణ్యాన్ని సంపాదించగలిగేది ఓర్పు మాత్రమేనని చెప్పాడు. యజ్ఞాలూ, యాగాలూ, వ్రతాలూ వంటి ధర్మకార్యాల ద్వారా పొందే పుణ్యాన్ని కేవలం సహనం ద్వారా పొందవచ్చు. మహాపురుషులకు లభించే ఉత్తమగతులు ప్రశాంత ప్రవర్తన ద్వారా సాధ్యమని కశ్యప మహాత్ముడు చెప్పాడు.

గాయత్రి మంత్రం ఎంతటి పాపాలను పోగొడుతుంది...

మహా మునీశ్వరుడైన పరాశర మహర్షి గాయత్రి మంత్ర పఠన పుణ్యాన్ని శెలవిస్తూ, అశ్వపతి మహారాజుకి ఈ విధంగా చెప్పాడు. ఒక్కసారి జపించినంతనే పగలు చేసిన పాపమూ, పదిసార్లు జపిస్తే రాత్రీ, పగలూ చేసిన పాపకర్మ పాపాలూ, వందసార్లు జపిస్తే నెలంతా చేసిన పాపాలూ, వెయ్యిసార్లు జపిస్తే సంవత్సరంపాటు

చేసిన పాపమూ, లక్షసార్లు జపిస్తే సర్వజన్మార్జిత పాపాలూ ఖచ్చితంగా నశిస్తాయి. పదిలక్షల సార్లు జపిస్తే పూర్వజన్మ పాపములూ, వంద లక్షలసార్లు జపిస్తే సకల జన్మల పాపాలూ తొలుగుతాయి.

శనీశ్వరుడు ఏ కార్యము ద్వారా మీకు అశుభాలను తొలగిస్తాడు...

శని సంచారి. ఎప్పుడూ ఆకాశ మార్గాన విహరిస్తుంటాడు. కర్మని బట్టి పాపాలను బట్టి పీడిస్తుంటాడు. శనీశ్వరునికి పూజాదికాలూ, జపాలకన్నా ఎక్కువ సంతృప్తి కలిగేది నడక ద్వారా. శనీశ్వరున్ని తలుచుకొని రోజు ఓ అరగంట చెప్పులు కూడా లేకుండా శుభ్రమైన ప్రదేశంలో నడిస్తే మీ అన్ని సమస్యలు తొలిగిపోతాయి.

భగవంతుని ప్రసాదాన్ని అవమానిస్తే కలిగే పాపం...

పూర్వము త్రిలోకాధిపతి మధుపానం సేవించి రంభతో సరసాలాడుతుండగా, దుర్వాస మహాముని కైలాసానికి వెళుతూ, కనిపించిన

ఇంద్రునికి వైకుంఠం నుంచి తెచ్చిన పుష్ప ప్రసాదాన్ని ఇచ్చాడు.

దాన్ని నిర్లక్ష్యంతో విసిరెయ్యటంతో దైవదోషం జరిగి దేవేంద్రుడికి బ్రహ్మహత్యా పాతకము చుట్టుకుంది. దానితో సకల సంపదలు హరించుకుపోయాయి. కాన ఫల, పుష్ప, అన్న ఏ ప్రసాదమైనా, భగవంతునికి అర్పించిన దాన్ని చులకన చేసినా, వాటిని అగౌరవ పరిచినా, సంపదలూ, సుఖాలూ, వైభోగాలూ, కీర్తీ తుడిచి పెట్టుకుపోతాయి.

సంధ్యావందనం చేయనివానికి వచ్చే దోషాలు...

ప్రతిరోజూ మూడు పూటలా సంధ్యావందనం చెయ్యనివాడు ఎన్ని పూజలు చేసినా ఫలితం ఉండదు. అలా మూడు సంధ్యలలో సంధ్యావందనము చేసినవాని పాదధూళి వల్ల కనుచూపంతా పవిత్రతతో పులకిస్తుంది.

సంధ్యావందనం చెయ్యకుండా దేవతలకు నైవేద్యాన్ని పెడితే స్వీకరించరు. అట్లే విష్ణు మంత్రాన్ని పఠించనివాడూ, దైవప్రసాదాన్ని

స్వీకరించక వద్దనేవాడూ, కన్యలను అమ్మినవాడూ, వడ్డీ వ్యాపారీ, సూర్యోదయ సమయంలో నిద్రించేవానికీ ఏ పూజలు చేసినా పుణ్యం రాదని సూర్యదేవుని గ్రంథంలో వివరించబడింది.

శ్రీ విష్ణుసహస్రనామం చదవటం ద్వారా సకల దరిద్రాలూ నశిస్తాయి. అన్ని వైభోగాలూ కలుగుతాయి.

నిశ్చయతాంబూలాలు పుచ్చుకొని వివాహాన్ని కాదంటే కలిగే దోషం...

అలా చేసిన కర్తకు భయంకర రోగం అవహిస్తుంది. శరీరమంతా సూదులతో గుచ్చిన వ్యధను అనుభవించాలి. కుటుంబానికి దూరంగా ఉండే వ్యాధితో అయినవారితోనే 'ఛీ' కొట్టించుకునే దుస్థితి వస్తుంది. ఇతరులతో సంపర్కం పెట్టుకున్న స్త్రీ పాపం వంటిది ఆవహించి నరకయాతన పడవల్సి ఉంటుంది.

లక్ష్మీపూజ లక్ష్మీస్తవం చేస్తే...

మహేంద్రుడు చేసిన పూజ. శుద్ధోదకాలతో స్నానమాచరించి గణేశ దినేశ వహ్ని విష్ణు శివపార్వతులను పూజించి పుష్ప గంధాదులతో మహాలక్ష్మిని ఆవాహన చేయాలి. వెయ్యి రేకలు గల తామర పువ్వు మీద కూర్చొన్న మహాలక్ష్మిని పూజించి మూల మంత్రాన్ని జపిస్తే అఖండ సంపదలతో తులతూగుతారు. ఈ పూజ ద్వారానే ఇంద్రుడు పోయిన సంపదలూ, పదవీ అందుకున్నాడు.

పూజాదికాలప్పుడు దక్షిణ ఇవ్వకపోతే ఎంత దోషం...

యజ్ఞయాగాదులప్పుడుగానీ, ఏ సత్కర్మలప్పుడు గానీ, దానాలప్పుడుగానీ, చేయించిన వారికీ, చెప్పిన వారికీ దక్షిణ అప్పుడే ఆ ప్రదేశంలోనే ఇవ్వాలి. ఆ తర్వాత ఇద్దాములే అని అనుకుంటే విప్రుల సొమ్ము అపహరించిన పాపం కలుగుతుంది. ఆ పాప పరిహారార్థం ఆ తర్వాత పదింతలు ఇస్తే గాని పోదు. దక్షిణ ఇవ్వకపోతే ఎంతటి పూజ చేసినా

ఫలం రాదు. లక్ష్మీదేవి శపిస్తుంది. అలాగే దానంగా ఇస్తానని చెప్పిన దాన్ని వెనువెంటనే ఇచ్చివేయాలి.

దక్షిణ ఉంటేనే ఏ పుణ్యకార్యమైన సత్ ఫలితాన్నిస్తుందని దక్షిణాదేవి వృత్తాంతము శెల విస్తోంది. దేవాలయాల్లో అలాగే పురాణ శ్రవణం విన్నవారూ, పండో, ఫలమో ఇవ్వటం గృహస్థుకి శుభం.

భర్త మనస్సెరిగి ప్రవర్తించటము ఎంతటి పుణ్యం...

దక్షిణాదేవి గాథలో పతిసౌభాగ్యము స్త్రీకి ఎంత గౌరవమూ, గర్వమూ ఇస్తాయో చెప్పబడింది.

సకల తీర్థాలలో స్నానం చేసిన ఫలమూ, మహా దానాలిచ్చిన ఫలమూ, సర్వ తపస్సులు చేసిన ఫలమూ, మహా ఉపవాసాలు చేసిన పుణ్యమూ, అనేక సత్కర్మలు చేసిన ఫలమూ, ఇవన్నీ కలిపినా రాని పుణ్యం భర్త మనస్సెరిగి నడిచిన స్త్రీకి దక్కుతాయని మన ఇతిహాసాలు చెబుతున్నాయి.

పురాణాల్లో పతివ్రతల విషయాల కొస్తే ద్రౌపది పడరాని పాట్లు పడింది. నలుని కోసం దమయంతి అనేక అగచాట్లు పడింది.

ఏ పరిస్థితుల్లోనూ వాళ్ళు భర్తని కించపరచలేదు. సుఖంలో సుఖంగా ఉన్నారు. కష్టాలను కూడా సుఖంగానే భావిస్తూ గడిపారు.

భర్తతో గొడవపడి దూరమయ్యిందంటే ఆ స్త్రీ లక్షపాపాలు దాటినట్టు దానికి కారణమైన ఆ పురుషుడు రెండు లక్షల పాపాలను దాటినట్టు.

దానికి శిక్షే ఇరువురూ దూరమవ్వటం. ఒక్కసారి దూరమై, విడిపోయి తిరిగి కలుసుకొన్నా, వారు చేసిన ఏ కార్యమూ, పుణ్యమూ ఫలం ఇవ్వదు.

అలాగే వారికిచ్చిన దానమూ చెప్పిన ధర్మమూ వృధాయే.

పిల్లలు లేనివారు షష్ఠీదేవిని పూజిస్తే...

శుక్లషష్ఠి రోజూ, పురిటిళ్ళలో ఆరవరోజూ, పదకొండవరోజూ, అన్నప్రాసనరోజూ షష్ఠీదేవి పూజ చేస్తే సంతానవంతులు ఆయుష్మంతులూ, బలవంతులూ అవుతారు.

షష్ఠీదేవి వృత్తాంతాన్ని చదివినవారికి కీర్తి గడించే సంతానము కలుగుతుంది.

ఆదిపరాశక్తి ఆరవ అంశ అయిన షష్ఠీదేవిని సాలగ్రామముతోగానీ, మంగళ కలశంతోగానీ, వటవృక్షం వద్ద గానీ ఆవాహన చేసి పూజించాలి.

ఓం హ్రీం షష్ఠీ దేవ్యైస్వాహా

పై మూల మంత్రాన్ని జపిస్తే గొడ్రాళ్ళకి సంతానము కలుగుతుందని వేద పురాణము శెలవిస్తోంది. షష్ఠీదేవి శిశువులకూ, బాల బాలికలకూ అధినేత్రి. ఆమెని పూజిస్తే బిడ్డల ఆరోగ్యం కూడా కుదుట పడుతుంది.

మంగళచండీ పూజ పగవారిపై విజయం కొరకు...

త్రిపురాసుర సంహారానికి ముందు తొలుత మంగళచండీని పూజించినవాడు శివుడు. ఆపై అంగారక గ్రహం, ముచ్చటైన మూడవ మంగళ పూజను మహేంద్రుడూ, నాలుగో పూజను దేవతలూ చేశారు. ఈ పూజ చేసిన వారికి శత్రు భీతిపోవటంతోపాటు కుటుంబమంతా మంగళకరంగా ఉంటుంది. బ్రహ్మదేవుడు స్వయంగా శివునికి ఉపదేశించిన పూజా విధానము శ్రీ దేవీ భాగవతంలో ఉంది.

ఏ సమయంలో మాట్లాడితే దైవ దోషం...

సంధ్యావందన సమయంలో, దంత ధావనము చేస్తున్నప్పుడూ, పితృదేవతలకు పూజాదికాలు చేస్తున్నప్పుడూ, మలమూత్ర విసర్జన సమయాల్లో, సంపర్క సమయంలో, యజ్ఞయాగాదులప్పుడూ, దానధర్మాలు చేస్తున్నప్పుడూ మాట్లాడకూడదు.

అలాగే శరీరాన్ని శుభ్రపరుచుకునే సమస్త కార్యాల్లో బొడ్డు పైభాగం శుభ్రపరచటానికి కుడిచేతినీ, బొడ్డు క్రింద భాగాన్ని శుభ్రం చేసుకోవటానికి ఎడమ చేతినీ ఉపయోగించాలి.

హారతి పట్టిన పళ్ళెంలో డబ్బులు పెట్టకపోతే ఎంత దోషం...

వివాహాలూ, శ్రీమంతము, బారసాలా వంటి ఏ శుభకార్యాల్లోనైనా అక్కచెల్లెళ్ళు హారతి పట్టి పాట పాడతారు. అలా పాడటమంటే పీటల మీద కూర్చున్న వారు పెద్దవారైతే ఆశీర్వాదాన్ని కోరుకుంటున్నట్టు, చిన్న వారైతే ఆశీర్వాదాన్ని ఇచ్చినట్టు. ఇంకా ఇటువంటి సందర్భంలోనే ఇంటి

ఆడపడుచు అనే హోదాని గుర్తించినట్టు కూడా.అలాంటి ఇంటి మహాలక్ష్ములకు హారతి పళ్ళెంలో శక్తిని బట్టి ధనాన్ని పెట్టాలి. ధనం కోసం చూసుకుంటే తద్వారా కలిగిన దోషానికి పుట్టే సంతానం చెడు నక్షత్రంలో పట్టడం వంటి చెడు దోషాలు జరగుతాయి. తత్కారణంగా అనేక జపాలు చేయించాల్సి వస్తుంది. తద్వారా పదిరెట్ల ధనాన్ని కోల్పోవాల్సి వస్తుంది.

కేతుగ్రహ దోషాలున్న వారు కేతు మహామంత్ర జప విధానము ద్వారా ఆ గ్రహ దోషాన్ని పోగొట్టుకోవచ్చు. అలాగే ఆయాగ్రహ దోషాలున్న వారు ఆ గ్రహ మంత్ర జప విధానము చేసుకుంటే ఆయా గ్రహ పీడలూ, దోషాలూ తొలగుతాయని నవగ్రహశాంతి మంజరి శెలవిస్తోంది.

సర్వదోషాలున్నవారు చెయ్యాల్సిన పూజ...

కశ్యప్రజాపతి పుత్రిక మానస పుత్రికవ్వటంతో మానసాదేవి అయ్యింది. ఈమెకి జరత్కారు అని పేరు. అదే పేరు గల వానిని పెళ్ళాడింది. మహాశివునికి భక్తురాలు, శిష్యురాలు. జనమేజయుడు సర్పయాగం చేస్తున్నప్పుడు సర్పజాతి అంతరించకుండా సర్పజాతులను రక్షించింది. ఈ తల్లిని పూజించిన వారికి పాముల పుట్టపై నిదురించినా హాని జరగదు. సర్పదోషాలు తొలగిపోవటంతోపాటు మహాసుఖ సంతోషాలు కలుగుతాయి.

గంగాస్నాన పుణ్యం కోసం...

పుణ్యం కోసం రుద్రాక్షని తలపై పెట్టుకుని స్నానం చేస్తే గంగాస్నానం చేసిన పుణ్యం వస్తుందని శివ పురాణం శెలవిస్తోంది.

ఏ రుద్రాక్ష ఉత్తమం...

ఉసిరికంత ఉండే రుద్రాక్ష ఉత్తమోత్తమం. రుద్రాక్షను ధరించినవారు మద్య మాంసాలతోపాటు

పరస్త్రీలకూ దూరంగా ఉండాలి. చతుర్థశీముఖి రుద్రాక్ష ధరిస్తే వ్యాధులు దరిచేరవు.

పాశుపత వ్రతమంటే...

హోమకుండం నుంచి తీసిన భస్మాన్ని పవిత్రంగా స్నానమాచరించి అధర్వణ మంత్రాలను పఠిస్తూ అవయవాలకు పులుముకోవాలి. శివనామాలను జపిస్తూ చేయాలి. ఇలా నిత్యమూ చేస్తే పాశుపతవ్రతమవుతుంది. మహా భుక్తి, ముక్తిలను అందిస్తుంది. ఇలాంటి వ్రతం చేసిన వారికి అకాల మృత్యుభయం తొలగిపోతుంది. ఆయురారోగ్య భోగభాగ్యాలు సమకూరుతాయి. భస్మము కోసం తెచ్చే ఆవు పేడ నేల రాలినిది అయి ఉండకూడదు. తెల్ల రంగు ఆవు పేడ అందరికీ ప్రశస్తము.

దుఃఖమనే మహాపాపం ఎవరి వల్ల తొలగిపోతుంది...

సకల వ్యాధుల్లో భరించలేనిదీ, పగవానికి కూడా రాకూడనిదీ దుఃఖం. అంతటి దుఃఖమనే రోగం పోగొట్టే ఒకే ఒక మందు భార్య. విసిగిన

సమయంలో, అలిసిన సమయంలో, ఆకలి, దాహాదులప్పుడూ, మహా కష్టాలప్పుడూ ఆ పరితాపాలన్నింటినీ పోగొట్టేది భార్య మాత్రమే.

మగవానికి తోడై నిలుస్తుంది. ధైర్యం చెబుతుంది. అలా మహా దుఃఖరోగంతో బాధపడుతున్న నిషధరాజుకు... సర్వమూ పోగొట్టుకున్న నలమహారాజుకు నీరే ఆహారంగా తీసుకునే పరిస్థితులున్నప్పుడు భీమరాజు పుత్రిక దమయంతి పై విషయాన్ని చెప్పి దుఃఖాలను పోగొడుతుంది.

శివస్తోత్రం పదహారు సోమవారాలు చదవటం ద్వారా సుపుత్రప్రాప్తి కలుగుతుంది.

ఏ లింగరూపాన్ని పూజిస్తే ఎక్కువ ఫలం...

శివుణ్ని రాతిలింగరూపంలో పూజించుట కన్నా ఇసుకతో చేసిన లింగాన్ని పూజించటం ద్వారా పదిరెట్లు పుణ్యం కలుగుతుంది.

శత్రువుపై విజయం కోసం పఠించాల్సింది...

మహా విజయము కోసం ఆదిత్యహృదయాన్ని చదివి ఆ కార్యాన్ని ప్రారంభిస్తే మీకు తప్పక విజయం కలుగుతుంది.

రావణ వధకు ముందు శ్రీరాముడు ఆదిత్య హృదయాన్నే పఠించాడు.

ఏ మాసంలో శ్రీ మహా విష్ణువును పూజిస్తే ఎక్కువ ఫలం...

మార్గశిర మాసంలో శ్రీమహావిష్ణువును పూజిస్తే మామూలు రోజుల్లో కన్న ఎక్కువ పుణ్యం.

ఉగాదిపచ్చడి పూర్ణ ఫలం ఎలా అందుతుంది...

ఉగాది పచ్చడిని కుండలో గానీ, ముంతలో గానీ చేసి స్వీకరిస్తేనే దాని తాలూకూ పరిపూర్ణ ఫలం అందుతుంది.

కుజ గ్రహ దోషాలున్నవారు ఏం వదిలేయాలి...

కుజ దోషాలున్న వారు నూనె పదార్థాలను తగ్గించి, వీలైతే పూర్తిగా వదిలేసి ఆహారాన్ని తీసుకుంటే కుజగ్రహ చెడు ప్రభావము కొంతమేర తగ్గుతుందని శాస్త్రం శెలవిస్తోంది.

బ్రహ్మాండ పురాణంలోని శ్రీ లలితా సహస్రనామ స్తోత్రం చదివి ధ్యానించుట ద్వారా సమస్త వాంఛా సిద్ధి కలుగుతుంది.

గ్రహణాలు ఎంత మంచివి...

గ్రహణాలూ, మూఢాలూ ఆ సంవత్సరం లేకపోవటము వరము కాదు. శాపము. దుర్భర పరిస్థితులు ఆ సంవత్సరం ఎదుర్కోవలసి వస్తుంది. గ్రహణాల వల్ల పూజలూ, పునస్కారాలు పెరుగు తాయి. తద్వారా దేవతలు శాంతిస్తారు. సకాలంలో వర్షాలు పడి అంతా పచ్చగా ఉంటుంది.

సంవత్సరంలో రెండు గ్రహణాలు వస్తే ఆ సంవత్సరం మారేలోపు పుట్టింటి వారు ఆడపడుచులకు పసుపు, కుంకుమ పెట్టడం శుభం... అలా చెయ్యటం ద్వారా దోషాలు కనుమరుగవు తాయి.

జూదం ఎంతటి వినాశనాన్ని కలిగిస్తుంది...

జూదమనేది భయంకరమైనది. మహా వైషమ్యాల్ని రగిల్చేది. ఆఖరకు భార్యా భర్తలు ఆడినా వారి మధ్య గొడవే.

శివపార్వతులంతటివారు కూడా జూదమాడి ఒకరిపై నొకరు ఆగ్రహించుకున్నారు. మహాశివుడు తన మూడో నేత్రాన్ని కూడా తెరిచాడు.

పుణ్యం ద్వారా కలిగేవి, పాపం ద్వారా అనుభవించేవి?

నీ పక్కనున్న వార్ని మోసం చేసి సంపా దించిన ధనం నీ సంతానానికీ, నీకూ, నీ భార్యకీ, నీవనుకునే వారికి అవసరమైన సమయంలో ఉపయోగపడదు.

పంచామృతాన్ని దగ్గరుండీ తినలేక పోవటమే పాపం. ఆ పంచామృత ప్రసాదాన్ని అనుక్షణం పొందుతూ జీవితాన్ని గడుపుతుండటమే పుణ్యం.

పుణ్యం ద్వారా మోక్షం వస్తుంది. పుణ్యం ద్వారా సుఖమూ, ధనమూ, పాపం ద్వారా లభించేది అనారోగ్యమూ, బాధలూ.

ఎలాంటి జలము తీసుకుంటే పీడలు పోతాయి...

ఆర్ఘ్యము ఇవ్వగా మిగిలిన జలమూ, ఆచమనము ఇచ్చిన నీరూ, అట్లే పాదోదకమూ, స్వామికి అభిషేకము చేసిన నీరూ సేవిస్తే సకల తీర్థాల్లోని నీటితో అభిషేకము చేసిన ఫలము లభిస్తుంది. అట్టి నీటిని సేవించిన వారికి దుష్ట పీడలు తొలగిపోతాయి.

ఎన్ని రుద్రాక్షలు ధరిస్తే ఎంత ఫలం...

వెయ్యి రుద్రాక్షలను ధరించిన వానికి దేవతలు నమస్కరిస్తారు. చేతులకైతే రుద్రాక్షలు పన్నెండు ధరించాలి. శిఖలో ఒకటీ, కంఠమునందు

ముప్పది రెండూ, తలకి నలభై అయిదూ, చెవులకి ఒక్కొక్కదానికి ఆరేసి ధరించి మహాశివుణ్ని పూజిస్తే ఆ పూజా ఫలం అనంతమని రుద్రాక్ష శాస్త్రం శెలవిస్తోంది.

శ్రీవిష్ణుసహస్రనామము చేదివిన పుణ్యం శ్రీ రామ రామ రామేతి రమే రామే మనోరమే। సహస్రనామ తత్తుల్యం రామ నామ వరాననే॥

అని ధ్యానించినంతనే కలుగు తుందని పరమేశ్వరుడు పార్వతీ దేవితో చెప్పాడు.

రాగిపాత్ర నీరు ఎంత శుభం...

సకల అనారోగ్యాలను హరించేది రాగి పాత్రలోని నీరు. అందుకే ధర్మరాజుకి అరణ్యవాస సమయాన సూర్య భగవానుడు అక్షయపాత్ర ఇస్తాడు. ఆ పాత్ర రాగిది.

అన్నప్రాసన ఏ మాసాల్లో చేస్తే శుభం...

ఆరు, ఎనిమిది మాసాల్లో మగ బిడ్డలకీ, ఐదు ఏడు మాసాల్లో ఆడబిడ్డకీ అన్నప్రాసన సకల శుభాలనీ ఇస్తుందని మదనరత్న గ్రంథం శెలవిస్తోంది.

భార్య ఎప్పుడు రెండో వివాహం చేసుకోవటం పాపం కాదు...

భర్త పట్టించుకోనప్పుడూ, శారీరక సుఖం ఇవ్వనప్పుడూ, ఎంతో కాలం విడిగా ఉంటున్నప్పుడూ, హింసించి గాయపరస్తున్నప్పుడూ, భద్రత ఇవ్వలేని పిరికి వాడయినప్పుడూ, నపుంసకత్వం కలిగిఉన్నప్పుడూ భర్తని వదిలేసి ఆ స్త్రీ రెండవ వివాహం చేసుకోవచ్చని పారాశుర గ్రంథం శెలవిస్తోంది.

బిడ్డకు ఎప్పుడు చెవులు కుట్టిస్తే శుభం...?

మూడో సంవత్సరంలో చెవులు కుట్టించటానికి కార్తీక, పుష్య, ఫల్గుణ, చైత్ర మాసాలు

తల్లికీ, తండ్రికీ, బిడ్డకీ శుభమని వశిష్ఠులవారు శెలవిచ్చారు.

మనోవ్యాధులూ, గ్రహ పీడనలూ ఉన్నవారు శ్రీ ఆంజనేయ ప్రభాతము చదవటం ద్వారా నశిస్తాయి.

ఏ తీర్థ నదుల్లో స్నానం చేస్తే ఏ సిద్ధి కలుగుతుంది...

గంగానది సరస్వతీ నదులు కలిసిన చోట స్నానం చేస్తే మహా పాతకములు తొలుగుతాయి.

గంగా ద్వారము అనగా గంగ పుట్టిన ప్రదేశంలో స్నానం చేసిన వారికి వందకోట్ల తీర్థాలను సేవించిన ఫలం కలుగుతుంది.

యమునా నది పుట్టిన చోట స్నాన మాచరించి ధ్యానిస్తే సకల సిద్ధులూ కలుగుతాయి.

కాశీలో శివుణ్ని ఆరాధించినా, కపిలాహ్రదంలో స్నానం చేసినా రాజసూయ యాగం చేసిన ఫలం వస్తుంది.

కృష్ణానదిలోనూ, గోదావరిలోనూ, కావేరీ తీర్థంలోనూ, తుంగభద్రలోనూ, కన్యాకుమారీ లోనూ స్నానం చేసిన పుణ్యలోకాలు సిద్ధిస్తాయి.

శ్రీ సుబ్రహ్మణ్యాష్టకము చదివి ధ్యానించుట వల్ల తెలిసి తెలియక చేసిన పాపాలు అంతర్ధానమవుతాయి.

ప్రయాగలో నివశిస్తే ఎంత పుణ్యం...

యాగాలు చేసిన పుణ్యం ప్రయాగలో నివశించినంతనే కలుగుతుంది. అందుకే సిద్ధులూ, యోగులూ, యక్షులూ ఎప్పుడూ అక్కడ కొలువుతీరి ఉంటారు.

పుత్రుడు, పుత్రిక నుంచి ఏ ఫలం ఆశిస్తారు...

ఏవరైనా పుత్రుడు కావలనుకునేది వృద్ధాప్యంలో సంపాదించిపెడతాడని, పోతే చితికి

నిప్పంటిస్తాడనీ, సంపాదించినది పరుల పాలు కాకూడదనీ, శ్రాద్ధాలు పెడతాడని ఆశిస్తారని శ్రీ దేవీభాగవతం శెలవిస్తోంది. ముఖ్యమైన ప్రేమ మాత్రము పుత్రిక నుంచే పొందుతారు.

సత్య అసత్య దోషాలు రాకూడదనుకుంటే...

సత్యమైనా, అసత్యమైనా ప్రియమే చెప్పాలి. మంచి జరుగుతుందని అప్రియము చెబితే, ఆ దోషం ఏదో ఒక రూపేణా తగులుతుంది. అప్రియం ప్రియంగా చెప్పే పరిస్థితి వస్తే మౌనంగా ఉంటే ఆ దోషమూ, దాని తాలూకు ఫలము తగలదు.

శని దోషాలున్నవారు ఏ లింగాన్ని పూజించాలి...

శనిదోషాలున్నవారు శివుని పాదరసలింగాన్ని పూజిస్తే శనీశ్వరుడు శాంతించి శుభాలనిస్తాడు.

మీ భర్త కొట్టి తిడుతుంటే చెయ్యాల్సిన పూజ...

మద్యం మత్తులో, ఒత్తిళ్ళలో, అనవసర విషయాల్లో మిమ్మల్ని బాధిస్తుంటే దానికి కారణము

దైవకారణము. గృహస్థు ధర్మంలో దోషాల వల్ల భర్తతో బాధలు పడుతుంటారు. అదే శని ప్రభావము. శనికి ఎనిమిది అంకె ప్రీతి.

ఎనిమిదో తారీకూ, లేదా పదిహేడు, ఇరవై ఆరు తారీకుల్లో నవగ్రహాలకి పూజ చేసి, శని స్తోత్రాన్ని పఠిస్తూ ఎనిమిది ప్రదక్షిణలను చేయాలి. ఏవైనా పండ్లు పదహారు మందికి దానమిచ్చి మిగతా పండును అనగా పదిహేడో పండును భార్య, భర్త లిద్దరూ తింటే ఆ భర్తకు ఆ భార్యపై ప్రేమ కలిగి గతంలో కంటే మార్పువస్తుంది. అలా ఎనిమిది సార్లు ఆయా తారీకుల్లో చేయాలి.

అప్పిచ్చిన ధనం తిరిగి రావాలంటే చెయ్యాల్సిన పూజ...

కష్టపడి పైసా పైసా కూడబెట్టిన ధనం నమ్మకంగా మీ నుంచి పొంది ఆపై ఇవ్వనప్పుడు, రానప్పుడు భైరవ పూజ చేయాలి. తలస్నానం చేసి భైరవునికి సకల పూజలు చేసి నైవేద్యంగా పెట్టిన ప్రసాదాన్ని పదిమందికి పంచాలి. భైరవుడు మహా ఆగ్రహం కలవాడు. ఒక్కోసారి అవతల వారికి మహాపకారం కూడా చేస్తాడు.

శ్రీ ఉమామహేశ్వర స్తోత్రము చదవి ధ్యానించుట ద్వారా సకల సౌభాగ్యాలతోపాటు భర్త అనారోగ్యం నుంచి కోలుకుని ఆరోగ్యవంతుడవుతాడు.

ధనవంతులవ్వటానికి చెయ్యాల్సిన విశిష్ట పూజ...

శనివారంనాడు, దగ్గరిలోని ఆలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామికి పూల అలంకరణ చేయించాలి. తులసీ, మల్లెలూ, చామంతులూ ఇలా అన్ని రకాల పూలతో స్వామిని నిత్య పెళ్లి కొడుకులా అలంకరించమని చెప్పాలి.

తన భర్తకి చేసిన భక్తి గౌరవాలకి ధనలక్ష్మి సంతసిస్తుంది. తనకు చేసిన పూజ కన్నా తన భర్తకు పూజాదికాలు చేసిన భక్తులకు అపార సంపదనిస్తుంది. ఉదయం అలంకరణ అయ్యాక, సాయంత్రం మళ్ళీ స్వామిని దర్శించి వారిచ్చిన ప్రసాదాన్ని పది మందికీ ఇచ్చి స్వామి కృపకు,

అమ్మవారి కృపకు పాత్రులవ్వండి. ఇలా ఏడు శనివారములు పూల సేవ చేసిన వారికి ధనంతోపాటు కీర్తి వస్తుంది.

కుటుంబంలో అనారోగ్యాలు దూరమవ్వాలంటే...

మీ గృహంలో గానీ, దేవాలయంలో గానీ శాంతి యజ్ఞం చేయించాలి. యజ్ఞం జరుగుతున్నంత సేపు భక్తి నిష్ఠలతో ఉండి సేవించాలి. యజ్ఞం పూర్తయ్యాక, యజ్ఞ కుండంలోని విభూదిని నిత్యం ధరించాలి.

యజ్ఞ కార్యమప్పుడు మీ మీ బంధుహితులను పిలిచి ప్రసాదాన్ని పెట్టాలి. అలాంటి యజ్ఞం చెయ్యటం ద్వారా పీడించే అనారోగ్యాలు కుదుట పడటమే కాక, మీ కుటుంబానికి ఉన్న నరదిష్టి తొలుగుతుంది.

వ్యాపారంలో ఎదుగుదల లేకుంటే...

ఎంత ప్రయత్నించినా, వ్యాపారంలో ముందుకు సాగలేకపోతుంటే ఎక్కడ ప్రారంభించిన

వ్యాపారం అక్కడే ఉంటే, ధీరోదాత్తుడైన శ్రీ ఆంజనేయస్వామికి మంగళవారం పూట నూట ఎనిమిది లేదా వెయ్యి నూట పదహారు తమలపాకులతో ఆకు పూజ చేయించండి. కొబ్బరి, అరటి పండ్ల ప్రసాదాన్ని ఆ రోజు దేవాలయానికి వచ్చిన భక్తులకు మీరే స్వయంగా ఇవ్వండి. హనుమంతుని దివ్యశక్తికి ప్రభావితులై అనతి కాలంలోనే మీ రంగంలో మహా విజయం సాధిస్తారు. వ్యాపార సంస్థలో శతమంత్రజపం చేయించుకుంటే ఇంకా మంచిది. కార్యాలయంలోని దోషాలు కూడా పోతాయి.

దీర్ఘాయుర్దాయం కోరుకునేవారు చెయ్యాల్సిన అభిషేకం...

పాత్రకు సూత్రవేష్టనం చేసి మంత్రజలంతో నింపి భూమిలో పాతిపెట్టి నలువైపులా తీర్థజలాలను ఆవాహన చేసి, అనేక ఫల పూల మంత్రాలతో పూజించి, బియ్యమూ, ఆవాలూ, నువ్వులూ, పాలు కారే చెట్ల నుంచి చిగురాకులూ సేకరించి అర్పించాలి.

ఆపై ఆ నీటిని తమపై చల్లుకోవాలి. అనేక భూత, రోగ, దోష దిష్టిలన్నీ పోయి ఆరోగ్యవంతుడై దీర్ఘాయుర్దాయం కలుగుతుంది. ఇది విప్రుల చేతనే చేయించుకోవాలి. స్వయంగా తగదు.

అధర్మ ధనం ద్వారా ఆహారము ఎక్కువ తీసుకోవాల్సి వస్తుంది. తద్వార అనారోగ్యం. ఆ అనారోగ్యంతో పుణ్యకార్యాలను చేయలేక ఇహలోకంలోనే నరకాన్ని అనుభవించాల్సి ఉంటుందని మనుధర్మశాస్త్రం తెలియస్తోంది.

చర్మ రోగాలు పోవటానికి చెయ్యాల్సిన పూజ...

సకల జీవకోటికి అన్నప్రదాతైన సూర్య భగవానుణ్ని స్మరించాలి. అన్నం పాయసం వండి

సూర్యదేవునికి నివేదించాలి. ఆపై హోమం చేసి మిగిలిన నైవేద్య ప్రసాదాన్ని భుజించాలి. ఉదయాన్నే ప్రత్యక్ష నారాయణుడ్ని చూస్తూ స్మరించి పూజించాలి. భాస్కరుని హోమం చేసిన ప్రసాదాన్ని బుతుస్నాతలు తింటే గర్భవతులవుతారు. తేజస్సు గల పుత్రుడు జన్మిస్తాడు.

బంధువుల ఆస్తి కలవాలంటే...

పుష్పాలతో చేసే హోమాలు లక్ష్మీదేవికి ప్రీతికరాలు. ఎర్రకలువలతో లక్ష్మీదేవికి హోమం చేస్తే సంపదలు వాటంతట అవే వస్తాయి. ఎర్రకలువలను నేతిలో ముంచి మంత్రోచ్ఛాటనలతో హోమం చేయించండి. అలాగే సప్తాహ హోమం చేస్తే మీ గృహమే లక్ష్మీ నివాసమవుతుంది. సంపదలకూ, ఆడంబరాలకూ, శుభకార్యాలకూ పుట్టినిల్లవుతుంది.

ఉద్యోగంలో ఉన్నతికి వెళ్ళాలంటే...

నదిలో నడుం వరకూ దిగి పరమేశ్వరుణ్ని స్తుతించినా, లేదా బిల్వవృక్ష సన్నిధిలో ఈశ్వరుణ్ని

ఓ మాసం పాటు నిత్యం పూజించి సేవించినా మీ కోరిక నెరవేరుతుంది. ఇంకా నమూల ఫలపల్లవంగా అనగా బిల్వవృక్షాన్ని వేళ్ళ, ఫలాలతో సహా యజ్ఞహోమం చేస్తే అత్యున్నతమైన స్థానంలో ఉంటారని శాంతి హోమ పర్వం శెలవిస్తోంది.

'నారాయణుడు' అనగా...

నారము అంటే నీరు, జలము. ఆయనము అనగా నివాసము. తొలుత జలంలో నివాసమేర్పరుచుకొనినందుకు ఆ దేవాదిదేవుడను నారాయణుడని భక్తిగా స్మరించుకుంటాము.

జపాలప్పుడు పూసలని ఎలా జరిపితే శాంతి...

- జపములప్పుడు బొటనవేలితో జరిపితే మోక్షం కలుగుతుంది. చూపుడు వేలితో పూసలని జరిపితే శత్రువులు నశిస్తారు.
- ఉంగరం వేలితో పూసలను జరుపుతూ జపిస్తే సకల శాంతి జరుగుతుంది.
- చిటికెన వేలితో పూసలను మారణంలో ఉపయోగించాలి.

ఏ దైవ జపానికి ఏ దారాన్ని వాడాలి...

విష్ణు జపానికి కట్టే మాలను ద్వాదశిలో మధ్యాహ్నం లోపు పట్టు దారం లేదా నూలు దారంతో కట్టుకోవాలి.

అమ్మవారి మంత్రజపానికి కట్టే పూసలమాలను పట్టుదారంతో అష్టమీ, చతుర్ధశీ రాత్రి సమయాల్లో కట్టాలి. మహాశివుని జపాలకి కట్టే మాలను ఊలూ, లేదా నారలతో త్రయోదశి పగటి పూట కట్టుకోవాలి.

మరొకరు కట్టిన మాలైతే మాలను పాత్రలో ఉంచి ఇష్టదైవాన్ని స్మరించి ఆవాహన చేసుకొని శుద్ధిపరిచి ఆపై జపమాలతో జపించుకోవాలి.

మోసం చేసిన భార్యని కానీ, స్నేహితుణ్ణి కానీ, సేవకుణ్ణిగానీ, గురువుని గానీ వదిలెయ్యటం కంటే పెద్ద శిక్షేమిలేదు.

ఏ దైవ జప మాలను ఏ సమయంలో కడితే ఫలం...

వినాయక జపమాలను చవితీ, చతుర్ధలప్పుడు పట్టు లేదా నూలు దారంతో కట్టుకోవాలి.

సూర్య జపానికి మాలను కట్టడం సప్తమినాడు పగటి పూట కట్టాలి. తన జపంకై తానే కట్టుకునే మాల మహా ఫలితాన్నిస్తుంది.

పాపముల ద్వారా ఏం క్షీణిస్తుంది...

ప్రతి పాప కార్యం చేసినంతనే భగవంతుని దివ్యశక్తి మీరు చేసుకున్న పుణ్యాలు హరించుకుపోయేలా చేస్తుంది. మనిషి తాను తెలియకుండానే శక్తి హీనుడవుతాడు. అలాంటి పాపాలు చేసే ఇంద్రుడు హీనమై శక్తి కోల్పోయాడు. తగు సమయం చూసి రాక్షసులు జయించేవారు. గౌతమ రూపం ధరించి అహల్యతో గడిపినందుకూ, అనేక ఋషుల తపస్సులను అప్సరసలను పంపి చెడగొట్టినందుకూ ఇంద్రునిలో శక్తితోపాటు తేజస్సు కూడా పోయాయి. అదే మనలాంటి మామూలు

వ్యక్తులు చేస్తే దరిద్రమూ, దోషాలూ, రోగాలూ, రొప్పులూ.... అంతే తేడా.

మద్యపానము ఎంతటి ఘోర స్థితిని తెచ్చి మహాపాతకాన్నిస్తుంది...

ఎంతధర్మపరుడనైనా, శాంత స్వభావుడనైనా రాక్షసునిగా మార్చి చెయ్యకూడని సమస్త నీచ కార్యాలనూ చేయిస్తుంది. వావి వరుసలను మరిపిస్తుంది. బలరాముడంతటివాడు తీర్థయాత్రలకు వెళుతూ మద్యపానము సేవించాడు. మద్యపానప్రియుడై విహరిస్తూ సూత మహర్షి అంతటివాణ్ని సంహరించాడు. దానితో శరీరము దుర్వాసన వచ్చింది. దాన్ని పోగొట్టుకొనుటకు సరస్వతీ నదీ తీర్థ స్నానము చేశాడు.

ఏ పాపాల వల్ల మరుజన్మలో ఎవరై పుడతారు...

H ధర్మంగా సంపాదించిన ధనాన్ని నమ్మకంగా కాజేసినవాడు గాడిదై పుడతాడు.

- H దుర్మార్గుడితో, నీచుడితో యజ్ఞయాగాదులు ధనం కోసం చేయిస్తే పురుగుగా పుడతాడు.
- H విద్య నేర్పిన గురువుకే ద్రోహం చేస్తే అలాగే గురు భార్యని కామిస్తే కుక్కగా పుడతాడు.
- H తల్లీ, తండ్రినీ తిట్టినవాడు ఆడ గాడిదగా జన్మిస్తాడు.
- H సోదరుని భార్యని తిట్టినవాడు పావురమై జన్మిస్తాడు.
- H యజమాని ధనాన్ని అపహరించినవాడూ, ఆ యజమానిని బైట తిట్టేవాడూ కోతియై జన్మిస్తాడు.
- H విశ్వాస ఘాతక కార్యాలు చేసినవాడు చేపగా పుడతాడు.
- H ఆహార పదార్థాలను దొంగిలించినవాడు ముంగిసగానూ, ఎలుకగానూ జన్మిస్తాడు.
- H పరస్త్రీని బలవంతంగా లోబరుచుకున్నవాడు తోడేలు జన్మ ఎత్తుతాడు.
- H స్నేహితుని భార్యను పొందినవాడూ, కామించినవాడూ పందిగా పుడతాడు.
- H ధర్మపూజా కార్యములను చెడగొట్టినవాడు పేడలో పురుగుగా పుడతాడు.

- H ద్రవ పదార్థాలను అపహరించినవాడు పిల్లిగా పుడతాడు.
- H బంగారాన్నీ, వెండినీ దొంగిలించినవారు క్రిములుగా జన్మిస్తారు.
- H చీరలను అపహరిస్తే చిలుకగానూ, సోదరుని భార్యను అనుభవిస్తే కోకిలగానూ జన్మిస్తారు.
- H భూములను అక్రమించుకున్నవాడు వెదురు వృక్షమై పుడతాడు.
- H పరస్త్రీలను తెచ్చి పక్కవాడికి తార్చటం వల్ల నపుంసకుడిగా జన్మిస్తాడు – శ్రీ మార్కండేయ పురాణం.

'ఓం నమఃశివాయ' అను పంచాక్షరి మంత్రము పలించితే వచ్చే పుణ్యం లెక్కించుటకు బ్రహ్మదేవునికే సాధ్యపడదని బ్రహ్మఖండం చెబుతోంది. ఈ మంత్రం సర్వవేళలయందు శుభప్రదమే.

ధనాన్నీ, లక్ష్మీదేవి పటాన్నీ ఎక్కడుంచితే మహా దోష దరిద్రము...

శిరస్సు మీద, అనాలోచితంగా లక్ష్మీదేవి చిత్రాన్ని కూడా శిరస్సుపై ఉంచుకోకూడదు. శ్రీ మహావిష్ణువు భార్యను, మంగళములను ఇచ్చునదీ, సకల జగత్తుకు ధనము ద్వారా సుఖములనిచ్చు లక్ష్మిని రాక్షసులంతా అపహరించదలచి దౌర్జన్యంగా పల్లకిలో ఎక్కించి శిరస్సులపై పల్లకిని ఉంచుకొని మోసుకుంటూ వెళ్ళారు. దానితో వారికి లక్ష్మీ కళ తొలగిపోయింది. దేవతల చేతిలో ఓడిపోయారు. సముద్ర గర్భంలోకి వెళ్ళి దాక్కున్నారు.

ఇంట్లోంచి బైటికెళ్తూ, లోనికొస్తూ గడప తొక్కితే...

వ్యాపారంలో ఎదుగుదల ఉండదు. గడప సౌభాగ్యానికీ, లక్ష్మీదేవికీ స్థానము. పొరపాటున కాలు తగిలితే నమస్కరించుకోవాలి. కొంతమందికి తెలియక లేదా అలవాటుగా గడప తొక్కుతూ

వెళ్తారు. గడపకి అలా కాలు తగలటమనే దోషం వల్ల ఏ కార్యములోనూ వృద్ధి ఉండదు. పసుపు రాసినా, రంగు వేసినా గడప గడపే.

ఆశ్వియుజ మాసంలో పాత ధాన్యాన్నీ, క్రితం రోజు నాటి పండ్లనూ, కాయలనూ ఆహారంగా స్వీకరించటం ద్వారా అనారోగ్యం కలుగుతుందని భృగుమహర్షి చెప్పిన మానవధర్మ శాస్త్రం శెలవిస్తోంది.

సంగీత సాధన చేసేవారు ఏ తల్లిని పూజించాలి...

నిర్మల మనస్సుతో త్రికాలములందు స్నానమాచరించి మితమైన ఆహారాన్ని తీసుకుంటూ అక్షర స్వరూపమైన సరస్వతీ దేవిని ధ్యానించాలి.

మంత్రాత్రయ యుక్తమైన ఓంకారము సరస్వతిదేవి. అట్టి సరస్వతీ దేవిని ఉపాసించి

నందుకే అశ్వతరుడను నాగరాజుకు ఆ తల్లి, సప్తస్వరములూ, సప్తగ్రామరాగములూ, సప్త గీతములూ సమస్తమూర్ఛనలూ, ఇంకా నలభై తొమ్మిది తాళములూ, మూడు గ్రామములూ తెలిపింది. వాటితోపాటు త్రివిధములైన లయలూ, త్రివిధగతులూ, చతుర్విధములైన తాళాలనూ అనుగ్రహించింది చదువుల తల్లి సరస్వతీ దేవి.

కుబేరుడంత ధనవంతుడవ్వాలంటే...

ధనలక్ష్మి సమస్త దీవెనలని ఇచ్చి మహా సంపదగలవాడిగా లోకానికి చాటాలంటే ఎన్నో అర్హతలుండాలి. కాకిలా అలసత్వము పనికిరాదు. కోకిల వలే అనేక ప్రాంతాలను చుట్టాలి. తుమ్మెదలు శత్రువుల వశం కానట్టు, జూద, మద్య, కామ విషయాల్లో లొంగిపోకూడదు. పాము వలే తన చిన్న శత్రువుని కూడా వదలక శత్రు సంహారము చేసినట్టు విరోధులను తుడిచి పెట్టాలి. నెమలి తన ఫించము విస్తరించినట్టు రోజు రోజుకు తన సంపదను పెంచాలి. హంస గుణం వలే స్వేచ్ఛగా ఉండాలి. కోడిలా సమయానికి నిద్ర లేవాలి. పద్మం

వలే పదిమందినీ ఆహ్లాదపరచాలి. చీమ వలే క్రమ శిక్షణతో నుండాలి. అప్పుడే మహాలక్ష్మి కరుణ కూడా తోడై ఈ భూమిపై మహా సంపద గల వాడిగా చేస్తుంది. అలర్కుడికి మదాలస చెప్పిన సారాంశమిది.

ఎలాంటి అతిథికి భోజనం పెడితే పుణ్యం...

అతిథి భగవత్ స్వరూపము. అట్టివానికి భోజనము పెట్టడం భగవంతునికి నైవేద్యం పెట్టినట్టే. అతిథికి నమస్కరించాలి. అలాగే మిత్రుడూ, పరిచయస్థుడూ, ఆ ఊరివాడూ, తెలిసినవాడూ అయితే అతిథి క్రిందకురాడు. అతిథి కులనామధేయములను అడగరాదు. ఆకలితో వచ్చినవాడై ఉండాలి. అలసి సొలసినవాడై ఉండాలి. అతిథి రూపాన్ని అసహ్యించుకోకూడదు. భగవత్ రూపంగా భావించి భోజనాదులతో తృప్తి పరచాలి. అతిథి తృప్తి చెందకపోతే పుణ్యం సంగతి అటుంచి వాని పాపం కూడా గృహస్థు పొందాల్సి ఉంటుందని గృహస్థాశ్రమ ధర్మ శాస్త్రము శెలవిస్తోంది.

పితృ దేవతలకి ఏ సమయంలో పెడితే పుణ్య లోకాల్లో విహరిస్తారు...

ఉత్తమమైన కాలములు సూర్యచంద్ర గ్రహణములప్పుడూ, ఉత్తరాయణ మందూ, విషువత్ పుణ్య సమయానా, సూర్య సంక్రమణ సమయానా, చెడు కలలు వచ్చినప్పుడూ, జన్మ నక్షత్రాదులప్పుడూ, గ్రహ పీడలు సంభవించి నప్పుడూ పితృదేవతలకు చెయ్యాల్సిన విధులను చేయిస్తే ఆ లోకాల నుంచి దీవెనలు వస్తాయి. ఆ దీవెనలు ఆయుష్యమునూ, ధనాన్నీ, సుఖాలనూ ఇస్తాయి.

పితృకార్యాలు చేసే విప్రుడు దొంగ, మద్యాన్ని అమ్మేవాడూ, త్రాగేవాడూ, వేదాలను విక్రయించేవాడూ, పిప్పిగోళ్ళుకలవాడూ, స్నేహితుణ్ని మోసం చేసినవాడూ, రోగీ పనికిరాడు. శ్రాద్ధ కర్తా, శ్రాద్ధ భోజీ ఇరువురూ ముందురోజు స్త్రీ సాంగత్యము చేయకుండా ఉండాలి. అప్పుడే పితురులు శాంతిస్తారు. శుభాలను దేవతల చేత ఇప్పిస్తారు.

పితృదేవతలకి ఏ తిథిలో పెడితే ఎంతటి పుణ్య లాభం...

- పాడ్యమినాడు అపార ధన లాభము కలుగు తుంది.
- విదియనాడు సంపత్తి లభిస్తుంది.
- తదియనాడు కోరిన కోర్కె సిద్ధిస్తుంది.
- చతుర్ధినాడు మీ శత్రువులు నశిస్తారు.
- పంచమినాడు శ్రీ లభిస్తుంది.
- షష్ఠినాడు మహా గౌరవము.
- సప్తమినాడు ఉన్నతస్థానము లభిస్తుంది.
- అష్టమినాడు వ్యాపార వృద్ధి.
- నవమినాటి కార్యానికి సంపదలకన్నా మిన్న అయిన స్త్రీ లాభము.
- దశమినాడు అన్ని కోర్కెలు తీరే అవకాశాలొస్తాయి.
- ఏకాదశినాడు సకల ధర్మసూక్ష్మ జ్ఞానము కలుగుతుంది.
- ద్వాదశినాడు గొప్ప ప్రయోజకుడైన సంతానము కలుగుతుంది. పుత్రుడుంటే పేరు తెచ్చిపెడతాడు.

H త్రయోదశినాడు అనారోగ్యములు దూరము అవుతాయి. ధనప్రాప్తి.
H చతుర్ధశినాడు వయసులో పోయిన తల్లీ, తండ్రులకు మాత్రమే చేయాలి.
H అమావాస్యనాడు నకల అభీష్టములు నెరవేరుతాయి.

ఏ నక్షత్రమున పితృదేవతలకి పిత్కకార్యాలు చేస్తే ఎలాంటి ఫలమొస్తుంది...

H అందమైన సంతానము కొరకు రోహిణి నక్షత్రమున.
H మృగశిరా నక్షత్రమందు కీర్తి.
H ఆర్ద్రా నక్షత్రమందు శౌర్యము.
H పునర్వసు నక్షత్రమందు పుణ్యక్షేత్ర లాభము.
H పుష్యమి నక్షత్రమందు పుష్టి.
H ఆశ్లేష నక్షత్రమందు వంశానికి కీర్తి తెచ్చే పుత్రుడు.
H మఘా నక్షత్రమందు అయినవారందరిలోకి కీర్తి వంతుడవుతాడు.

H పూర్వఫల్గుణీ నక్షత్రమందు ఇంటి స్త్రీలకు సౌభాగ్య ఫలము.
H ఉత్తర ఫల్గుణీ నక్షత్రమందు పది మంది మెచ్చుకునే పుత్రుడు జన్మిస్తాడు. లేదా ప్రవర్తిస్తుంటాడు.
H హస్తా నక్షత్రమందు కార్యము చేసిన వాని పుత్రుడు పూజలందుకుంటాడు.
H చిత్తా నక్షత్రమందు కార్యము చేసినవాని పుత్రుడు వంశానికి వన్నె తెస్తాడు.
H స్వాతి నక్షత్రమున వ్యాపార వృద్ధి.
H అనురాధ నక్షత్రమున అనారోగ్యములు దూరమవుతాయి.
H పూర్వాషాధ నక్షత్రమందు యశః ప్రాప్తి కలుగుతుంది.
H ఉత్తరాషాధ యందు పాత వ్యధలన్నీ తీరుతాయి.
H శ్రావణము నందు శుభకార్యాలు జరుగుతాయి.
H ధనిష్ఠా నక్షత్రమందు కార్యము చేసినవానికి అపార ధన ప్రాప్తి.
H అభిజిన్నక్షత్రమందు కార్యం చేసిన వాని సంతానానికి జ్ఞానము వృద్ధి అగును.

- శతభిషా నక్షత్రమందు కార్యము చేసినవానికి శాస్త్ర జ్ఞానము సిద్ధిస్తుంది. ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది.
- పూర్వాభాద్ర నక్షత్రమందు వ్యాపార పెంపు.
- ఉత్తరాభాద్ర యందు కార్యం చేసిన వానికీ, వాని సంతానానికీ సరస్వతీ దేవి దీవెనలు.
- రేవతి యందు కార్యము చేసినవారికి వ్యాపారం బంగారము.
- అశ్వని యందు కార్యము చేసినవారికి మహా బలము.
- భరణి యందు కార్యము చేసినవారికి దీర్ఘాయుర్ధాయము కలుగుతుంది.

గృహస్థు చెయ్యకూడని దోషాలు...

- సూర్యోదయాన్నీ, సూర్యాస్తమయాన్నీ చూడరాదు.
- పర స్త్రీ ముఖమును మాత్రమే చూసి మాట్లాడాలి.
- ఋతుమతి అయిన స్త్రీని చూడరాదు. స్పర్శించరాదు.

- భోజనాన్ని తూర్పు ముఖంగా గానీ, ఉత్తరముఖంగా గానీ కూర్చొని భుజించాలి.
- అధిక ఉప్పునూ, అధిక వేడి ఆహారాన్ని వదలాలి.
- ఎంగిలి చేత్తో ఏ వస్తువునీ పట్టుకోకూడదు. అట్లే సూర్యచంద్ర నక్షత్రాలను చూడకూడదు.
- ఏక వస్త్రముతో పూజలు చేయకూడదు.
- రెండు చేతులతో తలను గీరుకో కూడదు. అలా గీరుకుంటే లక్ష్మీదేవి అక్కను రమ్మని ఆహ్వానించినట్టే.
- పగలు ఉత్తర దిశగా, రాత్రి దక్షిణ దిశగా మలమూత్రాలను విడవాలి.
- పాదములూ, తొడలూ చాపుకొని కూర్చొనరాదు.
- ఉత్తర దిక్కు, పశ్చిమ దిక్కు తల పెట్టి నిద్రించకూడదు.
- పక్కపైనా, నేలపైనా 'హా' అంటూ కూర్చోరాదు.
- నురుగు గల నీటిని త్రాగరాదు. నురుగు వచ్చిన ఏ పదార్థాలనూ తినకూడదు. అవి విషపూరితములు.

- సంధ్యాకాలమందు స్త్రీతో కలవకూడదు. అలా చేస్తే నపుంసకుడు పుడతాడు.
- పుత్రునికై తొలి అయిదు రాత్రులూ దూరంగా ఉండి ఆరవ రాత్రి సంగమించాలి.

(ఋతధ్వజుని భార్య మదాలస తన పుత్రునికి చెప్పిన గృహస్థ ధర్మాలివి)

ఏ మన్వంతరములు చదివితే ఏ ఫలం అందుతుంది...

- స్వాయంభువ మన్వంతరము వినినవారికి సకల ధర్మజ్ఞానము అందుతుంది.
- స్వారోచిష మన్వంతరము చదివినచో సకల కోరికలు సిద్ధిస్తాయి.
- ఔత్తమ మన్వంతరము శ్రవణము చేసినచో అపార ధనప్రాప్తి.
- తామస మన్వంతరము వినినచో సకల విద్యా జ్ఞానము వస్తుంది.
- రైవత మన్వంతరము చదివినచో సకల సద్గుణాల సౌందర్యవతి అయిన స్త్రీ భార్యగా వస్తుంది.
- చాక్షుష మన్వంతరము విన్నచో సకల అనారోగ్యాలూ పోతాయి.

- వైవస్వత మన్వంతరము చదివినచో మహా బలమూ, తేజస్సూ కలుగుతాయి.
- సూర్యసావర్ణిక మన్వంతరము విన్నచో కీర్తి తెచ్చే సంతానము వారికీ, వారి సంతానానికి కూడా కలుగుతుంది.
- బ్రహ్మసావర్ణిక మన్వంతరము విన్నచో ఊహించని శుభాలు జరుగుతాయి.
- ధర్మసావర్ణిక మన్వంతరము శ్రవణము కుటుంబమంతటికీ మంగళకరము.
- రుద్రసావర్ణిక మన్వంతరము విన్నచో మహా విజయాన్ని పొందుతారు.
- దక్ష సావర్ణిక మన్వంతరము శ్రవణము చేసినచో మహాత్ముడిగా కీర్తి గడిస్తారు.
- రౌచ్య మన్వంతరము విన్నచో సకల శత్రువులపై మహా విజయము.
- భౌత్య మన్వంతరమును శ్రవణము చేసిన దైవబలము కూడా తోడై ఉంటుంది.
- ప్రతి మన్వంతరములో గల దేవతల, ఋషుల, పుణ్యపురుషుల వంశగాథలను తెలుసు కోవటం ద్వారా ఉత్తమమైన ఫలితాలు మానవులకు కలిగి సుఖంగా ఉంటారు.

గ్రహాలన్ని మీ పట్ల సముఖంగా ఉంటాయి. ఈ మహా ఫలాల గూర్చి క్రౌష్టకి మార్కండేయుడు విస్తార సహితంగా వివరించాడు.

హరి... హరి.. అని ఎప్పుడనాలి...

అమంగళం విన్నప్పుడు అంటే ఆ దోషం పోతుంది. అబద్ధం చెప్పేవాడిది ఎంత పాపమో, విన్న వాడిది అంతకు మించిన పాపం. వావివరుసలు లేకుండా తమ గొడవల మధ్య అన్నెం పుణ్యం ఎరుగని స్త్రీల గూర్చి నీచంగా అబద్ధాన్ని నిజంగా చెప్పి మాట్లాడుతుంటే వినేవాడిది మహా దోషమవుతుంది.

చెయ్యకూడని కార్యాలను ధన అధికార కామ, లోభాలతో ఆశ చూపుతున్నప్పుడూ వెంటనే హరి... హరి అని ఆ విషయాన్ని నా దగ్గర మాట్లాడొద్దని చెప్పి పక్కకొచ్చేయాలి.

అప్పుడే ఆ దోషం అంటదు. దేవలోకం వెళ్ళిన అర్జునుణ్ని తన అపూర్వ లావణ్యాన్ని అనుభవించమని ప్రణయావేశంతో ఊర్వశి అంటే

దానికి అర్జునుడు హరి... హరి అని ఆ అమంగళ మాటల దోషాన్ని పోగొట్టుకున్నాడు. 'మా వంశకర్త పురూరవుడికి భార్యవు.

తల్లి వరుసైన నీవు అనకూడని మాటలు అవి. అన్న నీకంటే విన్న నాకే ఎక్కువ దోషమని' అర్జునుడు హరిని తల్చుకున్నాడు. ఆ సమయాల్లో తలచుకుంటే దోషం పోతుంది. మిగతా ఏ సమయాల్లోన్నైనా శ్రీహరిని తల్చుకుంటే పుణ్యం కలుగుతుంది.

అన్నీ ఉండి స్వార్థబుద్ధితో తప్ప చేస్తే వెయ్యి రెట్ల పాపాన్నీ, తనకి దక్కినది ఎవ్వరికీ దక్క కూడదని నీచం చేస్తే పది వేల రెట్ల పాపఫలాన్నీ, ఆకలితో కడుపు కోసం నీచం చేస్తే ఒక రెట్టు పాపాన్ని అనుభవించాల్సి ఉంటుందని మనుధర్మశాస్త్ర సారాంశము.

శ్రీ విష్ణు దేవాలయ పుష్కరిణీల్లో స్నానం ఎంత మహాత్మ్యం...

మనశ్శుద్ధిర్భవే న్న వాణాం।
స్వామి తీరథ నిషేవనాత్॥

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని పుష్కరిణిలో గానీ, ఏ విష్ణు దేవాలయాల పుష్కరిణిలో గానీ స్నానమాచరిస్తే గురు భార్యకు చేసిన ద్రోహమూ, వివాహాల్లో వస్తు, ఆభరణాలు దొంగతనాలు చేసిన పాపములూ, నీచులతో స్నేహము చేసిన పాపములతోపాటు మద్య మాంసాదులు స్వీకరించిన దోషాలు కూడా పోతాయి.

కాశీని దర్శిస్తే ఎంతటి పుణ్యం...

భూమి పుట్టినప్పుడు, తొలి సూర్య కిరణం పడిన పుణ్య ప్రాంతం. మహేశ్వరుడు ఎన్నో సంవత్సరాలు ఈ వారాణాశిలోనే గడిపాడు.

ఇక్కడ దశాశ్వమేధ ఘాట్‌కు బ్రహ్మదేవుడు పది అశ్వాల రథాన్ని మహా శివునికై పంపాడు. ఈ మహా పుణ్య క్షేత్రాన్ని పితరుల కార్యార్థమై వెళితే ఆ ఫలం మాత్రమే వస్తుంది. క్షేత్రాన్ని దర్శించిన పుణ్య

ఫలం రాదు. కాశీ విశ్వేశ్వరస్వామిని దర్శించటానికే కాశీ వెళ్ళాలి. అప్పుడే మహా కాశీ క్షేత్ర దర్శన పుణ్య ప్రాప్తి.

శనిగ్రహం పట్టలేని దేవుళ్ళు...

వినాయకుడూ, హనుమంతుడూ. వీరిద్దరికి శనీశ్వరుడి వల్ల ఈతి బాధలు కలగలేదు. రావణుడి చెరలోని దిక్పాలకులకూ, నవగ్రహాలకూ శ్రీరాముడి ద్వారా ఆంజనేయస్వామి స్వేచ్ఛ కలిగించాడు. దానితో శనీశ్వరుడు హనుమ భక్తులని అంత తేలికగా ఎంతో కారణం ఉంటే గాని బాధించనని వరమిచ్చాడు. శనిగ్రహ దోషాలున్నవారూ, ఏలిననాటి శని ప్రభావం ఉన్నవారూ అమావాస్య లేదా శనివారం ఆంజనేయస్వామికి నేతితో దీపం వెలిగించి స్తుతిస్తే ఈతి బాధలు పోవటంతోపాటు సంపదలూ లభిస్తాయి.

శ్రీ రామ నవమినాడు ఇంట్లో శ్రీరామ పూజ ఎంతటి ఫలం...

ఆ పుణ్య రోజున వేకువ జామునే లేచి అభ్యంగ స్నానం చేసి పూజా మందిరాన్ని

శుభ్రపరుచుకోవాలి. శ్రీ సీతారామలక్ష్మణ భరత, శత్రుఘ్నులతోపాటు హనుమ ప్రతిమని సిద్ధం చేసుకొని పువ్వులతో, పండ్లతో శ్రీరామ సహస్ర నామము చదువుతూ, పూజ ప్రారంభించాలి. నైవేద్యానికి బెల్లం, మిరియాలతో కలిపిన పానకం, వడపప్పు, కమలా కాయలను స్వామికి అర్పించాలి.

పందిళ్ళలో శ్రీ సీతారాముల కళ్యాణం వీక్షించినవారికి సంతానం అభివృద్ధి, అష్టైశ్వర్యాలు లభిస్తాయి. తన రాముడ్ని పూజించినందుకు హనుమ ఆ కుటుంబానికి రక్షకుడై ఉంటాడు.

శ్రీ సత్యనారాయణ స్వామి పూజ ఎప్పుడు చేస్తే అమోఘ ఫలం...

ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి, చంద్రుడు ఉత్తరా ఫాల్గుణ నక్షత్రంలో ఉండే ఈ రోజు అనగా హోళీ పండగ రోజున పూజించాలి.

ఈ రోజున చాలా మంది శ్రీలక్ష్మీనారాయణ వ్రతం, అశోక పౌర్ణమి వ్రత పూజ, వెలుగుని ప్రసాదించే చంద్రుని పూజలూ చేస్తారు. ఈ రోజు చేసే పూజల వల్ల సౌభాగ్య సిద్ధి కలిగి, సకల సంపదలు నెరవేరతాయి.

త్రిపుండ్ర విధి అనగా పరమేశ్వరుడికి అర్పించిన మంత్ర జలంతో కూడిన భస్మం. ఆ భస్మాన్ని స్కందము నందు ధరించిన వానిని చూసినా మహాపుణ్యమని స్వయంగా రుద్రుడే దేవాదిదేవతలకి శెలవిచ్చాడు.

సరస్వతీ దేవిని ఏ రోజు పూజిస్తే ఎంతటి విద్యా ఫలం...

మదన పంచమి. దీన్నే మాఘ శుద్ధ పంచమని కూడా అంటారు. ఈ రోజే సరస్వతీదేవి పుట్టినరోజు. వినాయకచవితినాడువలె పిల్లలు సరస్వతీదేవిని పూజించటం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. తెల్ల బట్టలు ధరించి నైవేద్యంగా చక్కెర పొంగలి, మినప గారెలను నివేదించాలి.

గృహస్థురాలు నలుగురు ముత్తైదువులను పిలిచి తాంబూలం ఇచ్చి జరుపుకుంటే సంతానానికి విద్యా ప్రాప్తితోపాటు ధైర్యం, సామర్థ్యాలు లభిస్తాయి.

వైకుంఠ ఏకాదశినాడు ఉత్తర ద్వారం దర్శిస్తే ఎంత పుణ్యం...

మహా రాక్షసులు పెట్టే బాధలు భరించలేక ఈ ఏకాదశి రోజే బ్రహ్మతో కలిసి వైకుంఠంలో ఉత్తర ద్వారం గుండా దేవతలు వెళ్ళి స్వామికి మొరపెట్టుకొని ఆ రాక్షస పీడలు వదిలించుకున్నారు.

అంత పుణ్య ఏకాదశినాడు వైకుంఠవాసుడు దివి నుంచి భూలోకానికి దిగి వచ్చి గరుత్మంతుడి వాహనధారుడై ముక్కోటి దేవతలతోపాటు మనకీ దర్శనమిస్తాడు.

ఈ ముక్కోటి ఏకాదశినాడు చేసే పూజా, దానం, వ్రతం ఎన్నోరెట్లు ఫలమిస్తుంది. స్వామిని దర్శించుకోవటానికి దేవాలయానికి తెల్ల బట్టలు ధరించి వెళ్ళి స్వామి ప్రీతికి పాత్రులవ్వండి.

ఈ రోజున స్వామికి జాజి మల్లెల మాలను సమర్పించి, ఆకు పచ్చని పండ్లను ఇస్తే సకల

పాపాలు హరించుకుపోతాయి. ఇంట్లో పూజలో పాయసము, తీపి పదార్థాలు నైవేద్యంగా పెట్టాలి.

మోక్ష ఏకాదశిన విష్ణు పూజ ఎంతటి ఫలం...

అన్ని మాసాల్లో కెల్లా మార్గశిర మాసం అత్యున్నతమని శ్రీకృష్ణభగవానుడు శెలవిచ్చాడు. ఈ మాసంలో విష్ణు పూజా వ్రతం ముఖ్యంగా ఏకాదశి రోజున చేస్తే సకల సంపదలను పొందే అదృష్టం కలుగుతుంది. మార్గశిర శుద్ధ ఏకాదశినాడు చేసే పూజ పితరులకి అంది, వారి నుంచి కూడా దీవెనలొస్తాయి.

మార్గశిర శుద్ధ ద్వాదశినాడు ఏ పుష్కరిణిలో స్నానం చేస్తే మహా పుణ్యం...

భువిపై మూడు కోట్ల తీర్థాలున్నాయి. ఆ సకల మూడు కోట్ల తీర్థాలన్నీ మార్గశిర శుద్ధ ద్వాదశినాడు శ్రీ తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరుని పుష్కరిణిలో ప్రవేశిస్తాయని పురాణ

సారాంశము. ఆ రోజున స్వామి పుష్కరిణిలో స్నానమాచరిస్తే అష్టభోగాలు కలుగుతాయి. అనంతమైన సుఖాలు వద్దన్నకొద్ది అందుతూనే ఉంటాయి. ఎక్కడి కెళ్ళినా రాచమర్యాదలు జరుగుతాయి. లేమి అన్నది తెలీదు ఆ కుటుంబానికి.

ఆది, సోమ, బుధవారము లందు, అమావాస్య వచ్చినప్పుడు సముద్ర స్నానమూ, దానమూ, భగవంతుని పూజా, హోమమూ, వ్రతము వంటివన్నీ రెండింతల పుణ్యాన్ని కలిగిస్తాయి.

దక్షిణాయణములో పితురులకి కార్యమెంత ప్రీతి...

ఉత్తరాయణం దేవతలకి ప్రీతికరమైనది. అదే దక్షిణాయణము పితురులకి ప్రీతికరమైనది. భాద్రపద బహుళ పాడ్యమి నుంచి అమావాస్య

వరకూ ఉండే ఈ దక్షిణాయణము కాలంలో పితురులకు పిండ కార్యాలు చేస్తే అది మహా అక్షయమంత తృప్తిని కలిగిస్తుంది. పితృపక్షంగా అనబడే ఈ రోజుల్లో ఆయా తిథుల్లో వారి వారికి తర్పణాలు ఇవ్వటం ఎంతో శుభము. తిథి గుర్తులేనివారు అమావాస్యనాడు వారివారి గోత్రనామాలతో చేసినా ఆ ఫలం పితురులకు, చేసిన కుటుంబానికి అందుతుంది.

వరలక్ష్మీ వ్రతం ఎంతటి సౌభాగ్య సిద్ధి...

వరలక్ష్మి వ్రతంనాడు శ్రీమహాలక్ష్మిని పూజించి సేవించిన వారికి మహా సంపదలతోపాటు సుఖమైన జీవితం లభిస్తుంది. గడపకి పసుపు, గుమ్మానికి తోరణాలు కట్టి నిష్ఠగా పూజించాలి. పీటపై నూతన వస్త్రం ఉంచి బియ్యంపోసి, దానిపైన నగలతోనూ జాకెట్టు ముక్కతోనూ అలంకరించిన కలశాన్ని పెట్టి పూజించాలి. ఆకు పచ్చని చీర ధరించిన లక్ష్మీ ప్రతిమను పూజించి, ఎర్రని అక్షతలను సిద్ధం చేసుకోవాలి. పసుపుతో అమ్మవారి ప్రతిమను చేసుకొని పూజిస్తే మహా సౌభాగ్యం

సిద్ధిస్తుంది. నైవేద్యంగా కేసరి, రవ్వలడ్డూ, జామకాయలని అర్పించాలి. పన్నెండు పత్తులతో నేతితో దీపాలంకరణ చేయాలి.

సాయం సమయాన శ్రీలక్షీసహస్ర నామము, శ్రీవరలక్ష్మీవ్రత కథ చదువుతూ అమ్మవారికి దీపారాధన చెయ్యటం ద్వారా మహాభోగ భాగ్యాలు కలుగుతాయి. ఈ రోజున లక్ష్మీ దేవాలయాలను దర్శించటం ద్వారా సుమంగళి పుణ్యం కలుగుతుంది. పూజయ్యాక ముత్తైదువులకి తాంబూలాలను ఇచ్చి దీవెనలు పొందాలి. ముఖ్యంగా ఆ రోజు పూజ అయిన తర్వాత అక్షింతలిచ్చి భర్తకి నమస్కరించి ఆశీర్వాదం తీసుకోవటం ద్వారా పతివ్రతా ధర్మ పుణ్యం కూడా కలుగుతుంది. చాలా మంది అన్నీ చేసి ఆఖరున ఈ విషయం మర్చిపోతుంటారు.

సంతానం కోసం ఏ దేవుణ్ణి ప్రతిష్ఠించాలి...

తల్లి దాస్య విముక్తిని పోగొట్టటానికి స్వర్గం నుంచి అమృత భాండాన్ని తెచ్చి కద్రువకిచ్చి దాస్యం నుంచి తల్లికి విముక్తిని కలిగించాడు వినతా పుత్రుడు, విష్ణువాహనుడు అయిన గరుత్మంతుడు.

ఇంద్రుడి వజ్రాయుధానికి ప్రతిగా తన రెక్కలోని ఓ ఈకను తీసి వజ్రాయుధాన్ని నిలిపిన మహా వీరుడు గరుత్మంతుడు. అట్టి గరుత్మంతునికి ఇష్టమైనది నాగపంచమి. శ్రావణ మాసంలో వచ్చే ఈ గరుడ పంచమిరోజు విష్ణు ఆలయాల్లో గరుడ మూర్తిని ప్రతిష్టించిన వారికి శూరుడైనవాడూ, తల్లీ, తండ్రిపై అపార ప్రేమాభిమానాలు కలవాడైన పుత్రుడు జన్మిస్తాడు. ఆ రోజున గరుడుడ్ని పూజిస్తే శ్రీ మహావిష్ణువు వారి పాపాలను పోగొట్టి పుణ్యాన్ని ప్రసాదిస్తాడు.

గర్భదోషాలూ, నాగదోషాలూ పోవాలంటే...

ఆదివారం వచ్చే నాగ పంచమిరోజు నాగరాజుకు పూజాదికాలు నిర్వహిస్తే ఆ దోషాలు పోతాయి. ఈ రోజు భూమిని త్రవ్వటం, చెట్టూ పుట్టా కొట్టడము, కొమ్మలు విరవటం వంటివి చేయకూడదు. ఈ రోజున నాగపూజ చెయ్యటం ద్వారా స్త్రీ గర్భదోషాలు తొలగిపోతాయి. నాగారాధన చేస్తే కోరిన కోర్కె అతి తక్కువ కాలంలో నెరవేరుతుంది.

యోగినీ ఏకాదశి ఎంత పుణ్యాన్నిచ్చే వ్రతం...

ఆగష్టు మానంలో వచ్చే యోగినీ ఏకాదశినాడు శివ పూజ చేస్తే ఎంతటి అనారోగ్యమునైనా వదల గొట్టుకోగలగుతారు. శివపూజ దోషంతో ఘోర వ్యాధి పొందిన కుబేరుడి సేవకుడు ఈ వ్రతం ద్వారానే వ్యాధిని పోగొట్టుకున్నాడు. ఈ రోజున శివునికి ఇష్టమైన పూలతో బ్రహ్మాండంగా అలంకరించి, ధూప దీప నైవేద్యాలతో సేవించాలి. ధూప దీపాలకి నేతినే వాడాలి. దంపత సమేతంగా పూజించాలి ఉమాశంకరుణ్ని.

నాగుల చవితి పూజ స్త్రీకి ఎంతటి ఆనందము...

భక్తి శ్రద్ధలతో నాగుల చవితినాడు పుట్టలో పాలు పొయ్యటం ద్వారా స్త్రీలకి గర్భదోషాలు తొలగిపోతాయి. చర్మ సంబంధిత వ్యాధులు ముఖ్యంగా జననాంగాల వ్యాధులు సమసిపోతాయి. లైంగిక అసంతృప్తి తీరుతుంది. భర్త అనురాగంతో

క్రితం కన్నా ఎక్కువ లాలిస్తాడు. ఈ రోజున సర్ప స్తోత్రాన్ని పఠించినవారికి సర్పదోషాలు పోతాయి.

రుద్రాక్షని తలపై ధరించి స్నానం చేస్తే గంగా స్నానం చేసిన ఫలమని 81,100 శ్లోకాలు గల స్కాందపురాణంలోని బ్రహ్మ ఖండం శెలవిస్తోంది.

అక్షయ త్రితీయ ఎంత పుణ్యమైన రోజు...

ఋషులతోనూ, విప్రులతోనూ అరణ్యవాసం చేస్తున్న పాండవులకి ఆహార కొరత లేకుండా సూర్యదేవుడు అక్షయ పాత్రనిచ్చినది ఈ రోజే. ధర్మరాజు సూర్యస్తోత్రానికి భాస్కర దేవుడు ఆనందించి అక్షయమను రాగిపాత్రను ఇచ్చాడు. ఎంతమందికైనా సకల భోజ్యాలనూ, భోజనాలనూ, లేహ్యాలనూ సిద్ధం చేసే ఆ పాత్ర ద్వారా ధర్మరాజు ఎన్నో సత్కార్యాలను చేశాడు.

ద్వాపరయుగంలో శ్రీకృష్ణుని స్నేహితుడు కుచేలుడు అటుకులను స్వామికి అర్పించి, అపార ధనరాసులను పొందినది ఈ అక్షయ త్రితీయనాడే.

ఈ అక్షయ త్రితీయరోజున బంగారాన్ని కొనటమే కాకుండా ముఖ్యంగా పెళ్లైనవాళ్ళు, కాని వాళ్ళూ లక్ష్మీ పూజ నిష్ఠగా చేయాలి. ఈ రోజు హోమాలు చేసినవారికి పదిరెట్లు హోమ ఫలం వస్తుంది. కొత్తగా ఏ వ్యాపార వ్యవహారం మొదలుపెట్టినా మహా వృక్షంలా విస్తరిస్తుంది.

- ఈ అక్షయ త్రితీయనాడు జలదానం చేస్తే మహా ఆరోగ్యం చేకూరుతుంది.
- వృద్ధ దంపతులకి శయ్యాదానం చేస్తే భర్త అనురాగం పెరుగుతుంది.
- వస్త్రాలను దానం చేయటం ద్వారా ఆయుష్షు వృద్ధి చెందుతుంది.
- కుంకుమ దానం ద్వారా దీర్ఘసుమంగళి అవుతుంది.
- చందనం దానమిస్తే అకాల నష్టాలు అరికట్టబడతాయి.
- తాంబూలాన్ని ముత్తైదువులకి ఇస్తే మహా పదవి భర్తకి కలుగుతుంది.

- అలాగే గొడుగు దానమిస్తే చల్లని సుఖ జీవనం. చెప్పులు దానం చేస్తే పితరులు సంతృప్తులవుతారు. ఈ అక్షయత్రితీయనాడే పరుశురాముడు జన్మించింది. ఈ రోజు చేసే లక్ష్మీపూజ వల్ల మళ్ళీ అక్షయ త్రితీయ వరకూ ఆ తల్లి చల్లగా చూస్తుంది. అమ్మవారి పూజ అయ్యాక పూజలో ఉంచిన ఎర్ర దారాలను దంపతులిద్దరూ, సంతానమూ కంకణములుగా ధరించాలి. ఈ అక్షయ త్రితీయ త్రేతాయుగ తొలిరోజు కూడా. సూర్య చంద్రులు సకల శుభాలనిచ్చే స్థానాల్లో ఉండేరోజు కూడా ఈ అక్షయ త్రితీయనాడు అనగా ఈ తదియే.

వ్యాసభగవానుడే కోపం వల్ల పుణ్యాన్ని కోల్పోయాడు...

వేదవ్యాసుడూ, పరాశరుని పుత్రుడూ అయిన కృష్ణద్వైపాయన మహర్షి సకల తీర్థముల యందు శుచిగా స్నానమాచరిస్తూ, పరమేశ్వరుణ్ణి ఉపవాసంతో ఆరాధిస్తూ, పితురులకు తర్పణములు విడుస్తూ, పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ ముందుకు

సాగేవాడు. ఆ ప్రయత్నంలో మహాక్షేత్రమైన వారణాసి చేరి మహాలింగరూపుడైన స్వామిని దర్శించి, అక్కడే కొంతకాలం నివశించాడు. ఓసారి ఎన్ని వీధులు తిరిగినా భిక్ష దొరకలేదు. దానితో వ్యాసభగవానుడు కోపంతో వారణాసిని 'ఈ క్షేత్రమునకు వచ్చిన వారికి పుణ్యం రాదని' శపించాడు. అప్పుడు పార్వతీదేవి ప్రత్యక్షమైంది. వేదాలను విభజించిన వ్యాసునితో చెప్పింది.

"నాయనా! కోపం అన్ని వేళలా ఎంతటి వానికీ తగదు. నీ శాపాని కంటే నీ కోపానికే నే ఇస్తున్న ప్రతి శాపం. 'నీ వంటి కోప గుణం కలవారు ఈ క్షేత్రంలో నివశింపశక్యముకాదు. కాన వారాణాసి నుంచి బహిష్కరిస్తున్నాను' అంది. దానితో వ్యాసుడు 'తల్లీ కోపం ఎంతటి వినాశనాన్ని కలిగిస్తుందో తెలునుకున్నాను. చతుర్ధశి అష్టమినాడు అయినా స్వామిని దర్శించుకొనే అవకాశం ఇవ్వ'మని ప్రార్థించి, పార్వతీదేవి దగ్గర ఆ వరం తీసుకున్నాడు. కాశీలో కోపస్వభావంలో ఉండి వెళ్ళిన దర్శన పుణ్యం రాదు. కాన కాశీ వెళ్ళినప్పుడు కోప స్వభావంతో ఎవ్వరి వద్దా ప్రవర్తించవద్దని సూతుడు మునులకి వివరించాడు.

చైత్రమాసంలో శుక్లపక్ష త్రయోదశి నాడు పరమశివుణ్ణి పూజిస్తే సంవత్సరమంతా శివుణ్ణి పూజించిన ఫలమొస్తుందని ధర్మసింధు శాస్త్రం స్పష్టీకరిస్తోంది.

ప్రయాగక్షేత్ర దర్శన పుణ్య ఫలమెంత...

ఈ క్షేత్రమున స్నానం చేసినవారికి పునర్జన్మ ఉండదు. బ్రహ్మాది దేవతలు నివశిస్తున్న పుణ్య క్షేత్రం ప్రయాగ. ఇక్కడ అన్ని తీర్థాల్లో మహా పుణ్యశక్తి ఉంది.

కేవలం ప్రయాగ క్షేత్రాన్ని దర్శించాలని అనుకుంటేనే పాపాలు సమసిపోతాయి. అయిదు కుండముల మధ్య గంగ ప్రవహిస్తున్నచోట మట్టిని ధారణ చేసుకున్నవారికి పాపం స్థానాన పుణ్యం వస్తుంది.

గంగానదిని ఎంత దూరంలోనున్నా స్మరించినంతనే పుణ్యమెలా కలుగుతుందో ఈ

ప్రయాగను తలుచుకున్నా అంతే పుణ్యం. గంగా యమునల మధ్య ప్రాంతంలో అన్నదానము తరతరాల వారిని కాపాడుతుంది.

గంగా యమునల మధ్య ప్రదేశము భూమి మధ్య ప్రదేశము. ఇక్కడ దానం, వ్రతం, హోమం, కార్యం మహోన్నతమైన ఫలమిస్తుంది. అరవై వేల తీర్థాలనూ, అరవై కోట్ల పుణ్యక్షేత్రాలను దర్శించిన భాగ్యం ఈ ప్రయాగ క్షేత్ర దర్శనము.

గంగ పుట్టిన ప్రదేశమూ, ప్రయాగా, గంగాసాగర సంగమమూ ఈ మూడే భువిపై మహా పుణ్యమిచ్చు ప్రదేశాలని ధర్మరాజుకి మార్కండేయ మహర్షి శెలవిచ్చాడు.

పాద నమస్కారం ఎలా పెడితే పుణ్యం...

గురువుకి నమస్కరించేటప్పుడు ఎడమచేతితో ఎడమ పాదం, కుడి చేతితో కుడి పాదము పట్టుకొని నమన్కరించాలి. గురువంటే చదువు చెప్పినవారేకాదు. తల్లీ, తండ్రీ, మేనమామ, పిల్లనిచ్చిన మామ, తల్లి తండ్రి, తండ్రి తండ్రి, పెదతండ్రి, పిన తండ్రి, పినతల్లి, మేనత్త, అత్త,

తండ్రి తల్లి, పెంచిపెద్ద చేసిన అక్క, వీరంతా గురువులే. సకల స్త్రీలకు పతియే ప్రథమ గురువు. అలాగే గురుపత్నికి నమస్కరించవల్సి వచ్చినప్పుడు పాదాలను తాకకుండా 'అసావహం' అని వంగి భూదేవికి నమస్కరించాలి. విరుద్ధంగా ప్రవర్తించుట వల్ల జ్ఞానము నశిస్తుంది. జ్ఞానము నశించుట వల్ల మనసు చలిస్తుంది. దాని ద్వారా ప్రశాంతత పోతుంది. తద్వారా అశాంతి, ఆందోళన.

వ్రత పూజలప్పుడు చెయ్యాల్సిన స్నాన విధి...

బ్రహ్మ ముహూర్తమున లేవాలి. వ్రత పూజలప్పుడు చేతి వేళ్ళతో పండ్లు తోముకోరాదు. పాలుగారే చెట్ల పుల్లతో దంతశోధనము చేసుకోవాలి. పూజకు పూలు మాలతీ, ఉత్తరేణీ బిల్వములు మంచివి. ఆపై శుభప్రదమైన ప్రాతఃకాల స్నానము చేయాలి. స్నానమప్పుడు దేవతలనూ, పితురులనూ ధ్యానించాలి. కంఠస్నానము కన్నా శిరస్నానము మహా ఉత్తమం. పూజ దేవతలకైతే అమితంగా అత్యధికంగా పూలను వాడాలి. పూజలప్పుడు ఆకలితో ఆగలేక దేవతార్చన కన్నా ముందే

భుజింపకూడదు. అరవై సంవత్సరాలు దాటినవారు ఉండలేక ఆహారం స్వీకరించితే స్వామికి తన వయస్సు చెప్పి క్షమాపణలతో పూజలు చెయ్యాలి.

పూజ పూర్తి అయ్యాక బ్రాహ్మణునికి దక్షిణ ఇచ్చి పంపిన తర్వాత కుటుంబంతో కలిసి భుజించాలి.

తూర్పు ముఖంగా భుజిస్తే ఆయుష్యము. దక్షిణ ముఖంగా భుజిస్తే కీర్తి కలుగుతుంది. ధనాన్ని కోరుకునేవారు పశ్చిమ ముఖంగా భుజించాలి.

ఉత్తర వైపుగా భుజించినవారికి యజ్ఞ హోమాది మహా కార్యాలను ఎన్నో చేసే అర్ధిక స్థితి వస్తుంది.

భోగ మోక్షములకు దానమే ఉత్తమం...

సకల లోకప్రాణుల సృష్టికర్త బ్రహ్మదేవుడు మహాత్ములగు ఋషులకి చెప్పిన దాన సూక్ష్మాలు. ధర్మంగా సంపాదించిన ధనాన్ని సంపూర్ణ ఇష్టంతో ఇచ్చినదే దానం. అదే అన్ని భోగమోక్షములకు పునాది.

- ఎట్టి ఉపకారము దానగ్రహీత నుంచి పొందకుండా వానికి చేసే దానం నిత్యము.
- తను చేసిన అనేక పాపములు పోవటానికి ఇచ్చే అన్ని దానాలు నైమిత్తిక.
- సంతానం కొరకూ, ధన సంపదల కోసం, విజయం కొరకు చేసే దానం కామ్యం.
- భగవంతునిపై భక్తితో, ధర్మమనస్సుతో చేసే దానం విమలం. ఈ విమల దానం మహా శుభాతి శుభప్రదం. అంతటి మహాదానం అనగా 'విమల దానం' చేసే దాత పుణ్య పురుషుడూ కారణ జన్ముడూ అయితే కాని సాధ్యపడదు.
- జలదానము కుటుంబానికి ప్రశాంతతనూ, తృప్తినీ ఇస్తుంది.
- అన్నదానము అక్షయ సుఖాన్నిస్తుంది.
- బంగారము ఆయుష్షును వృద్ధి చేస్తుంది.
- రజిత దానము సౌందర్యాన్ని పెంచుతుంది.
- అందమైన అతిలోక భార్య కావాలనుకునేవారు వృద్ధ దంపతులకి శయ్యని దానం చేయాలి.
- ఉత్తరాయణ, దక్షిణాయన పుణ్యకాలంలో చంద్ర సూర్య గ్రహణములప్పుడు ఇచ్చే దానము మహా అక్షయ ఫలాన్నిస్తుంది.

వానప్రస్థం అనగా అరవై దాటితే ఎలా జీవించాలి...

- ఆయుష్షులో రెండు భాగాలు తీరిన తర్వాత అరవై దాటిన తర్వాత సకల వ్యవహారాలను పుత్రులకి అప్పచెప్పి ధర్మ చింతనలో గడపాలి.
- ఎక్కువగా ఫలాలనూ, పండ్లనూ తీసుకోవాలి.
- అన్నాన్ని ఎనిమిది ముద్దలు మాత్రమే తినాలి.
- నిత్య పూజలు విధిగా చేయాలి.
- ఎట్టి స్థితిలోనూ ఎవ్వరి నుంచి ఏమీ తీసుకోకూడదు.
- ఆకులోనే భోజనము చేయాలి.
- ఎవ్వరైనా ఎంతటి వారైనా ధర్మమునే చెప్పవలెను. ఆ వయసులో ధర్మం ప్రకారం మౌనంగా ఉన్నా దోషమే.
- స్నానము చెయ్యకుండా భుజించాల్సివస్తే ఓ పూట ఉపవాసం ఉండి ఆ దోషాన్ని పోగొట్టుకోవాలి.
- ఉల్లి, వెల్లుల్లి వంటి వాటిని భోజనంలో వాడకూడదు.

శివనామ జపం ఎంతటి ఫలం...

గణాలకి అధిపతి నందీశ్వరుడు స్వామితో సమంగా మృత్యుంజయత్వమును పొందినది కేవలం శివ జపం ద్వారానే. పుణ్యనది ప్రాంతంలో మహేశ్వరుని గూర్చి కోటిసార్లు మంత్రం జపిస్తూ తపస్సు చేశాడు.

కోటిసార్లు పూర్తవ్వగానే పరమేశ్వరుడు పార్వతీదేవి సమేతంగా తన గణములతో వచ్చి ఏం కావాలో కోరుకోమన్నాడు. దానికి మరో కోటి సార్లు జపించే శక్తిని కోరుకున్నాడు.

శివుడు తథాస్తు అన్నాడు. మళ్ళీ మరో కోటి జప మంత్రం అవ్వగానే శివుడు ప్రత్యక్షమై ఏం కావాలో కోరుకోమంటే, మూడో కోటి మంత్ర జపశక్తి ఇవ్వమని అడిగాడు.

మహాశివుడు వలదని మహాప్రీతిపాత్రుడై జరా మరణ వర్జితుడవని చెప్పి నందీశ్వరుణ్ని తన గణాలకి అధిపతిగా అభిషేకించి, మరుత్పుత్రికతో వివాహం జరిపించాడు. శివ నామ జపం అంతటి మహా పుణ్య శక్తి కలది.

గయలో శ్రాద్ధాదులు ఎంత తారకమైనవి...

గయాసురుని నామంతోనే గయగా సంభోదింపబడుతోంది. ఈ గయలో చేయు శ్రాద్ధాదుల ఫలం సనత్కుమారుడు నారదుడికి వివరించాడు. సకల తీర్థములలోనూ శ్రాద్ధాదులకి ఉత్తమ తీర్థము గయ.

బ్రహ్మదేవుడు యాగము చేసిన ఈ గయలో పితురులకు శ్రాద్ధాదులను నిర్వహించుట వల్ల పితురులకు నరకలోక బాధలు తప్పుతాయి. గయలో కార్యాలు చేసిన పుత్రునకు అన్ని దీవెనలు అందిస్తారు పితురులు.

గయలో మూడు రాత్రులు ఉండి అన్నదానము చేసిన సకల పాపము పితురులకూ, చేసిన పుత్రునికీ పోవును. తనకి తానే తిలలు పెట్టుకునే అవకాశం ఒక్క గయలోనే ఉంది. బ్రహ్మహత్యా, మద్యపానము, దొంగతనము, వావివరుసలు లేకుండా తిరిగిన దోషాలు గయాశ్రాద్ధము వల్ల పూర్తిగా నశించుకుపోతాయి. గయలో శ్రాద్ధమూ, గోశాలలో మరణమూ,

కురుక్షేత్ర నివాసమూ ఈ మూడు మహా పుణ్యాలు. గయకి వెళ్ళనివారికి ఆ మూడు పుణ్యాలు ఆచరించినా పుణ్యంరాదు.

అధిక మాసమప్పుడూ, పుట్టినరోజూ, గురువు శుక్రులు మౌఢ్యములలో గానీ, సింహరాశిలో గురువు ఉన్నప్పుడుగానీ గయ తీర్థములో ఎటువంటి కార్యాలు చేయరాదు. ఇక్కడ పాయసముతో గానీ, గోధుమ, పేల పిండితోగానీ, బియ్యమూ, ఫలాలతోనూ గానీ, పిండము పెట్టాలి. గయలో పిండ ప్రదానము ఎంత గొప్పదో వంద సంవత్సరాలు చెప్పినా ఇంకా మిగిలే ఉంటుంది. శ్రాద్ధకర్మలప్పుడు బ్రాహ్మణులకు మద్యదానం చేస్తే మహా నరకముల పాలవ్వవల్సి వస్తుంది.

అన్యాయంగా అవతలవారి ధనాన్ని పొందటమంటే, వారి పిల్లల నోటి దగ్గరిది తీసి తన పిల్లలకి పెట్టినట్టే, ఆ పాపం మహాశాపం... అనుభవించక తప్పదు.

దేవాలయ నిర్మాణానికి ధనమిచ్చుట ఎంత పుణ్యం...

H ఆలయం నిర్మించాలన్న కోర్కే అనంతమైన పుణ్యం ఇస్తుంది. అట్టివారికి సహకరిస్తే సహకరించిన వారి పాపాలు పూర్తిగా నశిస్తాయి. సంకల్పించిన వారికి ఇతోధికంగా గుడి నిర్మాణం వరకూ తోడ్పడటం మరింత పుణ్య ప్రదం. అలాంటివారి కుటుంబానికి కూడా పుణ్య ఫలం అందుతుంది.

H శ్రీమహా విష్ణువు ఆలయాన్ని గానీ, ఆలయంలో కోనేరు గానీ నిర్మించిన వారికి విష్ణులోక భోగప్రాప్తి.

H శ్రీకృష్ణుని ఆలయాన్ని నిర్మిస్తే వారి పితురులు నరకం నుంచి స్వర్గానికి వెళ్తారు. అక్కణ్నించి వారిచ్చే దీవెనలు మహాద్భుతం.

H ఏ ఆలయనిర్మాణమైనా మహా పాతకాలను పోగొడుతుంది. మహా యజ్ఞాలు కూడా ఇవ్వలేని బ్రహ్మాండమైన ఫలాలను ఇస్తుంది. చిన్నతనంలో పిల్లలు ఆటలాడుతూ ఇసుకతో ఆలయాన్ని నిర్మించినా మహా పుణ్య ప్రదమే.

H తీర్థములలో, పర్వతాల మీద, పుణ్య పవిత్ర ప్రదేశాలలో ఆలయం నిర్మించటం వల్ల రెట్టింపు పుణ్య ఫలం వస్తుంది.

H దేవాలయానికి రంగులు వేయించిన వారికీ, శిలాఫలకాలు వేయించినవారికీ భూమిపై జీవించినంతకాలం పుణ్యం జమ అవుతుంది. బాగా జీర్ణమై పోయిన ఆలయాన్ని తిరిగి నిర్మించినవాడు కనిపించే దైవ స్వరూపమే. అట్టి వాని మాట వేదవాక్కు, సత్యవాక్కు అగును. ఆలయాన్ని ప్రారంభం చేసే అదృష్టం కలవాడు మహా భోగాలను భువిపైనే అనుభవిస్తాడు.

H దేవాలయ నిర్మాణము, జీర్ణమైన వాటిని బాగుచేసినవారూ, ప్రతిమలను ఇచ్చువారు, ఆలయానికి రంగులు వేయించినవారూ, ధ్వజస్థంభాన్ని వేయించినవారూ, ఆలయాన్ని ప్రారంభించినవారూ, ఇలా వీరందరినీ యమలోకం తీసుకురావద్దని యముని శాసనం. ఇట్టి మహాపుణ్యాన్ని చెప్పింది సాక్షాత్తు అగ్నిభట్టారకుడు అగ్నిదేవుడు.

కార్తీక వనభోజన పుణ్య ఫలం...

ఈ మాసంలో చేసే ఏ పూజ అయినా, వ్రతమయినా అనంతమైన ఫలాన్ని కుటుంబ మంతటికీ ఇస్తుంది.

సూర్యోదయానికి ముందే స్నానం చేసి పూజాది కార్యక్రమాలను పూర్తి చేసుకొని వంటి పూట భోజనాన్ని చేయాలి. ఈ నెలలో నువ్వుల దానం మహా శ్రేష్ఠం. అనేక దోషాలను పోగొడుతుంది. సోమవారం శివునికి ప్రీతి. కార్తీక మాస సోమవారం మరింత ప్రీతి.

ఈ మాసమంతా ఆవు నెయ్యితో దీపం వెలిగించి గృహములో తులసి చెట్టుకి సమర్పించి, మడితో భోజనం చేస్తే ప్రతిరోజు కార్తీక మాస వ్రతం చేసిన ఫలం కలుగుతుంది.

ఈ మాసంలో ఉసిరిచెట్టు క్రింద సాలగ్రామ రూపమైన శ్రీమహా విష్ణువుని తులసి ఆకులతో పూజించి, ఆ చెట్టు క్రింద బంధు మిత్రులతో కలిసి భోజనం చెయ్యటము వల్ల సమస్త దోషాలన్నీ పుణ్యంగా మారిపోతాయి. ఇంతటి పుణ్య వ్రతాన్ని తొలుత బ్రహ్మ నారదునికి చెప్పాడు. ఆపై శ్రీ

మహావిష్ణువు లక్ష్మీదేవికి, మహాశివుడు పార్వతికి ఆపై వశిష్ఠుడు జనకమహారాజుకి చెప్పి చేయించాడు.

స్త్రీ ఉపవాసం రెండు రాత్రుళ్ళు మించి చేయరాదు. ఉపవాసాన్ని భర్త అనుమతితో చేస్తే రెండింతలు ఉపవాస ఫలం.

పూజాది వస్తు దోషాలు పోవాలంటే...

- బంగారానికి ఎంత అపవిత్ర వస్తువులు తాకినా, శుద్ధి లేకుండానే శుద్ధి అవుతాయి.
- ముత్యములను నీటితో కడిగినంతనే శుద్ధి అవుతాయి.
- కాంస్య, లోహాలు గల పాత్రలు పరాగముతో పూర్ణశుద్ధి.
- పూలు, శంఖములు, రాతి పాత్రలు, ఫలములు, తాళ్ళు వంటివి జలంతో శుద్ధి చేసి పూజకు ఉపయోగించడం ద్వారా అంతకు ముందు

అంటిన దోషాలు తొలిగి పోయి స్వచ్ఛంగా ఉంటాయి.

H యజ్ఞ పాత్రలను కుశలతో తోమితే శుద్ధి అవుతాయి.

H నూనె సంబంధిత పాత్రలు వేడి నీటితో పరిశుద్ధ మవుతాయి.

H వస్త్రములపై పసుపు నీళ్ళు చల్లుట వల్ల శుద్ధి అవుతాయి.

H పూజాదికాలప్పుడు పండు ముత్తైదువ ముఖం చూసి పూజించుట తనకు తాను శుద్ధి.

ఏ వ్రతము ద్వారా ఏ పుణ్యం...

H నక్షత్ర పురుష వ్రతము చేసి శయ్య దానము చేసిన వారికి తెలియక చేసిన పాపములు అంటవు. అందమైన స్త్రీ, తెలివి గల స్త్రీ, గుణవంతురాలైన స్త్రీ భార్యగా వస్తుంది. మహా ఆరోగ్యం కూడా కలుగుతుంది.

H కృష్ణాష్టమి వ్రతము సంపదలనూ, శాంతిని ఇచ్చే వ్రతం.

H ఆదిత్య శయన వ్రతము ఉపవాసములు లేని వ్రతం. కారం, పులుపూ లేకుండా చేసే ఈ

వ్రతం వల్ల రోగాలు దరిచేరవు. ఎంతోకాలం నుంచి వేధిస్తున్న శోకాలు తొలగిపోతాయి. వశిష్ఠాది, అర్జున, కుబేరులు చేసిన వ్రతమిది.

H రోహిణి చంద్రశయన వ్రతము ఆయుష్షునూ, సంతానాభివృద్ధినీ, సంపదలనూ పెంచుతుంది.

H రస కళ్యాణ తృతీయా వ్రతము చేసిన స్త్రీ పురుషులకు కామఫలదము. అన్ని సంపదలతోపాటు మహా భోగాలను దంపతులిద్దరు కలిసి అనుభవిస్తారు.

H అనంత తృతీయా వ్రతము మహా అక్షయ ఫలమిస్తుంది. ధనములేనివారు, ధనవంతులవుతారు. ఉన్నవారు మరింత ధనవంతులవుతారు.

H సరస్వతి వ్రతమైన సారస్వత వ్రతము ద్వారా ధర్మజ్ఞానము పెరిగి సుఖసంతోషాలతో జీవిస్తారు.

H మహాఘోర రోగాల బారినపడినవారూ, భయాందోళనలలోనున్నవారూ సప్తమి స్నపన వ్రతం చేస్తే సకలశాంతి జరుగుతుంది.

H కళ్యాణభామ ద్వాదశీ వ్రతము చెయ్యటం ద్వారా తపస్సు చేసిన పుణ్య ఫలం వస్తుంది. తద్వారా కోరుకున్నది అక్షరాలా జరుగు తుంది.

గోవు కాళ్ళ క్రింద నుంచి వెళ్ళటం ద్వారా ఎంత పుణ్యఫలం...

దేవాలయాల్లోని ఆవు కాళ్ళ క్రింద నుంచి అవతలకి వెళ్ళటం వల్ల మహాపుణ్య ఫలం వస్తుంది. గోవు ముక్కోటి దేవతలకీ, సకల తీర్థాలకీ, పుణ్యక్షేత్రాలకీ ప్రతీక. అట్టి గోవు క్రిందనుంచి వెళ్ళటం సకల క్షేత్రాలనీ, తీర్థాలనీ దర్శించినంత పుణ్య ఫలం.

హనుమంతునకు ఏ దీపవిధి ఎంత పుణ్యం...

వాయుపుత్రునకు పూనూనెతో దీపం వెలిగిస్తే సకల కోరికలూ తీరుతాయి. ధనం కొరకూ, అపార సంపదల కొరకూ నువ్వుల నూనెతో దీపాన్ని వెలిగించి స్వామిని సేవించాలి.

భర్త వశము కొరకూ, బహు ప్రేమను పొందుటకు అవిశనూనెతో దీపాన్ని పెట్టి ధ్యానించాలి.

వ్యాధి నివారణకు ఆవనూనె దీపాన్ని పెట్టి స్వామిని సేవించాలి. ఇంతటి దీపవిధిని మునీశ్వరుడైన సనత్కుమార మహర్షి తెలియచేశారు.

హనుమత్కవచాన్ని చదివినా, విన్నా సకల ఉపద్రవములు పోతాయని స్వయంగా శ్రీరామచంద్రుడు సనత్కుమార మునికి చెప్పాడు. భూత, ప్రేత భయములతో పాటు దుఃఖములు పోవుటకు హనుమత్కవచాన్ని విన్నా చాలు సకల కార్యాలు శుభమవుతాయి. భయమూ పీడా తొలగిపోతాయి.

వైశాఖమాసంలో మజ్జిగ దానం చేస్తే అదృష్టం కలిసి వస్తుంది. దప్పిక తీరినవాడు దీవించిన దీవెనలు ధనంగా మారి సుఖాలను అందిస్తాయి.

పిల్లలని సంగీత పాఠశాలకి పంపే రోజులు సోమ, బుధ, గురు, శుక్రవారములు గానీ, మూడూ, అయిదూ, ఏడూ, పది, పదమూడూ, పదిహేను తారీకులుగానీ మంచివని సంగీత శాస్త్రం శెలవిస్తోంది.

పిల్లనిచ్చిన అత్తమామలను దూషిస్తే కలిగే దోషఫలం...

తొలిసారి పసుపు రాసుకొని, పారాణి పెట్టుకున్న అల్లుడి కాళ్ళు కడిగి కన్యాదానం చేసిన వార్ని కించ పరిచేలా మాట్లాడితే దక్షప్రజాపతిని దూషించిన దోషం కలుగుతుంది.

అలా మామగారిని ఎదురించి మనసు కష్టపెట్టినందుకే చంద్రుడు రోజు రోజుకి క్షీణించే క్షయవ్యాధిగ్రస్తుడయ్యాడు.

అంటే తల్లి, తండ్రి తర్వాత అంతటి గౌరవ నీయులైన వారిని నిందిస్తే ధనక్షయమనే దోషం కలిగి కష్టాల పాలవ్వాల్సి వస్తుంది.

తోడల్లుడైన శివుడి అభయం వల్లే క్షీణించిన చంద్రుడు మళ్ళీ దినదినాభివృద్ధి చెందుతున్నాడు. కాబట్టే అత్తమామల యెదల పరుషంగా, గర్వంగా మాట్లాడితే ధనలక్ష్మితో పాటు ఆరోగ్యలక్ష్మి కూడా దూరమవుతుంది.

దరిద్రులతో తిరిగితే ఎంతటి పాప దోషం...

ఆర్థికంగా గానీ, అనేక సమస్యలతో గానీ సతమతమవుతూ, క్షణం క్షణం భయం భయంగా గడుపుతున్న వారితో కలిసి తిరిగితే వారి దోషము వానితో తిరిగిన వారికీ అందుతుంది.

దరిద్రమూ, కష్టాలూ, దుఃఖమూ అన్ని దోషాలకీ, పాపాలకీ ప్రాయశ్చిత్తాలు. అంతటి కష్టాల్లో ఉన్న వారికి చేతనయినంత సహాయం అందించాలి.

అంతే తప్ప వారితో కలసి మెలసి ఉంటే వారి బాధలూ, వ్యధలూ పంచుకోక తప్పదు.

దమయంతి దీనస్థితి, దైన్యస్థితి చూసి అడవిలో ప్రయాణిస్తున్న వర్తకులు తమతో కలసి ప్రయాణించమంటారు.

కారణాలేమైనా, ఏనుగుల గుంపు చేత వారిలో కొందరు ప్రాణాలను పోగొట్టుకుంటారు. మరికొందరు గాయాలపాలవుతారు. దమయంతి తనవల్లే వారికా కష్టం వచ్చిందని తలుస్తుంది.

అందుకే అంటారు ఆ దరిద్రుడితో తిరగకురా, మన అదృష్టం వాడికంటుతుందో లేదోగాని, వాడి దురదృష్టం మనకి అంటుతుందని.

వ్యాసభగవానుడు చెప్పిన కలియుగ పాపాలు... దోషాలు...

- సకల వర్ణాల వారు ధర్మం తప్పి ప్రవర్తిస్తారు.
- స్త్రీలు తమని తాము పోషించుకునే స్థితిలో ఉంటారు.
- జనులు కపటంతో ఉంటూ ధర్మాన్ని మాట్లాడతారు.
- ఎవరికి వారు తామే గొప్పనుకుంటారు.
- అల్పాయుష్కులెక్కువ మంది ఉంటారు.
- భర్త మాటను వినేవారు అరుదుగా కనిపిస్తారు.

- ఉత్తములు నీచులుగా మారతారు.
- నీచులు ఉత్తమమైన వారిగా పొగడబడతారు.
- తండ్రిని కొడుకు, కొడుకుని తండ్రి, భార్యను భర్త, భర్తను భార్యా ద్వేషించి హీనులవుతారు.
- ప్రజలు చెయ్యకూడనివి రాజులు చేయించి పన్నుల రూపేణా అధర్మాన్ని ప్రోత్సహిస్తారు.
- స్త్రీ వ్యామోహం కోసం, పక్కవారి ధనం కోసం ప్రాకులాడతారు.
- అడవాళ్ళు అలంకరణలతో మగవారికి విందు చేస్తారు.
- ధర్మాన్ని అమ్ముకుంటారు.
- కొందరు స్త్రీలు అవసరం లేకున్నా వ్యభిచారం చేస్తారు.
- బ్రాహ్మణులు నియమాలనీ స్నానశౌచాదికాలనూ వదిలేస్తారు.
- దానం తీసుకునే వారే కానీ ఇచ్చేవారు కనిపించరు.
- పదివేల కొక్కడూ, లక్షకు ఇద్దరూ, కోటికి ఇరవైమంది ధర్మపరుల వల్ల కలియుగము ముందుకు సాగుతూనే ఉంటుంది. వారూ లేని నాడు భూమి బ్రద్ధలై మహాప్రళయం వచ్చి భూమి అంతరిస్తుంది.

- కాషాయ వస్త్రాలను ధరించి తామే ధర్మ ప్రబోధకులమని నీచులు నమ్మిస్తారు.
- నమ్మిన వార్ని మోసం చెయ్యటమే పనిగా పెట్టుకుంటారు.
- ధర్మంతోనూ, గృహస్థు ధర్మాలను పాటిస్తూ గడిపే వారు ఆర్థికంగా బాధపడతారు.
- గురువునీ, తండ్రినీ, తల్లినీ నిందించని వారు వెతికితే గానీ కనిపించరు.
- అమ్మకూడనవి నిర్భయంగా అమ్ముతారు. సంభోగించకూడని వారితో సంభోగాన్ని జరుపుతారు.
- పైకి మంచి మాటలు చెబుతూ, లోపల ఎలా అశుభాలని చెయ్యాలా అని ఆలోచించే వారే ఎక్కువ ఉంటారు.
- మనుష్యులని దేవుళ్ళని చేసి పూజిస్తారు.
- పితృకార్యాలూ, తర్పణాలని మర్చిపోతారు.

ఎలాంటి వారికి ధన,వస్తు దానాలు చేస్తే పాపం...

కోప స్వభావం కలవారికీ, గొప్పలు చెప్పుకునేవారికీ, ఆవేశ పూరితులకీ, సంతానం

లేనివారికీ, ఆచార సాంప్రదాయాలను పాటించని వారికీ, స్త్రీ వ్యామోహం కలవారికీ, మత్తు పదార్థాలను అమ్మేవారికీ దానం చేస్తే ఆ దానం నిష్ఫలమవుతుందని సనక మహర్షి చెప్పాడు.

వారితో పాటు పగటి పూట నిద్రపోయేవారికీ, పట్టపగలు సంభోగ యూప కలిగిన వారికీ దానమివ్వటం పాపమవుతుంది.

మద్యపానాన్ని సేవించినంత దోషం దేని ద్వారా కలుగుతుంది...

రెండో పురుషుడితో గడుపుతున్న స్త్రీ ఇంటి భోజనము మద్యపాన దోషంతో సమానం. ధర్మహాని చేసేవాని ఇంట అనగా భగవంతుని గూర్చి వితండవాదాలు చేసేవాని ఇంట తిన్నా మద్యపానం సేవించినంత దోషం కలుగుతుంది. పై ఇద్దరితో పాటు వ్రతాలనూ, పూజలనూ మధ్యలో ఆపేసిన ఇంటా, దేవాలయం అర్చకుల ఇంటా (బంధువులు కానివారు) .... మద్యపానం చేసే స్త్రీతో గడిపినవాడూ ఆ పాప దోషాన్ని అనుభవించాల్సి ఉంటుంది.

ఎలాంటి వారికి వస్తు, ధన దానాలు చేస్తే పుణ్యం...

దాన యోగ్యత కలవారికి దానం చెయ్యమని శాస్త్రం చెబుతోంది. దానం ద్వారా మాత్రమే అవసరాలను తీర్చుకునే వారికి, తీరే వారికి దానమివ్వాలి. బిడ్డలు పట్టించుకోని తల్లీ, తండ్రికీ, అనాధలకూ, ధర్మపూజాదికాలు చేయించేవారికీ, భర్త లేని వారికీ దానం చెయ్యటం ద్వారా పరిపూర్ణ దానఫలం కలుగుతుందని పురాణ ఇతిహాసాలు శెలవిస్తున్నాయి.

ఇంటి పట్టునుండక ఊళ్ళు తిరిగే దోషం ఎలా కలుగుతుంది...

సంబంధము లేని విషయాల్లోనూ, పక్కవారి వ్యక్తిగత విషయాల్లోనూ తలదూరిస్తే దాని తాలూకు దోషం ఊళ్ళు తిరిగే వ్యాపారమో, ఉద్యోగమో వచ్చి ఆ దోషం అలా పరిహారమవుతుంది. త్రిలోక జ్ఞాని నారదుడు త్రిలోక సంచారి కాక ముందు అలానే తనవి కాని విషయాల్లో తలదూర్చి సతీదేవికి

ధర్మబోధ చేయబోతాడు. దానితో దక్షుడు కోపించి నారదుణ్ని అక్కడివి ఇక్కడికి మోసుకు వస్తున్నావు గాన నీవు త్రిలోక సంచారము చేస్తూనే ఉండు అని శపిస్తాడు. అప్పట్నించి నారదుడు ఓ చోట కుదురుగా ఉండక, ముల్లోకాలనూ తిరుగుతూ దక్షుడి శాపాన్ని లోకకళ్యాణం కోసం మార్చుకొని శాపాన్ని అనుభవిస్తున్నాడు. కాబట్టి మంచి కోసమైనా పక్కవారి వ్యక్తిగత విషయాల్లో తలదూర్చకూడదు.

తులసి మూలమందు సమస్త తీర్థలూ, మధ్యన సమస్త దేవతలూ, తులసి కొసల యందు సకల వేదాలూ ఉంటాయని నిర్ణయ సింధు వివరిస్తూ అట్టి తులసిని పూజించిన దేవతలందరినీ పూజించిన ఫల మొస్తుందని శెల విస్తోంది.

పతివ్రత, విద్య, సౌందర్య, శౌర్య, ఆవేశ దోషాలు ఎంతటి పుణ్యాన్ని కలిగిస్తాయి...

కురుక్షేత్ర మహాసంగ్రామము ముగిసింది. ధర్మరాజుకి మహా పట్టాభిషేకం జరిగింది. ముప్ఫయి ఆరు వసంతాలు హస్తినాపురి సామ్రాజ్యాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలాడు.

బిడ్డలు పోయిన బాధతో ధృతరాష్ట్రుడూ, గాంధారీ, బంధుహితులు దూరమైన వ్యధతో కుంతీ దేవీ వానప్రస్థానానికి తరలి వెళ్ళిపోతారు. కొంత కాలం ఆ తపోవనాల్లో తపస్సు చేసుకుంటూ భగవంతుని పిలుపుకై ఎదురు చూస్తుంటారు. ఓ రోజు అడవిలో మహా దావాగ్ని రగులుతుంది. ఆ అగ్నిలో ముగ్గురూ ఆహుతవుతారు.

అది తెలిసిన పాండుపుత్రులు సకల ఉత్తరక్రియలన్నీ జరుపుతారు. చేయవల్సిన విధులను, దానధర్మాలను చేస్తారు.

అనంతరం మహాప్రస్థానానికి బైలుదేరాలని నిశ్చయించుకుంటారు. హస్తినకు పరీక్షిత్తును మహారాజుగా అభిషేకం చేస్తారు. ప్రజలకూ,

మంత్రులకూ, సామంతులకూ చెప్పి వీడ్కోలు తీసుకుంటారు.

పతివ్రతా దోషం... ద్రౌపది దోషం...

ముప్పదిఆరు సంవత్సరాలు నమస్త భూమండలాన్ని ఏలిన ధర్మరాజు సుభద్రను రాజ్య రక్షకురాలిగా చేస్తాడు. పాండవులు తమ పుణ్య దివ్యశక్తితో ముందుకు సాగుతారు. వారితో పాటు ఓ శునకం కూడా వెంటపడుతుంది.

పాండవుల దివ్యశక్తితో సమానంగా ఆ శునకం మహాగిరిప్రాంతాలను దాటుతుంది. పాండవులు ఆ శునక శక్తికి ఆశ్చర్యచకితులవుతారు. అలా సాగుతుండగా ద్రౌపది పుణ్యశక్తి నశించి నేలపై పడి అనంత లోకాలను చేరుతుంది.

భీమసేనుడు ఎంతో బాధతో ధర్మరాజును ఎందుకిలా జరిగిందని అడుగుతాడు. పతివ్రతా ధర్మ దోషం.... మన అయిదుగురు భర్తల్లో అర్జును డంటేనే ఆమెకు ప్రీతి. దాని వల్ల పతివ్రతా దోషం కలిగి ఆమె పుణ్యశక్తి నశించింది. దాని వల్లే... ఆమె యోగశక్తి నశించింది అని చెబుతాడు. శృంగార

యావ ఎక్కువ ఉండటం వల్లే ద్రౌపది పుణ్యం కరిగిపోయింది.

విద్యాపాండిత్య గర్వం ఎంత దోషం...

ధర్మరాజు వెనుక శునకం అనుసరిస్తుండగా ఆ వెనుక తమ్ములందరూ ముందకు నడుస్తున్నారు. ఈసారి యోగసిద్ధి నశించి నహదేవుడు కూలిపోతాడు. భీమసేనుడు అగ్రజుణ్ని సహదేవుడేమి దోషం చేశాడని అడుగుతాడు. దానికి ధర్మరాజు సహదేవుడికి తనను మించి పండితుడు లేడని అహం. దానితోనే విర్రవీగాడు. అందువల్లే పుణ్యశక్తి నశించింది అని చెబుతాడు. సర్వం, సకలం నాకే తెలుసన్న విద్యా అహంకారం కూడా పుణ్యశక్తిని లాగేసుకుంటుంది.

సౌందర్య గర్వమెంత దోషం...

అలా సాగుతుండగా ఈసారి నకులుడు పడిపోతాడు. పుణ్యాలోకాలకి చేరుకుంటాడు. భీమసేనుడికి ధర్మరాజు చెబుతాడు. ఈ సృష్టిలోనే తనంత అందగాడు లేడని సౌందర్య గర్వం. అందుకే మధ్యలోనే నకులుడు వాలిపోయాడు.

శాశ్వతము కాని అందాన్ని చూసుకొని మిడిసిపడితే చేసిన పుణ్యం నశిస్తుంది.

ఉయ్యాలూగుతున్న శ్రీకృష్ణుణ్ని చూసి సేవించటము వల్ల ఈ జన్మలో చేసిన పాపాలు తొలుగుతాయి. ఆ వేడుకలో ఉయ్యాలను ఊపితే మహాపాతకాలు నశిస్తాయని దేవీనవరాత్రి గ్రంథం శెలవిస్తోంది.

శౌర్యగర్వమెంత దోషం...

ఆ తర్వాత అర్జునుడు నేలరాలతాడు. భీమసేనుడికి చెబుతాడు. అర్జునుడికి తానంత విలువిద్యకాంద్రు లేరని అతిశయం. ఎవ్వరినీ లెక్క చేయక కౌరవులందరినీ ఒక్క నిముషమాత్రంలో చంపుతానని ప్రగల్భాలు పలికాడు. మాటకీ, చేతకీ సంబంధం లేకుండా వీరాలు పోయాడు. ఆ శౌర్య దోషమే ఇది.

ఆవేశ దోషం...

ఆపై భీముడు కూడా తాను ఒరిగిపోతున్నాని తెలుసుకొని, దానికి కారణమేమిటని అడిగాడు. భీమా... నీకు ఆవేశం ఎక్కువ. పెద్దంతరము, చిన్నంతరము లేకుండా మాట తూలుతావు. దానితో పాటు మహా భోజన ప్రీతి. వాటి దోషమే ఇది అని చెబుతాడు.

ఆపై దేవేంద్రుడు రత్నాల దివ్య రథాన్ని తెచ్చి ధర్మరాజును స్వర్గానికి రమ్మంటాడు.

అంగీకరించిన ధర్మరాజు శునకాన్ని కూడా తన వెంట తీసుకువస్తుంటే ఇంద్రుడు అభ్యంతరం చెబుతాడు. అప్పుడు ధర్మరాజు....

'శరణన్న వాణ్ని రక్షించకపోవటమూ, స్నేహితునికి ద్రోహం చెయ్యటమూ, పక్కవారి ధనాన్ని అపహరించటమూ, తనని నమ్ముకొని అనుసరించిన సేవకుణ్ని వదిలియ్యటం బ్రహ్మహత్యా పాతకమని మీకు తెలియదా' అని దేవేంద్రుని అడుగుతాడు.

అప్పుడు ధర్మరాజు ధర్మానికి పరీక్ష పెట్టదలిచి శునక రూపం ఎత్తిన యముడు నిజరూపం ధరించి తన పుత్రుణ్ని సాదరంగా కౌగిలించుకుంటాడు.

యమధర్మరాజు పొంగిపోతాడు ధర్మరాజు ధర్మ ప్రవర్తనకి.

సత్సాంగత్యం ఎంతటి పుణ్యం...

ఏ గృహంలోనైతే ధనబాధలుండవో, ఆరోగ్య బాధలుండవో, బంధు హిత మిత్ర వివాదాలుండవో ఆ గృహం పుణ్య ప్రదేశం. అట్టి నివాసంలో చేసిన యజ్ఞయాగాది దాన వ్రత పూజల వల్ల సుఖమూ, సంతోషములు మాత్రమే ఉంటాయి.

పాండవుల అజ్ఞాతవాసాన్ని భంగపరచటానికి దుర్యోధనాదులు అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. శ్రీకృష్ణుడు అభిమన్యునితో ఈ అఖండ భూమండలంలో పాండవులున్న ప్రదేశాన్ని కనుగొనటం ధర్మపరులకి చాలా తేలిక అంటాడు. అధర్మపరులెంత ప్రయత్నించినా తెలుసుకోలేరని తెలియ చేస్తాడు.

అంతటి ధర్మపరాయణులైన వారు ఉన్న దేశంలో పాడిపంటలకి కొదవ ఉండదు. ధనరాసులతో, వైభోగాలతో ఆ దేశ ప్రజలు సుఖిస్తుంటారు. సకాలంలో వర్షాలు పడతాయి. భూమి పచ్చగా ఉంటుంది.

ధర్మపరులున్న ప్రదేశం అంతా సస్య శ్యామలమవుతుంది. అది పుణ్యం యొక్క శక్తి.. కాబట్టి పుణ్యమే సుఖాలనిస్తుంది. తనకే కాదు తన వారందరికీ, వారితో పాటు అంతటి పుణ్య ధర్మపరులతో ఉన్న వారందరికీ ఆ పుణ్యఫలభోగం కలుగుతుంది. అందుకే సత్‌సాంగత్యం అంత పుణ్యం.

యజ్ఞ యాగాదులనే పుణ్యం ఏ ఫలాలని ఇస్తుంది...

యజ్ఞం వల్ల అన్నం కలుగుతుంది. శరీరంలో శక్తీ, ఉత్సాహం వస్తాయి. సంకల్ప సిద్ధి కలుగుతుంది. యశస్సు కలుగుతుంది. బాహ్యవిషయ జ్ఞానమూ కలుగుతుంది.

చేసే వృత్తిలో ఆధిపత్యం వస్తుంది. గృహస్థలాలు పెరుగుతాయి. పదిమందీ మెచ్చుకునే సంతానం కలుగుతుంది.

వంశ కీర్తి పెరుగుతుంది. కుటుంబ మంతటికీ ఆరోగ్యం కలుగుతుంది. ఐహిక సుఖాలు నెరవేరుతాయి. సౌభాగ్యం కలుగుతుంది. శత్రుభేద నీతి అవగతమవుతుంది.

యజ్ఞ యాగాదుల వల్ల ధనం కలసివస్తుంది. విజ్ఞాన సామర్థ్యము కలుగుతుంది. జనన శక్తి పెరుగుతుంది. క్షేత్ర తీర్థ దర్శన భాగ్యాలు కలుగుతాయి. యజ్ఞ ఫలం... పుణ్యం ఎంత అని చెప్పుట అసాధ్యమని యజుర్వేద సారాంశము.

క్రతువుల కంటే, యాగముల కంటే, తీర్థముల కంటే నామ స్మరణము శ్రేష్ఠతరము.

- శ్రీ జ్ఞానేశ్వరజీ

సామవేదం ఎంత పవిత్రమైనది...

నాలుగు వేదాల్లో సామవేదం చిన్నది. కానీ సకల వేదముల రసం సామవేదం. భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఈ సామవేదాన్ని గూర్చి చెబుతూ, తను వేదాల్లో సామవేదాన్ననీ, దేవతల్లో ఇంద్రుడననీ, ఇంద్రియాల్లో మనస్సుననీ, ప్రాణుల యందు చైతన్యాన్ననీ సామవేదం గూర్చి చెబుతాడు. సామవేదమే వేదములకు తలమానికమని

మహర్షులు కూడా నిర్ధారించారు. అట్టి వేదాలను చదవటం యజ్ఞం చేసినంత పుణ్యం.

భర్త కంటే ముందే భోజనం చెయ్యటం దోషమా...

భర్త భోజనం పూర్తి చేసిన తర్వాతే భార్య భోజనాన్ని చెయ్యాలని గృహస్థ ధర్మం చెప్పటానికి ప్రధాన కారణం.... 'నే ఒక్కదాన్నే నీకోసం ఎదురు చూస్తున్నాను. కష్టమైనా సుఖమైనా నీతోనే' అని ప్రతి రోజు భర్తకి గుర్తు చెయ్యటం. అనేక ఆర్థిక వ్యవహార విషయాల్లో ఉండే భర్తకి 'భోజన సమయంలో ఇంట్లో నా భార్య నా కోసం ఎదురు చూస్తున్నదన్న విషయాన్ని గుర్తించి, అన్నీ పక్కన పెట్టి ఇంటికొచ్చి కొంత ఉపశమనం పొందుతాడని' స్త్రీకి ఆ పతివ్రతా నియమాన్ని ధర్మశాస్త్రకోవిదులు పెట్టారు.

అయితే భార్య ఆరోగ్యం బాగోలేనప్పుడూ, పుట్టింట్లో ఉన్నప్పుడూ, భోజన సమయం మీరిపోతున్నప్పుడూ, భర్త నిద్రపోతున్నప్పుడూ, స్నేహితులూ, సన్నిహితులూ వచ్చినప్పుడూ ముందే భోజనాన్ని చేస్తే దోషం లేదు.

ఎక్కడ పుట్టుమచ్చ ఉంటే అఖండ ధనప్రాప్తి, సుఖప్రాప్తి...

రెండు కనుబొమల మధ్య పుట్టుమచ్చ ఉన్న స్త్రీ మహాసౌందర్య రాశి అయి ఉంటుంది. అంతేకాదు అఖండ ఐశ్వర్యానికి చిహ్నం. అక్కడ పుట్టుమచ్చ ఉన్న స్త్రీని వివాహం చేసుకున్నవాడు మహా సుఖవంతుడవుతాడు.

వారి దాంపత్యం చూపరులకు రోహిణీ చంద్రుల వలే మనోహర దృశ్యం. మధ్యలో కష్టాలు అనుభవించినా అపూర్వమైన సుఖవైభోగాలను ఇరువురూ పొందుతారు.

దేవతలు సహితం వివాహం చేసుకోవటానికి ప్రయత్నించిన దమయంతి కనుబొమల మధ్య కూడా పుట్టుమచ్చ ఉంటుంది.

బ్రహ్మదేవుడు మహా అదృష్టజాతకులకే ఈ పుట్టుమచ్చను పెడతాడు.

హరి కీర్తనము వలన
అంతఃశుద్ధి కలుగును
- శ్రీ ఏకనాథజీ

వివాహంకై కన్యని చూస్తున్నప్పుడు ఏ దోషాలు లేకుండా చూసుకోవాలి...

సారంగ జంతువు వంటి కాళ్ళు గలది, ఆవు వంటి నడకకలది, ఎద్దువంటి పళ్ళు కలది మాట్లాడుతుంటే పాము బుసకొట్టినట్లు ఉండే స్త్రీ దోషములు కలది. వివాహం చేసుకున్నవానికి సుఖముండదని అథర్వణ వేదం చెబుతోంది.

వ్యాపార వృద్ధి కొరకు ఇంద్ర, అగ్నిలకు హవిస్సులు ఇస్తే...

వ్యాపారంలో అధిక లాభాల కొరకు, ఖరీదు చేసిన వస్తువులు భద్రంగా దుకాణానికి చేరటానికి ఇంద్రాగ్నులకు ఇంద్ర యజ్ఞం చేయాలి.

వ్యాపార విరోధులనూ, అడ్డంకులనూ తొలగిస్తుంది. ఈశానుడైన దేవేంద్రుడు ధనాన్ని ప్రసాదిస్తాడు. బలముతో పాటు ధనమూ అగ్నిదేవునికి హోమం చేయటం ద్వారా కలుగుతాయి. సకల చెల్లింపులూ సకాలంలో జరుగుతాయి.

ఇంద్రుణ్ణీ, అగ్నినీ స్తుతించటం ద్వారా హవిస్సుల ద్వారా, పూర్ణాహుతి ద్వారా సకల దేవతలను ఇంద్రాగ్నులు శాంతింపచేసి పుణ్యమనే ధనాన్నీ, సుఖాన్నీ ఇప్పిస్తారు. ఈ దైవపూజను అథర్వణ వేదంలో చెప్పిన ప్రకారం విప్రులచే చేయించుకొని వ్యాపార వృద్ధిని పొందండి.

రుణ దోషాన్ని పోగొట్టుకోవటానికి చేయాల్సిన అగ్నిపూజ...

ఐహిక సుఖలోలుడై అప్పులు చేసి వాటిని తీర్చలేని వారూ, యాగాదులు అనుకొని చెయ్యలేక పోయిన వారూ, సుఖాల కోసం కాళ్ళూ, చేతుల ద్వారా పాపములు చేయించినవారూ, పరాయి వాని భార్య వద్దకు వెళ్ళినవారూ అగ్నిహోమం చేయటం ద్వారా పునీతులవుతారు.

ఋణం తీర్చనందుకు, పరాయిస్త్రీల వద్దకు వెళ్ళినందుకు యముడు తన దండాన్ని పైకెత్తకుండా ప్రీతి చేస్తాడు. పావకదేవుడు అనగా అగ్నిదేవుడు దేవతల ఋత్విజుడు. హోత, సకల సంపదల ప్రదాత అయిన అగ్నిభట్టారకుడు శాంతించి,

ప్రాయశ్చిత్త భిక్ష పెడతాడని అథర్వణ వేదం వివరిస్తోంది.

వరుణ దేవుణ్ని పూజించి స్తుతిస్తే ఎంతటి పుణ్యశక్తి...

ఆయుష్షును పెంచే శక్తిగలవాడు వరుణుడు. యజ్ఞయాగాదుల్లో హవిస్సులు అర్పించేవారు కూడా ప్రత్యేకంగా వరుణుణ్ని స్తుతించి ఆయువును కోరుకుంటారు. వరుణస్తవము చేస్తే ప్రాణభయం వీడిపోతుందని ఋగ్వేదం చెబుతోంది. పూర్వం అంబరీషుడు అనే అయోధ్య రాజు తన యజ్ఞానికి బలివ్వటానికి ఋచీకుని పుత్రుణ్ని పొందుతాడు. ప్రాణభయంతో విలపిస్తున్న ఋచీకుని పుత్రుడు శునశ్శేపునకు విశ్వామిత్రుడు వరుణస్తవాన్ని ఉపదేశిస్తాడు. శునశ్శేపుడు భక్తితో పఠించి బలి నుంచి విముక్తుడవుతాడు.

బహుపుత్ర లాభం, ఆరోగ్యం కోసం ఏ పుణ్య గాథ చదవాలి...

అతిప్రాచీనమైన నలోపాఖ్యానం చదవటం ద్వారా ఫలశ్రుతి చెప్పటం ద్వారా ఆయుష్షు

అభివృద్ధితో పాటు ధనము వృద్ధి చెందుతుంది. పుత్రసంతానం కోసం నలదమయంతుల చరిత్ర చదివినా, విన్నా సంతానం సాఫల్యం కలుగుతుంది. అనారోగ్యదోషాలూ పోతాయి. కలి దోషాలు తొలిగించే ఈ గాథను చదివినా, వినిపించినా బహు పుణ్యప్రదమని బృహదశ్వ మహాముని శెలవిచ్చాడు.

నామ సంకీర్తనము సకల కలుషనాశకము - శ్రీ సనాతన గోస్వామి

గృహము, పొలాల్లో బావి త్రవ్వుతున్నప్పుడు ఎవరిని పూజించి స్తుతించాలి...

మరుత్తులు రుద్ర పుత్రులు. యజ్ఞాల యందు సోమపానము చేస్తారు. దేవతలు కూడా పూజించే దివ్యయజ్ఞవంతులు. గౌతమునికి దాహం వేస్తే అంతటి మునీశ్వరుడు మరుత్తులను ప్రార్థించాడు. దానితో మరుత్తులు అడ్డొచ్చిన పర్వతాన్ని ముక్కలు ముక్కలు చేసి గౌతమునికి బావిని త్రవ్వి ఇచ్చారు.

నిత్య దైవకార్యాలకి సహాయపడ్డారు. భూగర్భ జలాన్ని బైటికి తెచ్చిన మరుత్తులను ధ్యానించి స్తుతిస్తే తక్కువ లోతులోనే మంచినీరు పడుతుంది. ఈ గాథంతా ఋగ్వేదంలోనిది.

పరోపకారమెంత పుణ్యం...

మానవునికి భూతదయ ఉండాలి. సాటి మనిషికి సాయం చెయ్యటం మహాపుణ్య మవు తుంది. పదిమంది మంచి కోసం ఉపకారం చెయ్యటం వలన యజ్ఞయాగాదులు చేసినా రానంత పుణ్యం కలుగుతుంది. లోక కళ్యాణార్థం వృత్రాసుర సంహారం కోసం దధీచి తన దేహాన్ని ఇంద్రునికి ఇస్తాడు.

ఒకానొక సమయాన బ్రహ్మవిద్య అశ్వినులకు బోధించినందుకు దధీచి మహర్షి తల నరుకుతాడు ఇంద్రుడు. అశ్వినులు అశ్వము తలను తీసుకొచ్చి దధీచికి పెట్టి బ్రతికించి బ్రహ్మవిద్య నేర్చుకుంటారు.

ఇంద్రుడు అలాంటి ఘోరం చేసినా దధీచి మహర్షి ఆనందంగా తన శరీరాన్ని ఇంద్రునికి ఇస్తాడు. ఆ మహర్షి వెన్నుముక ఎముకతోనే వజ్రాయుధాన్ని నిర్మించి లోకహితం చేస్తాడు

దేవేంద్రుడు. దధీచి తనని అర్పిస్తూ అంటాడు. ఈ శరీరము ఎప్పటికైనా నశించేదే.

సాటి ప్రాణుల దుఃఖాలని పట్టించుకోకుండా తన సుఖం చూసుకోవటము అధర్మము.

ఎప్పటికైనా మట్టిపాలూ, కుక్కలపాలు, నక్కల పాలూ అవ్వాల్సిన శరీరంపై వ్యామోహం వలదు. పరోపకారం చెయ్యగలిగీ చెయ్యలేకపోవటం యజ్ఞాన్ని చెడగొట్టినంత పాపం.

మహాపుణ్యాలని ఇచ్చే అరు యజ్ఞాలు...

ధన యజ్ఞం: ధనాన్ని ధర్మంగా సంపాదించి అలా సంపాదించిన ధనంతో ధర్మకార్యాలను చేయటం వలన ధన,యజ్ఞ ఫలాన్ని పొందగలరు.

తాపయజ్ఞం: సకల జ్ఞాన, ధర్మ విషయాలను శోధించి లోకానికి తెలియచెప్పటం. సకల జనులలో జ్ఞానాన్ని రగల్చటం తాపయజ్ఞ ఫలం.

స్వాధ్యాయ యజ్ఞం: తను శ్రమించి సాధించిన దాన్ని లోకకళ్యాణం కోసం, మానవజాతి వికాసానికి వెలుగు పెంపొందించేందుకూ అర్పించటము.

యోగయజ్ఞం: మహా యమనియమాదులతో ఇంద్రియాలను అదుపులో పెట్టుకోవటం, శరీర అవయవాలపై విజయం సాధించటము. అట్టి శక్తితో ధర్మంగా జీవితాన్ని గడపటం.

జ్ఞాన యజ్ఞం : తనెందుకు పుట్టాడు? పుట్టినందుకు ఏం చెయ్యాలి? అన్వేషించాలి. తెలుసుకోవాలి. అజ్ఞానంలో ఉన్న వారిని సరయిన దారిలో నడిపించటం చేయాలి. అదే జ్ఞానయజ్ఞం. పుణ్య ప్రదం.

సంశిత యజ్ఞం : మనసులోని కోపాన్నీ, క్రోధాన్నీ, ఈర్ష్య, అసూయలను పారద్రోలు కోవటము. శత్రువులని మిత్రులుగా చేసుకోవటం. ప్రతిఫలం ఆశించకుండా కర్మలు చేయటం.

ఈ ఆరుయజ్ఞాల గూర్చి భగవద్గీతలో వివరించాడు వాసుదేవుడు.

తైలాభ్యంగనము ముఖ్యంగా ఏ రోజు చేస్తే పుణ్యం..

సంవత్సరంలో తొలి పండుగైన ఉగాదినాడు నువ్వులనూనెతో తైలాభ్యంగనము మంగళ స్నానమంత పవిత్రత. ఆ రోజు తలంటి పోసుకోని

వారు అనేక నరక బాధలు పడతారని శాస్త్రము. ఈనాటి తైలాభ్యంగస్నానము ఇంద్రియముల శక్తిని పెంచుతుంది. మంచి నిద్రకు ఉపకరిస్తుంది.

శ్రీరామ నామము నుచ్చరించని నోరెందుకు? వాని జన్మ మెందులకు? వాడెట్లు పుట్టునో అట్లేగిట్టుచున్నాడు. - కబీరు

దమనముతో పూజలెప్పుడు చెయ్యాలి..

పురుషార్థచింతామణి ప్రకారం చైత్ర శుక్ల పక్షములోని అనేక తిథులలో పూజ పుణ్య ప్రదానమైనది. ఆరోగ్య ప్రదానమైనది కూడా.

పూజానంతరం దమనమును శిరస్సున ధరించాలి. ఈ పక్షములో వచ్చే ప్రతి తిథికి ఆయా దేవతలను దమనముతో పూజిస్తే అఖండ సంపదలూ, ఆనందాలూ కలుగుతాయని హేమాద్రి వ్రత ఖండం శెలవిస్తోంది.

చైత్ర శుక్ల తదియనాడు గౌరీ శంకరులకూ, చైత్ర శుక్ల చతుర్థినాడు గణపతికీ, చైత్ర శుక్ల ద్వాదశినాడు శ్రీమహావిష్ణువుకూ, చైత్ర శుక్ల నవమినాడు అమ్మవారికి దమనపూజ ఎంతో ప్రీతి.

చైత్రశుద్ధ ఏకాదశి ఎంతటి పుణ్య తిథి....

అసురుడను మహా భీకర రాక్షసుడితో పోరాడి అలిసిన శ్రీ మహావిష్ణువు దేహం నుంచి వచ్చిన దేవతే ఏకాదశి. అసురుణ్ని సంహరించిన ఆ దేవతకి ఏకాదశి అను నామధేయం ఏర్పరిచి దేవతలు పూజించారు. ఏకాదశినాడు ఉపవాసం మహా పుణ్యం. శ్రీకృష్ణుడు ధర్మరాజుకూ, అర్జునుడికీ ఉపదేశం చేసి ఏకాదశి వ్రతం చేయించాడు. ఏకాదశి వ్రతం చేసిన స్త్రీ చేతి వంట అమృతప్రాయమౌతుంది. ఏకాదశి ఉపవాసం ఉన్నవారు ఆ రోజు కటిక నేలపై నిద్రించాలి. ఒంటి పూట భోజనం చేయాలి.

చైత్రశుద్ధ తదియనాడు అర్ధనారీశ్వరులైన శివపార్వతులనూ, లక్ష్మీ విష్ణువులనూ దమనంతో పూజిస్తే మహాపుణ్య శక్తి కలుగుతుంది.

మీ పురుషుడూ పత్నీవ్రతుడవ్వాలంటే చెయ్యాల్సిన పూజ...

చైత్రశుద్ధ విదియనాడు అరుంధతీ వ్రతం స్త్రీలకు సుమంగళీతనాన్ని కలగచేస్తుంది. స్కంద పురాణంలో చెప్పిన ఈ వ్రతం చైత్ర శుక్ల పాడ్యమి నుంచి తృతీయ వరకూ చేయాలి. రెండో రోజు అరుంధతి ప్రతిమతోపాటు వశిష్ఠ, ధ్రువ ప్రతిమలను పెట్టి వ్రతాన్ని కొనసాగించాలి. ఈ వ్రతం ద్వారా పరిపూర్ణ సౌభాగ్యమూ, పుత్ర సంతానం కలుగు తుంది. ఈ వ్రతం ద్వారా పురుషులు పత్నీ వ్రతులవుతారు.

చైత్ర శుక్ల తదియనాడు సౌభాగ్య గౌరీ వ్రతం చేసిన స్త్రీలకు భర్త అనురాగంతో పాటు సకల బంధుకోటి ఆత్మీయత లభిస్తుందని దేవీ పురాణం వివరిస్తోంది.

సకల పాపములు నశింపచేసే భవానీ పూజ..

చైత్రశుద్ధ అష్టమి భవానీ మాత పుట్టిన రోజు. ఈ రోజు తల్లిని పూజించి స్తుతించిన వారికి బాధలన్నవి ఉండవు.

భర్తతో నిందలు పడరు. పూజ అయ్యాక బెల్లపు ఉండలను ముత్తైదువులకు పంచితే జీవితమంతా తియ్యగా ఉంటుంది. ఈ రోజు ఎనిమిది అశోకపు మొగ్గలు అమ్మవారి ముందు పెట్టి తీసుకుంటే గర్భాశయ వ్యాధులు నయమయి సంతాన ప్రాప్తి కలుగుతుంది. ఈ పుణ్యమైన రోజు బ్రహ్మపుత్రానదీ స్నానం మహోన్నతమైన పుణ్యరాశిని ఇస్తుంది.

క్షీరసాగర మథనము నాడు ఉపవాసం ఎంత పుణ్యం...?

ఏకాదశినాడు ప్రారంభమైన క్షీరసాగర మథనం నాడు దేవతలంతా ఉపవాసము ఉండి మహాకార్యానికి పూనుకున్నారు. అమృతవిజయాన్ని సాధించారు. శ్రీమహాలక్ష్మీ దేవి ద్వాదశి రోజు

నాలుగు చేతులతో, మాదీఫలాన్నీ, బంగారు పాత్రనీ, కనకపు పద్మాలనూ ధరించి దివ్యకాంతితో జన్మించింది. ఏకాదశి నాడు ఉపవాసం ఉండి ద్వాదశి నాడు లక్ష్మీ నారాయణులను పూజించిన వారికి ఇహలోకంలో మహాసుఖాలూ, సంపదలూ కలుగుతాయి.

నూతన గృహ కట్టుబడి ప్రారంభం ఎప్పుడైతే ధనప్రాప్తి...

వైశాఖ మాసంలో కొత్త ఇంటి నిర్మాణము చేపట్టిన వారికి మహాధన ప్రాప్తి కలుగుతుందనీ, కట్టుబడిలో ఎలాంటి ఇబ్బందులూ ఎదురవ్వకుండా గృహనిర్మాణం పూర్తవుతుందని మత్స్యపురాణం శెలవిస్తోంది.

ఉదకుంభదానము ఎప్పుడు మహాపుణ్య ఫలాన్నిస్తుంది..

వైశాఖమాసంలో జలదానం పదిరెట్ల పుణ్య ఫలాన్నిస్తుంది. నీటిని పెద్ద కుండల్లో ఉంచి

దాహార్తితోనున్న వారికి జలం ఇస్తే వచ్చే పుణ్యం తరతరాలకి మిగిలి ఉంటుంది. ఈ కాలంలో వచ్చిన అతిథులకు చిన్న చిన్న కుండల్లో నీటిని ఇచ్చినా పుణ్యమే.

ఏ తిథిలో పితృకార్యాలు మహాఫలాలను ఇస్తాయి....?

యుగాది తిథిల్లో అనగా కృతయుగం కార్తీక శుద్ధ నవమీ, త్రేతాయుగ తొలిరోజు అక్షయతృతీయ నాడూ, ద్వాపర యుగం మాఘకృష్ణ త్రయోదశీ, కలియుగపు తొలిరోజు భాద్రపద త్రయోదశి తిథుల్లో నదీస్నానమూ, సముద్ర స్నానమూ మహాశుభకరం. ఈ తిథుల్లో తర్పణాలూ, పితృకార్యాలూ చేయటం మహాఫలం కలుగుతుంది.

ఏ ఏకాదశి వ్రతము పోయిన సమస్త సంపదలను తిరిగి తెస్తుంది..

వైశాఖ శుద్ధ ఏకాదశినాడు నియమ నిష్ఠలతో వ్రతం ఆచరిస్తే పోయిన ధనసంపదలూ, రాని

మొండి బాకీలు తిరిగి వస్తాయి. ఇదే మాసంలో వచ్చే వైశాఖ శుద్ధ సప్తమి గంగాదేవి పుట్టినరోజు. ఆ రోజున గంగాస్నానం, దానం, పూజ... సకల సుఖాలనూ, సౌభాగ్యాలనూ ఇస్తుంది.

గంగానదిని భగీరథుడూ, గోదావరిని గౌతముడూ భువిపైకి తెచ్చినట్టు బలరాముడు తన నాగలితో ఓ నది దశదిశ కల్పించాడు. ఆ నదే నూట పది హేను మైళ్ళు ప్రవహించి మచిలీ పట్నంలో తూర్పు సముద్రంలో కలిసే నాగవళీనది.

శత్రు, నీచ, దుర్మార్గులు నాశనమయ్యేందుకు చెయ్యాల్సిన తిథి పూజ...

వైశాఖ శుద్ధ ద్వాదశి పరశురాముని జయంతి. పరశురాముడు దశావతారాల్లో ఆరో

అవతారం. పునర్వసు నక్షత్రంలో పుట్టిన పరశు రాముడు తన తండ్రి మరణానికి ప్రతీకారంగా భూమిపై రాజులనూ, వారి భార్యల కడుపుల్లోనున్న పిండాలను సహితము ఖండించాడు. ఆ రక్తంతో పితృతర్పణాలు చేశాడు.

ఆ నెత్తుటి నేలే శమంతపంచకం. ఈ రోజున ఉపవాసముండటం ద్వారా బ్రహ్మపుత్రా నదీస్నానం ద్వారా... పూజాదికాలు నిర్వహించటం వలన సకల శత్రునాశనం జరుగుతుంది. నదీస్నానము చేసి పరశురాముడికి అర్ఘ్యం ఇస్తే కీడు చేసిన నీచులూ, దుర్మార్గులూ నశిస్తారని వ్రతోత్సవ గ్రంథం శెలవిస్తోంది.

నవగ్రహ బాధలు పోవటానికి చెయ్యాల్సిన వ్రతం...

వైశాఖ శుక్ల చతర్ధశినాడు మహావ్రతం పాటించాలి. మధ్యాహ్నం కూడా స్నానం చేయాలి. కలశం పెట్టి యధావిధిగా శ్రీలక్ష్మీనారాయణులకు పూజ చేయటం ద్వారా సకల పాపాలూ, దోషాలూ, నవగ్రహ దోషాలూ కూడా తొలిగిపోతాయి. సాయంత్రం వరకూ ఉపవాసం ఉండాలి. రాత్రి

భోజనంలో నైవేద్యం పెట్టిన పానకాన్ని తీసుకోవాలి. ఈ రోజు నృసింహ జయంతి. నేటిపూజ సకల శత్రు వినాశకరం కూడా....

వైశాఖ పూర్ణిమనాడు సముద్రస్నానం చేస్తే అనంత ఫలాన్నిస్తుంది. అనేక జన్మల పాపదోషాలూ సమసిపోతాయి. ఈ వైశాఖ పూర్ణిమ నాడే పరమేశ్వరుని వాహనమైన నంది పుట్టిన రోజు కూడా.

అందమైన భర్త లేదా భార్య కోసం చెయ్యాల్సిన వ్రతం....

ఆషాఢ శుద్ధ పూర్ణిమనాడు నదీ ప్రాంతానికి వెళ్ళాలి. పరిశుభ్రంగా స్నానమాచరించి, తెలగపిండితో కోకిల బొమ్మను చేయాలి. ఆ బొమ్మని పూజించాలి. అలా పదిహేనురోజులు చేస్తే సొగసైన భర్త సుందరమైన భార్య లభిస్తారు. స్మృతి

కౌస్తుభంలో చెప్పిన ఈ వ్రతాన్ని సూర్యుడు అస్తగిరికి చేరకముందే పూజ ముగించి గృహానికి వచ్చేయాలి.

శ్రావణ శుద్ధ ఏకాదశి. దీన్నే పుత్ర ద్వైకాదశి అని కూడా అంటారు. ఈనాటి ఉపవాస పూజ వల్ల ధన, కీర్తిని పొందే పుత్రుడు జన్మిస్తాడు.

శ్రీమహాలక్ష్మీదేవి తలుపు తట్టే రోజు...

ఆశ్వీయుజ శుద్ధ పూర్ణిమ. ఈ రోజున మహాలక్ష్మీదేవిని పూజించి జాగరణ చేయాలి. సప్త వ్యసనాల్లో నీచాతినీచమైన జూదం ఈ రోజు ఆడటం వల్ల దోషం రాకపోగా పుణ్యం వస్తుంది. లక్ష్మీపూజతో పాటు రాత్రి జాగరణ చేస్తూ, జూదం ఆడితే సకల సంపదలు వస్తాయి. ఈ వ్రత మహత్యాన్ని వివరిస్తూ క్షీరాన్నమును చేసి వెన్నెలలో ఉంచి ఆపై తీసుకుంటే, చంద్రుని కిరణాల ద్వారా

అమృతం క్షీరాన్నంలోకి వస్తుందని దాన్ని గ్రహించిన వారికి అనారోగ్యమన్నది దరిచేరదని వాలిఖిల్య మహర్షి శెలవిస్తాడు.

ఈ ఆశ్వీయుజ పౌర్ణమినాడు శ్రీమహాలక్ష్మీదేవి భూమిపైకి వచ్చి ఇల్లుల్లూ తిరుగుతూ పేరు పేరునా పిలుస్తుంది. అందుకనే లక్ష్మి పిలుస్తుందని అర్థరాత్రి వరకూ మేలుకుంటారు.

ఈ గాథ మీదే పెద్దలంటారు లక్ష్మి తలుపు కొట్టే సమయానికి నిద్రపోకురా... పిలిచినప్పుడు పలకకపోతే తలుపు తీయ్యకపోతే లక్ష్మీ కటాక్షం రాదని. అందుకనే ఈ రోజు జూదమూడు తూనయినా మేల్కొని ఉండాలి.

తామర పువ్వు ఆసనం.. కంటి పక్షి వాహనము... గవ్వలు లక్ష్మీ ప్రదాలు. అటుకులూ, కొబ్బరి ప్రియమైన నివేదనలు.

పేదరికమును దరి చేరనీయని వ్రతం...

భాద్రపద శుద్ధ తదియనాడు పదహారు కుడుములతో తద్ధినోము చేస్తే మహా సంపద కలుగుతుంది.

ఈనాడు పదహారు కుడుములను ఇష్టదైవానికి సమర్పించి పూజాదికాలు చేయాలి. పేదరికమన్నది దరిచేరనీయని వ్రతం.

ఉండ్రాళ్ళు ఎలా తయారు చేసి నైవేద్యంగా పెట్టాలి...

బియ్యపుపిండిని మొదట బాగా ఉడికించాలి. అలా బాగా వుడికిన తర్వాత అందులో బొబ్బర్లు లేదా శనగపప్పు వేయాలి.

ఆపై పిండిని చిన్న చిన్న ముద్దలుగా నీటి ఆవిరిపై అనగా ఓ పాత్రలో నీళ్ళు పోసి పైన గుడ్డ కట్టాలి.

ఆ గుడ్డపై పిండి ముద్దలను ఉంచాలి. నీటి ఆవిరితో అవి ఇడ్లీల్లా మారతాయి. వీటినే ఆవిరి కుడుములంటారు.

మహాశివరాత్రి....

- H మహాపర్వదినాల్లోకెల్లా మహాతిపర్వదినమైనది శివరాత్రి.
- H చతుర్థశి తిథి శివునికి ప్రీతికరమైనది. ఇంకా కృష్ణ చతుర్థశి మరింత ప్రియమైనది.

- H మహాశివుడు ఈ శివరాత్రినాడు అర్థరాత్రి పూట కోటి సూర్యుల వెలుగుతో లింగా కారంలో జన్మించాడు.
- H శివరాత్రి పగలు ఉపవాసం... రాత్రి పూట జాగారము చేయాలి.
- H ఈ రోజున అభిషేకం జరుగుతుండగా శివున్ని దర్శించటం మహాపుణ్యం.

సీతాదేవి పుట్టిన రోజు ఫాల్గుణ కృష్ణఅష్టమి. ఆ రోజున సీతారాములను పూజిస్తే సకల కష్టాలూ తీరతాయి. భర్త మరింత దగ్గరవుతాడు.

కార్తీకమాసమెంతటి పుణ్య మాసం...

- H ఈ మాసంలో గృహనిర్మాణం సకల ధన, వస్తు, ధాన్య ప్రాప్తి.
- H ఈ మాసానికి మరో పేరు కౌముదీమాసం.

- యోగనిద్రలోనున్న శ్రీమహావిష్ణువు మేల్కొనే మాసం.
- ఈ వెన్నెల మాసంలో ప్రాతఃస్నానం ... బిల్వ పత్రాలతో శివపూజలు... తులసీ దళాలతో విష్ణు పూజలు మహాపుణ్య ప్రదాలు.
- కార్తీక బహుళ అమావాస్య నాడే భగవద్గీతను శ్రీకృష్ణుడు చెప్పింది.
- ఈ మాసంలో వంకాయ నిషిద్ధము.
- ఈ కార్తీక మాసంలో ఉసిరికాయ మీద కుంభవత్తి పెట్టి వెలిగించి పూజించి, ఆపై నలగకొట్టి వంటికి రాసుకోవటం ద్వారా అనేక శారీరిక వ్యాధులు దూరమవుతాయి.
- కార్తీకమాసం దీపదానోత్సవం మహాఫలాన్నిస్తుంది. దీని వల్ల మహాలక్ష్మి దీవెనలతో పాటు సంపదలూ వృద్ధి చెందుతాయి.
- కర్ణుడు తర్వాత మహాభారతంలేదు. కార్తీక మాసం తర్వాత వానలుండవు.
- కార్తాక శుద్ధ చతుర్థశి.. ఈనాడే శ్రీమహా విష్ణువు వైకుంఠాన్ని వదలి కాశీలోని శివుణ్ని పూజించటానికి వెళతాడు.

- కార్తీక శుక్ల పాడ్యమి నాడు తెల్లవారకముందే స్నానమాచరించి బలి పూజ చేసి జూదమాడి గెలిస్తే మళ్ళీ కార్తీక శుక్ల పాడ్యమి వరకూ జూదంలో గెలిచే పుణ్యశక్తి కలుగుతుంది.

సకల విద్యలకు శ్రావణ శుద్ధ పూర్ణిమనాడు జన్మించిన హయగ్రీవుణ్ని స్తుతించి పూజించిన అన్ని విద్యల్లో ప్రవీణులయి అఖండకీర్తిని పొందుతారు.

కార్తీక శుక్ల విదియ రోజున చెల్లెలింటికి వెళ్ళటం ఎంత పుణ్యం...

దీనినే స్మృతి కౌస్తుభవము యమ ద్వితీయగా సంభోదిస్తుంది. యముని సోదరి యమునానది. ఎన్నిసార్లు యుముణ్ని పిలిచినా తన ఇంటికి

రాకపోవటంతో ఎంతో బాధపడుతుంది. సరిగ్గా ఈ రోజు యముడు యమున ఇంటికి వెళ్ళి సోదరి ఆత్మీయ అభిమానాలను అందుకుని భోజనం చేస్తాడు.

ఎంతో సంతృప్తుడైన యముడు ఏదైనా వరం కోరుకోమంటే ఈ రోజు సోదరింటికెళ్ళి అమె చేతి వంటను తిన్న ప్రతివారికి వారి దోషాలు పోవటంతో పాటు అపమృత్యు భయం తొలగిపోవాలి.

దానితో పాటు నరకలోక విముక్తి కలగాలని యమున కోరుకుంటుంది.

అందుకే కార్తీక శుద్ధ విదియనాడు ప్రతివారు సోదరింటికి వెళ్ళి పలకరించి పసుపుకుంకుమలను ఇచ్చి వారి చేతి భోజనమును స్వీకరించి వస్తుంటారు.

తెల్లతులసిని లక్ష్మీతులసి అనీ, నల్ల తులసిని కృష్ణ తులసి అనీ, నీలంగానున్న తులసిని రామతులసి అనీ పిలుస్తారు.

మార్గశిర శుద్ధ పాడ్యమి నాడు గంగా నదిలో స్నానం చేస్తే కోటి సూర్యగ్రహణాల్లో గంగా నదిలో స్నానం చేసిన ఫలమొస్తుందని వ్రత గ్రంథాలు చెబుతున్నాయి.

రథసప్తమినాడు ఏడు జిల్లేడు ఆకులుగానీ, ఏడు రేగిపండ్ల ఆకులుగానీ తలపై ఉంచుకొని స్నానం చేస్తే దోషాలూ, పీడలూ తొలగిపోతాయి.

మాఘమాసంలో శ్రీకాళహస్తిలో స్వర్ణముఖి నదీస్నానం మహా ఘోర పాపాలనీ, పాత కాలనీ నశింప చేస్తుంది.

కుటుంబంలో ప్రశాంతత కొరకు శివాభిషేకంలో వట్టి వేళ్ళ సమర్పిస్తే కుటుంబంలో కలతలూ దుఃఖాలూ దూర మవుతాయి.

శ్రీ కృష్ణుడు నిర్యాణం జరిగిన వారం రోజులకి సూర్యోదయ సమయంలో సముద్రం ద్వారకను తనలో కలిపేసుకుంది.

భాద్రపద పూర్ణిమనాడు ఇచ్చే దానం ఎన్నో రెట్లు పుణ్యఫలం. పరమపదమిచ్చే పుణ్యం కలుగుతుంది.

భాద్రపద మాసంలో గృహ నిర్మాణం హాని చేస్తుందని మత్స్యపురాణం నిశ్చయంగా చెబుతోంది.

స్త్రీలూ, పిల్లలూ సంవత్సరంలో మూడు సార్లనై గోరింటాకు పెట్టుకోవాలి. ఆషాడమాసంలో, భాద్రపద మాసంలోఆశ్వయుజ మాసంలో, రసాయానలతో చేసిన గోరింటాకును కాదు. అరి కాళ్లలో బిళ్లగా, చుక్కగా పెట్టుకునే గోరింటాకు వల్ల ఎంత పండితే అంత సంసార సుఖ మోస్తుంది.

అట్లతద్ది వ్రతంలో దోషం జరిగితే ముసలాడు మొగుడ వుతాడు.

నరక చతుర్ధశినాడు దీపదానం ఎంత పుణ్యం...

నరకచతుర్ధశినాడు అభ్యంగస్నానం చేసి దీపదానం చేస్తే నరకలోక బాధలుండవు. యముని స్తుతించి దీపదానం సకల పాపహరమని వ్రతచూడామణి శెలవిస్తోంది. ఈ రోజు నువ్వుల నూనెతో తలంటుకోవాలి.

మహాలయ పక్షమంటే భాద్రపద పూర్ణిమ నుంచి అమావాస్య వరకూ. దీన్నే పిత్ర పక్షమని కూడా సంభోది స్తారు. ఈ పిత్రపక్షము పితరుల కార్యాలకి దివ్యమైనది.

శ్రావణమంగళ గౌరీ వ్రతమును శ్రావణ మంగళ వారములు వివాహమైన అయిదు సంవత్సరాలు చేస్తే అన్ని జన్మలయందు ఎట్టి అమంగళములు జరగకుండా సుఖంగా కుటుంబంతో జీవిస్తారు.

నామస్మరణమే కాదు శ్రవణము సంసారార్ణవ తారకము

- శ్రీ హరిదాసజీ

భాద్రపద బహుళ ఏకాదశి నాడు పుత్రుడు ఏకాదశి వ్రతం చేస్తే యమలోకంలోనున్న పిత్ర దేవుడు స్వర్గలోకానికి పంప బడతాడు.

నోరునొవ్వంగ హరికీర్తనుడు వని వాని పుట్టుక తల్లుల కడుపుచేటు - భక్తపోతన

నామస్మరణ, ధ్యాన, చింత నముల వలన కృతార్థు లగుదురు

- శ్రీ కృష్ణుడు

భగవన్నామమును వినినను, స్మరించినను పాపములుండవు

- నారదుడు

హరికీర్తనవలన చండాలు డును ముక్తినొందును

- శ్రీ శుకుడు

కలిలో హరినామము కామి తములునొసగు కల్ప వృక్షము.

- శ్రీతులసీదాసు

మగపిల్లవానికి పెళ్ళి చేసిన ఆరు నెలల లోపు ఆడపిల్లకి వివాహం చేయరాదు. పెద్ద మంగళమైన కార్యము చేసి, స్వల్పమైన మంగళకార్యము చేయరాదని ధర్మశాస్త్రాలు శెలవిస్తున్నాయి.

పంక్తి భోజనాల్లో అందరూ భోజనం చేస్తుండగా లేచినవానికి ఇరవై రెట్లు, అయినా భోజనం చేస్తున్నవారికి ఒక శాతం దోషం కలుగుతుంది.

సరస్వతీ నదిలో స్నానం చేసినవారికి అగ్నిష్టోమ యాగం చేసిన పుణ్యం కలుగుతుంది.

బదరీనాథ్‌లో వశిష్ఠాశ్రమం అను తీర్థంలో మూడు రాత్రుళ్ళు నిద్రించి, రేగి పండ్లు తింటే చేసిన పాపాలు నశిస్తాయి.

శ్రీరామచంద్రునికి తాను శ్రీమహా విష్ణువునని తెలిసింది రావణ సంహారం తర్వాత. అదీ బ్రహ్మదేవుడు యమునితోనూ, ఇంద్రునితోనూ, వరుణ, వాయు దేవాదులతో కలిసి శ్రీరామ చంద్రుణ్ణి దర్శించి ఆపై చెప్పాడు. అప్పటి వరకూ శ్రీరాముడు ప్రతిదీ పరాక్రమంతోనూ, ధర్మం తోనూ గెలిచాడు.

శ్రీ దేవీ భాగవతాన్ని అష్టమీ, నవమీ, చతుర్థశి తిథుల్లో చదివిన వారు శ్రీదేవీ కరుణాకృపకు పాత్రులగుతారు. కోరిన కోర్కె సిద్ధిస్తుంది.

పురాణశ్రవణము చెబుతున్నప్పుడు వానికి నమస్కరించ కూడదు.ఆ సమయాన అతను వ్యాసుడు. అతనిని ఆటంక పరచరాదు. కాన పురాణ శ్రవణ మయ్యాకే నమస్కరించాలి.

గాయత్రితో సాటి వచ్చే మంత్రంగానీ, దేవతగానీ, తపస్సు కానీ లేవు.

ధనం లేనివానికి ఆ ధనాన్ని ఎలా సంపాదించాలా అని నిదుర పట్టదు. ధనం సంపాదించిన వాడు ఆ ధనాన్ని ఎలా కాపాడాలా అని సుఖ నిద్రకు దూరమవుతాడు.

క్రోధానికి ఇహలోక పాప భయం కానీ, పరలోక పాప భయంకానీ ఉండవు. లోభం మనిషి చేత ఎంతటి పనైనా చేయిస్తుంటుంది. కాన అలాంటి వ్యక్తులను దరిచేర నీయకుండా ధర్మంగా జీవిం చాలని శ్రీదేవీ భాగవతం శెలవిస్తోంది.

బృహస్పతి భార్యకూ, చంద్రునకూ జన్మించినవాడు బుధుడు. బుధగ్రహపూజలు చేసే స్త్రీలు అత్యంత పవిత్రంగా ఉండాలి. చిన్న దోషం చేసినా బుధగ్రహానికి కోపం వస్తుంది. తద్వార అవస్థలు వస్తాయి.

సుఖాలని కోరుకునేవారు ధర్మాత్ములతో, సమర్థులతో, ధనికులతో స్నేహం చేయాలి. పాండవులు శ్రీ కృష్ణునితో చేసినట్టు. అయితే వాటి కోసం అధర్మపరులతో, పాపాత్ములతో కలిస్తే వచ్చే సుఖాలు క్షణికాలు మాత్రమే. శాశ్వతాలుకావు కర్ణుడి స్నేహంలా.

ప్రాణులంతా పరాయి సొమ్ముకే, పరస్త్రీకి ఆశ పడే వారే... కాన ఆ అవకాశాన్ని ఇవ్వకుండా గడపటమే ధర్మ పరాయణ జీవితం.

ఏ భాగవతా పూజలోనైనా పిసినారి తనం పనికిరాదు. దానితోపాటు స్తోమతకి మించి ఖర్చు చెయ్యకూడదు.

పూర్వజన్మలో పూజలూ, వ్రతాలూ, ధర్మాలు చెయ్యనివారు వ్యాధి గ్రస్థులై ఈ జన్మలో అనుభవిస్తుంటారని శ్రీ దేవీ మహాత్మ్యం వివరిస్తోంది.

ధర్మంగా నడవటమంటే నత్యాన్నే వలకటం, శౌచం చేయటము, కరుణతో కూడిన దయ, దానం ఈ నాలుగే ధర్మానికి నాలుగు పాదాలు.

మదగజం పుష్పాన్ని ఎంత తేలికగా నలుపుతుందో అదే విధంగా పాపం ఎంతటి వాడినైనా చిత్రవధ చేస్తుంది. కాకపోతే సమయం కోసం నిరీక్షిస్తుంది.

దుఃఖాన్ని కలిగించే బంధు మిత్రుల కన్నా, సుఖాన్ని కలిగించే శత్రువులు చాలా నయం.

శుభాశుభాలు జరగాలని బ్రహ్మదేవుడు రాసి ఉంటే వాటిని మార్చటం దేవుడి వల్ల కూడా కాదని బ్రహ్మదేవుడే స్వయంగా భృగుమహర్షి పుత్రుడు శుక్రాచార్యునికి చెప్పాడు.

ఒకసారి శత్రుత్వం వచ్చాక, లక్ష మంది చెప్పిటం వలన రాజీ అయినా, వానితో తిరగటం ఎప్పటికైనా ప్రమాదమే. దేవతలు చెప్పారని సంధికుదుర్చుకున్న వృత్రుడిని దేవేంద్రుడు అవకాశం చూసి స్నేహం ముసుగులోనే నమ్మకంగా పక్కనే తిరుగుతూ చంపేశాడు.

లోభికి ముల్లోకాలిచ్చినా అశాంతే. వైరాగ్య తృప్తి ఉన్నవారికి గుడిసెలో ఉన్నా, మహేంద్ర పదవిని పొందిన అనుభూతే అని శ్రీదేవీ భాగవతము శెలవిస్తోంది.

దేవేంద్రుణ్ణి వృత్రుడి నుంచి రక్షించటం కోసం దేవతలు ఆవులింతను సృష్టించారు. వృత్రుడు ఆవలించటంతో ఇంద్రుడు నోట్లోంచి బైటికి దూకాడు. అప్పట్నించి ప్రాణులకు ఆవులింతలు కలగసాగాయి.

సముద్రాన్ని చేరుకునే నదుల్లో స్నానజపాదులే ఉత్తమ పుణ్య ప్రాప్తినిస్తాయి. అత్యధిక పుణ్య శక్తి గలవి కూడా.

ఏడు మాటలు మాట్లాడితే స్నేహం మొదలవుతుంది. ఏడు రోజులు ఏ వ్యసనమైనా మానేస్తే, మళ్ళీ దాని జోలికెళ్ళాలని పించదని శ్రీదేవీ భాగవతం శెలవిస్తోంది.

ఏ మాసంలో ఏవి తింటే పుణ్యం... ఆరోగ్యం...

ఆషాడ మాసంలో మునగాకు కూర తినాలి. ద్వాదశిలో అవిసె కూర తినాలి. ఆశ్వయుజ మాసంలో మినపాకును తీసుకోవాలి.

దేన్నైనా సాధించాలంటే ప్రయత్నం చేయాలి. ప్రయత్నం లేనిదే జరగని కార్యమంటూ ఉండదని దేవ గురువు బృహస్పతి గ్రంథంలో శెలవిచ్చాడు.

అంబికా ఆలయంలో జపిస్తే వచ్చే పుణ్యం, ఆ ఊరిలో నివ శించినంత మాత్రానే వస్తుంది అని సూతుడు శౌనకాది మునులకి చెప్పాడు.

దీపావళి రోజు బాణాసంచాకాల్చటం ఎంత పుణ్యం...

మహాలయపక్షమున స్వర్గం నుంచి భూమి పైకి వచ్చిన పితురులకు తిరిగి పితృలోకాలకి

దారిచూపించే వెలుగే బాణాసంచాకాల్చడంలో ఓ పరమార్థం. నరకలోక వాసులు కూడా పితృదేవతలకి దారి తెలియటానికి కాగాడాలు పట్టుకొని ఉంటారు. వారితోపాటు మనం కాల్చే మతాబులూ మరింత స్పష్టంగా వారికి దారిచూపిస్తాయి. ఈ దీపావళి రోజు తలంటు స్నానం గంగాస్నానం చేసిన పుణ్యం ఇస్తుంది.

నదుల్లో గంగానదీ, పర్వతాల్లో శ్రీశైల సుమేరు గంధమాదన పర్వతాలూ, సరస్సులో మానస సరస్సు, క్షేత్రాల్లో బదరికా క్షేత్ర ఆశ్రమం ఉత్తమోత్తమ పుణ్య ప్రదాలు.

చిత్రగుప్తవ్రతం చెయ్యటం ద్వారా ఎలాంటి పుణ్యం?

వంశాభివృద్ధి కోసం ఈ వ్రతం చేస్తారు. కుటుంబంలో కలహాలు మహా విపత్తును తేచ్చే

అనారోగ్యాలు. విపరీత పరిణామాల వంటివి తొలిగి పోవటానికి ఈ చిత్రగుప్త వ్రతం చేయాలి. చిట్టా పుస్తకమూ, గంటంను పెట్టి చిత్రగుప్తనికి సకల పూజాదికాలు చేయాలి.

పూజానంతరం చిట్టాపుస్తకాన్నీ, గంటంను పుట్టింటి వారికి ఇవ్వాలి.

వాటితోపాటు ధాన్యం, పప్పులు స్తోమతకు తగ్గటు ఇచ్చుకోవాలి. ఇలా ఇవ్వటం ద్వారా ఇరుకుటుంబాలు శ్రేయోస్కరంగా సుఖంగా ఉంటాయి. ఈ వ్రతాన్ని చిత్రా పూర్ణిమనాడు చేయాలి. చిత్రగుప్తునికి కంచిలో ఆలయం ఉంది.

స్త్రీ గర్భం నందు సకల పదార్థాలూ జీర్ణమవుతున్నాయి. మరి పిండా కారము ఎందుకు జీర్ణమవ్వటలేదు. అదే భోవంతుని మాయ, సృష్టి.

- శ్రీ మార్కండేయ పురాణం

పుణ్య ప్రదమైన షోడశదానాలు...

భూమి, గోవు, తిల, హిరణ్య, రత్న, విద్యా, కన్యా, దాసీ, శయ్యా, గృహ, అగ్రహార, రథ, గజ, అశ్వ, ఛాగ, మహిషీ ఇవి షోడశదానాలు.

వస్త్రాదానమూ, ధాన్యదానమూ, గుడదానమూ, రౌస్యదానమూ

లవణదానములు, గోదానమూ, భూదానమూ, తిలదానమూ, హిరణ్యదానమూ, ఆజ్యదానమూ ఇవే దశదానాలు. సకల శుభలనిచ్చే పుణ్య దానాలు.

భర్తను వశం చేసుకోవటానికి పురాణాల్లో మంత్రౌషధాలున్నాయా...

పాండవులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో వారి యోగక్షేమాలను విచారించటానికి కామ్యకవనానికి సత్యభామ సమేతుడై వస్తాడు. ఆ సమయంలోనే మార్కండేయ మహర్షి కూడా పాండుపుత్రుల వద్దకు వస్తాడు.

కుశల ప్రశ్నలయ్యాక మార్కండేయ మహర్షి పుణ్యగాథలను చెబుతుండగా ద్రౌపది, సత్యభామలు దూరంగా ఏకాంతంగా ముచ్చటించుకుంటున్నారు. అప్పుడు సత్యభామ ద్రౌపదిని అడుగుతుంది.

"నీ మగలు ఎప్పుడూ నీతో సంతోషంగా, నవ్వుతూ కోపమన్నది లేకుండా మాట్లాడుతుంటారు. నీ మాటను తూచా తప్పక పాటిస్తుంటారు. అలా కొంగున ముడేసుకునే కిటుకు, వ్రతమా, లేక మంత్రౌషధాలా అని అడుగుతుంది.

ద్రౌపదికి కోపం వస్తుంది.

సత్యభామా! నీవు శ్రీ కృష్ణుడి ఇల్లాలివి అయ్యావు. అందుకే ఏమీ అనలేకపోతున్నాను. మంత్రాల ద్వారా, తంత్రాల ద్వారా భర్త వశమవుతాడనుకుంటే అంతకు మించిన వెర్రితనం లేదు. మగడిని తన వైపు తిప్పుకునే మంత్రాల వల్లా, తంత్రాల వల్లా భర్త మగసిరి పోతుంది.

అనేక వ్యాధులు వస్తాయి. అది తెలిస్తే ఆ భార్య సకల నిందలు పడాల్సి వస్తుంది. భర్త విషయంలో కపట చర్యలు చేస్తే నష్టపోయేది భార్యే.

ఇక వారి నుంచి ప్రేమను పొందగలిగేది అణుకువ ద్వారే. ఎప్పుడూ వారితో అహంగా మాట్లాడను, ఎటువంటి సమయంలోనైనా చికాకుపడను.

సకల సేవలూ నేనే చేస్తాను. వారు లేనప్పుడు అలంకరణలు కూడా చేసుకోను. ఇంటి పనులూ, బంధువుల పనులూ క్రమం తప్పకుండా చేస్తాను. ధనం, ధాన్యం వంటి విషయాల్లో వృధా చెయ్యను.

పరులతో పగలబడినవ్వటమూ, పర పురు షులతో సంభాషణలూ, స్నేహాలూ చేయను.

వాకిలి బైట సాటి స్త్రీలతో సంభాషణలూ, వారితో కోపాలూ, గిల్లి కజ్జాలూ వంటివి చేయను. ఓర్పుతో, మంచితనంతో నిరంతరము మాట్లాడతాను...” అంది.

దానికి సత్యభామ సిగ్గుపడింది తలవంచుకుంది. ద్రౌపది చేతులు పట్టుకుంది.

అయినా ముందులూ, మాకులూ ఇతిహాసాల్లో ఉన్నాయా అంటే, ఉన్నాయి. మంచీ, చెడూ రెండూ ఉంటాయి పుణ్య గాథల్లో...

శుభం

H సకల ప్రాణికోటి సుఖంగా ఉండుగాక.

H ధర్మప్రవర్తనతోఅందరూ సుఖించెదరుగాక.

H సకాలంలో వర్షాలు పడి అన్నాపాదాదులు అందరికి లోటు లేకుండా ఉండుగాక.

H రోగాలూ, రొప్పులనుంచీ, ఆర్థిక బాధల నుంచి దేవతలు రక్షించుగాక.

H తెలిసి తెలియక రాసిన తప్పులను దయతో నన్ను దేవతలూ, పాఠకులూ క్షమింతురుగాక.

H పాపాలూ, పాతకాలూ, దోషాలూ చేసినవారు దాన ధర్మ పూజ తీర్థాల ద్వారా అన్నీ పోగొట్టుగొనుగాక.

Hఅందరికి శాంతి శుభం

K K K K K